తప్స

కతలు

సిద్దెంకి యాదగిరి

తప్ప

డా. సిద్దెంకి యాదగిరి

తెలంగాణ రచయితల సంఘం

THAPSHA

A Collection of Short Stories by

SIDDENKY YADAGIRI

Cover Design	:	Ahobilam Prabhakar
Frist Edition	:	October 2016
Second Edition	:	February 2024
Coppies	:	500
©	:	Author
Price	:	Rs.120/-
Library Price	:	Rs. 200/-
Publication	:	**Telangana Rachayithala Sangam**

For Copies:

Siddenky Yadagiri

19-44/2, Telecom Nagar,
Dist: Siddipet, Telangana-502103.
Cell:9441244773, 9441679937
email: sygiri773@gmail.com

Navodaya Book House Hyderabad
And All Literary Book Shopes.

Printed at:

అంకితం

ఆత్మ గౌరవం కోసం కొట్లాడుతున్న కోట్లాదిగుండెలకు

మరియు

మా నాయినమ్మ సిద్దెంకి మల్లవ్వకు

లేత పసితనమున లేదాయె బుద్దని
తెగిన గాలి పటము తీరు పోయె
ఎన్ని తప్పులైన ఏవగించకనే
బుద్ధి చెప్పె నాకు బుదగరిచ్చె

కతలు శాత్రాలు ఎన్నొ కైగట్టి చెప్పెను
నీతి నిలుపుము అని నిలిపె బోధ
గెలుపు ఓడిపోతె గేలి లేదనకు
సాగి పోవుట సరి సాగుతీరు

గురువు తల్లి తండ్రి గుణములు జెప్పెను
నాయినమ్మ తెలిపె నాకు రీతి
అంకితముగ యిస్తి ఆర్తితో ఆస్తిగా
తప్ష కతల ఎతల తల్లి వేరు

సిద్ధిపేట జిల్లా తొలి పుస్తకం

శెనార్థులు

చిన్నప్పటి నుంచి నాకు (కళలు) ఆటపాటలంటే చాలా ఇష్టంగా మారిపోయాయి. కళలు నాలో భాగమయ్యాయి. సూడవోయి నిదురకు ఆసక నిదురవోయెటోన్ని. తెల్లారినంకా నాకు పూసగుచ్చినట్లు మా నాయినమ్మ నాకు రాత్రిల్లో సూడ(కతకో, బాగోతానికో) వోయిన కతలు మలుపులు తిప్పుకుంటా, ఊరిచ్చుకుంట ఊరిచ్చుకుంట చెప్పుతుండేది. నాకు నిద్రొచ్చేదాకా రోజో శాత్రం జెప్పేది. నాకు కూడా అనిపించేది. నేను కథ(శాత్రం) చెప్పితే మా నాయినమ్మ లెక్క చెప్పాలనుకున్న. గోనెపల్లిలో చదువు పూర్తికాగానే సిద్దిపేట కళాశాలలో చేరి కవిత్వం రాయడం వలన క్రమేపి పుంజుకుంది. కథలు రాయాలనిపించింది. మాతొవ్వ కవిత్వ సంకలనం వచ్చిన తర్వాత కతల మీదికి, విమర్శ మీదికి దృష్టి మళ్లింది. అప్పుడు కతలు రాయాలనుకున్నాను. చుట్టూ ఉన్న సమాజం నన్ను కథలు రాసేలా పురికొలిపింది. అంతకు ముందు రాసినా వాటిలో ఏదో లోపించినట్లు తోచేది. ఆ తర్వాత అన్వేషి సెమినార్, తర్వాత వేముగంటి మురళి. దస్కత్ శనిగరం సమావేశం ఎంతగానో ఉపకరించింది. సిధారెడ్డి సార్ ఎప్పటిలాగె కవితల్లో చెప్పినట్లు, కతల్లో మెళుకువలు చెపుతుండేవారు. తైదల, పొన్నాల, నేను కతల్ని చర్చించుకునేవాళ్లం. మొదట ముద్రణకు నోచుకున్న కథ 'బోధ' సాహిత్య ప్రస్థానం ద్వారా ప్రచురితమయ్యింది. విరిగిన కల అను కథకు జనార్ధన మహర్షి ద్వారా ఏడువందల రూపాయలు లభించటంతో నాకొక ఆత్మ విశ్వాసం పెరిగింది. 'కీలెరిగినవాత' అను కథ 'తెలంగాణ కథ 2009' సంకలనంలో చోటు దక్కించుకుంది. నేను కతల కంటే ఎక్కువ కవితల శ్రద్ధ పెట్టడం వలన కథలు అనుకున్నంత రాయలేక పోయాను. అయినప్పటికీ కథా సాహిత్యంలో కొనసాగుతానని నిర్ణయించుకున్నాను. ఇప్పటకీ ఆలస్యం అయినప్పటికీ 'తప్ష' రూపంలో మీ ముందుకు తెస్తున్నందుకు నా కెంతో సంతోషంగా ఉంది. ఈ పుస్తకం రావడానికి ఎంతో మంది సహాయ సహకారాలు అందించిన వారందరికీ సదా కృతజ్ఞతలు.

మంత్రివర్యులు తన్నీరు హరీష్‌రావుగారు, కూర మణిక్యరెడ్డి(ఎం.పి.పి. చిన్నకోడూరు), అక్తర్ పటేల్ (వైస్‌చెర్మెన్ సిద్ధిపేట మన్సిపాలిటి), డా. కూర రామ్మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రఘోత్తంరెడ్డి, రత్నాకర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, ప్రొ. ఎస్వీ సత్యనారాయణ, ప్రొ. టి. కిషన్‌రావు, ప్రొ. నిత్యానందరావు, ప్రొ. గోనానాయక్, డా. కె. శివారెడ్డి, డా. నందిని సిధారెడ్డి, డా. దాశరథుల బాలయ్య, దేశపతి శ్రీనివాస్, ప్రొ. ఎండ్లూరి సుధాకర్, ప్రొ. దార్ల వెంకటేశ్వర్ రావు, కొలకలూరి ఇనాక్, ప్రొ. ఎండ్లూరి సుధాకర్, ప్రొ. గుండెడప్పు కనకయ్య, ప్రొ. కాశీం, సాగి కమలాకర శర్మ, సూర్య ధనుంజయ్, సంగిశెట్టి శ్రీనివాస్, పాపినేని శివశంకర్, మంద కృష్ణ మాదిగ, కృపాకర్ మాదిగ, దరువు ఎల్లన్న, వేముల ఎల్లన్న, జూపాక సుభద్ర, గోగు శ్యామల, జాజుల గౌరి, మేరిమాదిగ, తైదల అంజయ్య, పొన్నాల బాలయ్య, పసనూరి రవీందర్, జిలుకర శ్రీనివాస్, డా. కదిరె కృష్ణ, తోట అశోక్, రంగాచారి, రవిచంద్ర, కె. అంజయ్య, అరుణ్, పప్పుల రాజిరెడ్డి, వేముగంటి మురళి–రఘునందన్, వంగ గాల్‌రెడ్డి, అలాజిపూర్ కిషన్–శ్రీనివాస్, అష్టకాల నరసింహ రామశర్మ, సల్లారం సంజీవరెడ్డి, గజ్జెల కనకరాజు, ఐతా చంద్రయ్య, పెద్దింటి అశోక్‌కుమార్, నాళేశ్వరం శంకరం, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, జయధీర్ తిరుమల్‌రావు, కర్ర ఎల్లారెడ్డి, బాకి నారాయణ, ఐరేని సామ్రాట్, గుడిపాటి, బైసదాసు, ఎన్నవెల్లి రాజమౌళి, అన్వర్,

ఉంద్రాల రాజేశం, దాసరాజు రామారావు, డా. బెల్లంకొండ సంపత్ కుమార్, అన్నవరం దేవేందర్, పౌరప్రసాద్, తప్పెట ఓదయ్య, కూకట్ల తిరుపతి, విలాసాగరం రవీందర్, చెన్నరాజు, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, పగడాల నాగేందర్, స్కైబాబా, దాస్యం సేనాధిపతి, శ్రీదాస్యం లక్ష్మయ్య, ముక్కెర సంపత్, కుంట శ్రీనివాస్, దమ్మని రామ్‌లక్ష్మణ్, బుగ్గరాజు, నౌండ్ల రాంచంద్రం–మహేందర్, కొత్తపల్లి తిరుపతి, కెరె జగదీశ్, గుడిపల్లి నిరంజన్, ఎస్. హరగోపాల్, వఝల శివకుమార్, వెల్దండి శ్రీధర్, చైతన్యప్రకాశ్, వాసరవేణి పరుశురాం, అందె భాస్కర్, కాయితి బాలు, చిలుముల శ్రీనివాస్, వర్కోలు లక్ష్మయ్య, రాధేయ, గంగాధర్ దళితశక్తి, అహోబిలం ప్రభాకర్, అవుసుల భానుప్రకాశ్, పిడమర్తి రవన్న, తిరుపతి, చారకొండ వెంకటేశ్, కొంద్రు బ్రహ్మం, బద్రునాయక్, రామరాజు, సర్గం నర్సింలు, మార్క్ పొలోనియస్, రాజెందర్ గౌడ్, సతీష్, దాసరి రంగా, రామరాజు, చంద్రశేఖర్, 2002 ఓయు తెలుగు మిత్రులు. డప్పోల్ల రమేశ్, మాసాయిపేట యాదగిరి, యాటెల్లి ఈశ్వర్, నారాయణ శర్మ, పాకాల రాజయ్య, ఎస్. కనకయ్య, ఏర్పుల రామకృష్ణ, పెర్క నర్సింలు, దుర్గప్రసాద్, బాకి చంద్రభాను–ప్రభాకర్, కోరమైన మోహన్–రవి, మిట్టపల్లి పరుశురాములు, ఏటి ఉపేందర్–సుభాష్, న్యూస్ సిద్ధిపేట, గ్యాదరి రామస్వామి, ఆస లక్ష్మణ్, పొన్నమల్ల రాములు, కళాంజలి రాజేశ్, భీమసేన, ఉప్పర మల్లేశం, చింతల మల్లేశం, పోచయ్య, లక్ష్మిపతి, ధర్మయ్య, సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, రాజు, లక్ష్మినర్సయ్య ఎస్సార్కే ఎంప్లాయిస్ గోనెపల్లి, ఏరువ సత్యనారాయణ, శాగ బాబు, సలీం, మల్లిఖార్జున్, సత్తయ్య, సల్లోజు శ్రీనివాస్, ఉద్యమకారుడు కమలాకర్‌చారి,.. హైస్కూల్ గోనెపల్లి మిత్రులు, దబ్బెట శ్రీనివాస్, సింగపాక మల్లేశ్, ఇప్పల శంకర్, దబ్బెట కృష్ణ, రాజెందర్, కృప, జాషువా, కరుణాకర్, ఇందుప్రియాల్ పాఠశాల స్టాఫ్. వేములఘట్ ప్రధానోపాధ్యాయులు యాదవరెడ్డి, సదాశివరెడ్డి, నందాల శ్రీనివాస్–రవి మరియు స్టాఫ్, టెలికంనగర్ మిత్రులకు, హరిప్రియ ఫౌండేషన్, దరువు కళాబృందం, మరసం, తెరవే, తెరసం, సింగిడి, దస్కత్, తెలంగాణ సాంస్కృతి సమాఖ్య, తెలంగాణ వికాస సమితి, ఎన్నీల ముచ్చట్లు, సజరసం, రచనల చెరువు, బరసం, మొదలగు సాహితీ సంస్థలకు. సాహిత్య ప్రస్థానం, కథాజగత్.కామ్, తెలంగాణ కథ–2009, అందరికీ విద్య, దళిత శక్తి.. పత్రికలకు, కథలు అచ్చువేసిన, తిరస్కరించిన సంపాదకులకు, నా పాత్రల్లో ఒదిగిన మిత్రులకు, శత్రువులకు, 'ఇది మా కథే' అని హార్ట్‌ఫుల్‌గా స్పందించిన పాఠకులకు, ఆది జాంబవ యూత్ గోనెపల్లి, రామ్మూర్తి, (తెలుగు విశ్వవిద్యాలయం సిబ్బందికి), వివిధ సంఘాల సభ్యులకు.. మొదలగు గురువులకు, పెద్దలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు.

చిన్నతనంలోనే నాకు కథలు (శాత్రాలు) చెపుతూ నాకు కతలపట్ల ఆసక్తి కలిగించిన నాయినమ్మ సిద్దెంకి మల్లవ్వకు పుస్తకం అంకితం ఇవ్వడం నాకెంతో సంతోషం. నేనింత వాన్ని కావడం కోసం తమ బతుకుల్ని ధారవోసిన నాయిన సిద్దెంకి రాజయ్య(పెద్దెడ్ల), అవ్వ సిద్దెంకి లచ్చవ్వకు నా ఋణం ఏమిచ్చినా తీరనిది. నా జీవిత సహచరి సిద్దెంకి లావణ్య(పుణ్య)కు, నా కూతురు హర్షవర్ధినికి ఆశీస్సులు.

ఇంతకు ముందు 'మా తొవ్వ', 'బతుకుపాఠం' కవితా సంపుటాలను ఆదరించినట్లే 'తప్ష' కథల సంపుటిని ఆదరించగలరని కోరుతున్నాను.

– మీ **సిద్దెంకి యాదగిరి**

వరుస

క
త
ల
తొ
వ్వ

1. విరిగిన కల 10
2. బుద్ధి మాట 21
3. పంచుకోండ్రి 29
4. బోధ 36
5. అంతర్మథనం 44
6. తేలని లెక్కలు 51
7. కీలెరిగిన వాత 58
8. రేపటి సూర్యుడు 65
9. మార్పు ...76
10. సందిగ్ధం 86
11. ఎంత కంతే 100
12. అమరుల యాది 109
13. సావు 117
14. నాయినమ్మ 129
15. తప్ష 137

గమ్యానికి చేరువలో మా యాదగిరి 145
'గిరి'గీసి బరిలో నిలిచే అస్తిత్వ కథలు 147
జీవితం తెలిసిన కథా రచయిత. 157



విరిగిన కల

వనికిపోయి పోయి ఆకలితో వచ్చిన ఊశయ్యకు నీళ్లిచ్చి, భోజనమందించింది ముత్యాలు. తింటున్నపుడు ఏదో సోల్తి చెప్పుతనే ఉంటది. “ఇగో మిట్టపల్లి కాడ ఒక తల్లి చచ్చిపోయిన బిడ్డ ఉన్నదట. తెచ్చుకుందాం. సాదుకుందాం. నంగునూర్‌ల తండ్రి సచ్చిన పోరగండ్లు నలుగురున్నరట. ఒకరిని ఇస్తరట ఏమంటవు?”

“ఏమంటనే? ఇంకా కొన్ని దినాలు సూద్దామే. సుగుణ దగ్గర చూపెట్టుకోవడ్తిమి. సందులపురం చెట్ల మందులు తింటూ పత్యం చేయవడ్తిమి. పెద్దగుట్ట దేవునికి, మల్లన్నకు. ఆకరికి యేసుదేవునికి కూడా మొక్కవడ్తిమి. ఇంకో యాడాది సూద్దాం” అని ఊశయ్య ప్రేమతో జవాబిస్తున్నాడు.

“నీ యాడాదిపాడువడ. ఇంకెన్నొద్దులు ఆగుదాం! నల్లటిదాని మాట పెదవులతీట చేయవడ్తివి. మందులు మత్తుగ తిన్నం. మంత్రగాల్లయిరి. యంత్రగాల్లయిరి. తీరొక్కదేవుని దగ్గరికి తిరుగితిమి. ఏంగాకనేపాయె. ఏడాది సూద్దాం అనవడితివి. నల్లలేదాయె తెల్లలేదాయె..” దండకం అందుకున్నది ముత్యాలు.

“ఎద్దు ఎగురంగనే గంట ఎగురది అంటే ఆగవేందే? మనిషివా? పశు రానివా? ఎప్పుడు తినంగనే ఒర్రుతవు నీ యక్క నీళ్లియ్యహ. ఏం ఒర్రుతవ్” అని కసిరిచ్చుకున్నడు ఊశయ్య.

‘‘కుతికె వడ్డదా..? నరం వడ్డదా? ఇగవటు నీళ్లు? ఒర్రినట్టు

కనవడుతున్నదా? నన్ను ఒర్రుడుపేరు చేయందెన్నడు. అనవట్టి అనవట్టి నడీడు దాటె. నలుపైయేండ్లు దిరిగిపోయె.

మాచిన్నవ్వ బిడ్డను చేసుకొమ్మంటే... చేసుకోకపోతివి. చూసి చూసి మర్పడ్గకు మారుమానం పాయె. జాం జంపన్నోలె చేయవట్టివి. నీముచ్చట మిడ్క"అని ముత్యాలు అన్నది.

"సమితుల పోరెట్లుంటది? నీకే నష్టం. ఎంత మంచిగున్నా పంచాదు లైతయి".

"నేనే సమితిల పోరు పడుత. నాకేం నష్టం లేదు. పంచాదులు గాకుంట సూసుకుంట నేం జెప్పేది జెయ్యక దాటేసే ముచ్చట్లు చెప్పకు" మన్నది ముత్యాలమ్మ.

"ఇగ నేను చెప్పెకాడ్కి చెప్పుతున్న. నీకు తక్లీపు. వచ్చేది ఒట్టిగొత్తదా? జాగ రాయించుకుంటది. యిల్లు రాయించుకుంటది. ముసలోనికి కుసుమ గుడాలు ఎందుకే ముత్తి. అప్పుడప్పుడు పూనకం పూనిన శివసత్తి లెక్క చేత్తవు. నీ ముక్కు చెక్కుత" గుటుక్కుమని మింగుతూ ఊశయ్యన్నడు.

"నీకు రాని మాటలేమున్నయి. నన్ను, మావ్వగారిని తిట్టెతందుకు మాటలు మస్తుగ వస్తయి. గదంత గాదుగాని ఇబ్రహింనగర్ కాడ ఇడుపుకాయిదమయి యింటి మీదున్న దానికి ఊరు మీద కడుపయిందట. ఎవలకైన తోలుతరని మల్లమారి మల్లయ్య సోది తెచ్చిండు. నేను మొన్నటి నుంచే చెప్పుతున్న నా మాట యిను. నాక్కూడా శాతగాదు. రోగాల కుప్పనైతన్న. రోజురోజుకీ నాకు నీకు మంచి గుండది. చెప్పినట్టు యిను చేతులుండు. బాంచెన్ కాల్మొక్త. జర నా మాట జవదాటకు.." అని భర్తను వేడుకుంది.

"ఏమో పోయే" అని నీళ్ళు నములుతూ మాట్లాడుతుండు.

అంతలోనే బాయికాడి రాజయ్య "ఓరి ఊశయ్య... ఊషా... ఉన్నావురా...?" అని పిలుస్తుండు.

"ఉన్న ఉన్న" –ఊశయ్య.

"ఏం రా! నాలుగు పిలుపులకు కూడా యినొత్తలేదా?"

"నన్ను మా ముత్తి సంపుకు తింటంది. గందుకే యినిరాలేదు యింట్లకు?" ఊశయ్య జవాబిచ్చిండు.

ముత్యాలు యింట్లకేలి యినుపకుర్చి తెచ్చి అరుగుమీదేసి "రాజన్నా కూసో...

మంచిగొచ్చినవు దేవుడాడిచ్చినట్టు. మాకేమో పిల్లలు లేకపోయిరి. ఎవలనన్న సాదుకుందామంటే అట్లాయినడు. మారుమనం వద్దంటడు. నేనేం జేయ్యాలె. నేనేడ పోవాలె...?" అని అంగలార్చుతుంది.

"ఔరా ఊశయ్య. ఒగ పోరన్ని సాదుకుంటేమైతదిరా? లగ్గమో, మారుమనమో చేసుకుంటే ఏమయితదిరా? చేసుకబతికేంత జాగ, పని చేసేతందుకు నువ్వున్నవు. ముత్యాలున్నది. మారుమనం తెచ్చుకుంటేందిరా...?" రాజయ్య చెప్పిండు.

"ఆ నువ్వు బాగ చెప్పినవు? నీ అసొంటోడుంటే, మూడిండ్లకు ఆరిండ్లయితయి తగిలిత్తవు. యిగిలిత్తవు నారదామునోలే..? శాట్ల తవుడుపోసి కుక్కలకు కోట్లాట వెట్టినట్టే వుంది. యిద్దరు కొట్లాడితే మూడొగనికి సందయిందట. అంటే గిదేనా ఏంది?" రాజయ్య మొకమ్మీద గుద్దినట్లన్నడు ఊశయ్య.

"ఎవలు మాట్లాడితే వాల్లమీదికి గుడ్లుదెరుస్తడు. ఐరిని బైరి, బైరిని ఐరిచేస్తడు. గుడ్డేలుగు లెక్కచూస్తడు. కొమ్ముల బర్రె చెలిపినట్లు మాట్లాడుకుంట చెలుపుతడు. గిదే తరువాయి. తలుపుపెట్టి చెప్పితే కొలుపు పెట్టి యింటడు. ముందట్కి పోనియ్యడు. యెనుకకు రానియ్యడు. మూతిక్కల్లెం పెట్టేయి మాట్లాడుతడు." ముత్యాలు.

"ఊశయ్య! కోపమా? కొట్లాటనా? ఎవలదేందో వాల్లకు ఎరుక. ఒగొలు చెప్పే బుద్ది అప్పట్ది. తన బుద్ది ఎప్పట్ది. చెప్పంగనే గంత కోపమా? ఎక్కడికి పోయినా ఎంత ధనం సంపాయించినా ముందుగా అడిగేది పిల్లలనే. ఇల్లు కట్టినవా? బాయితోడినవా? బంగారం కొన్నవా? యిట్లాంటివి ఎవ్వి అడగరు. పండ్లల పండు ఏ పండు తీపి అంటే కడుపుపండు తీపి అంటరు. అందుకోసము చెబుతున్న ఎవల యిష్టం వాళ్లు. ఎంటిరామారావు చేసుకోలేదా? ముసలితనాన వయసు పెండ్లాన్ని. ఏదైనా మనసుంటే మార్గముంటది. నీ బుద్ది ఉన్నట్లు చేసుకో" అని రాజయ్యన్నడు.

"లోకమంత ముందట ముచ్చట వెట్టుకుంటనే ఎనుక ఎక్కిరియ్య పట్టిరి. పసుపులు ముట్టేకాడ పెండ్లిల్ల పేరాంటాలల్ల యిలువలేకపాయే. ఏంజేస్తం? ఏమంటం. భగవంతుడు అందరినీ ఒక్కతీరుగ చూస్తే బాధలుండకపోవు. నిన్నైత అంటలేరా? గొడ్డు అపక్షణని. చెవులతోటి యింటే పాపం. నోటితో అంటే పాపం. ఏమో పో బతుకు అరమంద్రం కావట్టే. కాళ్లురెక్కలుండంగా కష్టపడినా కమ్మగ తియ్యగ తిన్నరని లోకము ఆడిపోసుకుంటరు. వయసుడిగినంక కుక్కకానది. నక్కకానది. సట్టు (డబ్బు) ఉంటనే సుట్టు దిరుగుతరు. నోట్లే ఈగలు ముసురుతుంటే కసికెడు నీళ్లుపోసే

మానవుడుండడు." అని ముత్యాలు అంటంది.

"ఓ ముత్తవ్వ. రంది ఎందుకు? జరుగవోయేది జరుగకమానది. రేపటి దానికి రూపముండదిగని అల్లరపడకు, బూడిది కొట్టేది వున్నది. కిరాయికి రాకపోతివి ఒక్కనాడు. ఒక నాలుగు మలక (ట్రిప్పు)లు అయితే అయిపోవు. ఏమంటవు ఊశయ్య" అని రాజయ్య అడిగిండు.

"ఆ రేపు వీలు గాదు. ఆవల ఎల్లుండి వత్త. నీకర్జంటు గుంటే ఎవలతోటైన పోయించుకోపో...! ఎవలకు వీలుగాకపోతే నేనొస్త" అప్పట్దాక ఆలోచనల మునిగి అల్లరిపడుతున్న ఊశయ్య జవాబు.

"సరే ! ఎవల్తోటి ఏంది? నువ్వేరా..." అంటు వెళ్లిపోయిండు బాయికాడి రాజయ్య. బాడుగకు పోవాలని తయారైతుంటే... ముత్యాలు సద్దివెట్టింది.

"నీళ్లు క్యాను. సద్ది పెట్టి పులుసుపోసిన. పెరుగుపెట్టిన. యాల్లకుదిను. పనిమీద పడి మరచిపోయేవు? మీచెల్లె నర్సవ్వకు మనవడుపుట్టి నాలుగు రోజులాయె నేనియ్యాల్ల చూసెతందుకు పోత. ఆమె ఎటో మాట్లాడుతది. మొకం చూసుకుంట పటాపట్ కట్టిరిసినట్టు మొగ మాటలు మాట్లాడుతది. నవ్వుకుంట నవ్వుకుంట గుండెల్ల రాళ్లు ఎత్తేస్తది. ఏడికి పోతయి మీ బెమాన్ మాటలు. నాకు యియ్యాల్ల ఎడ్లకు పచ్చి గడ్డికోసుడు తీరది. నువ్వే యాల్ల పొద్దుగాల వచ్చి పని చేసుకో... గడ్డికోసుకో, జెమ్మాటాలు కొట్టుకుంట బీటిల పండకు. యింటన్నవా ఇగ నేను బోతున్న. రోడ్డు పొంట జతనంగా వో..." అని యింత ఆత్మధైర్యాన్ని కాసింత ప్రేమను కలపి సాగనంపుతూ పలికింది ముత్యాలు.

"యింటన్ననే పోయిరా! యాల్లపొద్దుగాల బయలుదేరు. ఇంత పొద్దుండంగ యిల్లుచేరరా" మీదికి చెప్పినా రాజయ్య మాటలు గుండె కెలుకుతున్నయి.

కొడుకు లెక్క సూసుకునే రామలచ్చుమనులనె ఎడ్లను బండి కట్టుకొని బండి మీద గూసున్నడు. రోజు వుండాల్సిన షత్తిని, ఉషారును రామలచ్చుమలు గమనించినయి. ఏదో ఏమో అనుకొని బండి యిడిసినంక యిద్దరి నడుమ వుండి గంగడోలు నిమురుతూ చెపుతడులే అన్న ధీమాతో ముందుకు పోతన్నె. బురుదను తొలచే కుమ్మరి పురుగులా తొలుచుతున్నా. ఏమి బురద అంటుకోనట్లు, ఆలోచనల తిరుగుతున్నా ఏది ఆచరించాల్నో సమజయితలేదతనికి. భర్తిదించిండు. మనసే

బరువవుతుంది. ఎడ్లకు గడ్డి సదిరి నల్లకాడ్కి పోయి తిందామని కూసుంటే తిండి సయించుట లేదు. మనసు మనాదిగా మారింది. ఎడ్లకు గడ్డిసదిరి అర్తిలకిపోయి ఏది ఏం ధర పోతున్నదో తెలుసుకుందామని పోతుంటే కొమురెల్లి కొమురయ్య కొడుకు రమేష్ ఎదురైయిండు.

"అల్లుడా! నీ వంతులవడ్డది బీటి. మీయయ్య ఎటువోయిండు? మీయయ్యకు గింత కూడా అర్కకు (ముందటికయ్యే బరువు) కానియ్యకు. ల్యావ (వెనుకకు అయ్యే బరువు)కు గానియ్యకు..." పరిహాసము కలిపి ఊశయ్య రమేష్‌తో అన్నాడు.

"మామా! మా నాయినకు కడుపు నొప్పిలేసింది. భాస్కర్రావు దావఖన్ల శేరీక్ చేసినం. ఇయ్యాల్ల ఆపరేషన్ జేత్తరట. సూది అంటేనే గజగజ వణికెటోడు. ఎట్ల తట్టుకుంటడో ఏమో మామా..? ఎట్లయితదో ఏమో" అని రమేష్ చెప్పుతుంటే గుడ్లల్ల నీళ్లు దిరిగినయి.

"ఊకో బిడ్డా ! ఊకో ధైర్యంగా ఉండాలే. నువ్వే ఏడిస్తే ఎట్లనయా? ఎంతమందికి అయితలేవు అపరేషన్లు. ఇంత చిన్న విషయానికి చిన్నపిల్లగాని తరీక ఏడుస్తున్నవు? ఏడవకు ఏడవకు" అని ఓదార్చిండు. పొమ్మని దీరచెప్పిండు.

ఊశయ్య హృదయంలో దు:ఖం నిమిషానికి వంద కిలోమీటర్ల వేగంతో తన్నుకొస్తంది. రేపటి గురించి. 'నాకేమన్నా అయితే ఎవలు చూయించుతరు. ఎవలు తిరుగుతరు. పైసలు తాగవెడతయా? తినవెడుతయా? పైసలు చేయని పనులు మనుషులే చేస్తరు. మంది ఎందుకు చేస్తరు' ఊరోల్ల అలికిడి విని భుజమ్మీది తువ్వాలుతో చెరువైన మనసు కండ్లు తుడుచుకున్నడు. గరళ కంఠుడై గాలిలో తేలిపోతున్నడు. తుంటరి ఆలోచనల ముందు తూలిపోతున్నాడు.

పంతుల్నడిగిండ్రు. మంచిదినం జూసి సుక్కురారం నాడు ఇంట్ల తోలుకొమ్మన్నడు. ఊశయ్య ముత్యాలు దగ్గరి సుట్టాలకు చెప్పి పిలిపించుకున్నరు. అప్పటికే ఈరవ్వ తల్లిదండ్రులు కూడా "సరే" అని ఒప్పుకున్నరు.

ముత్యాలు ఈరవ్వను ఈరమనిని చేసి మురిసిపోతంది. నా కడుపున పుట్టకున్న నా సమితికి పుడుతరని సంబురపడుతుంది. ముత్యాలు సంతోషాన్ని జూసి ఊశయ్య ఉప్పొంగిపోతండు. మరోవైపు ఊశయ్యకు ముత్యాలును, ముత్యాలు బతుకును ఆదరించే ఆప్యాయతలు, అనురాగాలు అంతకు దూరమయి పోతయనుకుంటండు. ఇగున్నారం కాడ ఊరంత తూతూ అని ఇజ్జతి పోయినకాడ

ఈరవ్వకు యిపుడు రంగుల కల కనపడుతున్నది. అన్నీ మనమంచికే నని ఒకానొక దశలో అనుకుంది.

నిందకు బొందల దూకాలని అనుకున్నపుడు ఎవరో చెప్పిన ఓదార్పు మాటలు యిపుడు నిజమేనని అనిపిస్తున్నయి. భయపడిన బతుకు నుంచి భయపడని బతుకు దొరికిందనీ, తల దించుకున్న జాగల తల ఎత్తుకున్నట్లుగా తోచింది. చీత్కార చీకట్ల నుంచి సత్కార వెలుగు రేఖలు వెదజల్లాయనీ, సంతోషముతో సంస్కారముతో సంసారం చేయాలని నిశ్చయించుకుంది. మెల్లగా వెళ్లి ఏర్పడకుంట ముత్యాలు కాళ్లమీదపడి పంతతో పాదాలు మొక్కింది.

“కొత్త జన్మనిచ్చిన తల్లివి”అని అ“ఛీఛీ ఎందుకే చెల్లె కాళ్లు మొక్కుతున్నవ్? అనీ లెవు ఒట్టి మనిషివన్న కాదు” అని ముత్యాలు చేయిపట్టి లేపింది.

కన్నీళ్లను తన కొంగుతో తుడిచి “నీకు నేనున్న ఈయ్యాల్లటి నుంచి ఏం ఫికర్ లేదు” అని భరోస ఇచ్చింది. పెనిమిటి ఊశయ్య దగ్గరికి ఈరవ్వను ముత్యాలు పట్టుకుపోతుంది. అప్పటికే తనూ పోవాలనుకుంది. కాళ్లు మొక్కేందుకు వంగుతుంటే వద్దని ముత్యాలే వారించింది.

ఊశయ్య ఒక చిరునవ్వును వదిలిండు. సిగ్గుతో ముడుచుకపోతూ పెదాలపై చిరునవ్వులని విసురుతూ చూపు వయ్యారాలతో సయ్యాటలాడుతుంది. అత్తింటి వారి మనుషుల్లో తన రూపును గుణగణాలను తర్పీదులాగా ముద్రించినది. ఈరవ్వను ఈరమని చేసింది ముత్యాలు. బిడ్డలెక్క చూసుకుంటంది. ‘మనెవ్వ ’ అని పిలుస్తుంది. ముత్యాలు సంతోషం చూసి ఈ మాత్రం సంబూరం ఉంటే సాలనుకున్నడు ఊశయ్య. మనెవ్వను చంటిపిల్లను పొదన చేసినట్టు చేస్తంది. యాల్ల తప్పకుంట పాలు. బువ్వ అన్ని లెక్క తర్వాయి కొద్దీ చేస్తంది. శావంగాలు దింటవా? చేస్తా. బెల్లం బువ్వ వండన్నా, పూస వొత్తన్నా, గారెలు చెయ్యన్న? గర్జెల్ తినాలనిపిస్తుందా? ఏమనుకోకు. ఎడ్డిర్కం పెట్టుకోకు. యిది మనిల్లు. ఏది తినాలనిపిస్తే అది కావాలని అడుగు. అన్ని బావతెస్తడు. బావతోటి తెప్పిస్త. నేనుచేసేటివి చేస్త. బాయికాడ కోతమామిడి, కలెమామిడిపండ్లు, జామపండ్లు, ఏ పండ్లు తినాలని అనిపించినా? ప్రాణం కొట్టుకున్నా నాకు చెప్పు. బావ ఎట్లాగో అరటిపండ్లు, సేపులు సిద్దిపేట్ల దినము తప్పించి దినం తెస్తడు...” అని చిట్టా చదువుతుంది ముత్యాలు.

"సరే అక్కా! యిపుడే అన్నం తిన్నకదా? తర్వాత తింట, తాగుత, తినబుద్ది అయ్యేటివి చెపుత.." అని అన్నది.

ముత్యాలుకు సంతోషమైంది. రోజు రోజుకీ ముత్యాలు పనిమనిషి అవతారం ఎత్తుతుంది. ఈరమని(మనెవ్వ) గల్లరగల్లర మాట్లాడుతుంది. పకపక నవ్వుతుంది. వొచ్చి పోయేటోల్లతోటి ముచ్చట్లు వెడుతుంది. ఒక్కపిల్లను కనకముందే పదిమందిని కన్నోళ్లకు పోత పోత్తంది. వాళ్లమాటల మీద తను పై పూతలు పూస్తంది. ఓపికతో భరిస్తుంది ముత్యాలు. తలుపు పెట్టి చెప్పితే కొలుపు పెట్టి యింటున్నట్లుగా వ్యవహరిస్తుంది.

ఊశయ్య బాయి నుంచి వచ్చినా, ఊళ్లె నుంచి వచ్చినా వయ్యారాలు ఒలకబోస్తంది. ముత్యాలను ఊశయ్యకు దూరం పెంచాలని చూస్తంది.

"బావా! బుద్దితీర మాట్లాడరాదూ? ఏంజేస్తవ్ పోయి. ఇంక జెర్రాగినంక పోదువుతియ్యి. దండం బెడత కాళ్లు మొక్కుత" అంటూ బూరెలా పొంగిస్తంది.

మనెవ్వ మాటల సంకెళ్లతో ఊశయ్య ఊరు తిరుగుతుండు. ముత్యాలును మనెవ్వను ఇద్దరినీ నొప్పించకుంట తప్పించుకుంటండు. ముత్యాలు యింటిపనికి బాయిపనికి విరామంలేని మిషనైంది. మనెవ్వకు కాలునొచ్చిన వేలునొచ్చిన జండుబాం బెట్టి, అప్యాయతలుచిలుకరిస్తూ బాదల్ని మాయంజేస్తండు. పండ్లు ఫలాలతోటి కడుపు నింపుతండు. ఇదంత గుర్తెరిగిన ముత్యాలు ముందే ఊహించింది. కాలం గడిచిపోతంది. మనెవ్వకు ముత్యాలు సీమంతంజేసింది. కంటిపాపతరీక చూసుకుంటుంది. నెలలు నిండినయి. నొప్పులు పుడితే సిద్దిపేట సుగుణ దావఖాన్లకు యేసుకపోయింద్రు. డాక్టర్ సుగుణ అబ్జర్వేషన్ల పెట్టింది. బాగా ఆలోచించింది. టైంమించిపోతున్నా పసిద్ద కాకపోవడంతో కంపోండర్‌తో చెప్పంపింది. ముత్యాలు ఊశయ్య ఇద్దరు డాక్టర్ దగ్గరికిపోయింద్రు.

"మనెమ్మ నీ భార్యనా?"

"అవునమ్మా..."

"నొప్పులు యిట్లనే వుంటే పెద్దాపరేషన్ జేయాల్సివస్తది. ఏమంటవ్? గాందికి రాయల్నా"

"వొద్దొద్దు. నాటి నుంచి మిమ్మల్నే నమ్ముకున్న. మీరే ఎట్లయినా చేయింద్రి.

తల్లీ పిల్లా మంచిగుండాలే అమ్మా” అన్నడు ఊశయ్య.ముత్యాలు ఇటు డాక్టర్ మొఖం, అటు పెనిమిటి మొకం చూస్తంది.

“ఏ అమ్మా పెద్దాపరేషననంగనే బీరిపోతున్నవు. నువ్వేం గావాలే మనెమ్మకు?”

“నేను అక్కను....”

“చేయింర్రమ్మా. పెద్దాపరేషనే చేయింర్డి. పాణాల్ మంచిగుండాలే గంతే...?” అని ఊశయ్యన్నాడు.

“ఏయ్ సిస్టర్ థియేటర్ రడీ చేయంర్డి. కమాన్ క్విక్” అంటూ ఆర్డరిచ్చింది డాక్టరమ్మా. ఒకవైపు కంపోండర్లు ఆపరేషన్‌కు సిద్దపడుతుంర్రు. ఒక ఆలోచన మెరుపులా మెరిసింది ముత్యాలుకు. పిడిసుట్టు కట్టుకొని దబాదబా మనెవ్వ దగ్గరకొచ్చింది. మనెవ్వ పిట్టోలే నోరు దెరుసుకుంట తండ్లాడుతుంది. మెరిసిన ఆలోచనను ఆచరణలో పెడుతుంది. “నొప్పులు దియ్యి దియ్యి...” అని సుట్టూ ఉన్న ఆడోళ్ళు పురిగొలుపుతున్నరు. మనెవ్వ నెత్తి యెంట్రుకలు యిప్పి గొంతికలకు దోపి, దిబిళ్లుమని గులుకోసు స్టాండ్ ఎత్తేసింది. భయానికి ఒక్కటే ఒక్క కేకేసింది మనెవ్వ. ఏందో సప్పుడయిందని కంపొండర్లు దగ్గరున్నోళ్లు, పక్కవాళ్లు చప్పుడైన కాడికి ఉరికి వస్తుంర్రు. డాక్టర్ కూడా ఉలిక్కిపడి ఏందో తెలుసుకుందామని కాలింగ్ బెల్‌నొక్కింది. క్యావ్ క్యావ్ క్యావని నవజాత శిశువు ఏడుపు. ఒగ నర్సు డోరు దీసుకుంట డాక్టర్ రూంలకు ఎగపోసుకుంట వచ్చి ఆదర్ధాతోటి ఆగింది.

“ఏమయింది? ఏంటాసపుడు?” డాక్టర్ ప్రశ్నల వర్షం.

“మేడమ్! మనెమ్మ పేషంట్ నార్మల్ డెలివరీ. మొగపిలగాడు పుట్టిండు”

“అయ్యో! మనం పెద్దాపరేషన్ జేద్దామనుకుంటిమి గదా”

“అవును మేడమ్ కానీ ఆ లోపే ఇలా” అని క్వశ్చన్ మార్క్ పేసుతో నర్సు

“ఏది చూద్దాం పా ...” ఇద్దరు నడిసింర్రు. స్టెత్‌తో పునికి తల్లీ పిల్లా ఆరోగ్యం బాగానే వుందని నిర్ధారణకొచ్చి “శభాష్” అని మెచ్చుకొంది.

“ఏమన్న జరుగరానిది జరిగితే ఎవల్నంటరు. యిలాంటి మోటు వైదుగాలు ఇంటికాడ చేసుకోవాలి? మనిషివా పశువా? ఆడిదాని రీతిలేదేమే నీకు? నువ్వుకనలేదా?” అని నానా బూతు మాటలు తిట్టింది. “చివర్లో మంచే జరిగిందిలే...”అంటూ క్లీన్ చేయమని చెప్పి కన్సల్టేన్సీ రూంలకు పోయింది.

ఊశయ్య ముత్యాలుకు మురిపెం కిరీటం పెట్టుకున్నట్లున్నది. అంతమంది దేవుళ్లకు మల్లొగసారి ఒగలకు తెలువకుంట ఒగలు మొక్కుతంద్రు. మొక్కులన్ని చెల్లిస్తమని హామిలైతంద్రు. పెద్దసందడి చేసుకుంట ఇరువై యొక్కటోరోజు వొచ్చింది. చుట్టాలు బంధువులతో నిండిపోయింది. ఆయిల్లు. ముత్యాలుకు రికాంలేదు. శమధర్మంలేని మనెవ్వ ముత్యాలును ముత్యాలు మంచిని అలుసుగా చేసుకొని సూటిపోటి మాటలతో గుంపిస్తుంది. తొక్కుడు బండకున్న ఓపికతో ముత్యాలు భరిస్తుంది. కేవ్..కేవ్ అని ఒక్కతీరుగ ఏడుస్తున్న పిల్లోన్ని తెచ్చి పొదుగుకు అనిచ్చి పాలియ్యమంటే బండెడు కోపమైతంది. తిట్టిన మాటలకు ముత్యాలు చెవిటైదైంది. అందరి సుట్టాలనడ్మ "రాజూ.." అని కొడుకును పిల్సిపేరు పెట్టిండు నాయినా. కట్నాలు వరదలా వచ్చినై. మూన్నెల్లలోపు. కొమ్రెల్లి, యాదగిరిగుట్ట, యెములాడ, మొక్కులు చెల్లించుకుంద్రు.

ఊశయ్య బరువు దిగింది. ఇంటికాడ బాడుగ బండి యిడువంగనే ఎడ్లు గడ్డివాము మీదికిపోవు. గొలెంల నీల్లతో సుబ్బురంగా కాల్రెక్కలు కడుక్కొని తినెతందుకుపోవు. ఊశయ్య రాకడను చూసిన ముత్యాలు ఎస్సై ముందు కానిస్టేబుల్ లాగా భయపడుతుండె. సీను రివర్సైంది. కొడుకుపుట్టిన కాన్నుంచి ఎంతన్నా ఆకలిగాని, పొద్దటి నుంచి మెతుకు తినకపోని బండి యిడువంగనే కొడుకు దగ్గరికి వస్తండు. కొడుకును సూడంగానే ఆకలి మరిసిపోతడు. తినమనంగ తినడు. రాజు తండ్రి మాటలకు నవ్వుతడు. నవ్విస్తడు. అడుతడు అడిస్తడు. ఊశయ్య యిపుదు కొడుకుతో బాలకుడయి ఆడుతండు. ఊశయ్య నోరుమూసి నాలుకను తీసి చూపుతడు. రాజు ----అందుకోబోయె వరకు లోపలికి తీసుకుంటడు. పిల్లవాడితో పిల్లవాడి తరీక ఆడుకుంటండు. చేసే పనిని మరిచి వాయిదాలు ఏసుకుంటండు.''పనికి పొద్దుపోయింది'' అని గుర్తు చేసే ముత్యాలు మీదికి ఉరుముతండు. నోరు తెరువనిస్తలేడు. రోజువారిగా చిన్నోనికి తినవెడుతడు. నీళ్లు తాగించుడు ఇట్లా ఆడవాళ్లను కాదని తను ఉన్నప్పుడు తనే చేస్తుండు.

రోజులు గడుస్తున్నె. సర్ధి అయినా జరమొచ్చినా తల్లడిల్లిపోతండు. ఏడిస్తే భరించడు. ఎవరినైనా సరే ఊరుకోడు. ఆరునెలల వయసు దాటింది. ఒకరోజున రాజు విపరీతంగా ఏడుస్తండు.

"అరే ఏమయిందిరా! అయ్యయ్యో! అగో కాకి రోకలి ఎత్తుకపోయిందిరా.

ఎంతపనైపాయెరా! నిన్నెవలు సూత్తలేరా బిడ్డా, ఛోఛో..." అంటూ లాలించేసరికి అప్పట్దాక ఏడిసెటోడు ఊరుకున్నడు.

"అమ్మే వస్తుంది. వచ్చె వచ్చె..." బుజ్జగిస్తూ "మనెవ్వ ! ఓ మనెవ్వా ఏం జెస్తన్నవు చంటోన్ని ఏడుపు వినిపిస్తలేదా? ఇంట్ల ఏం జేస్తున్నవు?" అని ఊశయ్య అరిచిండు. "ఓ...వత్తున్న వద్దామనెవరకే నువ్వు అందినవు" అనుకుంటూ ఎంగిలి పళ్ళెం చేత పట్టుకొని వచ్చింది. ఎత్తుకొని తినకపోయినవు. నీ తినుడు అమ్మగాను. పోరడు ఊపిరి పట్టిండు. ఎనుకసిరి తినకపోయినవు. కడుపు పీక్కపోతుందా? పిడచకట్టుకపోతుందా? ఏడవంగా ఎట్లపోతుందే తిండి? మల్లగిట్ల జేసినవో మర్యాదదక్కది..." అని ముత్యాలు మీదికి కాలుదువ్వినట్లు తనకోపాన్ని మనెవ్వ మీదికి చిత్తిండు..

గంతే, కాలుకాలిన పిల్లిలా యిని రాకుంట లోపట లోపట్నే "మరెసరి బుడ్డి లెక్క మాట్లాడకు. రానిపోని మాటలకేం మత్తుగున్నయి" అని అన్నది ఈరమని. ఇనిరాకుంట అన్నప్పటికీ ఊశయ్యకు యినవడింది. పంజీలల్ల పంజీ. ఆవలింపుదీస్తే పేగులు లెక్కవెడ్తడు. గసోంటి వాడు ఎందుకు యిట్లనే ఆలోచనలపడ్డడు. అదే ముత్యాలు అయితే ఏమనకపోవు.

'ఎన్ని తీర్ల తిట్టినా "తిట్టినవుగని ఊకో తిట్టెతందుకు ఉషారు. భూమలింగం శేటు బొర్రాలే నోరు వెంచినవు అంటుండే 'ఈరమనిని ఏమన్న ఏడిసేపోరన్ని ఎత్తుకొని ఊకుంచపోయినవుఅన్నగంతే గిట్లనే నన్ను' అని నారాజుల పడ్డడు ఊశయ్య.'

మరొక రోజు రాజు అదే పనిగా ఏడుస్తుండు. ఏడుపుని పట్టించుకోకుండా టీవిల మునిగిపోయింది ఈరమని. ముత్యాలు చూసి ఎత్తుకొని వీపు నిమురుతూ ఓదార్చింది.

"ఆచ్ పిట్ట..." అని పాట యెత్తింది. ఊరుకున్న తర్వాత నిద్దురలోకి జారుకుంటున్నపుడు మాలోకం కొద్దీ తీసుకుంటుంది ఈరమని, మనెవ్వ.. మనెవ్వా.. అని పిలుస్తుంటే యినిరానంతగా టీవిల మునిగింది.

కోపంతో ముత్యాలు "టీవి మీదున్న పట్టి పోరని మీదుండాలె. ఎన్ని తీర్ల ఏదుకుంటే పోరడు ఎదుగుతడు. యాల్లకు తినవెట్టాలె. ఏడువంగనే నీళ్ళు పాలు తాపాలే... మనసెరిగి మసలుకోవాలె... ఏం రీతిది ఏడ్సినా పట్టించుకుటలేవు..

మనిషివైతే ఒక్కసారి చెప్పితే మసులుకుంటవు.” అనుకుంట యిస్తంది.

ముత్యాలు చేతుల నుంచి ఊశయ్య తీసుకొని పడుకున్నోని ఎత్తుకున్నడు. ముద్దాడుకుంటా మురిసిపోతున్నడు. పసిబుగ్గలు గిల్లుతూపరవశించిపోతున్నడు.

“పన్నావురా బంగారుకొండ. పనిచేస్తే నీకాళ్లు రెక్కలు అలసి పోయినాయివురా తండ్రీ’.. అనుకుంటూ తన్మయత్వ సంద్రంలో తేలిపోతున్న మనసు తెరలకు మాటల రాళ్లు తాకుతున్నై ఈరమని రూపంలో. ముత్యాలు మీద ఎన్నటినుంచో మసలుతున్న కోపాగ్ని కురుస్తుంది.

“అవును నొప్పులు దీసి కన్నదానివైతివి. నీ అంత తెలుస్తదా నాకు. రోజు నువ్వు చెపుతనే గద నేను జేసేది. నువ్వు నలుగుర్ని పెంచిన దానివైతివి. నీకెరుకున్నన్ని నాకేం ఎరుక...?” అని వ్యంగ్యంగా తిడుతున్న మనెవ్వ మాటలు ముత్యాలును ఊశయ్యను కత్తిపోట్లయి దాడిచేస్తున్నయి. దాడి అనడం కంటే పొడుస్తున్నాయి అనడం సరియవుతుంది.

“ఏం మాట్లాడుతున్నవ్? ఏమో లవునీలుగుతున్నవు? నీది నోరా...? మోరా? అన్నం తింటన్నవా? అశిద్దం తింటన్నవా? నోరుకు ఏదోస్తే అదేనా మాట్లాడుడు? గుంజి పట్టుడు లేనేలేదా? తరీక తప్పి మట్లాడొద్దు...” ఎన్నడూ కోపానికి రాని ఊశయ్య

ఉరుముతండు. చేతులున్న కొడుకు ఉల్కిపడుతడనే మరో ఆలోచన లేకుండా. ఈరమని ఈరగోల అందుకున్నట్లు చెడ్డమాటలు రెట్టించింది.

“వడ్లల్లదే బియ్యపుగింజ. ముద్దాడవడితివి మురవవడితివి. రాజు, బూజు, కొండా., యెండీ ఎన్నెన్నో అనవడితివి. ఎక్కువ తక్కువ వొర్రేది లేదు. నోరుమూసుకుంటేంది? ఏమీలేని యిత్తారు ఎగిరెగిరి పడ్డదట. వాన్ని నువ్వే కంటివా? నీకే పుట్టిండా?” గురితప్పని బాణమైగుండెలో గుచ్చుకుంది. కొడుకుగాని కొడుకును ఆకరిసారి ముద్దాడి ఊశయ్య లేచిండు....?

సాహిత్య ప్రస్థానం డిసెంబర్ సంచిక 2012లో ప్రచురితం. సినీ రచయిత జనార్ధన మహర్షి గారి విరాళం 500/- రూ॥లు గెలుచుకుంది.

బుద్ధి మాట

"ఒగొల్ని అనడు. ఒగొల్తోటి అనిపించుకోడు, పిలెగాడంటె గట్లుండాలె" అని అన్మంతుకు పేరువోయింది. మాట మర్యాద దెల్సినోడని, సంస్కారందెలిసినోడని. ఆడోల్లకు, తొవ్విడిసి నడిసెటోడని, ఊల్లె పెగ్గెలు గొట్టకుంట మంచిగ సద్వి, ముందాల నౌకరి దెచ్చుకున్నోల్ల అందరిల మంచి పేరు దెచ్చుకొన్నడు అన్మంతు.

రూపాన్కి రూపం, ఎత్తూ పొడుగూ, ఎత్తుకుదగ్గ బరువు, నల్లటి బాల్. పెద్ద పెయి మనిషి. తన పనేందో తను జేసుకుంటడు. ఎవనిపాపం వానెంటనే గుణం కల్గినోడు. అతని మంచితనాన్ని ఆసరజేసుకొని, ఆయన ఈడోల్లందరు తోకలేని అన్మంతు అని మారుపేరు మీద పిలుస్తరు.

నాకు టీచర్ నౌకరైంది. ఎవల్తోటి ఏమైతదనే రకంగాదు. ఎవ్వరిని శిన్న సూపు జూడడు. వొర్సయెటోల్లకు, బావలకు, తాతలకు పరాశ్కం ఆడెటోల్లకు అట్ల ఆ తీర్గనే మెదులుతడు. గట్ల ఊల్లె అందర్కీ అన్మంతు నోట్లె పండు.

జాగముచ్చట మాట్లాడెతందుకు బజాట్ల యాపచెట్టు కింద పెద్దమన్షులు గూసున్నరు. అక్కడున్నోల్లు ఐదారుగురు వొచ్చెటోల్ల గురించి ఎదురు సూత్తంల్రు. పంచాది సుర్వు అయెదాక లోకమీది ముచ్చట. ఏదేదో సామెతలు పెద్దమన్షులు మాట్లాడుతుంల్రు! గపుడు ఊల్లెకు వొత్తున్న అన్మంతును జూసి, అన్మంతు గురించే మాట్లాడుకుంటంల్రు.

ఆ గుంపుల పెద్దమన్షి కర్రె మల్లయ్యకు అన్ని ముచ్చట్లు ఎరుక. అన్మంతు వాళ్ళ గురించి పురాగా దెల్సు. వాళ్ళ ఏ పంచాదికైనా ఈ కర్రె మల్లయ్య మీదనే గురి ఉంటది. కర్రె మల్లయ్య గంత నమ్మికం ఐందు. ఒకమాటలో చెప్పాలంటే అన్మంతోళ్ళకు పంజి (పంచాయితి పెద్ద) వాళ్ళ తరుపున పంచాది పెద్ద. ఆ తర్వాత రాములు.

"రాములు! గట్ల వొచ్చె పిల్లగాన్కి లగ్గం కాయమాయెనా? నన్ను మస్తుమంది సోల్తి మీద్కేలి ఊకే అడ్గుతంద్రు. శానమందే వొచ్చిపోతంద్రు గదా సుట్టిర్కాన్కి. కాయో... పండో... ఏమయిందో నీకు దెలుస్తది. నీ యియ్యపుడు మల్లాయెకు దెలుస్తది.లగ్గం ముచ్చట ఎంత దూరమొత్తుంది" అని భూమయ్య అడిగిండు.

"అన్నా! నాకేం ఎరుకనే. నాకాముచ్చట దెలువది. గావూరోడు, గీవూరోడు సిద్దిపేటోడు, సిర్సిల్లోల్లు వొత్తంద్రు పోతంద్రు. దగ్గర దగ్గర పదిరువై సుట్టిర్కాలొచ్చినై. యింకా వొత్తనే ఉన్నై. గిన్నిరోజులాయే నీళ్ళల్ల యేసిన గొడ్డలోలే నాన వెడ్తుంద్రు. ఈ పిలెగాడు శెవులు కొడుతలేడు. ఏందో ఏమో పోయే" అని రాములు అన్నడు.

"ఐతే! ఈ పిలగాందే పొల్లంటవా? యిప్పటికీ ముప్పై ఏండ్లు దాక ఉండే. లగ్గమీ్మదికి క్యాలి వుడ్తలేదు. గంతమంది ఇంటిసుట్టు దిరిగిపోయినా పిల్లను సూడ ఎందుకు వోతలేడంటవ్? ఇగెపుడయో? పెండ్లి జేసుకొనుడు. పిల్లలనుగనుడు. ఈడు వోయినంక పెండ్లి. ఆకలి దీరినంక బువ్వ ఏమిట్కి పనిత్తయ్?" అని భూమయ్య ఓ ప్రశ్న వేసిండు.

"సద్వుకున్నోడాయే. నౌకరి దొరికినాడాయే. సంసారం యిల్వ మీదుండే. నిల్వ మీదుండె. రాకపోతే ఏంజేత్తర్వాయి. యాడజూడబోయినా పైసలకాడ, పెట్టుబోతల కాడ, సద్వుకాడ నౌకరికాడ. ఓ తొంపు వెట్టుకొని ఆల్లు మాకు అందరు(సరిదూగరు) అని ముచ్చట వెట్టుకుంటర్రు. ఇంటిర్రాజులందరికి పైసల ఆపచ్చణ(ఆరాటం) బాగున్నది. వీళ్ళు బండకింది నల్లులోలే పిసినార్లు. బండ కింది నల్లి ఎప్పుడన్న శిటుక్కున కుడ్తది గని వీళ్ళు అంతకంటే అడివి. ఒకనికి పెట్టరు. ఒకనిది తినరు. రూపాయి కారనియ్యరు. పైసకు పదిముల్లు యేసే బండ పిసినార్లు కాదే? బావా..." అని కర్రె మల్లయ్య భూమయ్యకు జెప్పిండు.

"ఒగ బీడియ్యే బావా! ఉన్నదా? లేదా?" అని అడిగిండు ఎర్ర బాలయ్య.

"ఇగవటసా..." అని రుమాల్లకెల్లి అగ్గిపెట్టె బీడికట్ట దీసియిచ్చిండు కర్రె

మల్లయ్య.

"వాళ్ళగురించి ఊల్లె తెలువందెవలకే? పైసపోతే పానం బోతది గాదే. మాట మర్యాద దెలువది. పైసలు మిత్తిలకిచ్చేది. నీళ్ళు మింగనియ్యకుంట బాకీలు వసూలు జేసేదే ఎర్క. గట్లనే ఊరంత ఎర్కలేదా...?" అనుకుంటూ కర్రె మల్లయ్య యిత్తున్న బీడీలు దీసుకుంటు ఎర్రబాలయ్యన్నడు.

"ఔ" అని కర్రె మల్లయ్యన్నడు.

"గా పిలెగాడు కూడా వాల్ల అయ్యవ్వ లెక్కనేనా?" భూమయ్య అడిగిండు.

"ఈ సద్వుకున్నోళ్ళ కన్న సాకలోల్లె నయం. అంటే సదువు తరీఖ ఎట్ల ఉన్నదో సూడు. ఆ సాకలోడే సదువుకుంటే అసలు సదువు ఎట్లుంటదో సూడు. సదువుకున్న మూర్ఖులు తయారైతుండ్రు. అండ్ల వీడొకడు." అని ఓ పెద్దమనిషి అన్నడు.

"వొత్తుండు వొత్తుండు" అని గుసగుస పెట్టుకుంటండ్రు.

"ఏం సారు! యియ్యాల్ల దూటీకివోలే.." అని రాములు అన్నడు.

"పోలేదు తాతా! కొద్దిగా పనుండే. సెలవు పెట్టుకున్నా.." అనుకుంటు అన్మంతు అక్కడున్నోల్లకు చేతుల చెయ్యికలుపుతుండు.

"పెండ్లాన్ని చూస్కోను పోతన్నవా ఏంది?" అని ఎర్రబాలయ్యన్నడు.

"లేదు తాతా! తాతలకు ఎర్కలేకుంట సూత్తనా" అని అన్మంతు అన్నడు.

"లేదంటన్నవ్, కాదంటన్నవ్ ఏందోయ్. ఒట్టిగ ఎన్నొద్దులు పంటవ్? నీయక్క నీ తోటోల్లందరు ఒక్కొక్కడు ఇద్దర్ని కనిరి. నువ్వెపుడు జేసుకుంటవ్? నువ్వెపుడు కంటవ్? తాతలకి నౌకరి దావతి లేదు. పెండ్లి దావాత్ లేదు. ఇంకా ఆల్సమెందుకే తాతా..!" అని భూమయ్య అన్నడు. భూమయ్య అన్నమాటలకు అన్మంతుకు కోపం రాలేదు. నవ్వొచ్చింది. 'ఎప్పుడైనా గిట్లనే అంటడు ఈ తాత! ఇపుడు కూడా గట్లనే అంటండు' అని అన్మంతు అనుకుంటండు. చిన్నగ నవ్వి ఊకున్నడు అన్మంతు.

"ఏమో? తాతా! తాతలకు ఎర్కలేకుంటనే పెండ్లి జేసుకుంటవా..ఏంది? ఏది కానిత్తలేవ్వు? పోనిత్తలేవు" రాములు అన్నడు.

"ఛీ! గట్ల జేసుకుంటానే? పొయి పొయి తాతల్కి ఎర్కలేకుంట జేసుకుంటనా?" అని అన్మంతు అన్నడు.

“ఏమో ఏది జెప్పొత్తంది? తలుపు బెట్టేదా? తాళమేసేదా? లోకమే పెద్ద బంజరు దొడ్డి. ఎవ్వి ఎవ్వీటితోటి సుఖపడేది ఎవలకెర్క. మాకాలంల మా అయ్యవ్వలు సూస్కొచ్చినోల్ల కాదనకుంట చేసుకున్నం. యిపుడేమో యిట్టమైతేనే పెండ్లి లేకపోతే లేదాయే. కైముదిరిన ఆడోల్లు మొగోల్లు ఒక్కదగ్గర్నే సద్వవడ్తిరి. నచ్చింది కంట్లె వడ్తె కతం. ఉర్కిపోయి కాలు దొక్కెటోల్లు ఎంతమంది లేరు. ఎంతమందిని సూత్తలేము? ఏ పుట్టలో ఏ పాముందో ఎట్ల తెలుస్తది. మనసు కూడా గంతే” అని భూమయ్య అంటుంటే అక్కడున్నోల్లు అందరు నిజమే అన్నట్లు గొల్లున నవ్విండ్రు.

కర్రె మల్లయ్య “పొద్దువోతంది జెప్పన రమ్మనుండ్రి. నాల్గు ముచ్చట్లల్ల తేలగొ సంపాయించుకోవచ్చు మూటను, మాటను సంపాయించుకుంటమా? యిలువిచ్చేసుట్టిర్కం సూడు. పైసకు సూడకు పతారకు సూడకు. జెల్దిపెండ్లి చేసుకొ”మ్మన్నడు.

‘ఔ’ అన్నడు అన్మంతు.

“సారూ! సూసినయన్ని గావు. ఏడికైతే పోతవో…ఆడికి పోయెకంటే ముందుగాల ఒక్కటి రొండుమూడు మాట్ల వాల్లను వీల్లను అర్సుకో. సుట్టాలను, పక్కాలను, ఊల్లె, ఊరవతల ఎదురైనోన్ని అడ్గి తెల్సుకో. సుట్టిర్కం కుదురుతుందంటే శెడగొట్టె మనుషుల మాటలు నమ్మకు. ఎవడు జెప్పినా? ఐంది సెప్పుతుండా? కాంది సెప్పుతుండా? అవద్దమెంతో నువ్వద్దే ఎంతో పసిగట్టాలె. అకర్కి మనస్కు నచ్చితె సుట్టిర్కం జెయ్యాలె. అట్ల జెయ్యంగ ఏమన్న కిందిమీదైనా ఓర్సుకొని సంసారం జెయ్యాలె. వాడు జెయ్యంగ ఐంది. వీడు జెయ్యంగ ఐంది అని ఎవ్వని మీదేడ్వొద్దు. ఎవన్ని ఆడిపోసుకోవద్దు. వొంతుల ఎట్లుంటే అట్లయితది”అని రాములు అన్నడు.

“సరేనే… తాతా!” అని అన్మంతు జవాబిచ్చిండు.

“అట్లగాదు వాయీ! గా నడ్మ ఏ వూరూడో మీ శెల్లెను సూడొచ్చి, ఖాయం జేసుకున్నట్లే జేసుకొని, యాల్లకు కాదంటే మీకెంత తక్లీప్ ఐందో తెల్వదా? ఆనాటి పంచాదికి ఇదే కర్రె మల్లన్న ఉండే, ఎర్రబాలయ్య ఉండే ఎంత తిప్పలవడితే పంచాది ఐపాయే. మీ యింట్ల గట్లైనందుకు నువ్వెంతో ఇజ్జతికి కుమిలితివి. ఎంత పనైపాయెనని నారాజు ఐతివి. మీ అయ్య ఐతే ఉట్టిగనే గోడయిపాయే. రందిల అందరు మున్గిపోతిరి. మీ శెల్లె కర్రెగున్నది. ఎత్తు పండ్లున్నయి. అన్నందుకే ఆ పొల్ల మనుషుల్ల కలిసెతందుకు నెల నెలవదియేను దినాలాయే. గట్ల బాధలైతయ్. ఎక్కడోల్లమక్కడ వోదాం. రామయ్యా!

జర గా కనకయ్యను రమ్మనుపో. ఐనె వొత్తె పంచాది సురువు జేద్దాం. జరవో జరవో…”అని రాముల్ని పంపించిండు.

“గట్లేం లేదు తాతా! మీ కాల్లల శేతుల్ల పెరిగినోన్ని. మీకు దెల్సినంతల నేనసోంటి మనిషినేనా?” అని ఉన్న ముచ్చట్ని వాల్లమీద్కి ఉస్కె ఇసిరినట్టు జవాబు యిసిరిండు అన్మంతు. ‘యియ్యాల్ల ఈ తాతలకు పురాగ చెపుతా’ అనుకొని అని అన్మంతు అనుకున్నడు.

“గింతమంది సుట్టిర్కాలకు పోతున్నవని తెలుత్తంది. నీ దగ్గర్కివొత్తంద్రనీ తెలుత్తంది. ఎందుకు కుదురుత లేదు పెండ్లి. మాటకాడ కుదురుత లేదా? మూటకాడ కుదురుతలేదా? ఏమైందే? ఏమయితందే తాతా!” అని ఎర్ర బాలయ్యన్నడు. గపుడే కల్లెపల్లి కనకయ్య, రాములు యిద్దరు కల్సి బజార్లకు వొచ్చింద్రు.

సుట్ట తాగుకుంట వొచ్చిన కనకయ్య “తాతా! ఆడొల్లను గాకుంట మొగొల్లను జేసుకుంటవా? యేంది? అట్లట్ల ఉండి పొల్ల మంచిగుండాలె. అయ్యవ్వను సూడాలె. ఆడివిడ్డలను, అవ్వగారిని,అందరిని ఒక్కతీర్గ సూసే పిల్లగావాలె. మత్తుగ దినాలయె. గట్ల బాదలైతయి. సూసినకాడ నచ్చక పోతే, ఎందుకు నచ్చలేదంటరు? గిందుకు నచ్చలేదని ఒగ వొంక, ఒగ తొంపు పెట్టి యివతల వద్దవ్. మీ శెల్లెకోసం నువు బాధపడ్డట్టు ఆళ్ళు బాదపడరా? అందుకని అన్ని తెల్సుకున్నంక తొవ్వదొక్కు. అంతేనా? కాదా తాతా? మనుసుల తిట్టుకునేవ్” అని కల్లెపల్లి కనకయ్య అన్నడు.

“ఔ..! నిజమే తాతా! ఇగవోను. అన్ని తెల్సినంకనే పిల్లను సూడవోతా!” అన్నడు అన్మంతు. కాని అన్మంతు లోన ‘ఉన్న తప్పును తాతలు ఎర్క చెప్పింద్రు. గొంగట్ల రాల్లేసి కొట్టినట్లు కొడ్తంద్రు…’ అనుకొని ‘యిగవోతా…’ అన్నడు.

‘జర ససు తాతా! ఒగ ముచ్చట, ఒగ సామెత జెప్పుత యిను. ఏమనుకోవు గదా..? లోకమ్మీది ముచ్చట శెపుతున్న పురాగా చెవివెట్టి యిను. అటింత పాణం యిటింత పాణం ఉంచకు’ అని కర్రె మల్లయ్య అడిగిండు.

కర్రె మల్లయ్యమీది నమ్మికతోటి “ఆ శెప్పుతాతా!”అని అన్మంతు అన్నడు.

“నువు సదువుకున్నోడివి. మేం సద్వుకోని బగ్గడిగాల్లం. నల్గుర్కి సదువు జెప్పే సారువు –నువు. నువు పంచాదులల్ల కూసోక పోవచ్చుగని మాకంటె గ్యానమున్నోనివే.

నువ్ అర్థం జేసుకుంటవనే జెప్పుతున్న...”

‘ఆ శెప్పు తాతా ..శెప్పు’ అని హన్మంతు అన్నడు .

“నా అసంటోడు ఒగొాడు పిల్లకోసం పన్నెండక్కల్ల అటూ యిటూ జూసిండుట. ఎక్కడ్కివోయినా... పిల్లల సూసుకుంట అందర్కి వొంకలు వెద్తుండు. ఇది అదే బాపతి ఉన్నట్లు ఉన్నది. కర్రెగ బొగ్గోలె ఉన్నది. ఇది బుడ్మకాయోలే పొట్టిగున్నది. బుర్రకాయోలె బక్కగున్నది. ఎత్తు పండ్లున్నయ్. ఎదురుబొచ్చె ఉన్నది. బొక్కలు దేలినయ్. లొట్ట చెంపలు. బెదురుగుడ్లు. అగో దాని చాతి బరువు తోటి ఉన్నది. గిట్లదేనికైనా తీరొక్క వొంక వెద్తుండు. ఒక్క యేలు సూపెడితే వీని మూడేళు వీన్నే సూపెడుతున్నయని గమనించుకోలేదు. గట్ల వానిగురించి అంతట అందరికి ఎర్కయి ఎవ్వలు పిల్లను యిత్తమని వొత్తలేరు. రాకరాక ఒగొాడొచ్చి పిల్లను యిత్తమంటే సూసెతందుకు వోయిండాట ఎర్రగ బుర్రగున్నదని, అడిగినంత కట్నమిత్తుండ్రని నచ్చిండు. పిలెగాని అయ్యవ్వ పిల్ల గురించి తెలుసుకుంటే ఆ పిల్ల దునియమీద మంచిదిగాదని దెలిసింది.

“వొద్దు బిడ్డా! ఆ పిల్లను చేసుకోకురా?” అని బతిలాడిండ్రాట. వాడు మాత్రం చేసుకుంటే దాన్నే జేసుకుంట. ఆ పిల్లను గాకుండ ఉంకొగల లగ్గం జేసుకోను. లేదంటే ఉరివెట్టుకొని సచ్చిపోతా అని అయ్యవ్వను బెదిరిస్తే సత్తె కనవడుతడా ఈ ముండకొడుకు. వాని కర్మం వాడు కురుస్తడు. అని అనుకొని సరే కాని తియ్యి అని పెండ్లి చాలా భీకరంగా (గొప్పగా) జేసిండ్రట. మరువెండ్లి తిరువెండ్లి అయిపోయింది.

పెండ్లి పిల్లను పెండ్లి పిల్లగాన్ని యింట్లతోలితలుపు బెట్టిండ్రు. వాందో అల్వాటు. పెండ్లిగాక ముందు వాడు ఎంతో మంది తోటి సోపతి జేసిండు. ఐనా వాడు చెక్కు చెదరకుంట. మైసమ్మ దున్నపోతోలే పాణంపట్టి (బలమీ్మద) ఉన్నడు. గట్లా బండెడు బొక్కలు కిందేసిన దేన్ని చిన్నసూపు సూడక అప్పటి మందం ఒగ నూర్రూపాలు యిచ్చునట. గా అల్వాటు లెక్క మీద పెండ్లి పెండ్లాంకు ఒగ కడక్ నూర్రూపాల లోటు ఆ నడియామె యిచ్చిండాట. అది ఊకున్నదా? అంటే అదీ ఊకోలేదు. ఒగొని సొమ్ము నాకెందుకని తన పెండ్లి మొగనికి మడతవడి వున్న యాబై రూపాయల లోటును జాకెట్లకేలి సర్రనదీసి మొకమీ్మద గుద్దినట్లు యిచ్చిందాట. లోకం గట్లుంటదే... సారు తాత” అని ముగించిండు కర్రె మల్లయ్య.

అక్కడున్నోల్లకు కొంతవరకు దెలిసినా కర్రె మల్లయ్య చెప్పే మాటతీరుకు

అందరూ పగలబడి నవ్వుతుంండ్రు. అందరితోటి హన్మంతు సారు గూడా వాళ్ళతోపాటు కొద్దిగ నవ్వింఁడు.

"ఏమనుకోలేదు గద తాతా...?"

"ఏహే ఏమనుకోలేదు... ఇగవోతున్న" అంటు పోతండు హన్నంతు.కిందికి సూసుకుంట మీదికి ఆలోచించుకుంట జాండ కాడికి వోతండు. 'నిజంగా గింత కుట్ర లోకంల వుంటదా..' అనుకుంటూ కోమట్ల దుకాణంల కేలి నర్సయ్య అగ్గిపెట్టె బీడికట్ట కొనుక్కొని సైకలు దీస్తున్నపుడు నర్సయ్యకు హన్మంతుసారు కనవడ్డడు.

"నమస్తే సార్"

"నమస్తే. అంతమంచిదేనా?"

"అంత మంచిదే సార్ మావోడు (గురుకృప) కాలేజిల శేరీక్ అయిండు సార్"

"అట్లనా?"

మొన్న పెద్దసారు కూడా యింటి కొచ్చిండు. మీ వోనికి ఇంజనీయర్ సీటు వొచ్చిందని నాతోటి శెప్పిండు" నర్సయ్య.

కోమటి రంగయ్య హన్మంతు దిక్కు చూసి "ఓసారు యిగరా... మీ బియ్యం మా దుకాండ్ల యేసిండు ఆటోవాడు. మేం యిగ జెర్రయితే ఊరికివోతం. జెర్ర తీసుకపోండ్రి. మేం లగ్గం వోతన్నం. పద్దినాలదాక రాం. మీ యిష్టం" అని శెప్తుతండు.

"నేను సైకిల్ దీసుకరాలే.., ఎట్ల దీసుకపోవాలె..' అని హన్మంత్ చెప్తుతండు.

"ఎట్లనన్న దీసుకపో...; ఇంకో పావుగంటల మేం బోతం. మీ యిష్టం" అని మళ్ళీ అన్నడు రంగయ్యశేటు. "ఔ.. తాతా! మనయేనా బియ్యం" అని అడిగిండు నర్సయ్య.

"ఔనే మనయే. నాకు దెలువది ఇక్కడ ఉన్నయని నేను అనుకోకుంట వొచ్చిన. శేటు గిప్పుడు గిట్ల శెప్పవట్టే." అని జవాబు యిచ్చిండు హన్మంతు.

"ఎందుకు తాతా! నేను వొయి మన యింటకాడ యేసి వొత్త తియ్యి".

"నువ్వు పనికి వోతన్నవ్ గదా!"

"ఐతాయె పది నిముషాలు ఆల్సమైతే పొద్దుగుంజాముల పది నిముషాలు

ఎక్కువజేత్త. నా పనిగురించి ఏం రంది పడకు. నేను లేట్ వోయిన నన్ను ఏమనరు. దా సంచి వదుదువురా సైకిల్‌మీద్కి” అని పిల్సిండు నర్సయ్య. నర్సయ్య వెనుకాల హన్మంతు టీచర్ గోదోలె పోతండు. సైకిల్ మీదికి సంచిలావట్టి పెడితే సైకిల్ మీద బియ్యం యింటికి తీసుక వోతండు నర్సయ్య.

“ఈ నర్సయ్య ఎంత మంచోడు. వాళ్ళు కొడుకును సిద్దిపాట్ల కాలేజిల శేరిక్ జేత్తన్నపుడు ఒక్క ఐదువందలు యియ్యి మంటే నా జేబుల పైసలుండీ యియ్యలేదు. యిత్తడో యియ్యడోనని అనుకుంటి. అప్పట్కి కూడా మన బాయికేయి పనికొత్తా అని అన్నపుడు గూడా నేను కేర్ చెయ్యకపోతి. ఐనకు పైసలు యియ్యకున్నా మాకు ఎంత బాగా పని చేత్తండు. పైసలు జెయ్యని పని మనుషులు జేత్తరు. అందుకే అంటరు గుడిసెలో ఉన్న గుడ్డిదానితోటి కూడా అక్కరపడ్తది. నేను ఐదువందలు యియ్యకున్నా... వాళ్ళ కొడుకును కాలేజిల శేరిక్ జేసిండు. మంచి మనసు తోటి పని చేసేటోనికి, దిల్‌దారుగ ఉండెటోనికి మంచే జరుగుతది. గందుకే వాళ్ళ కొడుక్కు మంచి సీటు వొచ్చినట్లున్నది. కర్రెమల్లు తాత గిట్ల అన్నది కూడా గదే...

మనమెట్లుంటమో, మనకు ఎదురు ఉండెటోల్లు గూడా గట్లే ఉంటరనే బుద్ధిమాటను మంచిగ శెప్పిండ్రు.

జీవితభాగస్వామినే కాదు. జీవితంలో ప్రతిపనీ అందరికీ ఉపయోగపడేలా ఆచితూచి చేస్త. నేను కూడా నల్గురికి ఉపమోగపడే విధంగా నా తెలివిని, నా చదువును, నా టైంను కేటాయించుత. నల్గురు సరేననే బతుకు బతుకువలెనని చెప్పిన బుద్ధిమాట తీరుగ నేను బతుకుత...” అని హన్మంతు నిశ్చయించుకున్నడు.

అందరికీ విద్య ఏప్రిల్ 2010 సంచికలో ప్రచురితం

పంచుకోండ్రి

“ఓ...వజ్రవ్వ ఒక్కచాయి యియ్యవ్వ” అని నిన్నటి పేపర్ల మూతి పెట్టి అక్షరాలు నములుకుంట అన్నడు మల్లయ్య. మల్లయ్యది మాదిగ కులమైనప్పటికి రోజు హోటల్ కాడికి వచ్చి పేపర్ చూసుకుంట, టిఫిన్ చేసుకుంట, చాయి తాగడు అలవాటు. ఆ రోజు, రోజూ వచ్చే సమయం కంటే ముందుగా వచ్చినందువల్ల టిఫిన్ ఏది రడీకాలేదనుకొని టీ చెప్పిండు మల్లయ్య.

“ఆ...ఇత్త..అని వజ్రవ్వ అన్నది.

అప్పటికే చాయికి వచ్చిన జంగిటి ఎల్లయ్య మల్లయ్యను చూసి ఈ మల్లయ్య కాంగిరేసు పార్టీ అంటే ప్రాణమిస్తడు. నిన్నటి కాంగిరేసుపార్టీ మీటింగ్‌కి పోయిండా లేదా అని తెలుసుకుంటనని అనుకొని “తమ్మీ మల్లయ్య! సోనియాగాంధి మీటింగ్ పోయినవా”?..అన్నడు.

“పోలేదు”

“మీ వొల్లు బాగానే పోతరుగదా” అని ఎల్లయ్య అన్నడు

“ఆ.. ఔనే ఇందిరమ్మ మీది పీర్తితోటి శాననే పోతరు. ఇండ్లు యిచ్చిందని జాగభూమి. ఎడ్లబండ్లు అరొక్కటిచ్చిందని నమ్మకం కొద్ది పోతరే..? కాని ఈ రాజశేఖర్‌రెడ్డి, ఆ సోనియమ్మ మాకు మస్తు మోసం జేసింద్రటనే ఈ ఐదేండ్లల్ల” అని మల్లయ్య అన్నడు.

“ఏం మోసం తమ్మీ...” అని ఎల్లయ్య అడుగుతున్నపుడు మాల నర్సయ్య ఓటల్లకు వొచ్చిండు. కూసున్నడు. అంతకు ముందు రాతిరి పెద్దమాదిగ భూమయ్య

చాటింపు చేసి ఓట్లకోసం ఫోటోలు దిగనోల్లు... ఓట్ల కారట్ల పేర్లు కింది మీద పడ్డోల్లందరు మల్ల మంచిగ చేసుకోవల్నాట...అని సాటింపు చేసిండు. అందుకే ఝూండకాడి గ్రామ పంచాయితీ ఆఫీసు పక్కకున్న వజ్రవ్వ హోటల్ల అందరు అక్కడనే కూసున్నరు.

“ఏం మోసం తమ్మీ..” అని మల్లయ్యను మల్లడిగిండు ఎల్లయ్య.

“నిన్న టీవిల ఓ పక్కకు సోనియమ్మ మాట్లాడుతున్నపుడే మాదిగ దండోర కార్యకర్తలు కాంగ్రెస్‌పార్టీ ఆఫీసును కాలవెట్టవోయినోల్లు, లోపలున్నోల్లు యివతలికి యెల్లక ముందే, యెల్లినరని అనుకొని దండోరా కార్యకర్తలు గాంచునూనే పోసి, అంటువెడితే లోపటివాల్లు లోపటనే యిరుక్కుపోయి మంటల్ల కాలిపోయింద్రట. అండ్ల ఇద్దరు బతుకుడు బహుకష్టముందట... ఏది పెట్టినా ఆ టివి ఒకటే తరీఖ సూపెట్టిందే సూపెడుతునే ఉంది. గదిసూత్తె నాకు మనసంత కలికలి ఐంది. వాడు అయ్యవ్వకు ఒక్కడే కొడుకట. ఐనే కాలిపోతే ఆ సంసారం ఆగమైనట్టేకదా...?” అని మల్లయ్య అన్నడు.

“అగో గంతపని ఎందుకైనట్టు...? గట్ల జరుగంగ ఎవలాపలేదా...?” అని ఎల్లయ్య అన్నడు. పేపరు అటుఇటూ మర్రేసుకుంట అన్నింటిని గమనిస్తున్నడు మాల నర్సయ్య “ఓ వజ్రక్క ఇంత సుదువ వెట్టు” అని అన్నడు.

వజ్రవ్వ “పూరి గరం గరం చేస్తున్న ఆగుతమ్మీ!” అని నర్సయ్యతో అన్నది.

“ఏయ్ పిలగ మేంగూడ గరంపూరి కొరకే కూసున్నం. ఇటురావోయ్ ఈడ కూసుందువురా...?” అని పిల్సిండు వరుసకు బావయ్యే మాలనర్సయ్యను మాదిగ మల్లయ్య.

“ఎందుకురానే? వత్తన్ననే బావ!” అంటూ తనకన్నా పది పదిహేనుండ్లు పెద్దున్న మల్లయ్య దగ్గరకి పోయి నర్సయ్య కూసుండే.

“ఆ సెపురా... మల్లయ్య” అని ఎల్లయ్య అన్నడు.

“ఏంలేదే? గా రొండు నెల్ల కింద మాయిండ్లల్లకు ఎమ్మార్పీసోళ్ళు వచ్చింద్రు. వచ్చి మా నౌకర్లు, మా కొలువులు, మాలొల్లు....అన్నీ మా పేరుమీదియి వాళ్ళ పేరుమీదయి ఎస్సీలమని, విద్యార్థుల్ల కూడా వాళ్లే మలుపుక పోతంద్రని సభ వెట్టి సెప్పింద్రు. ఈ ఓట్లల్ల మన మాదిగల సత్త ఓట్లతోటి సూపెట్టాలన్నరు. గందుకే

ఇగసేత్త..., అగసేత్త...అంటు సిలుకోలే నవ్వుకుంట బీరపూల వాయిదాలు ఏసుకుంట వచ్చిండట రాజశేఖర్ రెడ్డి. గదే ముచ్చట మీదికేలి మావొల్లు అగ్గి లెక్క మండుతుండ్రు". అని మల్లయ్య చెప్పిండు.

"యిగో ఎల్లయ్య బాపు! ఈ మాదిగొల్లు కానిదానికి ఏం తండ్లాడినా తండ్లాడుతుండ్రే! అది అయ్యేదుంటే యివారకే అయిపోవు. ఇపుడెట్ల అయితదే...? ఒకసారి ఆయే..., పోయే.." అని నర్సయ్యన్నడు.

"ఇవారకు ఏమయిందిరా నర్సయ్య..." అని ఎల్లయ్య అన్నడు.

"ఇవారకు ఎ.బి.సి.డి.లు చేసిండ్రు. మ్యాతరోల్లను, మాదిగోల్లను, ఎ,బి.లుగా మాలొల్లను, మాల ఉపకులాలను కలిపి సి.డిలుగా చేసిండ్రు. ఐతే కోర్టు కొట్టేసింది. పుణ్యానికే ఎట్ల అయితది? ఎస్సీలల్ల ఎ.బి.సి.డి.లు కావు అని నర్సయ్య అనంగనే మాల మాదిగోల్లు మునుపటోలెనే ఉన్నారే? ఎల్లన్నా" అని మాదిగ మల్లయ్య అన్నడు.

"ఔ....రా...నర్సయ్యా! వీడు మన మల్లయ్య చెప్పినట్టు మాదిగోల్లు మాయితనం బొందకాడు, తలారి, నీరడితనం చేస్తుండ్రా? ఎట్టి సేతుండ్రా....? మునుపటోలెనే ఉన్నారా...?" అని అంటున్నడు.

"గది కాదే.. మాలొల్లను మాదిగొల్లను అందరు కలిపితే ఎస్సీలు అయిండ్రు. ఎస్సీలను విడదీయొద్దు. యిచ్చుకొట్టద్దు. అట్లతీయొద్దట. చేయొద్దట. గందుకే అది కాదని తెలిసి వీళ్ళు ప్రాణాలు ఎందుకు తీసుకునుడు? అయ్యవ్వకు దు:ఖం ఎందుకు కలిగించాలే...? దొరకదని తెలిసి ఎందుకు లెంకులాడాలే?" అని మా అంబేద్కర్ అండ్ల రాజ్యాంగంల రాసిండట. మాల నర్సయ్య చెప్పిండు.

"ఔనే... ఎల్లన్నా! వీళ్ళు మేం ఒక్కటిగా ఉన్నామే...? నువ్వే సెప్పే....? అని మాదిగ మల్లయ్య అన్నడు.

"నర్సింలూ... మాదిగొల్లకు మాలోల్లకు బుద్ధి తెలిసిన కాన్నుంచి కంచం పొత్తు, మంచంపొత్తు లేదు. పండుగలకు పబ్బాలకు దేనికి లేదు. ఎవని పిల్లలను ఎవనికి యియ్యరు. చేసుకోరు. మాదిగోల్ల ఆకిలిని మాలోల్లు తొక్కుతరుగని మాలోల్ల ఆకిలిని మాదిగొల్లు ఎన్నడు తొక్కరు. కంచం పొత్తు లేదాయె. యిగ మీరేడ పొత్తుల ఉన్నట్లు? మీరంత ఎస్సీలని అనవచ్చుగాని మాదిగొల్లు మాలొల్లు, ముందుగాల అయినంక యెనకసిరి ఎస్సీలు ఐతరు. మీరు పొత్తుల్నే లేకపోతిరి. ఎవల జనాభా

తీరు వాళ్ళకేస్తే అయిపోతదిగదా...”అని ఎల్లయ్య అన్నడు.

మల్లయ్య “ఇగో ఎల్లన్నా, నర్సయ్య బావా! మనం దొడ్డి గోదల్ల బక్కది ఒక్కటి ఉంటది. బలమున్నది ఉంటది. బలమున్నదాన్ని దొడ్లె యిడిసిపెడితే బక్కాటిని గడ్డి తిననిస్తదా....? తిననియ్యది. గందుకే బక్కది తిన్నంత బక్కదానికి పెడ్తం. పాడిసే దాన్ని జర్రంత గడ్డి పెట్టి పక్కకు కట్టేస్తం. అట్ల దొడ్లె నాలుగు గోదలు బతుకుతయ్ లేకుంటే బతుకుతయా...? బతుకయి” అని మల్లయ్య అన్నడు.

“మీరు గడికోటి మాట్లాడకుండ్రి. అది యిచ్చకొట్టరాదట.... గందుకే అయితలేదు. అది కాని పనే ఇంక సూడు! అంబేద్కర్ రాసిపోయింది మర్రేసి రాయరాదట” అని నర్సయ్య అన్నడు. మాదిగోల్లు కొట్లాడేది ఆ అంబేద్కర్ చెప్పినట్లు జనాభా ప్రకారం సీట్లు రిజర్వేషన్లు కోసం. మా బి.సి.కులం ఎ.బి.సి.డి.లు యెనుకట చేసిపోతే, ఇపుడు తురుకోల్లని కలిపి బి.సి–ఇ గ్రూపును కూడా పెట్టిరి. మాదిగోల్లు అడిగేది న్యాయమే. ఎవల వాట, ఎవలపాలు ఎంతనో వాళ్ల పాలు వాళ్లకు పక్కకు పెట్టుమని, న్యాయమైన కోర్కెలను....తీర్చాలే” అంటుండంగ వజ్రవ్వ పూరి తెచ్చి ఆల్ల ముంగిట పెడితే... ఆల్లు గరం గరం పూరి ఊదుకుంట తినుకుంట ముచ్చట్లు సాగనిచ్చిండ్రు.

“నర్సయ్య ఎవలయి వాళ్లకు పంచేస్తే నష్టం ఏమున్నది? ఏం లేదని నాకు అనిపిస్తుంది. అంతేనా? కాదా?” అని ఎల్లయ్య అన్నడు.

“వీళ్లు సరే తియ్యి అని ఒప్పుకుంటే గింతదూరం కతరానే రాకపోవు. వీళ్లేపోయి కోర్టులకేసు పెడితే ఎ.బి.సి.డి.లు చెల్లవు అని తీర్పు ఇచ్చింది. అందులో సాంకేతిక కారణాలున్నందువల్ల కొట్టివేయడమైందని చెప్పింది. గదాన్నే మల్లచేయాలని మాదిగలు ఒకటవుతున్నరు. గంతే”నని మల్లయ్య అన్నడు.

“గా ముచ్చట నేను సెప్పుతయిను. ఆర్టికల్ 341–ఏ ప్రకారం దళితుల్ని విభజించొద్దని సుప్రీంకోర్టు అన్నది. అది గంతే” అని పురాగ అనకముందే. నా తెలివేందో సూడుమని డిగ్రీ ఫేలైన నర్సయ్య తన తెలివి నిరూపించుకుంటా సెప్పుతున్నడు.

“ఎల్లన్నా! ఎట్ల పంచేయాలంటే....అది రాష్ట్ర గౌర్మెంట్ ముగ్గురుల ఇద్దరు తీర్మానం చేసి మీదికి పంపిస్తే అయితదట. లేకుంటే మన ఎం.పి.లు ఢిల్లీల యిదే పద్ధతిల ఒప్పుకుంటే అయితదట.” అని మల్లయ్య అన్నడు.

"గట్ల అయితదా...? ఎవల్నో చెయ్యిమను? ఎవలు చెయ్యరు. మా మాలొల్ల ఓట్లు పడుతయా వాళ్లకు? ఒక్క ఓటు కూడా పడనే పడది." అని నర్సయ్య అన్నడు.

"మనూల్లే అందరు పొత్తుల ఉన్నట్లు పనిచేసి, అంబేద్కరును నిలబెట్టి ఎవనంతల వాడు ఉండవట్టిరి. ఇదేం న్యాయంరా...? నర్సింలూ, మల్లయ్య" అని ఎల్లయ్య అన్నడు.

వజ్రవ్వ వచ్చి మనిషింత పప్పు ఏసింది.

''ఎల్లన్నా!... ఒక ముచ్చటనే! అయ్యవ్వ ఆస్తిల కొడుకులకు భాగముంటదా....?

ఉండదా...? గది ఒక్కటే చెప్పు"అని మల్లయ్య అన్నడు.

"అయ్యవ్వ సంపాదించిన ఆస్తిల ఖచ్చితంగా అన్నదమ్ములందరికి పాలుంటది. కాకపోతే జేష్ఠ పాలుకింద జర్రంత ఎక్కువ తీస్తరుగాని అందరికి సమానంగానే పాలుంటది." అని ఎల్లయ్య అన్నడు.

"అంబేద్కర్ మా అందరికి అయ్యలాంటోడు, అతను తెలివోడు అయి, ముందుగ నడిసి, మాజాతికి మా ఎస్సీ జాతికంతటికి ఆస్తిని, సద్దిని సంపాయించి పోయిండు. ఆ ఆస్తి అంత మాకే కావాలే. ఆ సద్ది అంత మేమే తింటమని, మీకు వద్దు అంటుండ్రు వీళ్లు" అని మల్లయ్య అన్నడు.

"ఆ గట్ల ఏం అనుకుంటలేం?" అని నర్సయ్య అన్నడు. "గట్ల అనుకోకపోతే మరి ఇగ ఎట్ల అంటున్నట్లు" అని అన్నడు మల్లయ్య, ఎల్లయ్య జోక్యం చేసుకొని ఇగ నేను ఓ మాట చెప్పుత యినుండ్రి.

"మనూరు పెద్ద పటేండ్లు తాతలకాలం నుంచి పొత్తుల ఉన్నరు. వాళ్లకు పిల్లలు అయిండ్రు. వాళ్ల పిల్లలకు పిల్లలయిండ్రు. అంత మొన్న మొన్ననే పంచుకుండ్రు. గిప్పటిదాక పొత్తుఉన్నాకని ఎవలది వాళ్లు ఏమనుకోకుండా వాళ్లంతల వాల్లె మూడోకంటికి తెలువకుంట పంచుకున్నరు. యిప్పటికి పదేండ్లు కావొచ్చు. మనం చూసినంతల వాళ్లు పండుగలకు పబ్బాలకు ఒగొల్లు లేనిది ఒగల్లు పండుగ జేసుకుంటరా..." అని చెప్పి పూరిలు తిన్నచేయి కడుక్కొని మూతి కడుక్కున్నడు ఎల్లయ్య.

"పొత్తుల ఉండంగా యేరుపడుదామనే ఆలోచన రాకుంటేనే సంసారం

పొరెపోకుంట నడస్తది. ఏ ఒక్కనికి యేరుపడుదామని ఆలోచన వస్తే సంసారం యేరుపడేదాక అది రూపుకురాదు. రుంగానికి రాదు. దీనికి వైర్నం ఒక్కటే ఖచ్చితంగా యేరు పడ్డట్లు పంచేయ్యాలే... గంతే. లేకపోతే కాకులు చింపిన యిస్తారైతది ఆసంసారం" అని ఎల్లయ్య సామెత చెప్పిండు.

"అసలుసూడు. మేం ఉండంగ అసలు అట్ల జరుగనే జరగది" అని నర్సయ్య అన్నడు.

"నర్సింలూ! మాదిగొల్లు, మాలొల్ల యిస అదుగుతుండ్రా...? లేకపోతే మీ యిస మీదికి వాళ్లు వస్తమంటుండ్రా...? వాళ్లది వాల్లె అదుగుతుండ్రా...? యింకోగలది కావలంటుండ్రా...?" అని ఎల్లయ్య అన్నడు.

"ఆ గట్లడిగే ఎల్లన్నా!" అని మల్లయ్య అన్నడు.

"అడుగని అడగకపోని ఎస్సీలది ఎస్సీలు ఎవలు తిన్నా ఒక్కటే...? ఎటైతేంది? అనవోయిందు" మాలనర్సయ్య

"ఊకో...మాట మాట్లాడితే ఒక తరీక ఉండాలే... ఎట్లాగో మీ మాలొల్లదాంట్ల ఉన్నంత చదువుకున్నోల్లు మాదిగొల్ల దాంట్ల లేరనే గర్వం నీకుంది. ఎవనిది వానికి పంచెయ్యి. వాని శాతనైనకాడికి వాడు చేసుక బతుకుతడు. వానిది వాడు, కొండమీది గోపయ్యకు దానం చేసుకుంటడు. గీ ముచ్చట నేనే కాదు ఎవలు మెచ్చరు తమ్మీ" అని ఎల్లయ్య నర్సయ్యతో అన్నడు.

"అంబేద్కర్ గిట్లనే అనుకుంటే హిందువులంతా... ఒకటే.., ఎవలది ఎవలు తింటే ఏంది అనుకుంటే బి.సి.లను ఎస్సీలను గీ జండాదాక వచ్చి మాట్లాడేవాల్లం కాదు. ఓటు హక్కు కూడా యిత్తురో యియ్యిక పోదురో... మనం యిప్పటికే యింక అడవిలో ఉందుమో ఏమో?" అని బి.సి. కులం ఎల్లయ్య అన్నడు.

"ఎల్లన్నా, నర్సయ్యా ...మనం ఊల్లెకు వచ్చి యింటికి పోంగ పొద్దుగాల డబల్ రొట్టెనో, బిస్కట్లు ప్యాకెటో ఏదో ఒకటి కొనుక్కొని పోతం. పోరగాండ్లు తింటరని తీసుకపోతం. మా నాయిన వత్తండని పోరగండ్లు తొవ్వలు కాస్తరు. పెద్దోడు ఉరికచ్చి నాయిన నాకు యియ్యిమని చేయిలకేలి గుంజుకుంటుంటే...? అరేయ్, అది నీకు, తమ్మునికి చెరిసగం తీసుకోండ్రి' అని చెప్పుతం. వాడు ఆనందంలో ఆటో ఇటో ఉరుక్కుంట తిన్నడు అనుకుందాం. ఇదేనారా నీబుద్ధి...? తమ్మునికియ్యందే

తింటావురా? అది ఇది అని కోపంజేస్తం. మల్లొకనాడు తమ్మునికిస్తనేనని చెప్పి నమ్మిచ్చి, తీసుకపోయి, ఒక్కడే తింటడు. ఎపుడు గట్లనే యియ్యంగదా...?

మరునాటి నుంచి పెద్దోనికి డబల్ రొట్టె ఇస్తే పెద్దోడే తింటడు అని చిన్నోనికి, పెద్దోనికి చెరిసగం పంచిస్తం. గట్లనే మన నర్సయ్య ఏ కొడుకు అయితే ఏంది. నాకొడుకే తిన్నడు అని ఒగని కడుపు ఎండబెట్టి ఒగని కడుపు నిండవెడితే పాయిద ఉంటదా...? నువ్వేసెప్పే." అని మల్లయ్య అన్నడు.

ఎల్లయ్య భీంకరంగా బేవ్‌దీసి... ఇదంత లొల్లి ఎందుకని నర్సింలూ, మల్లేశా... మాలోల్లు, మాదిగోల్లు అన్నదమ్ములెక్క పంచుకోవాలే. దొడ్లె ఎడ్లను బర్లను సాదుతుంటము, ఒక ఎద్దో ఆవో అన్నిటిని పొడసేది వుంటది. మ్యాత ఏస్తే దేనిని తిననియ్యది. అది తినది. అందుకని ఆ ఎద్దును గుంజకు కట్టేసి దొడ్డిల దేని మ్యాత దానికేస్తమ్. ఇది కూడా గంతే గట్లయితేనే. మనూల్లె మాల మాదిగలు ఎప్పటోలె కూడుతరు. కలుస్తరు. లేకుండా ఇంతే అయితది. వీడు యిస్తడని వీడు ఓట్లు ఎయ్యమంటడు. వాడుయిస్తడని వాడు వోట్లు ఎయ్యమంటడు. వాడు చేస్తడని వానికో ఐదేండ్లు. వీడు చేస్తడని వీనికో అయిదేండ్లు ఆలస్యంచేసి రొట్టెను దొంగిలించిన రెండు పిల్లులు కోతి కథలాగ మూడో మనిషిని, మూడోపార్టీని బతికిచ్చినోల్లమైతం. రాజ్యాధికారానికి దళితులమైతే ఊల్లె కాకుండా రాష్ట్రంల, దేశంల దూరమైతం. కాబట్టి మంచితనంకొద్ది పంచుకోండ్రి లేదంటే మీయిష్టం.

గానుగు మీది ఎద్దు ఎంత తిరిగినా అండ్లనే తిరిగినట్టు అయితది. గందుకే పంచుకోండ్రి. ఎవలంతల వాళ్ళు ఉండుండ్రి. పంచాది ఉండది. కొట్లాట ఉండది. అనుకుంట ఓట్లు సరిజేసేటోల్ల దగ్గరికి వోటళ్ళకేళి పొతరు.

- జాంబవీయం త్రైమాసిక పత్రిక అక్టోబర్

- డిసెంబర్ 2011సంచికలో ప్రచురితం.

- మెతుకు కతలు-2016 సంపుటిలో ప్రచురితం.

బోధ

"లచ్చిమీ!... లచ్చిమీ!..." అంటూ అదే పనిగా నర్సవ్వ పిలుస్తనే ఉంది.

"ఓ...అక్కా! ఏందవ్వా, ఒక్క తీరుగ పిలుత్తన్నవ్" అనుకుంటూ ఇంటెన్క నుంచి సర్రనొచ్చింది లచ్చవ్వ.

"ఏం జెప్పాల్నే. అది చెప్పొచ్చే ముచ్చటేనా? మీ బాలడు ఏం గనకార్యం చేసిండో ఎర్కేనా? ఏందో అడుగు?" అని ఆరెతోటి పొడిచినట్లు చెప్పింది.

"ఏమైందో చెప్పరాదవ్వా!" నువ్వు అంటుంటే మనుసు తాయిలలేదు.

"నిన్న, దక్కలి కోనేరు గానికి బువ్వ ఎయ్యవోయి ఏంజేసిండో అడుగు? వాన్ని ముట్టుకున్నడట. నీకేరుకేనా ఈ ముచ్చట" అని పందిరి మీది గుండు మీద పడ్డట్టు ఎరుకైనా ముచ్చట పటుక్కున జెప్పింది నర్సవ్వ.

ఒక్కసారిగా నమ్మిచ్చి యాడిసి గుద్దితే మొసమర్రకుంట ఐనట్లు లచ్చవ్వకు ఈ ముచ్చట ఎరుక కాంగనే దమ్ము తీసుడే తక్లీఫ్ ఐతంది. దొంగతనం జేసిన దొంగ పట్టుపడినపుడు దొంగ గుండె ధమ ధమ కొట్టుకున్నట్లు కొట్టుకుంటుంది. ఐనా ధైర్నమిడిసి లచ్చవ్వ మాట్లాడుతుంది.

"ఏహే..! మావోడు ఎందుకు ముట్టుకుంటడు? ముట్టుకోడు. ఎవల చూసి ఎవలనుకుంటున్నవో" అని లచ్చవన్నది.

"నిజంగ! నాతోడు నేనేందుకంటనే పోరి" అని నర్సవ్వ మల్ల చెప్పింది.

"కొడుకును అడుగుత గని, గట్ల దాకితే కీడంటరు గదా! ఎట్ల అక్కా?"

అని దీనంగా లచ్చవ్వ అడుగుతుంది.

"మన మాదిగిండ్లల్ల కానక ఎవరు తాకినా? తాకినోల్లను ఔసులోల్ల ఇంటికి తీసుకవోయి పొయిల గరం జేసిన బంగారి తీగె తోటి సురుకు వెట్టుక రండ్రి. ఉ న్నొక్క పోరనికి మంచిది గావాలె. ఆమెగాక ఇంకా శానా మంది బువ్వ ఏస్తున్నపుడు సూసిండ్రట" చిన్నత్త నర్సవ్వ కోడలు లచ్చవ్వకు విరుగుడు చెప్పుతుంది.

'ఉన్నొక్క పోరడు మంచిగుండాలె. పుట్ట పెట్టా, పోంగ! పోంగ! మిగిలినోడొక్కడు. ఈడు మంచిగుంటేనే నా వొంశం నిలవద్దది. ఏమన్న కీడు అయిందనుకో...? ఎవలకు జెప్పినా థూ" అని తుపక్కునుంచుతరు. 'గంత పని కానియొద్దనుకుంది' లచ్చవ్వ.

గప్పుడే బాలయ్య బాయికాడి నుండి ఇంటికి వొచ్చిండు.

"ఔరా...! నిన్న దక్కలోనికి బువ్వ ఎయ్యవోయి నువ్వు ముట్టుడైనవట నిజమేనా..." అని కొడుకును లచ్చవ్వ అడిగింది.

"ఆ... నిజమే! ఐతే ఏమయింది? దక్కలోడు మనిషిగాదా?" అని గడుసుగా చెప్పిండు బాలయ్య.

"పోంగ...పోంగ మిగిలినోనివి నువ్వొక్కనివిరా బాలిగా. ఆయింత ఉన్నొక్క మెతుకును, గంజిల పోగొట్టుకొని లెంకులాడు మంటన్నావురా? నీకు ఏమన్నైతే మమ్ముల ఎవలను జూసుకొని బతుకుమంటున్నవురా? సెప్పు ఎంత దూరం బోయినా దక్కలోడు దక్కలోడే. మాదిగోడు మాదిగోడే. అరేయి జర్ర నా మాట యిను. ఆవుసులోల్ల ఇంటికి.. వోయి బంగారు తీగతో కాల్పిచ్చుకోవాలె. పోదాం... బిడ్డా... వద్దనకు" అని కోపం బాధకలగలిపిన గొంతుతో లచ్చవ్వ బాలయ్యను బతిమాలుతూంది.

"నేను రాను. అవుసులోడు బంగారు తీగేతోటి అట్టిగనే కాలుత్తడా? నేను మంచిగానే ఉన్నా... నాకేంగాలే. నాకేంగాదు. నువ్వూకో. నేన్రాను" అని బాలయ్యన్నడు.

"పోవాలె బిడ్డా! ఎందుకంటే అందరం మంచిగుంటెనే మనుషులం. సెప్పుతే యిను. అసోంటి మిడుమాల్లం పనులు జెయ్యొద్దు నువ్వు అవుసులోల్ల ఇంటికి రాలేదనుకో బాగుండది"అని తల్లి గుడ్లుదెరిసి బెదిరిస్తుంది.

తల్లి కొడుకుల వాదులాట విన్న లచ్చవ్వ సిన యారాలు ఎల్లవ్వ వచ్చి

"బాలయ్యా! పోవాల్నయా, బాగ సురుకు ఏం పెట్టడు. జర గోరెచ్చగ బంగారు తీగె గరంకాంగనే మెల్లగ ఇట్ల ఆనిత్తడు" అని అరచేయిల సూపెట్టి చెప్పింది.

"నేను వోను. ఎవలు జెప్పినా యిన. ఇంతగనం ఎందుకు ఒర్రిత్తండ్రు? ఒక్కసారి జెప్పుతే అర్థంజేసుకోవాలె. గంతే. ఒర్రియకుండ్రి."నేనువోను అంటున్నడు బాలయ్య. గిదంత జర్గంగ పొలంనుంచి ఇంటి కొచ్చిండు మొగులయ్య.

"ఏందిరా ఏమైందిరా" అని కొడుకు బాలయ్యను అడిగిండు.

"ఏయ్ ఏమైందే? ఏం లొల్లి సేత్తున్నవ్? నువ్వు వాడూ మాట్లాడేది ఆడికి ఇనవడుతుంది. ఏమయిందే...?"అని లచ్చవ్వను అన్నడు మొగులయ్య.

నిన్న వొద్దీకి నేను బొబ్బెర్లు శెరుగుతున్నపుడు దక్కలోడు "ఇంత బువ్వ ఎయ్యింండ్రవ్వా" అని మూడు బజార్లకాడ ఉండి పిలిసిండు. నేను పనిమీదున్న బిడ్డా! గింత బువ్వ యేసిరాపో... అని చెప్పిన గంతే. వాడువోయి బువ్వ యెయ్యబోయి వాన్ని ముట్టుకున్నడట. గీ ముచ్చట గా నర్సక్క గాల్లు గీల్లు అంటే ఇని బిడ్డా! అవుసులోల్ల ఇంటికి వోయి బంగారు తీగెతోటి సురుకు వెట్టిచ్చుక రాండ్రన్నరు. ఊల్లెకు వారా అంటే అత్తలేడు. నీ తోటో శమ, నీ కొడుకు తోటో శమ. చెపితె ఇనె జాడ గాదాయె. చెపితె ఇనరైతిరి. చేతులుండరైతిరి. మీ మిడుమాల్లం మిద్క. నేను సత్తె ఒక్క సిత్తమైతది" అని అన్నది లచ్చవ్వ.

"గీయింత దానికే రానంటవా? దక్కలోనికి మనం తగిలినా? దక్కలోడు మనకు తగిలిగినా? మనం అవుసులోల్ల ఇంటికి వోయి బంగారం తోటి సురుకు పెట్టుకోవాల్రా. అది, మీ యవ్వ అన్నదాంట్ల ఏం తప్పున్నదంటన్నవురా? ఎందుకు పోనంటున్నవురా? నువ్వుగాంక సదువుతున్నావురా? లోకం మీద ఎవ్వడులేదురా" అని తండ్రి మొగులయ్య అన్నడు.

"ఇగో నాయిన! అవ్వా! నేను సదువుకోను వోతున్న. మీరు పంపిత్తేనే వోతున్న కదా! బల్లె కులానికి ఒక్కడు సదువుతడు. అండ్ల అందరికంటే తక్కువ కులపోల్లుం మనమేగదా! అవునా? కదా? నా తోటోల్లు నేను కల్సి అడుకుంటున్నం. కల్సి చదువు కుంటున్నం. బల్లె గాకుంట ఇవతల మన మాదిగోల్ల నీడ తగిలితేనే ఆల్లు నీల్లల్ల మునుగుతరు. గట్ల ఎందుకు మునుగుతరు? మేం మీవోలే మనుషులం కాదా? మీ లెక్క మాకు... రక్తం లేదా? అని ఎవ్వెవ్వో అంటం. మనం ఆల్ల దగ్గరికివోయి

ఆల్లనంటం. అదే మనకింది దక్కలోల్లు మనిండ్లల్లకొచ్చి, మనల అడుక్కుంటరు. ఆల్లకంటే మనం పెద్దనే. కాదంట లేను. లోకమ్మీద ఎవలు కాదనరు. మనం మనకంటే తక్కువోల్లను మనం కలుపుకోవాలె! మనల కలుపుకోనల్ల దగ్గరికి వోయి ఆల్లకు మనం గుణం చెప్పాలె గాని ఎక్కువోల్లు మనపట్ల ఎట్లున్నరో? మనం దక్కలోల్ల పట్ల అట్లుంటే మంచిదేనా? మనక్కలిగిన బాధ అల్లకు కలుగదా?" అని తత్వం చెప్పుతుండు బాలయ్య.

"ఔరా! బాలయ్యా! నీకు మేం బుట్టినమా? నువ్వు మాకు పుట్టినవా? ఐదేళు ్ల ఒక్కతీర్గ ఉన్నాయిరా? ఈ తీర్గ ఎందుకు మాట్లాడుతవ్? సెప్పేది ఇన బుద్దిగాదురా? సేడిపోతవు" అని లచ్చువ్వన్నది.

"ఎంత మంచి వస్త్రం కట్టినా? ఎంత మంచి తిండి తిన్నా? తినకున్నా? పైసకు ఉన్నా లేకున్నా..! మనమయితే మాదిగోల్లమే. మనం మనకు కట్టు బాట్ల మీద, కులం బెట్టిన పాబందుల మీదుండాలె. కులం కుతికెల మంటి సముద్రం మొకాలు మంటి అని పెద్దలు సెప్పింద్రు. ఈ బంగారు తీగెతో కాల్వాలె. లేకపోతే మన కులంల మనం పల్సగైతం. కొన్నింటికి లోకం కోసం మారాలె. కొన్ని కుటుంబం కోసం, సంసారం కోసం మార్సు కోవాలె. ఇదంత ఎందుక్రా? ఔస్ల జగదీశ్వర్ దగ్గరికి వోదాం. బిడ్డా! నువ్వొద్దనకు నువ్వొద్దనుకుంట నీ పాట నువ్వు పాడితే నీ చదువుకు, శాత్రానికి మా పాట మేం పాడుతం. నీ జోలికి రాం. నీ వార్తకు రాం. నీ బుద్ది ఉన్నట్లు చేసుకో? ఇన్ని సెప్పంగ కూడా ఇంటనేమో? ఇను. ఇనకపోతే నీ కర్మం నువ్ కురువ్. ఇగ ఏమంటవురా…" అని తండ్రి మొగులయ్య కోపంతో ఉరుముతుండు.

వీరబ్రహ్మంగారి సూక్తులు, గుండ్రెడ్డిపల్లి సిద్దప్ప చెప్పిన కులంలేదని చెప్పిన సారు మాటలు గుర్తుకురాంగ… బలవంతంగా "సరే" అని ఒప్పుకున్నడు బాలయ్య.

వూరి పెద్ద పటేల్ రగుపతి రెడ్డి అంటే అందరికీ హడల్. న్యాయంగా వోతడు. అన్యాయం జేసినట్లు ఎవలు కనవడ్డా? దాన్ని, దానికి సపోట్ చేసినోల్ల ఈపును మద్దెల గొడుతడు. ఇంటికి వోంగ బజార్ల నిలవడ్డ మొగులయ్య జూసి "దండం పటేలా" అని అన్నడు.

దొంగతనం జేసింది, జేయంది, అసలు దొంగ ఎవరో మాటల్లనే రగుపతి రెడ్డి గురుతు పడుతడు. ఆవలింపు దీయకముందే పేగులు లెక్కవడ్తడు. ఆయన

కైకిల్ల కోసం కైకిల్లు వొచ్చినోల్లకు కైకిల్లు ఇచ్చేతందుకు సైకలు మీదొచ్చిందు. రగుపతిరెడ్డిఅంటేనే భయం భక్తి ఆ ఊరి జనాలకు. పటేల్ సైకల మీద వస్తున్నపుడు ఎప్పుడు కైకిల్లోల్లను తోలుకొచ్చె దుర్గవ్వ జోడించి దండం పెట్టింది. “దండం” అన్నడు రఘుపతిరెడ్డి.

“మొగులూ ఏం జేత్తున్నవ్ బిడ్డా! బాయికేయ్”

“ఏం లేదు! పటేలా! జ(రంత దంతె కొడితె అయిపోతది”

“మీ వోడు ఏం చదువుతుండు”

“మా వోడా? పదోది పటేలా”

రఘుపతిరెడ్డి, మొగులయ్య మాట్లాడుతుండగా వొయిలు సదురుకుని, లచ్చవ్వ ఎంట పెట్టుకొని బజాట్లకు రాంగనే పటేలు కనపడ్డడు.

“అయ్యో! పటేలు ఎటో వోతందు. బాయికేయి ఏం జేతు(రుబాంచెన్”

“ఏమున్నది! ఏం లేదు. మొన్నటి దాక తవుటం బెట్టిం(డు. ఇక మూడు నాలుగు రోజులల్ల ఇంత మందు యేస్తే ఐపోతది. ఔ గని అందరికందరు ఎటో బయిలెల్లిం(డు” అని రగుపతిరెడ్డి అడిగిందు.

రఘుపతిరెడ్డి మాట శబ్దం ఇని ఒక్కొక్కలు అందరూ కూలికి వోయెటోల్లు, కూలి పైసల్ దీసుకునేటోల్లు, బెల్లంను ఈగలు సుట్టినట్లు అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు పోయెటోల్లు పటేలును చూసి ఆగి, ఆల్ల ముచ్చట ఐపోతే ఎవల ముచ్చట వాళ్లు చెప్పుదామని ఎదురు సూత్తం(డు.

పటేలు అడిగిందానికి లచ్చవ్వ “పటేల ఔసులోల్ల ఇంటికి వోతన్నం” అని అన్నది.

“ఎందుకు? బంగారంతో నగజేపిత్తం(డా ఏంది? పశువుకు తింటె బలం. మనిషికి ఉంటే బలం అన్నరు పెద్దలు”

“లేదు పటేలా! మావోన్ని బంగారంతోటి సురుకుపెట్టిచ్చుక రావాలె. గందుకే పోతున్నం” అన్నది లచ్చవ్వ.

“బంగారం తోటి ఏమిటికి సురుకు?”అని పటేల్ అడిగిందు.

అప్పటికే పటేల్‌కు దండం పెట్టి పక్కకు నిలవడ్డ మాదిగ నర్సయ్య “పటేలా!

మాదాంట్ల దక్కలోడు మాకు తాకితే మేం ఔసులోల్ల దగ్గరికిపోయి బంగారం తీగెతోటి కాల్పిచ్చుకుంటే దోశమనేది అడికి తీరిపోతది. అందుకు పోతంద్రు" అని అన్నడు.

"దక్కలోడు తగిలితే మీరు బంగారం తోటి సురుకు పెట్టుకుంటారు? ఎందుకు? దక్కలోడైతే మనిషి కాదా? గంత తక్కువ సూత్తరు మీ దాంట్ల. మేమే మారుతున్నం. మీరుకూడా మారాలే. మీకు గిట్ల ఎందుకు? చావకుంట బతికెటోడెవడు నర్సింహ. అగ్గి అందరికి సమానమే. ఇంకా యెన్కటి రీతి పట్టుకొని తండ్లాడుతాంర్రా?" అని అన్నడు పటేల్.

"అనాదు నుండి మాకు సంపరదాయకం, ఆచారం, జరుగపోయె ముచ్చట గట్లనే నడుస్తుంది. గట్లనే తీసుకపోతున్నం. కులకశ్పి మీద పోతున్నం పటేల" అని నర్సయ్యన్నడు.

"కులమనేది ఎవడు పుట్టిచ్చిండో? వాని యాలి ముండవొయ్యా? లంజకొడుకు. ఎవనికెవడు కలువకుంట జేసింద్రు. నీ దగ్గర ఏమున్నది? నా దగ్గర ఏమున్నదిరా? ఎవని రక్తమైన ఎర్రగనే ఉంటది. గోదలకాడ్కి గోదలు పోతయి. గొర్లకాడ్కి గోర్లు పోతయిగని మనిషినికాడికి మనిషిని పోకుంట జేసింద్రురా?" అని పటేల్ అన్నడు.

"ఔ నిజమే పటేలా. బూతవైద్యం చేసినప్పు ముట్టుకుంటే ఏ దోషముండది. కక్కవోసినపుడు, దించవోసినపుడు తాయితలు కట్టినపుడు ఏదీ ఉండది." అని జమగూడినోల్లు ఆలోచనల పడ్డరు.

"బాపనిండ్లళ్ల బస్టోడు లేడా? మాదిగిండ్లల్ల మంచోడు లేడా? కులంతోటి ఏందిరా? గుణం మంచిగుండాలె. ఎనుకటి శాస్త్రం గుడిసైతేంది? గుణం మంచిగుండాలే. అంతేనా? కాదా?" ఎల్లయ్య, నర్సయ్య, మొగులు, పోతున్న గుంపు దిక్కు చూసుకుంటు నొసలు ఇరిసిండు రఘుపతిరెడ్డి పటేలు.

ఎల్లయ్య "ఔ ! నిజమే పటేలా!"

"మొగులయ్యా ! యెనుకట మీ వోల్ల నీడవారితే నీళ్లు మునిగే దినంల మా అయ్య, మా నలుగురన్నదమ్ముల దగ్గర ఎవలతాడ తినలేదు. ఏ కోడలు తిండిపెట్టినా తినన్నడు. ఎందుకురా? ఒగల చేతికింద ఎందుకు బతకాలని. మీకెరుకున్నంతల మా అయ్య ఒండుక తింటే కులానికొక్కని తోని సార్గం చేయించుకున్నడు. సార్గం

చేసేతందుకు అన్ని కులాల వాళ్లకు పనిజెప్పితే. మురుసుకుంట జేసింద్రు. మీ మాదిగ కులం మీనోల్ల ఎల్లయ్య తోటి దినాం, నిత్తె ఝూండకాడి బోరింగు నుంచి నీళ్లు తెప్పిచ్చుకున్నడు. సాకలి మల్లవ్వ బువ్వొండింది. మంగలి మొండయ్య కట్టెలు దెచ్చిండు. మాలోల్లతోటి ఆకిల్లూడిపిచ్చుకున్నడు. తెనుగోల్లు తీరొక్క పనిజేసింద్రు. ఊరిల అడుక్కునే సిందోల్లకు పొద్దు మాపు తిండి పెట్టుకుంట నాలుగైదు ఆటలు ఆడిపిచ్చు మా నాయిన.

పంచాది కురుంబ కాన్నుంచి, నడి ఊల్లె నుంచి మీ ఇండ్లల్లకు, మీ పంచాది నడువాలని, పంచాది జేసి తశ్వచేసిండు. ఏది ఆటంకమైనా? ఎవలనన్న అనోస్రంగ బఱ్రెసేన్లవడ్డా! గొఱ్రె సేన్ల వడ్డా, దాన్ని అలుసుగా తీసుకొని కొట్టినోల్ల మీదికి పయమాలు ఐతే దీసుకోగని దెబ్బలు కొట్టుడెందుకని మాట్లాడలేదా?” అని రఘుపతిరెడ్డి చెప్పిండు. రఘుపతిరెడ్డి తండ్రి సత్తిరెడ్డి తోటి మేలు పొందినోల్లంతా కులమే లేదనుకుంటంద్రు మతిల. ఆ మాటలు ఇంటూ..

“ఏం మొగులూ! చెప్పు నిజమంటావా? అబద్దమంటవా?” రఘుపతిరెడ్డి మొగులయ్యను అడిగిండు.

“నువ్వొద్దనే పటేలా!” అని మొగులయ్య, లచ్చవ్వ అన్నరు.

“ఏవరైనా మట్టి పనిజేసినా సరే. అందరూ మీ పొరగాండ్లను బడికి సదువడానికి పంపుండ్రి. బాలయ్య సదువుతుండు కాబట్టి ఇట్లా ఆలోచిస్తండు. అదే సదవకపోతే గట్లనే ఆలోచిస్తడు. అందరు సదువాలే. సదివినోడైతే సముస్కారమొస్తది. మీ వోల్లు తెలివోల్లు అయితే మీకు తెలివి. మీ వాడకట్టుకు తెలివి. ఈ బూమ్మీదికి ఎప్పటికి బతుకొచ్చినాం? బతికిన్నన్ని రోజులు మంచిగ బతుకాలే. సచ్చిన్నాడు అందరం గండ్లకే పోతం. ఎందుకురా ఇవన్ని?” అని పటేల్ యాష్టపడ్డడు.

“పటేలా! నీ మాటలన్ని నిజమే కాని నాకొక్క కొడుకు వానికేమన్న ఐతే మేం బతుకుతమా? ఈ ఒక్కతాప సురుకు వెట్టినంక ఇగ ఊకుంటం. ఇదే ఆఖరు తాప పటేలా!” అని లచ్చవ్వ అన్నది.

“మావోడు కూడా వొద్దంటండు. ఇదే ఆఖరి సారి పటేలా! ఇగ కులం గురించి పట్టించుకోం పటేలా...” అని మొగులయ్యన్నడు.

“నేను చెప్పే కాడికి చెప్పిన. ఇగ మీ ఇష్టం.” అని రగుపతిరెడ్డి అన్నడు.

‘మంచి చదువు చదివి తెవివోనివికా బిడ్డా! కులం తెలివికంటే కాయిదం చదివిన తెలివి గొప్పదని రుజువు చెయ్యి. నలుగురికి మంచి బోధ జెయ్యి బిడ్డా!” రఘుపతిరెడ్డి చెప్పిండు.

“సరే ! పటేలా...” అని బాలయ్యన్నడు.

“దుర్గవ్వా! మొన్నటి తవుటం కైకిల్లు దీస్కో...” అని లెక్కవెడుతూ డబ్బులు తీసుకుంటూ ఎవల పని కోసం వాళ్లు పోతండ్రు.

“బూతవైద్యం చేసినప్పుడు ముట్టుకుంటడు. తాయితలు కడుతూ తాకుతడు. పసుపు రాస్తూ పట్టుకున్నపుడులేని బువ్వ దానం చేసుకుంటూ తాకితే ముట్టుడైనాడు తియ్యి.” ఒక పెద్దమనిషి వాస్తవీకరణ పోతపోస్తుండు.

“ఔను నిజమే! కులమెక్కడిదని...” అనుకుంటూ.....

ఔసులోల్ల ఇంటిరి రానని, బంగారంతోని సురుకు పెట్టుకోనని బాలడు మొండికేశి తిరుగుబాటు జెండా పాతిండు కులంల. వశపడని తల్లిదండ్రులు నెత్తిపట్టుకున్నరు.

“ఉట్టి ఉట్టిగనే ఔసులోల్ల ఇంటికి పోదాం బిడ్డా! మనకోసం గాదురా? మందికోసం” అని బుదగరిస్తూనే ఉంది తల్లి.

ఏవీ పట్టించు కోకుండా బాలయ్య పుస్తకాల సంచి జబ్బకేసుకోని గాలి మేఘంలా బడికి ఉరుకుతుండు.....

– సాహిత్య ప్రస్థానం సెప్టెంబర్–2009 సంచికలో ప్రచురితం.

అంతర్మథనం

కొన్ని ప్రకటనలు మనల్ని నిరాశావాదం వైపు నడిపిస్తున్నాయడానికి నా జీవితంలో జరిగిన సంఘటనే ఉదాహరణ. ఆకలి రుచి ఎరుగదన్నట్లు నిరుద్యోగం కదా! జాబ్ కోసం ఎడతెగని ఆరాటం.

డిగ్రీ కాలేజిలో కాంట్రాక్ట్ లెక్చర్ పోస్టుల అప్లై చేశాము. మరునాడు ఆదివారమైనప్పటికీ సెలక్షన్ లిస్ట్ వేస్తామని వరంగల్ ఆర్జేడిగారు మైక్‌లో అన్నౌన్స్ చేశారు. ఆ రోజు వెనుదిరిగినం. అప్లై చేసుకున్న నా మిత్రుడు పీ.జి క్లాస్‌మేట్‌కు భానుకు ఫోన్ చేసిన...

"అన్నా నీకు అటునుండి దగ్గరే కదా! వెళ్లన్నా" అని భానన్న అన్నడు.

"నువ్వు పో. అన్నా! నువ్వు పోతే ఆరా తీసి చూస్తావనీ" అని అన్నాడు.

నేను సిద్దిపేటలో బస్సెక్కిన. హన్మకొండ పెట్రోల్ పంపుకాడ దిగి నడుచుకుంట పోయిన. అక్కడ నిరుద్యోగులు పిట్టకు పెట్టినట్లు ఎప్పుడు లిస్టు పెడుతరా? ఎదురుచూస్తుండ్రు. ఎంతో ఆరాటంతో చూస్తున్నారు. వారి సంభాషణంతా పేదవాని కోపం పెదవుల తీటా అన్నట్లు వుంది.

లిస్టు ఈ రోజు పెట్టరని తెలిస్తే నేను హైద్రాబాదు బయలుదేరిన. అంతకు ముందురోజే దరువు ఎల్లన్న జయ మ్యారేజి 'డే' కి వెళ్లాలి ఉండే. ఈ రోజు నాబిడ్డ, నా భార్య వస్తున్నారు. హైద్రాబాద్ త్వరగా పోవాలనిపించింది.

రైల్వే స్టేషన్ ఆటోలో వెళ్లి స్టేషన్ ముందుట దిగిన. ఫర్లాంగ్ దూరం నుంచి పోతూంటే అనాథలు, అభాగ్యులు, వికలాంగులు చేతకాని వృద్ధులను చూస్తూంటే జాలికల్గి వారిలో ఇద్దరికి చిల్లర పైసలు దానం చేసి లోపటికి పోతున్న. అపుడే ఒక

మైక్‌లో తియ్యటి స్వరంతో మాట్లాడుతూ మరి కొద్ది నిమిషాల్లో రానున్న నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ సకాలంలో వచ్చుచున్నది. అప్పటికే ఆ ట్రేయిన్ టైం సా॥ 4.45 అవుతుంది. ఆ ట్రేయిన్ 4.50 ని॥లకు వరంగల్ నుండి బయలుదేరుతుందని తెలుసుకున్నాను.

అంతలోనే "తిరుపతి నుండి సికింద్రాబాద్ మీదుగా నిజామాబాద్ వెళ్లే నిజాముద్దిన్ ఎక్స్‌ప్రెస్ మరికొద్ది సేపట్లో రాగలదు..." అంటూ అనౌన్స్ చేసింది.

'నేను ఫ్లాట్‌పారమ్ ముందున్న టిక్కెట్ క్యూలైన్ చూస్తే చాతాడులా ఉంది. నాకు పదినిమిషాలైన టిక్కెట్ దొరకదు' అని మనసులో గులుగుకుంటూ ఎనుక నిలబడ్డ.

ఒక వ్యక్తి వచ్చి "మీరు ఎక్కడికి వెళ్తున్నారు?" అని ప్రశ్నించాడు.

"నేనా? సికింద్రాబాద్ వెళ్ళాలి" అన్నాను.

"ఆ ట్రెయిన్ వచ్చేటైం అయింది. క్యూలో నిలబడి టిక్కెట్ తీసే లోపే ట్రెయిన్ వెళ్ళిపోతది. మళ్లీ గంటన్నర దాక ట్రెయిన్ లేదు. కాబట్టి ఇపుడే వెళ్ళాలి. ఈ ట్రేన్‌కే వెళ్ళాలి. నన్ను నమ్ము సార్" అని అంటూనే ఇదిగో ఇది నా వికలాంగ (ధృవీకరణ పత్రం) సత్తుపికెట్ (వికలాంగులకు) మాతో ఒకరికి ఫిరీ ఉంటదనే.

ఇదంత విన్న నాకు ఎట్లయితేంది? ముందుగా చేరాలె" అని అనుకున్న. అంతలోనే కొంత సందేహము. 'ఇతను మధ్యలోనే పోతే ఎట్లా? అటుపెట్టి టిక్కెట్ కలెక్టర్ వస్తే ఎట్లా?' అని ఆలోచిస్తున్న.

నీకు ఏం ప్రాబ్లంకాదు సార్, అని ఆ సర్టిఫికెట్ ఈ సర్టిఫికెట్ చూపించబట్టిండు. టిక్కెట్ తీసుకునేందుకు నిలబడితే ట్రెయిన్ పోతుంది'. అని ఆలోచించి ఒప్పుకున్న.

ట్రెయిన్ ప్లాట్ ఫాం మీదికి ఆగడం కోసం నెమ్మదిగా వస్తుంది. ఫ్లాట్ ఫాం నుంచి కిటికి సీటు ఆపెతందుకు దస్తి ఇస్తే సీటు ఆపిండు ఒక పుణ్యాత్ముడు. సందేహము కొద్దే లోనికి ప్రవేశిస్తున్నా "రాండి సార్ సీటు ఆపిన కూసొండి" అని సీటును చూపెడుతూ తను నిల్చున్నాడు.

పయాణికులు దిగుతున్నారు. ఎక్కుతున్నారు. మెల్లమెల్లగా బండి కదులుతుంది. నేను ఏం మాట్లాడకుండా 'టిక్కెట్ కలెక్టర్ వస్తే ఎట్లా...? వీడు దిగిపోతే ఎట్లా' అనుకుంటూన్న.

"సార్ మీరేం జేస్తరు?" అని తనతో తీసుకెళ్తున్న దివ్యాంగుడు అడిగిండు.

"నేనో సిన్నపాటి నౌకరి జేస్తా".

"ఎంతమంది పిల్లలు?"

"ఒక్కతే పాప."

"ఎన్నో తరగతి చదువుతుంది?"

"చదువు లేదు 14నెలలది. "

"మీదేవూరు ?"

"సిద్దిపేట"

"ఇటువైపు ఎందుకొచ్చినవు?"

విషయం అంతా చెప్పినా విసిగిస్తూనే ఉన్నడు. 'ఓరి ఫాగల్ నాబాధ నాది. నీ బాధ నీది. నన్నెందుకు సావగొడుతున్నవురా?'అని మనసులో అనుకొంటూ ఊరుకుంటే లాభం లేదనుకొని నేను ప్రశ్నలు వదిలిన.

"నీకేంతమంది పిల్లలు?"

"నాకు ఇద్దరు."

"ఏం చదువుతుండ్రు?"

"10వ తరగతి అయిపోయింది. పెండ్లి కూడా సేసిన" అని ప్రశ్నలకు టకా టకా జవాబులు యిస్తున్నాడు. ఇగ ఇదంత ఒడ్రుదు(అరవడం) నానుంచి కాదు. ఇక నేనే ఒడ్రియ్యాలె అనుకొని పదిప్రశ్నలు మూల్లెకట్టి వాని నెత్తిమీద పెట్టిన. వాడు ఒక్కొక్క దానికి నిదానంగా సమాధానం చెప్పేసరికి అర్ధగంట గడిసింది. ఇంతలో నాకో ఫోన్ వచ్చింది. నేను మాట్లాడుతుండగా వాడు కొద్దిసేపు బ్రేకు యిచ్చిండు. మళ్లీ యెంటనే అందుకొని అన్ని కుటుంబ విషయాలు మాత్రమే చెబుతున్నాడు.

విని వినరానట్లుగానే నేను ఉదహరిస్తున్నప్పటికీ "మీదే కులం?" అని అడిగిండు. "ముందు నీ కులం చెప్పు?" అని నేనడిగిన.

మాది ఆరే-ఛత్రియ కులం. ఇప్పటి డీజిపి మా కులమే. మాది గొప్ప కులమని ఒక్క తీరుగా సెప్తుతనే ఉన్నడు.

నేను ఏదో ఆలోచిస్తున్న. "ఓ సారు...అని గట్టిగా పిల్సిండు."

ఉలికిపడ్డట్లు ఆ...ఏంటిది? అన్నట్లు చూసిన.

"మీదే కులం ?" అని మళ్లీ అడిగిండు.

ఇగ వాడు ఎంత వేగంతో అడిగాడో అంతకన్నా వేగంతో మాదిగొల్లం

అన్న.

"మీరు మాదిగోల్లు ఏంటిది సారు? బట్టగుండు భాగ్యవంతునివి చూస్తే మవూరి కొమాటాయెన లెక్క ఉన్నవు." అంటూ పోడిగిస్తూనే ఉన్నాడు.

"అయ్యా నేను మాదిగోన్నే... కాదనడానికి నువ్వెవరు? మా తాతకు, మాతండ్రికి బట్టతలే ఉంది. నాకు ఉంది." అని వివరణ యిస్తూన్న.

"ఎవరైతేంది గుణం మంచి గుండాలే గని కులం తోటి ఏంది?" అంటూ మళ్లీ సమర్థిస్తున్నాడు.

మాటల మధ్య భువనగిరి స్టేషన్‌ల బండి ఆగింది. రైలు సుట్టూ ఎంత మంది బతుకుతున్నరో నిశితంగా పరిశీలిస్తేగాని అర్థంగాలేదు. సమోస సమోస అంటూ ఒకాయన. చాయి, చాయి, కాఫీ, అంటూ కీచు శబ్దంతో ఇంకొకరు. పల్లి, పల్లీ, అంటూ లంబాడ మహిళ. ఇలా ఎంతో మంది ఎన్నో విధాలుగా తమ జీవనోపాదిని వెళ్లదీస్తున్నారు.

"ఒరేయ్ దుడ్డే. ఏం కూసుంటవురా? నీ మొఖంల సెప్పు" అని దివ్యాంగుని

నాకు సమాధానం చెప్పుతూ వాడు నా దోస్త్. నన్ను వాడు గట్లే అంటడు సారూ. వీరిద్దరి మధ్య ఇరువై సంవత్సరాల తేడా. మా సీటు దాటి పోయాక తిరిగి చూసిన. ఈయనేకేం లోపం అని పరిశీలిస్తే ఆయన చేయి లోపం. అప్పుడనుకున్న మనసులో ఈ వికలాంగులది ఇంత నెట్‌వర్క్ ఉందా? వీరంతా వీళ్ల జీవనోపాధి ఇట్లనే సంపాదించుకుంటున్నారా?" అని అనుకున్నంతలోనే తిరిగి వచ్చిండు.

నేను నాలుగు సమోసలు కొన్న. పొద్దటి నుంచి ఆకలి అయినా ఏమి తినలే.

"మాస్టారు నువ్వు దేని గురించి పోతున్నవు హైద్రాబాద్" అని అడిగాడు.

"మా దోస్తు దగ్గరికి పోతున్న" అని అన్న.

"మల్ల ఇటువైపు వస్తరా?" అని అడిగిండు.

"ఆ వస్తే రేప్పొద్దున్నే రావచ్చు."

"నువ్వొస్తాంటే నేను పొద్దుగాల స్టేషన్‌ల ఉంట" అని అన్నాడు.

"ఇంకెంత సేపు అయితది మనం హైద్రాబాద్ పోయేసరికి" అని అన్నాను.

"రాత్రి ఎనిమిదన్నర అవుతుంది" అని అన్నాడు. పక్కనే నిజామాబాద్‌కు వస్తున్న మహారాష్ట్ర చెందిన వాళ్లు టెం కిత్తె హోగయె అని అడిగింద్రు. సెప్పిన. వాళు

_ తిరుపతి నుంచి గుండ్లు చేయించుకొని బోడి తలలతోటి వస్తున్నారు.

జోడాబైల్ జర్దాతీసి అరచేయిల పోసుకొని నలిపి నలపి కింది పెదవి గుంజి పండ్లకు పెదవి నడుమ కచ్చకాయంత జర్దాను ఒత్తిపెట్టె. అబ్బ ఎట్ల తింటండో ఏమో అనుకున్న. హిందిలో ఏదేదో మాట్లాడుతున్నడు. నాకేం అర్థంకాదు. అర్థం చేసుకొందామనుకున్నా ప్రాథమిక జ్ఞానం నాకు లేదు. నాది నాకే ఎంతో యిజ్జతి పోయినట్టు అనిపించింది. అసలే నేను టిక్కట్ లేక ప్రయాణం చేస్తున్నానే బెంగ.

వాళ్లముచ్చట్లు అట్లా మాట్లాడుతుండంగా నాలో నాకనిపించింది నేను అనవసరంగా దొంగోలే ప్రయాణం చేయవడితి. డబ్బులు ఈ వికలాంగుడికి ఒప్పందం ప్రకారం వరంగల్లు నుంచి ఎంతనో గంత యియ్యాల్నాయే.

నేను యిచ్చే పైసలు సంస్థకు చేరుతలేక పాయే. అన్ని తెలిసి అంతో యింతో చదివిన నేను ఇట్లయితే ఎట్ల. నేను చేరుకోవానులకుంటి. నిజంగా యాదికొస్తే ఎల్లమ్మ పండుగకు ఆఖరు దినం నాడు గావు పట్టుకొని ఈరగోల అందుకొని ఇసిరి ఇసిరి కొట్టె శివసత్తుల శివయ్య యాదికొచ్చిండు. ఎందుకంటే ఒక్క దెబ్బకొట్టిండంటే ఇగ అంతేసంగతి.

అయన కొట్టినట్లుగా టిక్కెట్ తీసుకోనందుకు యాదిల తల్సుకుంటే భయంగావట్టింది. బిల్‌కలెక్టర్ పట్టుకుంటే ఎంతో కొంత ఫైన్ కట్టాలే. ఫైన్ కట్టకపోతే రైల్వే పోలీసులకు అప్పజెప్పుతరు. నాకు టిక్కెట్ కలెక్టరు వేసిన బిల్లును కట్టక పోతే ఒక బాధ. నేను చేసింది, నాకు జరుగుతది.

కష్టాన్ని సుఖాన్ని, నిందను పొగడ్తను నేను నామిత్రులతో పంచుకోంది నాకు ఏదో వెల్తి అనిపిస్తది. నేను అలా చేబితే నీవు అయిన లేట్ అయింది. ఇంకో గంటగాని అర్ధగంట గాని లేటౌవుతండే గని ఎందుకు తెల్వని అనామకునితోటి వచ్చి ఫైన్‌కట్టినవని నన్నే కోప్పడుతరని బాధకలిగింది. చెపుతే ఎట్ల చెప్పకపోతే ఎట్లనే సందిగ్ధం కలుగుతూనే ఉంది. అంతలోనే వాళ్ల సంభాషణ ముగిసింది. సార్ లాలపేట పోతాంటివి మౌలాలి నుంచి దగ్గరయితది. రాత్రి తొమ్మిదవుతుంది. ట్రాఫిక్‌జాం సరిగా బస్సులు ఆటోలు దొరకవు.”

ఎందుకొచ్చిన తిప్పలు సక్కగా యిక్కడ దిగి మంచిగా నడుచుకుంట పోతే పదినిమిషాలల్ల లాలపేట వొత్తదని చెప్పె. నాకూ నిజమే అనిపించింది. నాకు అసలే కొత్త గనక వాళ్లను అడుగుతున్న. ఇక్కడి నుంచి లాలపేట దగ్గరనా? దూరమా..?”

దగ్గరనే అని అన్నారు.

అంతలో ఇరువయేల్ల యువకుడు ఫోన్ మాట్లాడుకుంట "నేను మౌలాలిల ఉన్న దిగుతున్నరా! నీవు రారా" అంటున్న మాటలు మాత్రం విన్న. ఆయన ఫోన్ పెట్టేసినంక ఇక్కడి నుండి లాలపేటకు పోవచ్చునా? ఆటోలు బస్సులు దొరుకుతయా?"

"అన్నా సిటీల ఒంటిగంటదాక ఆటోలు తిరుగుతునే ఉంటాయి. కాకపోతే కొద్దిగ ఆటోవాల ఎక్కువనే కిరాయి అడుగుతరు. ఆటోలు ఎందుకు దొరకయన్న."

ఇంకొక్కాయన జవాబు. ఏమాయే నాపైసలు, చార్జి ఎపుడు యిత్తవు? అన్నట్లు నాకేయ్ ఒక్కతీరుగా సూత్తుండు.

'వాళ్ళు పోన్‌ల మాట్లాడి స్టేషన్‌ల ఉండుమని ఒకలకు ఒకలు ఫోన్ చేసుకోని, తావు తప్పదీసుకొని ఈయన్ని ఆల్లు తీసుకొనిపోతే నేనేం కావాలె' అని అనుకొంటున్న. అంతల్లనే ఒక ఫోన్ ఒచ్చింది. సెప్పురా మామ. ఏ భోగిలున్నవురా? దేంట్ల(ఏ ట్రెయిన్ల) పోతున్నవురా? నేను నిజామొద్దీన్‌ల వత్తున్న, ఏమన్న గిరాకి తగిలినాదిరా? నేను గీసుకొండ యెంకటిని. అదే కర్రె శీను దోస్తును మాట్లాడుతున్నా." అంటూ ఫోన్‌ల మాట్లాడ వట్టిండు.

"మల్లెపుడు వత్తవు? నా ఫోన్ నంబర్ రాసుకోండ్రి. మీరు మల్లెపుడొచ్చినా నాకు ఫోన్ చెయ్యిండ్రి. నేను లేకున్నా మావొల్లు ఇక్కడ ఈ స్టేషన్‌ల ఉంటరు. ఆ స్టేషన్‌ల ఉన్నోల్లకు ఫోన్‌చేసి నేను నీకు అందుబాటులో ఉంచుతా" అని చెప్పిండు.

మాట్లాడుతూ ఒక పాత టిక్కెట్ మీద గీసుకొండ యెంకటి తన సెల్‌ఫోన్ నంబర్ రాసి "తీసుకోండ్రి సారూ తీసుకోండ్రి"అన్నడు.

బతిలాడితే బలిమీటికి తీసుకున్న. అంగిజేబుల అన్ని కాగితాలల్లకు మెల్లగ కుక్కిన.

"సారు నాకు పైసలు యియ్యరాదు."

"నువ్వు నన్నిడిసి పోవు. నేను నిన్నిడిసి పోను కదా! స్టేషన్‌ల నన్ను అవుతలికి పంపంగనే నీ పైసలు నీకిత్త యెంకటి" అని నేను.

"పైసలు యిత్తే అయిపోతదికదా సార్ ఊకె అడుగుడు" అని అంటండు.

నాకేమో జాతీయద్రోహం లెక్క ఏదో పెద్ద దొంగతనం చేసినట్టు అలజడి కలుగుతుంది.

'నేను పైసలిత్తినా వెళ్లిపోతడు. నన్ను బిల్ కలెక్టర్ పట్టుకుంటడు.

నలబైరూపాయల టిక్కెట్‌కి నాలుగు వొందల రూపాలు కక్కాలే. ఆనంగ ఈనంగ ఓయు మిత్రుల చెవుల పడ్డా, క్యాంపస్ దోస్తుల చెవుల పడ్డా! సిద్దన్నా...! నువు గిట్లెందుకు జేసినవే? అని నన్నే అంటే సిగ్గతో తలదించాలే. ఇట్ల ముందుగ యిచ్చి నేను గట్ల తిట్ల తిప్పల పడాలే. నేనెందుకు పడుత. ఛాల్. నేనెందుకు యిత్త. ఆగినంక అలుకగా గేటు దాటినంక ఓ పైస ఎక్కువనే యిత్తగని తక్కువ యియ్య' అని అనుకుంటున్న.

లాలపేటకు పోతంటివి గదా వొత్తుంది. మౌలాలి స్టాప్ దగ్గర ట్రేన్ మెల్లిగ పోతుంది. ఇగ ఆగుతుంది జల్ది దిగాలే. దా. దిగుదువు రా అని నన్ను అడిగితే పక్క సీట్లవాల్లను అడిగి పూరాగా తెల్సుకొని దిగుదామని సీట్లకేలి లేసిన.

"అంకుల్ మీరెందుకు గంత నారాజు పడుతుంండ్రు? నేను కూడా గంతే. నన్ను సూడు ఎంత మంచిగ ఉన్నానో" అని ఒకాయన దీర చెప్పుతండు.

'నీకేంది పడుసో పెడుసో. నువ్వెట్ల సేసిన సెల్లుతది. నువ్వుతప్పు జేసినా నిన్నెవలు ఏమి అనరు' అని అనుకుంటున్న.

ట్రేన్ ఆగింది. దిగిన. నాలుగు పదులు లెక్కపెట్టియిత్తి. యెంకటి చూపులో దీనత్వం తొణికిసలాడితే మరో ఐదు రూపాయలిచ్చినా సరిపోలేదంటడు.

"నలుపై యిస్తి. ముందు ముప్పైఐదు సాలంటివి. యిపుడు యింకా కావాలంటే ఎట్లా ? మాయి పైసలు కావా? ఏం మాట్లాడుతున్నవు ఊకో? నాలుగు సమోసాలు తినవెడితి. ఓ చాయి దాగవెడితి. అవన్ని కలుపుకుంటే యాబైలపడే ఆ లెక్క ఎటుపోవాలె? అనుకుంట దిగుతున్న.

ఆ ఇరవై రెండేండ్ల అబ్బాయి "అంకుల్ ముప్పైఐదే నువు నలుపై యిచ్చినవు గంతే".

కంకర మీదికేలి నడుసుకుంటు బయిలిదేరి వస్తున్న. ఎవలు ఎట్ల బతికెటోల్లు అట్ల బతుకుతరు. ఇట్లాంటి చట్టవిరుద్ద పనులు చేయొద్దు. ఊకే నలబైరెండు రూపాయలతో టిక్కెటే కొంటే గిట్లా దొంగోలే వొత్తునా? ఇదంత ఎందుకు? గోస ఇగ నా జీవితంల ఇసోంటి పని చెయ్య అనుకొని గట్టిగ నిర్ణయించుకున్న.

అడుగుల్ల అడుగులేసుకుంట గేటుదాటి మొసతీసుకున్న. ఇంటికి చేరుకునే వరకు నా గావురాల బిడ్డ అప్పటికే వచ్చింది. నన్నుసూసి కీకెలు పెట్టుకుంట నవ్వుతంది. నేనే టిక్కెట్ తీసుకోక ఫైన్ కడితే ఆమె ఎగజల్లే కేరింతల్ని అందుకునే వాన్నేనా?

ఇగ ఇసొంటి పనులు చెయొద్దు. ఇరుకుల పడొద్దని చెప్పదలుచుకున్న. ఈ ముచ్చట ముందుగా...

తేలని లెక్కలు

రోడ్డుపక్కన ఉన్న బార్బార్ షాప్‌లో కత్తెర కరకర ఆడిస్తూ "సార్! మీకు ఎలక్షన్ డ్యూటి?ఎక్కడ పడ్డది" అని భాస్కర్ లక్ష్మీపతి సారుని అడిగిండు.

"దగ్గరనే పడ్డది. మన మల్లారంల." బదులిచ్చిండు లక్ష్మీపతి సారు.

"గాలి ఎటుదిక్కు ఉన్నది?"

"తెలంగానకు ఓట్లు పడ్డయా? తెలంగాణ గెలుస్తదా?" కటింగ్ చేస్తూ అడిగిండు భాస్కర్.

"ఏం చెప్పొస్తది? మన చేతుల ఏమున్నది? మనకు చూపెట్టి ఏస్తరా?"

"ఓట్లు పడుతయా సార్ " అని భాస్కర్ అన్నడు.

"ఏమోనయ్యా మునుపటి లాగా కాదు. అందరిలో మార్పువచ్చింది. ఓట్లు వేసే పద్ధతి మారింది." అని సమాధానంగా లక్ష్మిపతి సారు.

సారు భాస్కర్ తండ్రి దుకుణం సురువు చేసినప్పటి గిరాకి. కుటుంబ సమస్యలకు పరిష్కారం. బతుకుతెరువు ముచ్చట్లు. తోచినకాడికి భాస్కర్ కుటుంబానికి సహాయం. కాలేజీ పిల్లలకు ఏదో ఒక ఉచిత సలహా ఇసరడం. వినని వినకపోనీ మంచిగ సదువుతే మంచి బతుకు? లేకుంటే అయ్యవ్వలోలే తట్టపార పని" అని చెప్తుంటడు. భాస్కర్ వచ్చే రెగ్లర్ కస్టమర్లకు ఆయన సుపరిచితుడు.

"సార్ సార్" వేరే అతనికీ కటింగ్ చేస్తూ పేపర్లో లీనమైన సార్‌ను పిలిచిండు భాస్కర్. అదే షాపులో వెంకట్ ఇంట్ల పరిస్థితి బాగలేక కులవృత్తిని చేసుకుంటుండు. సార్ మాట మీది కేలి ఇంటర్ పాస్ కాకున్న సరే ఓపన్ డిగ్రీ కట్టుమంటే కట్టిండు. పేపర్‌లోంచి యువతలకు వచ్చి, భాస్కర్ అడిగేది గ్రహించి

"ఈ రాజకీయం బదుత ఉన్నోంది బర్రె. రాజకీయమే రంకు, బొంకు. అందరికి అన్నితీర్ల ఉంటేనే రాజకీయం. ఎటుపెట్టి ఓట్లు, సీట్లుకావాలే. అంతకన్నా ఎక్కువ అధికారం కావాలే. గంతే. ఎవడు ఎటుపోతే వాళ్ళకేంది? సీయం అదే ముచ్చట ఒకరోజు ముందు అంటే ఎట్లుండు. మన ఓట్ల కంటే ఒక్కరోజు ముందు అట్ల మాట్లాడితే ఆ ఓట్లు కనపడు. సీట్లు కనపడు. ఆ అధికారం కూడా కనపడు.ఏం ఫాయిదా. తెలంగాన అంటే ఎంత కుట్రవుందో ఎరుకయితందా?" అని లక్ష్మిపతి సార్ వెంకట్‌తో అన్నాడు.

ఈ మాటలు అనుకుంటుండంగా ఆ పార్టీని నెత్తిన ఎత్తుకునే వీరాభిమాని వీరేశం చిన్నపాటి కాంట్రాక్టర్ కటింగ్ కోసం ఒచ్చిండు. వాళ్ళు అనుకునేటివిఅన్ని ఇంటండు. ఎప్పుడందునా..!' అని మతిల అనుకుంటుండు.

"మన తెలంగాణోల్లకు యాదిమరుపు బాగ సార్! మనల ఏమంటరు, మన బతుకులు నాశనం చేస్తరా? అనే ఆలోచన రాదు. మనోల్లకు కావలసింది ఇప్పటి మందం ఆలోచనల ఇరుక్కపోయి ఇబ్బందిపడతరు. ఇదేందో తెలుసుకునే వరకు అరచేయిల వైకుంఠం కనబడుతది సార్ " అని వెంకట్ అన్నడు.

"నిజమే! వెంకట్ మనోల్లు ఒట్టి అమాయకులు. ఏదిచెప్పితే గదే అంటరు. అట్లెట్ల అని అరికెలు పట్టరు. నిన్న ఏమైంది? ఇయ్యాల్ల య్యేవైంది? రేపు ఏమైతది ? అనే ఆలోచనలు, ముందు సూపులేక, ఇంకెన్ని రోజులు ఆగమైతరో? పోనీ సదువుకోనొల్లకంటే సదువుకున్నోల్లు అందరు ఒక్కతీరుగా తయారైతండ్రు. ఏం జరుగుతుందో ఏం అర్థంకాదు." అని సార్ అన్నడు.

అధికారపార్టీ అభిమాని గడ్డం గీయించుకుంటూ "జర్రాగు వెంకట్" అని చెప్పి, "సార్ కాంగురేస్ పార్టీ ముఖ్యమంత్రి ఏం అన్యాయం చేసిండు? ఏం చిన్న సూపు చూస్తుంది పార్టీ? కరెంటు మాఫీ చెయ్యలేదా? ఒక్కొక్కనికి వేలపైస మాఫీ కాలేదా...? 65 ఏండ్లు నిండిన మహిళలకు పించన్లు, కట్టుకున్నోల్ల కల్ల ఇండ్లు, అందరికి పించన్లు, రోగం నొప్పికి ఆరోగ్యశ్రీ, తెలుగుదేశమోల్లు బందుపెట్టినా రెండు రూపాయలకు బియ్యం పథకం కూడా నడిపించవట్టే, జలయజ్ఞం చేయవట్టే, తెలంగాణకు ఏం లుక్సాన చేస్తండు?" అని ఒక దమ్ము వానెలిసినట్లు ప్రశ్నలడిగి ఊకున్నడు వీరాభిమాని వీరేశం.

'ఈగాలి ఎటుపోయి ఎటుతిరుగుతదో?' అని అనుకొని "వీరేశం ఎవలు

గెలిచిన మన ఇంట్లకేం పెట్టరు? ఏదో ఉండలేక ఉప్పసకు అనుకుంటంగాని, మనకేం వస్తది. ఈ భాస్కర్‌కి, వెంకట్‌కి ఈ సెలూన్ల పనిచేయంది ఎల్లది. నేను నౌకరి చేయంది నాకు ఎల్లది. కూలికైకిలి చేయంది కూలోనికెల్లది? మనకెందుకు ఈ లొల్లి" అని అన్నడు లక్ష్మిపతి సారు సుతిమెత్తగా.

"వీరేశం అన్నా ఏమున్నా కట్టిరిసినట్టు మాట్లాడుతడు. తప్పైతే ఒప్పుకుంటడు. ఏమంటవే వీరేశమన్నా" అని భాస్కర్ అన్నడు.

"అవును తమ్మీ నాగురించి తెలువందారా? గట్లేం లేదు నేను పట్టిన కుందేలుకు మూడుకాల్లు అంటనా..? ఏదన్నా మొండిగా వాదిస్తున్నానా..? నిజం గావాలే..! అబద్దం అవసరంలేదు! " అని అన్నడు వీరేశం.

"వీరేశం సారు ! కాంగురేసు పార్టీ మంచిగనే చేస్తది. అందరిని బతుక చూస్తది. కాదంటలేం? మనకొరకుండాలె గని మంది కొరకు కాదు కదా సార్, గీ వెంకట్ ఇంటర్ పాసయిండు. ఇంట్ల పనిచేస్తండు. ఈయనసోంటోల్లు ఎంతోమంది ఉన్నరు. వాల్లందరిని యిడిసిపెట్టి సెక్రటేరియట్ గేట్ కీపరులదాక మొత్తం ఆంధ్రోల్లె వుంటరు. ఇక్కడ ఇంటర్ సదివికూడా చెపరసి నౌకరిని దొరికిచ్చుకొలేక పోతంద్రు. మన జిల్లాల కూడా అటెండర్లు ఆంధ్రోల్లే అటెండర్లు. కావలంటే ఐకెపి ఆపీసుల సూడు. మనకంటే ముందుగా వాళ్లే సుదులాంచు కుంటుంద్రు" అని సార్ అన్నడు.

"సార్ రండ్రి సార్ కుర్చీ కాలీ అయింది." అని కటింగుకు పిలిచిండు భాస్కర్. సరే అనుకుంట కుర్చీలకు పోయిండు.

"వీరేశం సార్ ఇంకో ముచ్చట మన మెదక్ వెలుగు ఆఫీసుల నేను చూసిన శ్రీకాకుళం చెపరాసిని. మనోల్లకు నౌకర్లు ఇగ ఎక్కడినుంచి వస్తయ్."అని అన్నడు సార్. "నిజమే సారూ! మన జిల్లాల ఆంధ్రోల్లు బాగనే నౌకర్లు చేస్తుంద్రు" వాస్తవాన్ని ఒప్పుకున్నడు వీరేశం. ఎట్లనన్న మా కాంగురేసు పార్టీ మంచిదని ఒప్పియ్యాలే అనుకున్న వీరేశం

"సార్ జలయజ్ఞం గురించి, రైతులగురించి, కరంటి మాఫిగురించి, మీ ఆలోచన చెప్పుండ్రి సార్" అని వీరేశం అన్నడు.

"జలయజ్ఞం అంతా దొంగల ధనయజ్ఞం తియ్యే వీరేశమన్నా" అని వెంకట్ అన్నడు.

"అరే ఊకోరా బయ్" అని అన్నడు వీరేశం. వెంకటి మీదున్న ప్రేమతో.

"వీరేశం సార్, పారేనీళ్ల ఇకమాతుగా మాలుపుక పోతంద్రు. దానికోసం ప్రాజెక్టులు కట్టిస్తంద్రు. అంత అవినీతిని చెప్పుతుంద్రు జర్నలిస్టులు. తలాపున పారుతున్న గోదారిని పటేల్ పోలంలకు నీళ్లుమలిపే నీరడి నర్సయ్యలెక్క మలుపక పోతంద్రు. గోదారి నీళ్లు మన తెలంగాణల పదిపైసల మందం పారయి. అటుదిక్కేలేమో తొంబైపైసల మందం తీసుకపోతరు. పాలమూరు పక్కల నుంచి పారుతున్న కృష్ణానది నుంచి కసికెడు నీళ్లు కూడా యియ్యకపోతేనే గదా పాలమూరంతా యియ్యాల్ల ఏడారి అయిపోయింది. మన నీళ్లు మనకు పారనపుడు మనమేంది మనబతుకేంది? ఇంకా ఆ ప్రాజెక్టుల కోసం హైద్రాబాదు శివారుజాగను అగ్గువకు అమ్మి ఆ ప్రాజెక్టులకు కడతరు.

మన నీళ్ల దోచుకపోయెతందుకు అభివృద్ధిపేరు మీద ఉన్నజాగలుఅమ్మవట్టిరి. ఇది న్యాయమేనా? వీరేశం. మన తెలంగాణల శిలాఫలకాలు అట్లనే మిగిలిపోతన్నయి. మనపైస మన ప్రాజెక్టులకు పెట్టే ధైర్నం లేదు. ఇది అన్యాయం కాదా?" అని ప్రశ్నలమీద ప్రశ్నలు వేస్తుండు లక్ష్మిపతిసారు.

"సార్ మా ఊల్లె సర్పంచిగా గెలువకముందు కాంగురేసు ఆయనకు ఒక్క స్కూటర్ మాత్రమే ఉండే సార్. ఇయ్యాల్ల ఆయనకు ఊల్లెకు కార్ల వొస్తడు. సార్ యిదంత ఎట్ల వస్తది సార్ పైస" అని భాస్కర్ అన్నడు.

వీరేశంను దెప్పిపోడిచినట్లుగా... ఆవిషయం వీరేశంకు కూడా అర్థమైయింది.? ఇంకో కస్టమర్ మనపట్నంల జాగ అమ్మి మన పైస ఇకమాతుగా ఆంధ్రకు తీసుకపోతంద్రు. ఆ ముచ్చట అడిగేందుకు తెలంగాణ నాయకులకు దైర్నమె లేపాయే. మంత్రి పదవి, టిక్కెట్ రావాలంటె వాళ్ళు చెప్పినట్టు యినెటోల్లు గట్టిగ అడుగుతరా? అడుగరు అన్నడు.

ఈ సారు తెలంగాణ లీడర్లను కడిగేస్తనని అనుకొని "కరంటి మాపి, బ్యాంక్‌ల అప్పులు మాఫి సంగతి ఏంది సారు" అని ఒకింత గర్వంగా ఈ ప్రశ్నలో నేనే గెలుస్తనే విశ్వాసంతో అన్నడు వీరేశం.

"వీరేశం సార్ మీకు మేం చెప్పాల్నా. మనదగ్గర కరంటి ఆధారిత వ్యవసాయమే కాబట్టి రైతుల కొరకే వచ్చినట్లు మంచి ఆలోచనతో రైతుకు న్యాయం చేస్తంది గవుర్నమెంట్. దాంట్ల కూడా తెలంగాణలో ఉన్న బోరు బాయి మోటర్లకే గాక రాష్ట్రమంతటా తక్కువ చేసింది. కరక్టే! లక్ష్మిపతిసార్ అనంగనే లోలోపల

మురిసిపోతందు వీరేశం. మొకం కలకల లాడుతుంది. ట్యూబ్‌లైటుకు "మాలిష్ మంచిగ చెయ్యిరా వెంకట్" అని ఉత్సాహంతో అన్నడు.

యిదంత మనకు కరువు. మనకు యాడాదికి ఒక్కపంటనే బలువు, రెండోపంట అంతంత మాత్రమే ఉంటది. మనము సర్కారుకు గీ నాలుగైదేండ్లల్ల కరంటిబిల్లు కట్టలేదనుకుందాం. సర్కారుకు ఎంతలాసైనా ఏంగాదు. కని మీకు యిస్తన్నమని మనకు సూపెడుతుండ్రు. అక్కడ పారెకాల్వలకు వాళ్లు ఎన్నడన్న బిల్లుకడుతరా...?

"వాళ్లకు యాడాదికి మూడు పంటలు దోసుకపోయిన నీళ్లతోటి పండించుకుంటరు. వాళ్లకు పంట ఎండిపోనే ఎండిపోదు. అయినా వాళ్లకు బిల్లులేదు. మనకు పంట పండినా ఎండినా బిల్లు ఉన్నది. మనకు ఎక్కువలాభం కలుగుతుందనుకుందాం వీరేశం వింటున్నవా? కరంటి తయారుకు బొగ్గుబాయిలు మనయి. రామగుండం మనది. నాగార్జున సాగర్ కరంటి మనది. ఇవ్వన్ని మనయి. వాళ్లకు యిచ్చిన మనకేం లాభం కల్గింది? మన జాగల ఇవ్వన్ని ఉంటయి. మనం బిల్లులు కడుతం. యియ్యాల్ల మాఫి చేసిమనే ఊకదంపుడు ఉపన్యాసాలు ఎవరికి కావాలె...? మనది మనకిచ్చుడు, మనది మనకు వేరేటోడు దానం జేసుడు మంచిగనిపిస్తుందా...? ఇంక బ్యాంకు అప్పులు లెక్కపెడుదాం. మన తెలంగాణల సాధారణంగా రెండెకరాల చిన్నకారు రైతులు, సన్నకారు రైతులకు ఔదుఎకరాలు. ఎక్కువగా ఉన్నది మహా అంటే ఎకరాకు ఎనిమిదివేలకంటే అప్పు ఎక్కువ యియ్యరు. ఐదెకరాలకు నలుపైవేలఎక్కువ యియ్యరు. పదెకరాలున్న క్రాప్‌లోన్ కూడా గంతే యిత్తరు.

ఆంధ్ర రాజకీయ నాయకులకు ఒక్కొక్కరికి వందల ఎకరాలు ఉంటది. ఉన్న కొద్ది భూమి తరి అని, పారకమనీ ఎక్కువ మొత్తం అప్పు ఇస్తరు. రాజకీయం చేతుల ఉన్నది. కాబట్టి బ్యాంకోడు లక్షలుగాదు కోట్లు యిస్తడు. కోట్ల టర్నోవర్ గల చేపల చెరువులకు అప్పులు, కరంటి మాఫి చేస్తడు. ఈ విషయంల తెలంగాణల పంటలుండయి గనుక అప్పులు తక్కువనే యిస్తరు. యిప్పుడు నువ్వే చెప్పు ఎవలకు ఎక్కువ లాభమో...? వుట్టిగనే మనకు తెలుస్తది. విద్యాలయాలు కేటాయించడంలోను, నిధులు కేటాయించడంలోను, నీళ్లు కేటాయించడంలోను, ఎంత పక్షపాతముందో మనకు ఊకెనే ఆంధ్రోళ్ల పెత్తనం అర్థమయితది... కాంగురేసు, తెలుగుదేశంల

అన్నిటిది అర్థమయితది. అని డబుల్ డోస్ మందిచ్చినట్లు ఉన్నది ఉన్నట్లు చెప్పిండు" లక్ష్మిపతి సారు.

పుల్లుగ తాగినోడు చెక్కరి బుక్కితే నిస దిగిపోయినట్లు వీరాభిమానం జరసేపు దిగినా మల్ల తెలంగాణ లీడర్లమీద సూసుకో నా తడాఖా అని ధైర్నం తెచ్చుకున్నడు వీరేశం.

"తెలంగాణ లీడర్లయి ఏం తప్పులే లేవా! మాయి తప్పుడు విధానాలు అనుకున్నపుడు మా కాంగురేసుకు ఎట్ల అధికారం యిస్తండ్రు పబ్లిక్" అని ప్రశ్నలు ఒదిలిండు వీరేశం.

మంచి చెడ్డలు కల్గిన మనుషులు ఎక్కడ ఉంటరో అక్కడ అన్ని ఉంటయి. తెలంగాణ వాదాన్ని ఓట్ల రూపంలో ఏయించుకోలేక పోయినం. రాజకీయనాయకులే కాదు వారికి చెక్క భజన చేస్తున్న సలహాదారులది. మేధావులది. ఓట్లు, సీట్లు అధికారం అని ఉద్యమం గెలుపు గుర్రాలకు టిక్కెట్లు యిస్తన్నమని గెలిచెటోనికి యిడిసిపెట్టి పైసపోసినోనికి. పలుకుబడి ఉన్నోనికి టిక్కెట్లు యిచ్చింద్రు. పైసపోసినోడు నాయకుడు అయితడా...? ఓటర్లనాడి పట్టుకొని ఆపతి సంపతికి లేనోన్ని నాయకుడని ఎట్ల బావించుకుంటరు. అన్నింటికి మించి కుటుంబ పాలనతోటి ముందుకు పోతండ్రు. దళితున్ని తొలి తెలంగాణ ముఖ్యమంత్రి చేస్తనని అన్నడు. ఇప్పటివరకు ఏ దళితున్ని ఏ జిల్లాకు అధ్యక్షున్ని కూడా చేయలేదు. అట్టడుగు బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయకపాయే ఎట్ల ఓట్లు ఎయ్యాలనిపిస్తది? ఒకవేళ అనిపించిన తెలంగాణ పేరు మీద ఊకే ఏస్తరా...? ఎయ్యరు. అది కూడా కారణమే. ఇట్ల చెప్పుకుంట పోతూంటే మస్తుగ చెప్పుకోవచ్చు" అని చెపుతుండు సార్

"సార్ ఇంక ఏమేమి తప్పులు జరిగినయి? ఎట్ల తెలంగాన పక్కాదారి పట్టించింద్రు జర చెప్పుసార్" అని వెంకట్ అన్నడు.

"చెయ్యని చెయ్యక పోని అరచేయిల వైకుంతం చూపలేని వాళ్ళు లీడర్లు కారు. ఎంత పెద్దలీడరు అయితే అంత పెద్ద మాయ. నా దృష్టిల" అని వ్యంగంగా వీరేశం చెప్పిండు.

"పదిమందిల పాము చావదన్నట్లు వాడు వీడు లేసినోడు లేవనోడు అందరు కల్సి ఒక్క పాట పాడింద్రు. మాకు ఓట్లు వెయ్యండ్రి మేం యిస్తం. తెలంగాణా...! అని ఓట్ల బుచ్చుగాల్లు ఒక్కతీరుగా తిరిగితే...., తిక్కపుట్టిన ఓటరు బుద్ది ఉన్నట్లు

ఓటు గుద్దుతడు. ఎవరి నుంచి ఎక్కువ మేలు ఇప్పటి మందంల, ఎప్పటి మందంలనైనా మేలు జరుగుతదో గాల్లకే ఓట్లు వేస్తరు ప్రజలు" అని సార్ చెప్పిండు.

"మన తెలంగాణ ఎట్లవస్తది సార్, ఎప్పుడొస్తది సార్" అని వెంకట్ అన్నడు

"ఇదే పరిస్థితి ఇట్లనే ఉంటే రావడం కష్టమే. తెలంగాణ అన్ని పార్టీల లీడర్లు తెలంగాణ తెవాలనే ఒకే ఒక్క కోరిక కల్గివుండాలే..... రెండవది మనం తెలంగాణకు మద్దతును తెలంగాణకే వేయాలే... తెలంగాణ వాళ్లమందరం బ్యాలెట్ సైనికులమై మేలుకోవాలె...గట్లయితేనే మనతెలంగాణ మనం ఏలుకుంటం. సరియైన సమయం రాదు. సరియైన నిర్ణయం తీసుకోరు. మన నాయకులంతా పార్టీలకతీతంగా తెలంగాణ బలంగా తీర్పు చెప్పినాడు తెలంగాణ పాలనలో మార్పువస్తది.

యిపుడు రావలసింది అగ్రవర్ణ తెలంగాణా కాదు. అట్టడుగు బడుగు బలహీన వర్గాలతో మమేకమై బహుజన ప్రజాస్వామ్య తెలంగాణ కోసం కలలు కనాలి. ఆ దిశగా ప్రయత్నం చేయాలి. అపుడు అందరి తెలంగాణ తప్పక ఏర్పడుతది. లేకపోతే మన ఓట్ల లెక్కలు అన్ని తప్పయితయ్. రింగవుతున్న ఫోన్‌ను చూసి ఫోన్ ఎత్తేకంటే ముందు "సార్...ఇగ కలుస్త" అంటూ వీరేశం వెళ్లిపోతడు.

ఎప్పటిలాగే కటింగ్ అయినంక లక్ష్మింపతి సార్ పేపర్ల పురుగైతడు. కత్తెర కరకరలాడుతుంది. ఫ్యాన్ అదే పనిగా తిరుగుతుంది. తెలంగాణ మాత్రం ఎక్కడుందో అక్కడనే...

కీలెరిగిన వాత

బాయినించి ఇంటికి చేరుకునే వరకు రాకీల పున్నంకు వొత్తనని చెప్పిపోయిన కొడుకు ఎల్లయ్య లచ్చవ్వకు యింటికాడ కనవడ్డడు. 'ఎన్నడు గిట్లరానోడు గిట్లెందుకు వొచ్చిండోలిఅని మనుసుల అనుకొని "ఎపుడొచ్చినవు బిడ్డా!" అని అడిగింది.

పుల్కాషిగా ఉన్న కొడ్కు "యిపుడే ఒచ్చిన్నే" అన్నడు. నారాజుగా గూత ఎల్లకుంట మెల్లగ మాట్లాడతండు ఎల్లయ్య.

"ఏమయిందిరా ఎమో సిన్నగ మాట్లాడుతున్నవ్?" అనుకుంటూ జాలేట్లకు వొయి కాళ్లు కడుగుకునేది ఆగింది. వొచ్చి కొనరుగుకు కూసున్నది.

"ఏమయింది బిడ్డా! ఏముట్ల శిన్నతనమైందిరా... శెప్పు బిడ్డా శెప్పు" అని కడుపుల దేవుతున్న ఆత్మతోటి తకాయించి అడుగుతుంది.

"ఏం లేదు తియ్యే! ఒట్టిగనే వొచ్చిన. ఆడ ఆస్టర్లు ఇంకా దెరువలే. మొన్నటి పరీక్షలో మార్కులు ఆడికాడికే వొత్తన్నె. గీ టీచర్ నౌకరన్న వొత్తదో రాదో! ఏమో పోయే ఏం సదువుడో ఏమో..." అని ఉన్నముచ్చట శెప్పిండు ఎల్లయ్య.

'అయ్యో గింతగనం సద్వినా కొడుక్కి నౌకరి రాదట. ఏంజేత్తు? ఎంతగనం జేద్దు. పోరి యింటిమీదుండే, యీనికి నౌకరొత్తె ఆమెను అండ్లది అండ్ల జర మంచోనికి, మంచి ఇంట్ల యియ్యాలనుకుంటి. ఒకపారి రొండు లగ్గాలు చేద్దామనుకుంటిమి. భగవంతా! ఎంత పనైపాయే. కొడుకు ఒగ రీతోడు గాకపోతే ఎట్ల? ఒక్కపోరన్ని సదివిచ్చెతందుకు ఒలువవొతే నార లేకుంట మనుషులమైతిమి. ఐనెకు నాకు కట్టం తప్పకపాయే. బాకీలు తీరకపాయే. బత్కు మారకపాయే. తీరని మావులకు బతకు తేరని పావుల గావట్టే. ఐనెకు గీ ముచ్చట ఎర్కయితే ఏమంటడు. ఏమనుకుంటడు.

గిట్ల నవ్వెటోని ముంగట కాలుజారి పడ్డట్టు కావట్టె. ఈ పిల్లలకు నాలుగిత్తులెయ్యక పోతిమి' అనుకొని నీళ్లూరిన కండ్లను తూడ్చుకుంటంది.

"అయితాయె బిడ్డా! అనుమము ఎట్లుంటె గట్లైతది. నౌకరి ఏంది బిడ్డ. నసీబ్ ఎట్లుంటె గట్లైతది. పాసుల నౌకరి వొత్తేంది? రాకపోతేంది? మేం బతుకుతలేంరా! యెన్కటి నుంచి నౌకరి జేసే సాదింద్రా. గా తర్వాయి మీద నిన్ను చెల్లెను ఇద్దరక్కలను సాదలేదా? అక్కల పెండ్లిలకు, పురుల్లకు, పుణ్యాలకు, పండగలకు, పబ్బాలకు అన్నిటిని ఉన్నంతల ఎల్లదీత్తలేమా? కట్టాలు వచ్చినపుడు గుండెను రాయిజేసుకొని బతికినోన్నె మనిషంటరు. మతిల మనాది దీసెయ్యాల్రా...లేకపోతే రంది రోగమైతది..." అంటూ బాధలకేలి తేరుకున్న లచ్చవ్వ పైకి జెప్పుతున్నా లోపట్లోపట కడుపంత కలికలి ఐతంది.

మెల్లగ జాలెట్లకు వొయి, కాల్రెక్కలు గడుక్కొని, వత్తున్నపుడు బిడ్డ పద్దుమవ్వ "అవ్వా! ఇగో తువ్వాల..." అంటు సేతికిచ్చి పొయిమంట సూసుకుంట బీడీలు జేసేతందుకు వోయింది.

"అవ్వా! బట్వాడా వొచ్చిందా బాంచెన్?" బిడ్డను మెల్లగ అడ్గుతుంది లచ్చవ్వ.

"యియ్యల్ల లేటయితదని రేపు ఇత్తమన్నరు" అని పద్దుమవ్వన్నది.

"ఎల్లమూ! అయ్యకు ఎదురుంగా పోయిరాపో బిడ్డా!" లచ్చవ్వ చెప్పింది.

"పోతన్ననే..." అంటూ పోయిండు ఎల్లం.

ఎల్లం సైకిల్ మీద సర్రన దొడ్డికాడ ఆగేవరకు ఎడ్లకు గడ్డి సదురుతూ ఎల్లం దిక్కు చూసి రంగయ్య "మాయెల్లమే వొచ్చినవేంరా పట్నం కేలి" అని కొడుకును అడిగిండు.

"ఆస్టల్ యింక పద్దినాలైతే ఇస్టాట్ ఐతదట. గప్పటిదాక ఏంజెయ్యాలె అని వచ్చిన్న"న్నడు ఎల్లయ్య.

'గిన్ని దినాలాయే పట్నం పోవట్టి, ఎన్నడుజెప్పని ముచ్చట గిపుడు చెప్పవట్టె... ఏంది గిట్ల. ముందుగాలైతే బక్కాటికి గడ్డి సదురుత...' ఏమో ఆలోచిస్తున్న నాయనను జూసి, 'అన్ని అడ్గుతడు మా నాయిన. పనిమీద ఉన్నపుడే నేనవతల పడాలె' అని మనసులో అనుకొని, "నాయనా! గీ పచ్చిగడ్డి మోపు కొంటావోవన్నాయే..." అని అడిగిండు ఎల్లం."కొంటవో... బిడ్డా!" అని అయ్య రంగయ్య జెప్పిండు.

క్యారల్‌కు మోపు వెట్టుకొని గిర్రున యింటి మొకాన సైకిలు మలిపిండు ఎల్లయ్య. రంగయ్య ఇంటికొచ్చె వరకు ఎప్పటోల్నె కలె మబ్బయింది. ఐన కంటెముందుగ బర్రె ఇల్లు జేరింది.

కాళ్లెక్కలు కడుక్కొని వొచ్చి "అవ్వా! కొన్ని నీళ్లియ్యిరా! అట్లనే పాలసర్వ దీసుకురా బిడ్డా!" అంటూ పద్దుమకు జెప్పిండు.

అప్పట్కే డొక్కు బ్లాక్ ఐందు వైట్ టీవిల మునిగి ఏడుపుగొట్టు సీర్యల్ సూత్తన్నామెకు అయ్య మాట యినిరాంగనే బీడీల సాట కిందవెట్టి సర్రున నీళ్లు, పాలసర్వ దెచ్చి, "అయ్యా ఇగోయే..." అని ఇచ్చింది.

"బర్రెను కట్టేసి శానసేపాయే. దుడ్డె తండ్లాడుతుంది. నడువు నద్వు" అంది లచ్చవ్వ.

"పోతన్ననే...పోతన్న. పాలు పిండెతందుకు"

"ఎయ్, ఎట్వాయనే వీడు. పట్నం నుంచి రాంగనే ఏదో వొయి ముంగటేసుకొని సద్వుకుంటుండే" ఎల్లయ్య నుద్దేశించి లచ్చవ్వతో అన్నడు రంగయ్య.

'ఏమో..? అంటే కుక్క బూతులు పడవలసి వొత్తదని, ఎప్పుడో కొంకలు ఇచ్చెతందుకు పోయినా' "ఇపుడే కొంకలు యిచ్చెతందుకు కొత్తరూంల్ల లచ్చినర్స దగ్గర్కి తోలిచ్చిన"అంది లచ్చవ్వ.

"ఉడ్కుడ్కు యింత యేస్కరాయే. నాలుగు సినుకుల్ల తడిసినందుకు సల్సలి వెడ్తంది. బుక్కెడు దినంగనే మల్సుకొని పంట" అని లచ్చవ్వకు జెప్పిండు.

"అవ్వా! నేను పప్పు యిసురుతున్న. జర్ర యేస్కరా బాంచెన్. పని మీద్కేలి నేనేం లేవాలె..." అని పద్దుమకు జెప్పింది.

లచ్చవ్వ. పద్దుమ బువ్వ యేసుకొచ్చి, అయ్యకు తలె యిచ్చింది. పొగలెల్లిన బువ్వదిని, నుల్కమంచంల గొంగడి కప్పుకొని పన్నడు రంగయ్య.తొమ్మిదిన్నరయినంక యిల్లు జేరిండు ఎల్లయ్య.

"యాడ్కి వోతివి బిడ్డా! అయ్య కలువరిచ్చి రాపాయె ననుకుంట నిదురవాయె తినుపోరా..." అని తల్లి అన్నది.

అనుడు ఆల్శమే లేదు. పద్దుమ నీళ్లు దెచ్చి యిత్తె చెయి కడుక్కొని వొచ్చి,

టీవి ముంగట తినెతందుకు సకులం ముకులం వెట్టుకొని కూసున్నడు. పద్దుమ బువ్వ దెచ్చి యిచ్చింది.

ఎల్లం టీవి జూసుకుంట అదే మనాదికి తినబుద్ది అయితలేదు. తిన్నట్టు జేత్తండు. కరుసుకుంట, కరుసుకుంట తింటన్న అన్నను జూసి పద్దుమవ్వ "అన్నా పులుసు మంచిగ లేదాయే" అడిగింది. పన్నుకింద యిసుకొచ్చి కిర్రుమన్నట్టు అనిపించింది ఎల్లయ్యకు.

"మంచిగనే ఉందిరా! నువ్వు జేసిన పులుసు మంచిగుండదారా!" అంటూ ఆ కొద్దిసేపు మారేసినకాడ్కి పురాగ దిన్నడు. దినాం పొద్దుగాల బాయికేలి మబ్బుతో పోతున్నడు. నాలుగైదు రోజులైనంక వీన్ని పట్నం ఎందుకు పోతలేడో ఆర్సుకుంటనని' అనుకుంది లచ్చవ్వ.

"అరేయ్! నువ్వెపుడు పట్నం పోతవ్రా!" గట్టిగానే అడిగింది లచ్చవ్వ.

"ఇగ పట్నంబోను సద్వ. అయ్యతోటే పనికి వోత"

"అదెరా...?"

"నాకు నౌకరత్తలేదు. ఏం లేదు. ఏం సద్వుమంటున్నవ్?"

"మల్ల మాలెక్క గాయిది పని జేత్తవా...? నువ్వు సద్వాలని దొర పటేండ్ల దొడ్లు కడ్గితిమి. వాళ్ల పిల్లల ముడ్లు గడ్గితిమి. అయ్య నేను మాయితనం జేత్తిమి. సెల్లెను బీడీలు సుట్టవెడితిమి. ఎందుక్కొడ్కా ఈ బాంచె బత్కు పోయేతందుకే గదా..."అని లచ్చవ్వన్నది.

గపుడే ఊళ్లెకేలి రంగయ్య వొత్తండు. "అవ్వా కోమట్ల యింటికాడ చెక్క పల్క శేతికిచ్చినపుడు ముర్సుకుంట బడికి పోయిన. పది పాసైనపుడు పదిమందికి చెప్పక తిర్గితి. పై సదువులకు నేను వోతున్నపుడు తూట్లు పడ్డ టిక్కెట్లోలే సదువుకు తూట్లు పడొద్దు అనుకున్న గని అన్ని నౌకర్ల అటెండరు నుంచి అందరు ఆందరోళ్లె నిండిపోతంద్రు. మనోల్లకు ఏమి యియ్యనిత్తలేరు. నేనేం జేయాలే" అని ఎల్లయ్య అన్నడు.

అప్పటికే సూత్తన్న రంగయ్యకు తిక్కెపుట్టింది. ఔరా! తర్రగాడ్డికొడ్కు లెక్క యెన్కకు మర్రుతావురా? యీడ పుట్టినం. ఈడ పెరిగినం. ఈడ మలమల మాడుదు ఏందిరా?. పొయి మనది. పొయిమీద కుండ మనది. పొమ్మనకుంట పొగవట్టి

యెల్లగొట్టాలె. గీయింత దానికే పోనని చెప్పుతండు మొగోడు. ఆ ఈని పిరికితనం సూడే, ఎట్లుందో…” అని లచ్చవ్వ దిక్కు గుడ్లు యిర్మి చూసి “నువ్వు జెయ్యంగానే గిట్లైందే… నీయక్క రోగం కున్న వారెద్దూ…” అని తిడ్తండు.

“ఒర్రకు మాసినోడా… ఒర్రకు. ఏమో గాయి గాయి ఒర్రుతున్నవ్. ఇంట్ల మాట అవుతల పడకుంట మాట్లాడాలెనని నూటయాభై సార్ల జెప్పినా గంతే… గట్లే ఒర్రుతడు” అని లచ్చవ్వన్నది.

“ఈయక్క నీ మెడలిరిసేను. ఔల్దానా! నువ్వొక్కసారి మంటవెడ్తనే.. .బువ్వకూర అయితాదే? నేనొక్కసారి చేయించిన నాగలితోటి సాలీము దున్నుతన్నానే.. ఊరికి పయనం ఐపోంగా పొట్రౌతు దాకితే ఊకొంటామే… గవ్వేమో చెప్పవేమే. పట్టు పట్టనే వొద్దు. పడ్తె ఇడుస్తారే…” అనుకుంట లచ్చవ్వ మీదికి గయ్యిన లేసిండు రంగయ్య.

“ఏందయ్యో! ఎరగని ఊల్లె మొరగని కుక్క. పంచాది ఊకనే ఐతదా…? కూకుండి గుర్రాల మత్తుగ మలుపొచ్చు. నీ ఒర్రుడు మొకంగాల ఊకో” రంగయ్యను లచ్చవ్వన్నది. “అయ్య గట్లనే ఒర్రుతడు. ఊరుదాటనోనికి ఏం ఎర్కరా? కొలువు రాకపోతే రాకపాయే ఇంకో బాయి ఏడనన్న పాలుకుపట్టి యెవుసం జేద్దాం. మా అన్నతో మాట్లాడి నర్సిని అడిగి పెండ్లి జేత్త. మా అన్న నాకియ్యనని అంటడా వాని బిడ్డను”అని అన్నది. ‘‘కీలెరిగి వాత పెట్టాలె యిగురంతోటి అడుగులేసి యిసంగాల్ల మోసం చూడలే. పోరాడి పడగొట్టాలె. గీసొంటి లోకమ్మీది ముచ్చట జెప్తె నా మాటలు పట్టుకుమని చెప్పుతున్నవేమో, గండకరువుల బొంబాయి పోయి బంగ్ల బంగ్లల పనిజెయ్యలేదే? మెసలుతె తంత మెంటల్దానా..? అరె ఎట్లా? పోకపోతే పొట్టువాయె, నువ్ సద్వపోతే సద్వపోతివి గని యియ్యాల శారగొండ పటేండ్లది కౌలుకు మాట్లాడ్త… ఏయ్ ఏత్తువు రాయే. ఎడ్లు దొడ్లెవాయే. నడ్వు నడ్వు…”

“బర్రెలెక్క ఒర్రినట్లు ఏస్కొని తిను” లచ్చవ్వన్నది.

“నా బిడ్డ ఉంటే ఎవ్వడు పిలుసు. రాయే… ఆమె బీడీల మాప్ ఇచ్చేతందుకు కంపెనికి వొయింది. రా…రా…” రంగయ్యన్నడు. బువ్వ ఏత్తె రంగయ్య తింటండు.

“ఔను నాయిన…అవ్వ అన్నది నిజమే. పగదారునితో కొట్లాటకు

పోయేటపుడు గెల్చి రావాలె. అట్లా అని ఒక్కసారి ఓడిపోతే మొత్తం ఓడిపోయినట్లు ఎట్లయితది? కాదు. ఒక్కసారి ఫేలయినోల్లు నౌకరి చేసేటోల్లు లేరా..." ఆలోచనలన్ని ఎల్లయ్య మతిల మెదులుతనే ఉన్నై.

ఎల్లయ్య సిన్నప్పటి దోస్తు సతీష్. ఒకటో తరగతి నుంచి పట్నంల యిప్పుడు సదివేదాక ఒక్కకాన్నె తిని, ఒక్కకాన్నె సదివిండ్రు, ఒక్కకాన్నె ఉన్నరు. సత్తయ్య రాకను చూసి "ఏం బిడ్డా! సత్తయ్యా! బాగున్నావ్ కొడుకా? ఎపుడొచ్చినవ్" అని లచ్చవ్వ అడిగింది.

"ఆ బాగానే ఉన్న సిన్ని. ఎల్లిగాడు ఎటువోయిండు. శెల్లె మంచిగున్నదా?" అని అడిగిండు సత్తీష్.

"నువ్వు పట్నంలనే సద్వుతున్నవా...?" "ఆ అవునే"

"మావోడు ఇగ సదువా అంటండు. ఏం సంగతి. ఇన్నొద్దులు మీ అయ్యవ్వ, మేం మంచిగ సదివిత్తన్నం అని పేరెల్లినం. మావోడు ఇగ సదువా అంటండు. ఏం జేయాల్నయా?" అంటూ ఎల్లయ్య దిక్కు చెయ్యి సూపెట్టుకుంట సెప్తుతండు రంగయ్య.

"నువ్వొద్దనే మన నౌకర్లు మనగాకుంట, మన నీళ్లు మనకు పారకుంట మన బొగ్గు మనకందకుంట మనకగ్గిపెట్టిండ్రే... పంట పండాలె గని తింటే దంగుతదా అన్నట్లు మంచి మంచి సదువులు కోస్తాంధ్ర పంటలు దీసెటోల్లు సద్వించ బట్టిరి. ఇగ మేమయితే మీరు పంపిచ్చిన పైసలు సాలక ఎస్టీడీలల్ల క్యాటరింగ్...లాంటి ఎన్నో పనులు జేసుకుంట సద్వితిమి. వాళ్లకు మనకు పోటీవెడ్తె ఐతదా...? గట్ల పెట్టి, మన దగ్గర కొలువులు కూడా ఏర్పడకుంట గుంజుక పోతండ్రు. గట్ల నౌకరైనోడు పందికొక్కోలె వాని కిందికి, వానోని కిందికి పొక్క తోడుకుంటండ్రు. మనకు నౌకర్లు రాకుంట చేత్తండ్రు" అని చెప్పిండు సత్తీస్.

'మన పని మనకు పంచెయ్యాలె. మన నౌకరి పాల్లు మనకు పెట్టాలె. పెట్టేటట్లు చెయ్యాలే." రంగయ్యన్నడు.

"అట్ల వొత్తలేదే? మాది మనోల్లది అనే ఆలోచన రాక ఆగమైతన్నం" అని సత్తీస్ అన్నడు.

"ఎందుకు రాదూ? గడ్డిని తాడువడితే ఆ తాడు గడ్డామును ఆగవడ్తది గాలికి అటు ఇటు కొట్టుకవోకుంట. గట్టిగ పిడికిలి వట్టియాడిసి గుద్దితే సచ్చేదాక

దెబ్బలేసుకుంట యాదుంటది. అంతకన్నా అడివా...? ఒగోలు చెప్పిన బుద్ది అప్పట్టి. మీ బుద్ది ఎప్పట్టి. మేం మత్తుగ అంటం గుడ్డెద్దు శేన్లపడ్డట్టు. ఇదే ఏ పని జేసినా కాయంగా జేసుకుంటేనే బతుకుతరు... లేకుంటే ఎప్పటి శిప్ప యెన్గులనే."

"అరేయ్! మనం పెరట్ల గుండు మీద గూసుండి మాట్లాడుకుందాం పారా పోదాం" అని సతీశ్ అంటే అటువోయింఁడ్రు ఇద్దరు దోస్తులు.

"ఔరా! మన తాడికి బతికెతందుకొచ్చి, మనది మనగ్గాకుంట గుంజుకుంటే ఊకుండ వడ్తిమి. రేపు మన తమ్ముల్ది గుంజుకోరా...?వాంది వాని తాతది, వానయ్యది మాయిముంత ఏడదాసింఁడ్రో గది వాని ఖుద్దుజాగ. మన దగ్గరొచ్చి మన యాసమీద, బాసమీద, పండుగల మీద వాని జుల్మ్ ఏంది? వలసొచ్చినోడు వతన్‌దారై పెత్తనం చెయ్యవట్టే. ఎదిరిద్దాం. నువ్వేమంటవ్రా ఎల్లా! చెప్రా!"

"నువ్వొద్దనేరా... మనకు చరిత్ర దెల్సు. యిత్తేసి పొత్తుగూడినోడు పొయిమీద కుండను మాయం జేత్తండు.

"మనం వొండుకున్నది మనకు వెట్ట వాడెవడు. మన పొయి మంటను గుంజుకున్నడు. యిపుడు మండేది పెయిమంట. అదే కడుపుల ఆకలి మంట. గా మంట సల్లార్పెతందుకు ఎన్నడో ఒగనాడు మంచి కాలమొత్తది. గదేందో మనమే సురువుజేస్తే ఐపోతది గదా...!' అన్నడు సతీశ్ అన్నడు.

"ఔను! గీ ముచ్చట మంచిగున్నది. థింక్ పాజిటివ్ వే గా ఆలోచిస్తే అది ఖచ్చితంగా ఐతది. ఒగ పెద్దాయన 'నీ సంకల్పం మంచిదైతే శక్తి దానంతట అదే ఉద్భవిస్తది' అన్నట్టు మనం జేసే పని మంచిదైతే అదే శక్తిని సంపాదించుకుంటది. శాతనైనకాడికి పోరు చేద్దాం. పొయ్యేదాక పొగవెడుదాం. పొట్ట కూటికి వచ్చినోని మీద కాదు. పొట్ట కొట్టెటోని మీద పోరాడి గెలుద్దాం." అని ఎల్లం అన్నడు.

"ఇగ రేపు వోదాం క్యాంపస్‌కు" సతీశ్.

"సరే అట్లయితే అట్లనే" ఎల్లం.

"అవ్వా! నాయినా, చెల్లే రేపు పొద్దుగాల పట్నం బోతన్న. నౌకర్ల కోసం, మన తెలంగాణ కోసం, నీళ్ల కోసం, నిధుల కోసం, అందరం ఒక్కటైయేటట్లు జేస్తం. కొలువన్నదెత్త. ఇలువన్నదెత్త. కొనాకరికి కొత్త రాష్ట్రం తెచ్చుట్లో ముందుంట. ఇగ వోత....

...తెలంగాణ కథ 2009లో ప్రచురితం.

–కథా జగత్ అంతర్జాల పత్రికలో ప్రచురితం.

రేపటి సూర్యుడు

“ఎక్కడున్నవురా? ఎపుడొస్తవు? అంతమంచిదేనారా? అమ్మ నాయిన బాగున్నార్రా?” అటునుండి నరేష్ ఫోన్లో ప్రశ్నల వర్షం కురిపిస్తుండు.

“నేను కరీంనగర్‌లనే వున్న. ఇంకొక వారం రోజులుండి వెళుత. అమ్మ నాయిన బాగనే వున్నర్రా?” సురేష్ బదులు పల్కిండు.

“ఎక్కడన్న సంబంధం కుదిరిందారా?”

‘‘ఎక్కడ కుదరలే? మిల్ట్రి అంటే ఎవడు పిల్లనిస్తలేడు? ఏం జేయిమంటున్నవ్రా?” అని సురేష్ అన్నడు.

“మిల్ట్రి అంటే ఒగ భయం భరోసలేని బతుకు. గందుకే గట్ల అనుకుంటరు. కళ్యాణమొచ్చినా ఆగదు కక్కొచ్చినా ఆగది. నీకు కూడా కలసి వచ్చినపుడు సంబంధం కుదురుతది. ఏం పికర్ చేయకుం? గా గాగిల్లపురపోడు వస్తే నేనిపుడే పెళ్లిచేసుకోనంటివి. మల్లారపోడు మరి మరి దిరిగే. ఎవలకు సూదు తర్వాత చేసుకుంటా అని మర్రగొడ్తివి. నువ్వు కావాలె అన్నపుడు దొరుకుతరా? నేను అనుకున్ననా అంటే చేసే తీరిన. అరేయ్ నీకో ముచ్చట మరిసిన. నిన్నవొద్దీకి కొడుకు పుట్టింద్రా” అని నరేష్ సంతోషం కలిపి తండ్రి హోదాలో చెప్పిండు.

“అరె బద్మాష్! ఏమ్మనిషివిరా?ఎనుక సెప్పేటివి ముంగట, ముంగట చెప్పేటివి ఎనుక చెపుతవేంరా? ఎపుడు పుట్టింద్రా కొడుకు? తల్లి కొడుకు ఆరోగ్యం మంచిగున్నదా? ఎక్కడ పుట్టిండు? ఎంత బరువున్నడు?” అని ఎదురు ప్రశ్నలు విసిరిండు సురేష్.

"చెపుదామనే ఫోన్ చేసిన్రా? ఆమెకు కొద్దిగా బీపి ప్రాబ్లం వుండెగదా సికింద్రాబాద్ మిల్ట్రి హాస్పిటల్లనే జాయిన్ చేసిన. నాలుగు కిలోల బరువుతోటి పుట్టిందు. ఇపుడు తల్లీకొడుకు యిద్దరు ఆరోగ్యంగనే వున్నరు. ఆమెకు పెద్దాపరేషన్ చేసింద్రు" అని చెప్పిందు నరేష్.

"మంచి వార్త చెప్పినవురా. మొత్తమ్మీద యాడాదిరక్కుండానే తండ్రివైనవు. ఈ విషయము మా అమ్మనాన్నకు తెలిస్తే నామీద గన్ను ఎక్కుపెడుతరు? నీతోటి పెండ్లి చేసుకుంటే నాకో కొడుకు పుట్టుననే ఆరాటం వాళ్లది. పెండ్లిగానోన్ని నిన్ను చూపెట్టి ఆగిన. నీపెండ్లైన కాన్నుంచి వచ్చినపుడల్ల మాటలతోటి నా పెండ్లి చేత్తంద్రు. కొడుకు పుట్టిండని ఎర్కయితే పిచ్చేముడ్, దైనేముడ్ అంటరు." సురేష్.

"ఎన్ని రోజులు ఆగుతవోయి చేసుకోక. నువ్వొచ్చెటపుడు, నా కొడుకును చూసిరారా." అని నరేష్ అన్నడు.

"అరేయ్ నేనే కాదు వీలైతే మా అమ్మనాన్నను కూడా తీసుకపోతా. నువ్వెపుడు అనెటోనివి గదా? నాకు కొడుకు పుడితే కమాండర్ చేస్త అని అంటివి. ఆ కమాండర్‌ను చూసేతందుకు పోతం. జూనియర్ నరేష్‌కు మిల్ట్రి సెల్యూట్‌కొట్టి ఎత్తుకొని ఆడించి వస్తరా. ఓరేయ్ వాడెవడను కుంటునవ్ నా అల్లుడ్రా? ముందే బుక్‌చేసుకున్న. మల్లీ చెప్తున్న. నాకు బిడ్డపుడితే వానికే యిస్త. బిడ్డ పుట్టలేదనుకో వానికిష్టమైనదాన్ని నా బిడ్డగా భావించుకొని నల్గుగురు మెచ్చెటట్టు పెండ్లి జేస్త. కాదు పోదు అన్నవనుకో నేనే కిడ్నాప్ జేసి ఒప్పిస్తా. చెప్పేది చెప్పుతున్న. ఇగ నీ యిష్టంరా" అని తన్ను తాను మైమరచిన సంతోషంతో మ్లాడుతుండు సురేష్.

"ఓ.. బే... గదంత గాదుగని ఎపుడువోయి చూస్తవు రా..."

"నాలుగు రోజులైతది. ఆ లోపు కొంత పని వున్నది. కొన్ని షూటింగ్‌లున్నయి"

"ఓకే రా తప్పకుండా పోయిరారా" అని ఫోన్ పెట్టిందు.

నరేష్ సురేష్ ఇద్దరు ఒక్కాల్లె సదివింద్రు. చిన్నప్పటి చెడ్డీల దొస్తులు. జాన్‌జబ్బలు మరిసి వుండేది లేదు. యిడిసి పండేది లేదు. ఒగరికోసం మరొగరు ఎంత త్యాగమైన చేసుకునే టోళ్ళు. అపుడే కొట్టుకొని అపుడే కలిసిపోయేది వాళ్ళస్నేహం. మనస్తత్వం కలిసింది. ఎంతో మంచిగ ఉండే దోస్తులకైనా ఈర్ష్య పుట్టేటట్లు ఉన్నారు. వాళ్లు సర్కార్ ఎస్సీ హాస్టల్ శనిగరంల సదివింద్రు. రెసిడెన్షియల్

జూనియర్ కాలేజ్ హుస్నాబాద్‌ల చదివింండ్రు. ఇంటర్ అయిపోయినంక మిల్ట్రి సెలెక్షన్స్‌కని కరీంనగర్‌కు పోయి యిద్దరొక్కసారే సెలెక్టయింండ్రు.

కమాండర్ పుట్టుకతో యిద్దరి కుటుంబాల్లో పండుగ వాతావరణం ఏర్పడింది. మరోవైపు ఆందోళన కూడా సురువైంది. కానని రాజ్యంల కారండపు అడివిల డ్యూటీ చెయ్యాలె. జరమొచ్చిన ఏకివచ్చినా అయ్యేవడు అవ్వవెవడు? చూసుకుంట యమునిమూతి కాకులకు అప్పగించినట్లు, కొలువు లేకుంటే బతుకమా? నాటిసంది కొలువులుజేసే బతికినమా? వొద్దని తల్లిదండ్రుల పోరు వెడుతున్నపుడు మెల్లగ మసక కొట్టింండ్రు. అరచేయిల వైకుంఠం చూపి మెల్లగ అవతలవడి శేరీకయింండ్రు.

ట్రేనింగ్ ఒక్కదగ్గరనే, కొలువే దూరం పడ్డది. ఇద్దరికీ ద్రాస్, కార్గిల్, లెహ్, మనాలి, బికునూర్‌లో అత్యంత యుద్ధ వాతావరణంలో పనిచేసింండ్రు, నౌకరొచ్చిన ఈ పదేండ్ల కాలంలో మంచుకురిసే హిమాలయాల్లో, క్రూరమృగాలుండే అడవిలో లోయలు, గుట్టలు, నదులు, నగరాలు దాదాపు అన్ని ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. ఎపుడూరుకొచ్చినా యింత మంచితనాన్ని మానవత్వాన్ని, జాతీయ జండా పొగరును విత్తుతుంటారు. మాతృదేశం కోసం మనందరం సైనికులు అవ్వాలె. మనమీద మనదేశమ్మీద దాడిచేసేటోడు, దండెత్తెటోడు ఎవడుంటడు? తప్పిదారి ఎవ్వడొచ్చినా? అడ్డమొచ్చినోన్ని తుక్డల్ తుక్డల్ నరికేయాలి."అని ఇద్దరు విన్నోని చెవులు కొరికేటోళు ళ.

నరేష్ ఎపుడంటడు నా కొడుకు పుడితే వాన్ని కమాండర్‌ను చేస్త. బిడ్డ పుడితే యుద్ధ పైలెట్‌ను చేస్త అని చెపుతూ ఉండెటోడు. నరేష్‌ను ద్రాస్ సెక్టర్‌లకు మళ్లీ తీసుకున్నరు. అత్యంత ధైర్యసాహసాలు (ప్రదర్శించిన చరిత్ర)రికార్డు అతనికున్నది. సురేష్ అందులో ఏదో డిపార్టుమెంటల్ టెస్టులు పాసయి సిగ్నలింగ్ వ్యవస్థలో స్థిరపడి వేరే చోటున్నడు. నరేష్ ఎపుడైనా యింటికి ఫోన్‌జేస్తడు. పెండ్లైనంక యింకా ఎక్కువ చేస్తండు. అందులో భార్య గర్భవతి కావడంతో రోజూ చేస్తున్నడు ఫోన్. డెలివరి టైమపుడు తోడు ఉంటననే వచ్చిండు. కాని లీవులు అయిపోకుండానే సాంక్షన్ చేసిన లీవులను కాన్సిల్ చేసి ఉన్నతాధికారులు పిలిపించుకున్నరు. అందువల్ల వెళ్లక తప్పింది కాదు నరేష్‌కు.

ఆపరేషన్ ముందు అతని భార్య శైలజకు వీలు దొరికినపుడు, వీలు చేసికొని మాట్లాడుతున్నడు. ఆపరేషన్ అయిన తర్వాత కొడుకు పుట్టిండని తెలుసుకొని సైనిక

శిబిరంలో కూడా చెప్పుకుంటూ సంతోషపడ్డడు.

మాటాడే పరిస్థితి ఏర్పడగానే శైలజకు ఫోన్ చేస్తండు. శైలజ అంటే ఎవరెస్ట్ శిఖర శైలమంత ఆత్మధైర్యమున్నది. ఆ ధైర్యంతోనే నరేష్‌ను పెళ్ళాడడానికి సిద్ధపడ్డది. డెలివరి అయినా రెండోరోజు ఫోన్‌జేసిన నరేష్‌తో ఆయాస పడుతంది.

"...చా...లా...ఆ...యా...సమైతుంది? ఒకటే తీరుగ నొప్పులున్నయి. పేన్‌కిల్లర్స్ యిచ్చిన తగ్గినట్లే అనిపిస్తున్నయి. తగ్గట్లేదు" అని మాట మాటకు ఆయాసపడుచు నరేష్‌కు చెబుతుంది.

"మరి నేను తర్వాత పోన్ చేయనా?"

"ఫర్వాలేదు మాట్లాడు బావా! మాట్లాడు" అంటూ నరేష్‌తో మాట్లాడ్తంది.

"నా తండ్రి ఎలాగున్నడు? నీ ఆరోగ్యం వాడి ఆరోగ్యం మంచిగుండాలే. నేను ఈ పదిహేను రోజుల్ల మళ్లీ సెలవుల్లో వస్తున్న. మీ అమ్మ మా అమ్మ ఉన్నరు గదా?"

"ఎంతైనా నువ్వున్నట్లు వుంటదా?"

"ఉండదనుకో",

"ఉండదనుకో గాదు ఉండది"

"నీకు ప్రామీస్ చేసినట్లు కమాండర్ అందజేసిన నీకు సంతృప్తేగదా?"

"థ్యాంక్స్ డీయర్, కమాండర్ నిచ్చినవు. మరో లెఫ్టినెంట్‌ను లీడర్‌ను యియ్యాలె"

"చాలు. బడాయిలు బాగనే వున్నయి. నోరు ఆడినట్లు నొసట్లె ఉండాన్న"

"ఎంతకు తృప్తి పడితే అంత అంటున్నపుడు కేర్ కేర్‌మని ఏడుస్తున్న చప్పుడు విని జరసూడు కమాండర్‌కు కోపమొస్తది." నరేషన్నడు.

"వాల్ల నాన్న రాలేదనీ, నాన్న పోన్ అలికిడి విని లేచి ఏడుస్తండు. ఏ విత్తుపెడితే ఆ విత్తు మొలుస్తది. నీకున్నట్టె నీ కొడుక్కు మస్తు రేషమున్నది." అని శైలజ అన్నది. "బేట నేనొస్త గని ఏడువకు బిడ్డా! పాలు తాగు. పోన్ దగ్గరపెట్టె నేను బుదగరిస్త. త్సొ త్సొత్సొ ఊరుకోరా ఊరుకోరా ఉక్కుపిండమా..." అంటూ పాడిండు.

అది త్రిజి ఫోన్‌లో కదలికలు రూపు రేఖలు, ఛాయలు చూసింది. నరేష్ తన అమ్మతోని అత్తమ్మతోటి మాట్లాడిండు. భద్రంగా చూడుమన్నడు.” వాళ్లలో “మాకుదెలువదారా?” అని అమ్మన్నది.

“సరే బిడ్డా...!” అని అత్తమ్మన్నది.

“ఇంకో సారి శైలజకు యియ్యి”

“శైలు నేనుంట మళ్లీ రేపు ఫోన్ జేస్త”

“సరే బావ” అని అనగానే పోన్ పెట్టేసిండు.

ద్రాస్‌సెక్టర్‌లో ఉగ్రవాదులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నరు. భారత దళాలు ఎదుర్కొంటున్నాయి. పదాతిదళాలు వాయుసేన విభాగం కలిసికట్టుగా ముష్కరులను ఏరివేస్తున్నాయి. ఆత్మాహుతి దాడిలో సియాచిన్ ప్రాంతంలో భద్రతా దళాలమీదికి గ్రైనేడ్ విసిరే ముందు యాబైకిలోల ఆర్డీఎక్స్‌తో వాహనం దూసుకొచ్చింది. అచ్చం సైనిక్ కారు లాగేవుంది. అది రాకముందే, దానికంటే కొన్ని క్షణాలముందే రాకేట్ లాంచర్లను ప్రయోగించిండ్రు. ఐదుగురు సైనికులు కమాండర్ అక్కడి కక్కడే చనిపోయిండ్రు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా వుంది. ఆ చోటులో మందుపాతరలు, క్లైమర్‌మెన్స్ గుఢాచారుల నివేదికలో యివన్ని ఉన్నాయి. దానిని ఎదుర్కోవటానికి ద్రాస్ సెక్టర్‌లోని బెటాలియన్‌కు ఆదేశలొచ్చాయి. యుద్ధప్రాతిపదికన సిద్ధమయ్యారు. అనుకున్న సమయము కంటే రెండు నిమిషాల ముందే వున్నారు. ఆ బెటాలియన్‌లో నరేష్ కూడా పోయిండు. ద్రాస్ సెక్టర్‌కు పోయేముందు మరోసారి చాలాసేపు శైలజతో, హాస్పిటల్‌లో వున్న తల్లిగారితోని అత్తగారితోను ఇంకా బంధుమిత్రులతో నిర్మలంగా మాట్లాడిండు. కొడుకును త్రిజి ఫోన్‌ద్వారా ఆప్యాయతతో చూసుకున్నడు. అందరితో సంతృప్తిగా మాట్లాడి నాకు మరల మాట్లాడే అవకాశం రాకపోవచ్చు. ఒకవేళ ఏ చిన్న అవకాశం దొరికినా మాట్లాడుతానని శైలజతో చెప్పిండు. సియాచిన్ విధులు నిర్వర్తిస్తూ సెలవు మీదున్న సురేష్‌కు కూడా ఈ విషయాన్ని చేరవేసిండు. ద్రాస్ బెటాలియన్‌కు పిలుపొస్తది. సురేష్‌కు కూడా యుద్ధంలో పాల్గొనడమంటే మహాసరదా.

హాస్పిటల్‌కు సురేష్‌కు వెళ్లమని చెప్పిండు నరేష్. అదే రోజున రాత్రిపూట ద్రాస్ బెటాలియన్ ఏరివేతకు బయలుదేరింది. ఉదయమే లేచి సురేష్ కాలకృత్యాలు

తీర్చుకొని స్నానం చేసి అడ్డబట్ట కట్టుకొని ఏడుగంటల న్యూస్ చూస్తున్నడు చాయితాగుతూ. ఒక్కసారిగా స్వరం పడింది. ఒకేతీరుగ తెరలు తెరలుగా వస్తున్న దగ్గునుంచి తేరుకొలేకపోతండు. ఆ న్యూస్‌లో ముష్కరుల ఏరివేత. లాంచర్లతో దాడి చేసిన ఉగ్రవాదులు సైన్యానికి ముష్కరులకు భీకరపోరు. పదిమంది ఉగ్రవాదులు హతం. తీవ్రవాదుల దాడిలో ముగ్గురు సైనికులు ఒక కమాండర్ హతమైనట్లు (పిటిఐ) భోగట్టా! ఎపుడూ శోద్యంగ చదివే కంఠమే కర్కశంగా చదువుతున్నట్లు అనిపించింది. సురేష్‌కు కాలు కాలిన పిల్లిలా ఇంట్లకు బయటకు తిరుగుతున్నడు. మనసు మనసులో లేదు సురేష్‌కు.

కరీంనగర్ బస్టాండ్‌ల హైద్రాబాద్ అని రాసివున్న హైటెక్ బసెక్కి కూర్చున్నడు. బస్ స్టార్ట్ అయింది. కరీంనగర్ దాటి మానేరు దాటుతుంది. సురేష్‌కు నరేష్ జ్ఞాపకాలు ఉగ్రవాద్ని వెంటాడె సైన్యంలా వెంటాడుతుంది. గురి తప్పక సూటిగా దూసుకొస్తున్న బుల్లెట్లలాగా గుండెలో తాకుతున్నయి. గురుతులు, ఎపుడు సంభాషించుకున్న మిల్ట్రీ, మిల్రీ ఫీట్‌ల గురించి, ఇతర రాష్ట్రాలలో వుండఉఉఉగ్యాపరాక్రమాల గురించి, గతంలో తెగువ చూపి ప్రాణాలను తృణపాయంగా త్యాగం చేసిన త్యాగవీరుల త్యాగాలు సురేష్ మెదడు నెమరేస్తుంది.

బస్సు వేగంగా వెళుతుంది. ఇంకా వేగంగా ఆలోచనలు ఊహాలు పరిగెడుతున్నయి. మనసు బరువు అయితంది. నరానరాల్లో రక్తం మసులుతుంది. ఆవేశం పొగలు గక్కుతుంది ఆందోళన అనేక రూపాలుగా మారిపోతుంది. వీటికితోడు నరేష్ మాటలు ప్రవాహంలాగా మీదికి పొంగుతున్నయి.

'ఓరి సూరి ఎన్నిరోజులు బ్రతికినా మనమెట్లాగో చస్తం. చావక బతుకని మనుష్యుని చూపురా...? ఎందుకు రానంటన్నవురా మిల్ట్రీకి. ఎన్నొద్దులు బతుకుతవు చావుకు భయపడుకుంట. అమ్మనాన్నలు వద్దంటరు? వద్దనరా! నువ్వె భయపడవద్దీ. వాళ్లు భయపడరా? చనిపోతూ మీసం మెలేస్తు మనకళ్ల పొరల్లో శత్రువు ఛాయలని చిత్రించాలి. గుండెల్ల ధైర్యముండాలి. గుండ్లు ఒడిసితే ఏమున్నయిరా? చిరునవ్వులు చిందించినంత సుతారంగా రక్తం చిందించాలి. శత్రువును బంధించాలి. మిత్రున్ని కరాచాలనం కోసం మనసు తహతహలాడుతదో మృత్యువును ఆలింగనం చేసుకునేందుకు అంతే తహతహలాడాలి.

పోతూపోతూ పోటురాయి తట్టుకొని ముక్కుముడుచుక పడి దిక్కుతోచక

చచ్చినోల్ల ఎవరికీ ఉపయోగడని చావు. అనుకోని ప్రమాదంలో ఆయువుమూడిన చావు, అందరిలో దు:ఖపోరల్ని కప్పి దూరమవుతది. జాగ పంచాయితిల కాడ. పగలల్ల రగిలి ప్రాణాలు పోతుంటయి. చివరకు ఏ ప్రాణం చనిపోయి త్యాగంగా మారవు. చావంటే ఒక భరోస. చావంటే ఒక కీర్తి. చావంటే చాలా మందికి దారి చూపే ఒక బ్రతుకు రేవు. చావు ఒక దిక్సూచి. చావంటే ఒక నినాదం. ఒక సునాదం. త్యాగమంటే చావే. చావు సహజం. సహజత్వాన్ని అసహజంగా ఉండాలంటే దేశంకోసం మరణించుటకంటే ఇంకేముంది? నూరిపోసిన జ్ఞాపకాలు సురేష్‌కు మెదులుతున్నయి.

ఓరేయ్ ముసలినక్క! పంట పండటంకోసం విత్తుచచ్చిపోతది. పండుటాకు రాలిపోతూ చిగురాక్కు చేయూతనిస్తది. ఆరిపోతున్న దీపం వెలుగుల్ని వెదజల్లుతది. ఓరి వయసీ ముసలోడా, రాకురా రాకు ఇంట్ల పండు. మిల్ట్రీకి సెలెక్టై పారిపోయొచ్చిన్నని గర్వంగా చెప్పుకో. సచ్చినాడు కుక్కను గుంజినట్లు గుంజుకపోయి మన్నుకప్పి మరిచిపోతరు. కాలవెట్టి కాలంతో పరిగెత్తుతరు. ఏదోఒకటి చేస్తరు లేరా? పిరికివాడా? చావంటే భయమున్న మురికివాడా! బ్రతుకుతూ మురిగిపోరాక! నేనైతే దేశంకోసం సలసలకాగే రక్తాన్నై మరుగుతుంటా. రక్షణ కోసం దిక్కులనై, ఉక్కునై ఎక్కుపెట్టిన గన్నునై భయపడక ఎదురులేక బెదురులేక, ప్రాణమంత ధారబోసి, ఊపిరి ఉన్నంతవరకు ఎముకనై, శూలమై, గాలమై శత్రువులో దూరిపోతా? మాతృదేశంపై పోరెత్తిన ద్రోహులపై బాహువుచాచి మృత్యువునై అలుముకుంట. నెత్తురంత పులుముకుంట, దేశంకోసం సింధూర తిలకమై అమ్మఒడిలో ఒరిగిపోతూ ఒరిగిపోతూ మట్టిని ముద్దాడుతూ పరుచుకొని చనిపోతా! చనిపోతా! చనిపోతా సైనికున్నై చనిపోతా! అనే మాటలు సురేష్ చెవిలో ప్రతిధ్వనిస్తున్నై. సైనికుని వేషధారణతో సెల్యూట్ కొట్టడం. లెఫ్టైట్ చేయటం. మీసాలు మేలేయటం. (జేమ్స్‌బాండ్ చిత్రాల్లోని) జేమ్స్‌బాండ్‌ను అనుకరించటం.

జాతీయంగా పోలీస్ నేపధ్యంగా వచ్చిన సినిమను దేన్ని వదలక చూడడం లాంటివి. ప్రత్యక్షంగా ఆలివ్‌డ్రెస్‌లు ధరించటం. ప్రస్తుతం కళ్లముందు కదులాడుతున్న ఆలివ్ డ్రెస్ హేర్‌స్టయిల్‌ల్లోనూ పోలీస్‌గ కనపడటం. కుంగ్‌పూ కరాటే నేర్చుకొని ప్రత్యేక సమయంతో దినచర్యగా సాధన చేయటం ఒకటేమిటి ప్రతీ విషయంలో సైనిక ఠీవి అగుపించేలా వ్యవహరించిన పరిస్థితి. మరొకమారు డైలీ సీరియల్‌లాగా ఒకభాగం నుంచి మరొకభాగం గుర్తుకొస్తున్నయి సురేష్‌కు.

ప్రజ్ఞాపూర్ వద్ద డ్రైవర్ సడన్ బ్రేక్ తొక్కగానే ఈలోకము లోనికి దృష్టిని మరల్చిండు. శ్రీనివాస్‌కు ఫోన్ కలిపిండు. ఫోన్ లిఫ్ట్‌చేసి "హలో! సురేష్‌భాయి ఇంకా ఏ వివరాలు తెలియరాలేదు సైనిక్ హెలికాప్టర్‌లను రంగలోకి దించి డెడ్‌బాడీస్‌ను తెచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తుంది." అన్నడు."సరే సరే! ఏ విషయమైన జరూరుగ చెప్పు" అని ఫోన్ పెట్టేసిండు బస్సు పోతున్నా కొద్దీ సురేష్‌కు మనసున పడుత లేదు. వేగంగా పోతుంది. ఆలోచనలు అతివేగంగా దూసుకపోతున్నయి.

"సరే సరే! ఏ విషయమైన జరూరుగ చెప్పు" అని ఫోన్ పెట్టేసిండు బస్సు పోతున్నా కొద్దీ సురేష్‌కు మనసున పడుత లేదు. వేగంగా పోతుంది. ఆలోచనలు అతివేగంగా దూసుకపోతున్నయి. అనుమానం నిజం కావద్దని కోరుకుంటున్నడు. రెండు చేతులతోటి నెత్తిపునికి సూసుకుంట అటీటు మసులుతున్నడు. షామీరుపేట చెరువు అందం కనపడుతలేదు. ఎన్నడులేని కట్టమైసమ్మను ఎదురిచ్చి కళ్లకు అద్దుకుంటున్నడు.

జూబ్లి బస్టాండ్‌ల దిగి ఆటోలో పోతున్నడు. ట్రాఫిక్‌లో యిరుక్క పోతుంటే రెక్కలుంటే ఎగిరిపోయేవాడినని ఆలోచిస్తున్నడు. ఆటో అరవై స్పీడ్ మీద వెళు తున్నప్పటికీ అదిస్పీడుగా తోస్తలేదు.

"హలో డ్రైవర్ స్పీడ్‌గ వెళ్లు"అని గదమాయిస్తండు. ఆటో పోతంది ఆగకుండానే పోతుంది. అయినప్పటికీ ఆటో స్పీడ్ పోవాలంటున్నడు. అర్ధగంటలో హాస్పిటల్‌లో వున్నడు. గేటు పాసుతీసుకొని లోపలికి పోయిండు. రిసెప్షెన్ కాడికిపోయి వివరాలు తెలుసుకొని బేబి ఆఫ్ శైలజ ఏ ఫ్లోర్‌కు ఉన్నదో తెలుసుకొని లిఫ్ట్ వైపు నడిచి ఎక్కి లోనికివెళ్లి ముందుగేట్, లిఫ్ట్‌గేట్ వేసి నంబర్ త్రి ప్రెస్ చేసిండు. గాలిలో తేలిపోతుంది లిఫ్ట్. ఆలోచనలు గాల్లో తేలిపోతున్నయి. థర్డ్ ఫ్లోర్ వెల్లగానే లిఫ్ట్ ఆగిపోయింది. లిఫ్ట్‌దిగి డోర్‌క్లోజ్ చేసిండు. రూం నంబర్ 305 వైపు వెళుతున్నాడు. వెళ్లగానే డోర్ పక్కన్నే చెప్పుల స్టాండ్‌లో చెప్పులు విడిచి, తలుపు కొడుతున్నడు. చపుడు విని కిర్రుమని డోరు తెరుచుకుంది. ఎవర్నువ్వు అన్నట్లుగానే ఆ చూపులు ప్రశ్నించాయి.

"అమ్మా! నేను నరేష్ ఫ్రెండ్‌ను. నువ్వు శైలజ అమ్మవుకదా?" అని పరిచయం నిర్ధారణ చేసుకున్నడు సురేష్. శైలజ తల్లి సావిత్రి కూడా ఎక్కడనో ఎపుడో చూసిన్నని గుర్తు తెచ్చుకొని, వస్తుండని తెలుసుకొని "రండి సార్" అని ఆహ్వానించింది.

రూంలకు ఎంటరవుతున్నపుడు నరేష్ తల్లి నర్సమ్మ చూసి "ఎపుడు వొచ్చినవు బిడ్డా! శానొద్దులకు కనబడ్తివి" అని అన్నది.

"నేను పదిహేను రోజులాయే వచ్చి. ఎప్పుడు వొచ్చినా ఏదో పని కాసుకొని వుంటుంది. ఆ పని పూర్తి చేసుకొవటం అటు అటే ఖాళీ సమయం ఖర్చయిపోతంది. నరేష్ నేను ఒక్కసారి వచ్చినట్లు ఉంటే తప్పకుండా కలుసుకునేటోల్లం" అని అంటున్నడు.

"బిడ్డా! కూర్చో ఎపుడో బయలుదేరినట్లున్నవు," అని కుర్చి జరిపింది సావిత్రి. పాలు తాపుతున్న శైలజ"

"అన్నా ఎపుడొచ్చినవే బాగానేనాయే" అని ఆప్యాయంగా అడిగింది. "మొన్ననే వచ్చినరా, ఆరోగ్యం బాగున్నదారా. చిన్నోడు బాగున్నడారా"అని అడిగిండు.

"బాగున్నదన్నా! చిన్నోడు నేను ఇద్దరం మంచిగనే ఉన్నమన్న" అని సమాధానమిచ్చింది. పండుకున్నోన్ని పక్కపొరిలిచ్చి చేతుల్లోకి తీసుకుంది. నర్సమ్మ తన మనమన్ని చేతుల్లోకి తీసుకుంటున్నపుడు మెడలు తింపుకుంటూ యెన్ను విరుచుకుంటు"యీయే..యీయే" అంటూ ఏడుస్తున్నడు. "మా కత్తి మొగోడు, కత్తి వంశంల బంగారు కొండ. వజ్రం..." అని పొగడుతూ ఛాతికి అద్దుకొని సురేష్‌వైపు తెస్తుంది. ఎత్తుకొమ్మన్నట్లుగా...

"అమ్మా! నాకు చిన్నపిల్లల్ని ఎత్తుకోరాదు? చూసిన గదా? ఎందుకుతియ్యి" అని వారించినా వినకుండా పొత్తిగుడ్డలతోటి చేతుల్లో పెట్టింది నర్సమ్మ.

"నీకు పుడితే ఎట్లా? ఎత్తుకోకుంటనే వుంటవా?" అని గడుసుగా అన్నది సురేష్‌ను.

"ఓ...అక్కా! నువ్వు పొద్దుగాల తినలే, ఇపుడు రెండున్నరయిపోతంది. అన్న ఇడ్లి తెచ్చిండు. తిను తిను" నర్సమ్మకు శైలజ గుర్తుచేస్తుంది.

"మనుమడు పుట్టంగనే అమ్మకు ఆకలి మీద దూపమీద సోయిలేకుంట పోతంది. తినకపోతే ఎట్లనమ్మా? అని నర్సమ్మను, హాయి కమాండర్ పండుకున్నవా? నేను నీ సోల్జర్‌ని వచ్చిన యిటు చూడు" అంటూ బుగ్గను నిమిరాడు.

"అమ్మా! మొత్తం నరేష్‌గాని పోలికలు నీ పోలికలే వున్నయి" అన్నడు సురేష్.

"మా కత్తి వంశం. ముద్దెర కొట్టినట్టె వుంటది" అని మురిసిపోతంది నర్సమ్మ.

"ఏం పిలగాడయ్యా! రాత్రి పూట ఒక్కసారి పంటలేదు. నేను, అతని నానమ్మ ఎత్తుకుంటన్నం. యిరాముంచుతలేదు. నిన్న పుట్టనే పుట్టలేదు. శానా గజుగారి యేషాముంది" అని సావిత్రి అంది.

"అత్తమ్మా కనీసం టిఫిన్ అయిన చెయ్యి. ఎంతసేపుంటవు తినకుండా" అని శైలజ అన్నది.

"మీ యవ్వ తిన్నంక నేను తింట."

"యిద్దరు నువ్వు తిన్నంక నేను తింట నువ్వు తిన్నంక నేను తింట అనుకుంట ఎంతసేపుంటరు?" శైలజ అన్నది.

ఫోన్ మోగుతుంది సురేష్‌దా, పరిస్థితిని చూసి సావిత్రి చేతులకు తీసుకొంటుంటే ఒక్కటే తీరుగా ఏడుస్తున్న నవజాత శిశువుకు "పాలు తాపుతము బిడ్డా! ఉక్కులు యిప్పు" అని తల్లి చెప్పింది. పాలు ఇవ్వడంలో శైలజకు యింకా నేర్పురాలేదు. తాగడంలో నరేష్ కొడుక్కు ఒడుపు దొరుకుతలేదు.

బయటకిపోయి "హల్లో శ్రీనివాస్ బ్యాడ్ న్యూస్" అన్నడు శ్రీను.

సురేష్ ఒక్కసారిగా శరీరంలోంచి గుండెను, ఊపిరితిత్తులను మత్తు యియ్యకుంట తీస్తే ఎంత అవస్థకు లోనవుతడో... అంతకంటే ఎక్కువ విలవిల్లాడిపోతున్నాడు. నీరసం నిలువెల్ల నిండింది. మనసు ద్రవిస్తూ గుడ్లల్ల నీళ్ళు పొంగిపోర్లుతున్నయి. గోడకు ఒరిగి గోడయిపోయిండు. బాల్కనిలో చూపుతెర తడిసి ముద్దయి చేతులు తలపట్టుకొని పొంగుతున్నమనసు సముద్రాన్ని కొద్దికొద్దిగా కన్నీళు ్లకార్చుతున్నడు. ఎంత నటిద్దామనుకున్న బాధఛ్చాయలు కనబడుతనేవున్నయి. కండ్లు గోర్జమోలే ఎర్రగైనయి. పావుగంటయింది. అర్థగంటయింది. చెప్పొద్దని, చెప్పాలని సందిగ్దంలో కనీసం పోతున్నని చెప్పకుండా ఇక్కడ నుండి ఎట్లపోవాలి? అని ప్రశ్నించుకుంటున్నడు.

పోదామని లిఫ్ట్‌వైపు అడుగులేస్తుండు. లిఫ్ట్ గేట్‌దీసి చూడగానే నరేష్ తన కొడుకునెత్తుకొని మిల్రీడ్రెస్‌లో చిరునవ్వుతో కనవడ్డడు. నరేష్ ఆత్మ నాచుట్టూ నా అల్లుడి చుట్టూ తిరుగుతుంది.

దేశంకోసం, చెదరని ధైర్యం, బెదరని ఆత్మవిశ్వాసం దేహాన్ని అర్పించాలనీ,

దేశాన్ని రక్షించే సూర్యున్ని తన స్థానంలో భర్తిచేయుమని ఉపచేస్తుండని అర్థమైయింది. నరేష్ కలను నిజం చేయడానికి నడుం కట్టుకోవాలనుకున్నాడు. ఏడుపు బిగపట్టిన ధైర్యంతో రూంలోకి వస్తున్నాడు. అపుడే నర్సమ్మ టిఫిన్ ప్యాకింగ్ దారాలు తెంపుతు యిప్పుతున్నది. మనుమడున్న రూంలోనే యిపుడు నిర్జీవంగా నడుస్తున్నాడు. ప్రాణం లేనట్లుగానే వచ్చి యుద్ధఖైదీలాగా నిలబడ్డాడు. ముఖమ్మీద విషాదం కనపడుతుంది.

"దా బిడ్డా! కూర్చుందువురా? ఏమైంది నీకు" అని చేతుల్లో పట్టుకొన్న మనుమడిని పాలు తాపుతూ అడుగుతుంది.

"ఏమైంది అన్నా!" అని శైలజ ప్రశ్నిస్తుంది.

"ఒకవైపు ఎందుకు నారాజు పడుతున్నవు బిడ్డా'' అని నర్సమ్మ అడుగుతుంది.

నర్సమ్మ మాట ఒక్కొక్క తూటా దించుతున్నట్లు అనిపిస్తుంది. భరించ లేకపోతున్నడు సురేష్. ఎట్ల చెప్పాల్నో తటపటాయిస్తున్నడు. సుడిగాలిలా కుర్చీలోంచి లేచి ప్యాంటు జేబులోంచి కర్చీఫ్ తీసి కన్నీళ్లతో తనవైపు వస్తున్న సురేష్‌ను శైలజ గమనిస్తున్నది. నర్సమ్మ ఇడ్లి ముక్క నోట్లె పెట్టుకుంటుండగా ఒక్కసారి నుదుటి సింధూరాన్ని తుడిచిండు. ఒక క్షణం నిశ్శబ్దత. నర్సమ్మ నోట్లోనుంచి ఇడ్లి ముక్క కిందపడ్డది.

సావిత్రమ్మ "ఎంతపని జరిగే బిడ్డా! నీ పాపపు రాత పాడుగాను" అంటూ రాగమెత్తుకున్నది.

శైలజ ఆకాశమంత దట్టమైన మొగులైనట్లు, జడివాన కురిసినట్లు ఒకతీరుగ "కన్నకొడుక్కు చూసుకోకపోతివా అయ్యా... తండ్రీలేని కొడుకును చేసిపోతివా అయ్యా! కమాండర్‌ను చేద్దామంటివి అయ్యా!..."అని ఏడుస్తుంది.

"నీ గుడి గుండంగాను, నా కొడుకునే మింగినావురా దేవుడా! నీగుళ్ళే రాళ్లు రోళ్లుపడ. మా సంబూరాన్ని చూసి నీ కండ్లల్ల మన్నుపోసుకున్నావురా దేవుడా?"అంటూ ఏడుస్తున్నరు.

హాస్పిటల్లోని మిగతా రోగులు శైలజ చుట్టు చేరి అయ్యో బిడ్డా అంగలారుస్తు కన్నీళ్లతో సానుభూతి ప్రకటిస్తున్నారు. హాస్పిటల్ అంతా విషాదం.

రేపటిసూర్యుడు ఇవ్వేమి పట్టనట్లు చనుబాలతో పాటు, కన్నీళ్లుకూడా సేవిస్తున్నడు. నాన్న దృష్టిలోని రేపటి కమాండర్.

మార్పు

సికింద్రాబాద్ స్టేషన్ల దిగిన సునీల్ రెతిఫైల్ బస్టాఫ్‌కేయి చాలాస్పీడ్‌గా నడుస్తున్నాడు. అసలే రద్దీ ఎక్కువగా వున్నది. అందరినీ పాయదీసుకుంట ఎటో చూసుకుంటా నిర్లక్ష్యంగా తప్పించుకుంటూ వస్తున్నడు. అతను సిటిలో ఎలా నడవాలో ఒంట బట్టించుకున్నాడు. కట్టుబాట్లలో మార్పువొచ్చింది గని మనసు మారలేదు. అలా వెళ్తాంటే గణేష్ టెంపుల్ కాడ ఎనిమిదేండ్ల పోరడు చింపిరిజుట్టు మాసిన బట్టలతో ఎదురొచ్చి కాళ్ళమీద పడ్డడు. అందరిలాగే “ఛల్ ఛల్ నడువు. లెవు లేవరా” అని కోపంతో ఊగిపోతున్నడు. వాడికి యిలాంటివి షరా మాములే. వాడు పట్టుకున్న కాల్లను వదిలి పెట్టలేదు.

“సారు సారు ఒక్కరూపాయి. ఒక్కరూపాయి సార్ దిక్కు లేనోన్నిసార్ ప్లీజ్ ప్లీజ్ సార్” అని బతిమాలుతున్నాడు.

“లెవ్‌రా! లెవు తల్కాయే కరావయిందారా...! చెపుతుంటే మనిషివి కావారా?” అని కాళ్లు దులపరిచ్చుకుంటుండు ఐనా వదులుతలేదు.

“సార్ నన్ను తన్నినా సరే! కొట్టినా సరే! దొక్క గుంజుక పోతుంది. మొన్న వొద్దీకి తిన్నసార్. నాకొక్క రూపాయి యియ్యండ్రి సార్” అని బతిమాలుతుంటే గుంజుకపోయిన మొకం. తడిలేని పెదవులు. తాఖత్‌లేకుండా ఉన్నవాన్ని చూసి ఎందుకోగాని సనీల్‌కు మనసుల కెలికింది. కనికర తెర కళ్లల్లో కమ్ముకుంది. ఆలోచించి, ఆలోచించిండు.

"ఏంగావాడ్రా.... సంపుక తింటావురా?"

"దొక్కగుంజుక పోతుంది. తిందామంటే తిండిలేదు. అడుక్క తిందామంటే అందరు దూరం గొడుతుండ్రు. ఏం జెయ్యాలే సార్. పాణం బేజార్ అయితుంది. ఒర్రి ఒర్రి తటారి పోయిన. ఏమన్నా, ఎట్లనన్నా ఇయ్యాలే."

"నేను ఒక్క రూపాయిత్తె సరిపోతాదిరా....?" అని ప్రశ్నేస్తి.

"సాలది. నీ అసోంటి పుణ్యాత్ముల్ని ఇంకా అడుక్కుంట. ఒక పది రూపాలయినంక గా బండి కాడ కరాబయిన కర్రెటి అరటి పండ్లు కొనుక్కుతింట." తనుపడ్డ ఆకలిబాధ బోధ మెరిసింది.

"ఇగరారా! అంటూ అరటిపండ్ల బండిదిక్కు తోలుక పోతండు." వాడు ఎంట పడి ఉరుకొత్తండు.

"ఎట్లడజన్ అరటిపండ్లు?"

"తీస్ రూపై"

"అరడజన్ యియ్యి. ఇదిగో..." అంటూ పైసలు యిచ్చిండు. అరటిపండ్లు కోసి కవర్ల పెడుతూ తకాయించి సునీల్‌ను అడక్కతినే పోరన్ని సూత్తండు పండ్లమ్మెటోడు.

"తిను... యిగ తినురా... కడుపునిండా" అని వాడి చేయిలో పెట్టిండు. అరటిపండ్ల కవరు యిచ్చుడు ఆల్శమే లేదు వాడు కవర్ పత్రన చింపి అరటిపండును ఒక్కొక్క దాన్ని రెండే బుక్కల్ల పూర్తి చేస్తండు.

"మెల్లగా తినురా... కుతికెపడుతది. మెల్లగా...మెల్లగా ఏం పేర్రా ?" సునీల్.

"రా..జు" అని గుటుక్కున మింగుకుంట చెప్పుతుంటే వానికి ఎంతో ఆకలిగ వున్నదని అర్థమయితంది.

"ఏవూర్రా మీది?"

"ఏమో! తెలియదు"

"సదువుకోపోయినవురా?"

"సదువనియ్యరు"

"అదే?"

"మేం అడుక్కొచ్చి మాయ్యవ్వలకు రోజూపైసలు యియ్యకపోతే తిండిపెట్టరు"

"వాల్లేం జేత్తరు?"

"వాల్లూ అడుక్కుంటరు. మేం మొత్తం అడుక్కుతింటం"

"యిట్ల ఎన్నిరోజులు? అడుక్కుతింటే ఎన్నొద్దులు బతుకుతరురా"అరి అడుగుతూ పూర్తి నిమ్మలమైయిండు. తెలుకోవాలని ఆలోచిస్తున్నడు.

"రోజూ యిదే పని?"

"మీ అయ్యవ్వకు ఎందుకియ్యాల్రా"

"యియ్యకపోతే కొడుతరు. బతకనియ్యరు? తిండిపెట్టరు"

"నిన్ను హాస్టల్లకు పంపిస్త పోతావురా?"

"మావొల్లు చంపేస్తరు. ఎక్కడున్నా దొరుక వడుతరు. ఎక్కడ దాక్కున్న అడుక్కోవెడుతరు" అని ధీనంగా అన్నడు రాజు.

"ఎందుకు దొరుకవడుతరు?" అప్పటికి ఐదు అరటిపండ్లు తిన్నడు. గబగబా ఒక్క అరటిపండు. తిన్న తరువాత మెల్లగ తింటండు.

"అన్నా! నే నీజన్మల రుణపడి వుంట. గా గణేశుడేనా? ఏదేవుడేనో? నిన్నైతే నా కడుపు నింపెతందుకు పంపిండు"

"అరేయ్ నేనడిగిన దానికి జవాబు చెప్పుత లేవేంరా"

"చెపుత అన్న. సూడు నా యీపు" అని యెనుకకు మరలి వొంగి అంగి ఎత్తి మొన్ననే కొట్టింద్రు. సూపెడతూ గీ పక్కబొక్క కూడా యిరిగింది. దానంతల అదే అతికింది? రోజుకు నూర్రూపాయలు యియ్యకపోతే చంపేస్తరట? దొరకన్నాదు నా బతుకు డోలక్ గొడతంద్రు. ఏం జేయాలన్నా..." అంటూ వాన్ని వాడు మరచిపోయి కంటి కొలుకు మెలేస్తండు.

"ఎందుకేడుస్తవు, వాళ్లు నిన్ను కన్నోల్లే గట్ల చేస్తున్నారా? ఎంతదారుణం, ఎంత ఘోరం?"

"లేదన్నా ఈ దెబ్బలు నన్ను కొట్టిన్నాడు. నేను సోయిదప్పి పడిపోయిన. నన్ను తన్నుకుంట అక్కడనే తాగుతున్నారు. ఎంతసేపు కోట్టింద్రో ఏమో? నాకు ఎపుడు మెలుకువ వొచ్చిందో తెలియదు. కొద్దిగా మేలుక రాంగనే వాల్ల మాటలు

యిన్న. యిని అట్లనే సోయిదప్పి పండుకున్నట్లు యాక్షన్ జేసిన. నన్ను ఎన్నెన్ని మాటలన్నరో అన్నీ యిన్న. నేను అసలు వాళ్లకు పుట్టలేదన్నా. నన్ను ఎవలో బట్టల సుట్టి చెత్తకుండిల పారేస్తే నన్ను ఎత్తుకుపోయి యిదే గుడిముంగట ఎండల పండవెట్టి పైసలు అడుక్కొని బతికింద్రట. గప్పుడు నేనిట్లే వుండాలని నన్ను పండేయంగనే కరుణగల్ల తల్లులు తండ్రులు అయ్యో బిడ్డా! అనుకుంట నామీద విసిరిన పైసలు వారు రోజు అడుక్కునే పైసలుకంటే ఎక్కువ పడుతలు పడ్డదట. వాళ్లు నేను ఎండల, వానల చలిల అదే జాగల పడేద్దుండే. గుడికొచ్చినోల్లు ఏసినయి తింటూ పైసలు సంపాయించుతుండే. పాయకాన్లు కడిగే ఆసిడ్‌పోసి గుడ్డోన్ని చేద్దామన్నరట. ఎందుకో ఏమో ఆ పనిని చేయలేదట. అందుకే నా కండ్లల్ల ఆసిడ్ పోయ్యలేదట. అని అనుకోంగ విన్న. నిజంగానే ఆసిడ్ పోసినట్టు వొణికిపోయిన. మల్ల జరసేపు అట్లే పండుకుంటే కన్ను అంటుకుంది. నిద్రల అనుగవట్టి ఒర్రంగా మేకను కోసినట్టు, పాణం పోతున్నపుడు గిలగిల కొట్టుకాడుతున్నట్టు కలవడ్డది. ఆసిడ్ పోసినట్టు మల్లీ నిదరకేలి మేలుకొన్న. మల్లీలేచి చూసే వరకు ఎవ్వలు లేరు. నడుచుకుంటొచ్చి ఆలతి లేకుండా బస్టాండ్ల నీళ్లు దోసిలి తోటి రెండులీటర్లు తాగిన. శాతకాలేదు నీరసం వచ్చింది. నేను ప్లాట్‌ఫాం మీద పడుకున్న గపుడే మా తమ్ముడు మా చెల్లెలొచ్చింద్రు.

"అన్నా! అన్నా! నిన్ను గుడ్డోన్ని చేత్తరట్నే నువ్వులేసి పైసలడుక్కొచ్చి యియ్యకపోతే" అని అన్నరు.

"ఊకే చంపేయిమనుంద్రి. పురుసతుగ చస్త. బతికి సుఖపడ్డది లేదు. సచ్చికొంటవోయేది యేది లేదు. ఎందుకు బతుకాలే పోంద్రి. నాకండ్లు దీస్తరు నన్నే చంపేస్తరు? మీరు పోంద్రిరా? పోంద్రి."

"అన్నా నువ్వు గట్లనకు. అన్నా మన నాయిన అవ్వకంటే ఎక్కువ నువ్వు అడుక్కొచ్చి తినవెట్టినవు. నాయిన అవ్వ కొడుతుంటే అడ్డం వొచ్చి దెబ్బలు పడ్డవు. నువ్వు లేకపోతే మేం బతుకుదుమా? అన్నా నువ్వు మా కోసము బతుకాలే అన్నా..." అని యిద్దరు చెవుల మైకులు పెట్టి ఏడిసింద్రు.

నువ్వు సావనని మాటియ్యి మంటే నేనియ్యలే. అన్నా పోదాంపంద్రి. అన్నా అందరికి అందరం రైలుపట్టాల మీద పందాం. రయిమని వురుకొచ్చె బసుకింద పడుదాం. అన్నా అని ఏడుస్తుంటే... నాకు ఏడుపొచ్చింది. నేను పండే ఏడిసిన.

సెక్యూర్టీ గార్డు వచ్చి ఎన్కకేలి తమ్ముణ్ని చెల్లెను పిర్రలమీదికేలి యింతదొడ్డు దద్దు వచ్చేటట్టు గుంజుడు గుంజిండు. నన్ను కూడా కొట్టొచ్చిండు. నేను పన్నోన్ని పన్నట్టే ఏడుసుకుంట దండంబెట్టిన అయినా ఒక్కటి వుతికిండు. మల్లీ పోయిండు. దూరంగా సెక్యూర్టీ పోంగనే మాతమ్ముడు చెల్లీ మల్లీ వచ్చి, అన్నా అని పిలువంగానే తాకినయా నేను అడిగిన.

ఏం తాకలేదు తియ్యన్నా అని నాకు నచ్చజెప్పింన్రు. ఐనా నేను అడిగిన. చూస్తే నాకు మస్తుగ నొప్పి అయింది. గపుడు నాకు ప్లాస్టిక్ గ్లాస్‌ల ఛాయి తెచ్చి ఒక బ్రెడ్ తినబట్టింన్రు. జరసేపట్కి వొచ్చి, అన్నా! యియ్యాల నీపైసలు గూడా మేం అడుకోస్తం నువ్వేం బాధపడకూ, నువ్వు పైసలిస్తే నాయిన అమ్మ నీ మీద కోపం ఏముంచుకోరూ? నువ్వు యిక్కడనే కూసో అన్నా" అని చెప్పి పోయింన్రు.

ఎటుదిరిగింన్రో ఎటుపోయింన్రో చాలాసేపయింది. చెల్లెరాలే తమ్ముడురాలే. నేను ఎదురుచూసి కండ్లు లొట్టలు పోయినయి. గపుడు మాచెల్లె వొచ్చింది. వెలుగులున్న మొకంతో... నేను సంతోషపడిన ఆమె ఒక నలుపై రూపాయలు యిచ్చింది. నాదగ్గర పది రూపాలు అడుక్కున్నయి వున్నయి. కొద్దిసేపటి తర్వాత నెత్తిల బొడుసొచ్చింది. గమనించిన ఏమయింది ఇటురా అని నెత్తిపునికి సూసిన. నేను బాధ పడనంటే చెప్పింది. "అన్నా! నేను గురుద్వారా గుడికాడ నిలబడ్డ. అక్కడి స్థలంల అడుక్కునెటోల్లు. యిక్కడ అడుక్కోకు వెల్లిపో వెల్లిపో అని వెల్లగొట్టినా వెళ్లలేదట! కోపమొచ్చి ఒక గుడ్డోని చేతుల కట్టె అందుకొని కొడితే బొడుసొచ్చిందని చెప్పింది. జరసేపు ఏడిసిందట ఏడిస్తే లాభం లేదనుకొని రాంగ రాంగ అడుక్కోని వచ్చిందట. మాయి బతుకులాన్న మాతమ్ముని గురించి చెప్పలేదు. వాడు వాని టార్గెట్ కంటే యాభై అడుక్కురావాలని ఎంత ప్రయత్నం చేసినా కాలేదట. చివరాఖరికి పర్సుకొడుతూ పట్టు పడ్డడట. వాడు బాగా బాగా గుద్దుతంటే పర్సును వదిలి పెట్టకుండా రెండు వందలు తీసుకొని పర్సును దూరం విసిరేసి తప్పించుకొని మందిల కాటకలిసి వచ్చిండు. వాడు రాంగనే నడుసుకుంట పోయి ఫుట్‌పాత్‌మీద నూడిల్స్ రెండుప్లేట్లు చెప్పి ముగ్గురం తిన్నం. గట్ల ఆ రోజు గడిసింది. మామ్మనాయినకు మేం కలుసుకోనట్లుగానే పోయి మనిషికి నూరు యిచ్చినం.

మా అమ్మ వద్దనంగా కొట్టిండురా మీ నాయిన నిన్ను. నిన్న తాకిన దెబ్బలు తక్కువయినాయిరా? యిగవటు బిడ్డా అని ఇరువై రూపాయలియ్యొచ్చింది. వద్దని

నేనంటే, గుంజి చేతులపెట్టి పొద్దుగాల సర్కార్ దావఖనకు తోలుకపోయింది. మందులు గోలిలతో జర మంచిగయిన....” అని తనబాధ చెప్పిండు రాజు.

“అబ్బా! యెంత ఘోరం. ఎంత దారుణం. మనసంత కసాయితనం నింపుకున్నోల్లు ఎంత హింసించారు. వాళ్ళు సాదుతున్నమనే ముసుగుల ఎంత రాక్షసత్వం” అని సునీల్ అనుకున్నడు.

“ఔరా! రాజు నిన్న మీ తమ్ముడిని మీచెల్లెను హాస్టల్లకు పంపిస్తే పోతావురా?”

“అంటే...? ఏందన్న”

“హాస్టల్ అంటే యాల్లకు తిండిపెడుతరు. పొద్దుగాల టిపిన్. మధ్యాహ్నం సాయంత్రం తిండే. రాత్రి తిండి సరిపోయేంత పెడుతరు. రోజు ఒకసారి వుడికిన కోడిగుడ్డు పెడుతరు. బట్టలు, దుప్పట్లు అన్ని ఫ్రీగా యిస్తరు. రోజంతా బడికి పోవాలే. బడిల సార్లు విద్యా బుద్దులు చెపుతరు. మనం ఎట్లా ఉంటే మంచిది. ఎలా వుండకూడదు రెండిటిని బేరీజువేసి చెపుతరు. మంచి వలన కలిగే లాభాలను చెడువలన కలిగే దుష్ఫలితాలను చెబుతారు. మంచిగ సదువుకుంటే మంచినౌకరి రావచ్చు... మనిషిగా బతకడం నేర్పుతరు” అని సునీల్ చెప్పిండు.

‘మేం అందరిలాగా చదువవచ్చు. మాలాంటి బిచ్చగాల్లకు మేమే దానం చేయొచ్చు. అడుక్కుంటే ఆనందం లేనేలేదు. దానం చేస్తే వచ్చే ఆనందమే వేరు మనసులో అనుకోని “మమ్ముల మామ్మ నాయిన పంపియ్యరుకదా! చదువాలని కోరిక ఉండాలే”

“ఐతే మా చెల్లెను. మా తమ్మున్ని హాస్టల్ల చేరికు చేసుకుంటరా?”

“ఖచ్చితంగా జాయిన్ చేసుకుంటరు. ఎవ్వరినీ వద్దనరు. చదుకోవాలని మీకుండాలి గంతే!”

“మాచెల్లెకు తమ్మునికి చెబుత అన్నా...నేను చెప్పుతే యింటరోయినరో? జర నువ్వే చెప్పే, అర్థమయ్యేటట్లు...” అని చెప్పి తోలుకరాను పోయిండు రాజు.

“ఒకే ఎంతసేపు అయితదిరా?”

“పదినిమిషాలు. పదినిమిషాలు అన్నా, ఇపుడే వస్తావుండు” అనుకుంట పోయిండు రాజు.

రాజు సునీల్‌గురించి అప్పటికే వస్తున్నపుడు పూర్తిగా చెప్పిండు. మనసున్న మారాజు అని మనకోసం ఏదో చెబుతండు. అతని వలన మనకు మంచి జరుగుతుందనీ నేను చెప్పిన దానికంటే పదిరెట్లు ఎక్కువగా మీకనిపిస్తది అని వివరించిండు.

సునీల్‌బాయి ఇగో గీల్లె నాతమ్ముడు నాచెల్లె అని ఏదో సాధించిన అనే ఆనందంలో పరిచయం జేస్తండు. ఒక్కసారి ఉలికి పడి యిటువైపు చూపు మరల్చితే... అవే మురికి గుడ్డలు. నూనెలేని వెంట్రుకలు. శుభ్రతలేని ఆకారాలతో ఉన్నప్పటకీ "అచ్ఛా! అచ్ఛా! మీరేనా? ఏంపేరు" అని అడిగిండు.

"నాపేరు కవిత. నాపేరు కరుణాకర్ అని పరిచయం చేసుకున్నరు. టైం మూడు అయితంది తిందాం పాండ్రి. తినుకుంట ముచ్చట వెడుదాం పాండ్రి." అని హోటల్లోకి పోయిండ్రు.

"మాకు తిండికి యాల్లకెక్కడదన్నా? దొరికితే తింటం. నీళ్ళు తాగుతం. ఉ పాసముంటం, ఆకలికి భరించకపోతే దయగల్లోల్లు ఒకటో రెండో అరటిపండ్ల దానం జేస్తే కడుపు నింపుకుంటం. వాళ్లు తినొద్దరా? ఛల్ రే ఛల్ తిందాం పాండ్రి. ఒక టేబుల్ మొత్తం వారిదైపోయింది. సర్వర్‌కు ఆర్డర్ యిచ్చినపుడు ప్రారంభించి ఇంతదాక నేను అన్న (రాజు)కు చెప్పిన.

"మీరు పడుతున్న కష్టాలు తెలుసుకున్న మనబతుకులు యింతేవుంటయి. మనరాతరాసినోడెవడు లేదు. మన బతుకురాతను మార్చుకోవాలె. మన కోసమే మనమే మారాలి. విద్యలేని వాడు వింత పశువు. మనం చేసేపని మంచిదా? చెడ్డదా? మనకు తెలియాలి? ఏదీ తెలియకుండా డాంబర్ రోడ్ మీద పోతా అన్నట్లు ఎక్కడా ఉండది. మీరంతగా కష్టదుతున్నప్పటికీ బుక్కెడు బువ్వకూడా తిండికూడా పూర్తి స్థాయిలో దొరుకుతలేదు. ఎన్నిరోజులు యిలా వుంటారు. మీకోసం హాస్టళ్ళున్నాయి. మంచిగ వండిపెడుతయి. కన్నతల్లి ప్రేమలాగా, కడుపు నిండ తిన్నరో.. లేదో? అన్ని చూస్తయి. మనం మంచిగుంటనే మనకు విలువ ఏమంటవ్ కరుణాకర్?" అని ప్రశ్నించిండు. రాజు తమ్మున్ని

"మేం చదువుకోక పోతింగద సార్ ఎట్లా? మా అమ్మనాన్న మమ్ముల సంపుతరు సార్

"ఏంగాదు చదువొస్తది. మంచిగ చదువు నేర్పుతరు. మీరు ఎంతజేసిన, ఎంత సంపాయించిన మన జీవితం మారది. కాబట్టి పోవాలె." అని వివరించాడు. ఒక మంచి పని కోసం కూర్చున్నపుడు సర్వర్ ఒకసారి ప్లేట్స్ పెట్టిపోయిండు. టేబుల్ మీద

"నీకు భయంగా వుందా కవితా?" అని అడిగిండు.

"అవును ఎట్లంటుదో ఏమో? కొత్త జాగనాయే మేమక్కడ యిముడుతమాన్న"

"ఎక్కడయిన మనం యిమిడిపోవాలే. మీరు భయపడినట్లు మాత్రం వుండది."

కొత్తజాగ ఎపుడు కొత్తగా వుండక పాత పడుతనే వుంటది. మీ అమ్మ నాన్నలు కూడా వారానికి ఒక్కసారి వస్తరు. మీలాగానే అందరి పిల్లల తల్లిదండ్రులు అందరు వస్తరు. యిక్కడ గాలికి తిరిగిన అలవాటుకు అక్కడ వుండలేక పోవచ్చు. వుండాలి అనుకుంటే ఖచ్చితంగా వుంటం." సునీల్ చెబుతున్నాడు.

రైస్‌ను ప్లేట్‌లలో పెడుతున్నడు. మరొగరు మూడు మూడు రకాల కూరలు ఒక పాపడం, పెరుగు దెచ్చి ముందట పెట్టిండు సర్వర్. ఆకలి అందరినీ దంచేస్తుంది. అందరు సంతృప్తికరంగా భోజనము చేస్తుండ్రు.

'మలిచిన విస్తర్లను అతి జాగ్రత్తలో విప్పి ఒక్కొక్క మెతుకుల్ని ఏరుకొని తిన్న. చెత్తకుండీలో కంపువాసనలో కుల్లిన పండ్లను ఏరుకొని ఏరుకొని తిన్న ఆకలి ఫంక్షన్ హాల్ల వెనుకగేటు ముందు నిలబడి కడుపు చూపెట్టుకొని అడుక్కున్న ఆకలి గురుతులు వెంటాడుతునే ఉన్నై. తిను పదార్థాలు దొరుకనపుడు నల్లనీళ్ళు తాగి పడుకున్న బెంచీ జీవితం గురుతులు వెంటాడుతున్నై గుడి, మసీదు, చర్చి బస్టాండ్‌లు రైల్వేస్టేషన్లు అడుక్కతినే ఆలోచనలు తిరుగుతున్నై. తొందర తొందరగా తింటున్న రాజు ఆలోచనల పడి ఉన్న సునీల్‌ని చూసి "అన్నా! ఏమైందే" అని అడిగాడు.

"ఏం కాలేదు. మీరు తినండిరా! ఇంకేం ఆలోచనలు వచ్చినా అడుగలేక పోతున్నారు. పీక్కపోయిన మొఖం వెన్నుకు అంటిన దొక్క. కాళ్ళు కట్టెపెళ్లు. సేతులు చెక్క పేళ్లు. గుడ్లు ఇవతలికి ఎల్లినయి. పండ్లు ఎల్లినయి. తడారిన పెదవులు పావుశేరు రక్తం లేదు. షెటాకు మాంసం లేనపుడు ఆరోగ్యం నడుస్తున్న రోగాల పుట్టగా ఈగలు దోమల గుంపులు ఎపుడు సుట్టూ ముంచెత్తేది. పడుకుంటే లేవ చేత కానపుడు లేచి

కూచుంటే లోకమంతా గుండ్రంగా తిరిగినపుడు ఒక మహానుభావుడు జీవం కల్గి నడుస్తున్న దేవుడులా నా దగ్గరికి వచ్చి మొకం మీద నీళ్లుజల్లి కూర్చుండ బెట్టాడు. తినలేని పరిస్థితుల్లో బల్మీటికి తినిపించాడు. దవాఖాన్ల షరీక్ చేసిండు. ఆరోగ్యం తన పిల్లలతో కలిసి పెంచుకున్నాడు. తండ్రిగాకున్న తండ్రి అయ్యాడు. చదువనేర్పి, నాకో అనాథ అమ్మాయిని చూసి పెళ్ళి చేసిండు. ఇవ్వాల్ల మనుషుల్లో మనిషిగా ఉ ండడానికి మనిషి హోదా ఇచ్చిండు. ఆ తండ్రి లేకుంటే నా పరిస్థితి ఏమిటి? నేనింతవాన్ని అవుదునా? ఈ పరిస్థితిలో ఉందునా? నా పుటుకకు ఒక రూపం. నాకు ఒక రూపం నాకొక ఉద్యోగం కల్గించిన నా తండ్రిని నా జీవిత కాలం స్మరించుకుంటున్నా. స్మరించుకొవటం కాదు ఆచరణలో చూపిన కట్టుబాటును నేనుఆచరిస్తాను. నాలో వెలుగులు నింపి నన్ను వెలిగించినట్లుగానే, నేను ఈ పిల్లల్ని వెలిగిస్తాను. అని అనుకుంటున్నపుడు మొగులైన మనసు కురుస్తూనే ఉ ంది. కన్నీరు చల్లగా తగిలి ఈ లోకంలోకి వచ్చాడు. టేబుల్ సుట్టూఉన్న ముగ్గురు పిల్లలు తినేది ఆపి సునీల్‌ని పరిశీలిస్తున్నారు. వారిని గమనించిన సునీల్ తినండి తినండిరా అని అన్నాడు.

ఏ బాబు శాకం తీసుకురా అని సర్వర్‌ని పిలుస్తున్నాడు. ముగ్గురి చూపులు ఏమైందన్నట్లుగా ప్రశ్నిస్తున్నాయి. సర్వర్ వచ్చి కూరలు ఏస్తుంటాడు. తినండి తినండి, పిల్లలు అని తన స్థాయి మరిచి ఒకప్పటి స్థాయితో మార్పుగా చెబుతున్నాడు. పిల్లలు కుదుపు కుదిపిన తుఫాన్ తర్వాతి సముద్రంలా నిర్మలమయ్యారు. మళ్లీ ఆలోచనలోకి వెళ్తున్న సునీల్ కర్చీవ్‌తో పొంగుతున్న మనసుకు అడ్డుపెడుతున్నాడు. దీనికి ఒకటే పరిష్కారం. నన్ను చదివించిన ఆ పుణ్యాత్ముని బాటలో నేను నడుస్త. నా కొచ్చిన నౌకరిని నా టైంని టాలెంట్‌ని ట్రెజరిని వీరికే కాదు నాలాంటి వీళ్లలాంటి వాల్లకోసం అంకితం జేస్తా అని తీర్మానించుకుంటున్నాడు.' సర్వర్ తెచ్చిన బిల్లును తీసుకొని తృప్తి పడిన రేపటి పౌరుల్ని వెంటబెట్టుకొని కౌంటర్ కాడ డబ్బులు చెల్లిస్తూ...

"మీరేమనుకోనంటే నేనొగ మాట చెబుత వినుండ్రి. నేను యియ్యాల ఈ స్థాయిలో ఉన్నానంటే గర్నమెంట్ హాస్టల్‌ల చదివిన. నాకు మొన్ననే సర్కార్ నౌకరి వచ్చింది. యింకా పోస్టింగ్ యియ్యలేదు. హాస్టల్ పిల్లలకు వండిపెట్టే వార్డెన్ నౌకరి. మీరు కూడా చదువుకుంటే ఉద్యోగులు అవుతరు. చదువుకు కులం మతం ఏదీ లేదు. పేదా ధనిక తేడాలు ఏమిలేవు. చదువుకోవాలి మనం మారాలి. మనుసులు

మారాలి. మెదళ్లలో మెదలాలి. మనము ఏదైన సాధిస్తం" అని నిత్యం అనుకోవాలి.

"సరే" అని అన్నరు.

"మరి యిపుడే ఈ అవకాశం వస్తే మీరు వెళుతారా?" అని మరల అడిగిందు సునీల్.

"సరే! వెళ్తం తప్పకుండా...? అని రాజు కరుణాకర్ అన్నారు.

"ఏంటి కవితా ఆలోచిస్తున్నావు?"

"మనం వాళ్ళపిల్లలం కాదట. మనమీద ప్రేముండది. పెంచిన ప్రేమ అమ్మకుంది. నాన్నకు లేదు. మొన్న వాళ్ళు అనుకుంటున్నపుడు కవితకు విన్నది గుర్తుకొచ్చింది.

"మా అమ్మ నాన్నకు చెప్పకపోతే ఎట్లా? చెప్పినంక పోతం" అని కవితన్నది.

"అయ్యో చెల్లె చెప్పినంకా పంపరు. మల్లాగిదే అడక్కతినుడైతది తిట్టంగా కొట్టంగా రేషం సంపుకునుడయితది. పోదాంపా చెల్లె. మన కోసం మనం మారుదాం.

"పోదాం పదా? ఏమంటవురా చెల్లె" అని అంటున్నరు రాజు కరుణాకర్లు

"పోతం పోతముసార్. మాచెల్లెకూడా సరే" అన్నది.

ప్రశ్నార్థకంగా వాళ్ల చెల్లెవైపు చూసిందు ఆమె సమ్మతితో 'సరే' అన్నదు. తల ఊపింది.

మనం పోయేది హాస్టల్లాంటి మా యింటికి.

సందిగ్ధం

బండి మీద బడికిపోతున్నపుడు ఫోన్ రింగయింది. జేబుల నుంచి సెల్‌ఫోన్ దీసి "హల్లో" అని కిష్టయ్యసారన్నడు. అవతలి వ్యక్తి పరిచయం జేసుకున్నడు.

"ఓహో.. నువ్వా...! అనిల్, రాయవరం ఎపుడొచ్చినవు? వెయ్యి రూపాయలు సరిపోతయా? వచ్చి తీసుకపోతవా? నేను గజ్వేల్‌కి రావాల్నా? సరే ఇందుప్రియాల్ బస్సెక్కిరా స్కూల్‌టైంలా రా. సరే ఉంట బిడ్డా..." అని కట్‌చేసి జేబుల పెట్టుకున్నడు.

కిష్టయ్య సార్ అంతగిరి సార్ ఇద్దరు కలసి ఒకే బండిమీద పోతరు. వాళు స్కూళ్ల ఉన్నపుడు మాత్రమే 'సార్' అని సంబోదించుకుంటరు. మిగతా సమయాల్లో అన్నదమ్ముల ఆత్మీయతతో మెదులుతుంటరు.

"ఎవరన్నా. ఏమైంది...?" అని అంతగిరి సారన్నడు.

"రాయవరం స్కూల్ పాత విద్యార్థి అనిల్ అని ముదిరాజు. మెదక్‌లో డైట్ రెండో సంవత్సరం ఏ అవసరమున్న నా గైడెన్స్ తీసుకుంటడు. వాల్ల అమ్మానాయిన కూడా మంచిగౌరవం యిస్తర"ని కిష్టయ్యసార్ చెప్పిండు.

"మన బడికి వచ్చేటోల్లు గరీబులాయె. మంచి గైడెన్స్ యిస్తే అనుకున్నది సాధిస్తారు. జీవితాంతం యాదికుంచుకుంటరు"

"కొడకండ్ల, లకుడారం, రాయవరం ఎక్కడ పనిచేసినా విద్యార్థులకు లక్ష్యం గిరిగీసి చూపి నైతిక ధీమాను కల్పించిన. తల్లిదండ్రులతో మాట్లాడి చదివించేలా సహకరించిన. ఇప్పటికీ అక్కడి పిల్లలు ఫోన్‌జేసి మీ సాయం లేకుంటే మేమెక్కడ వుందుమో...సార్ " అంటరని కిష్టయ్య సార్ చెప్పిండు.

“అవును మనం కష్టపడి సదివి ఉద్యోగం చేయవట్టిమి. చాలా మంచి పనిచేసినవే. నీ అంతటి సాయం ఎవరికీ చేయలేదు. కాకపోతే ప్రైమరీల ఉన్నపుడు ఐదో తరగతి చదివినోల్లకు రెసిడెన్షియల్ స్కూల్లకు పంపించిన. ఈసారి పదోతరగతి పిల్లలను ట్రిపుల్ ఐటీకి అప్లయి చేద్దామా?” అంతగిరి సారన్నడు.

“అందరికీ చేద్దామా?” కిష్టయ్య సారు.

“అందరి కెందుకు మంచిగ్రేడ్ వచ్చినోల్లకు చేద్దాం. ఎంత మంది రడీగ ఉంటరో అడిగి మనమే అప్లయి చేద్దాం. అన్ని ఫ్రీగా చేద్దాం. మహా అయితే చెరి వేయి పదిహేను వందల కంటే ఎక్కువ ఖర్చుగాదు. ఒకవేళ వాళ్లకు సీటోచ్చిందనుకో వాళ్లు జీవితాంతం మరిచిపోరు. ఒకవేళ మర్చిపోయిన మనకైతే ట్రిపుల్ ఐటీకి పంపించామనే సంతృప్తి మిగులుతుంది.” అని అంతగిరి సారన్నడు.

“ఖర్చుకు గాదు ఎంతన్నగానీ మనస్కూల్ల చదివే పిల్లలతోటి చెప్పి పంపుదాం” కిష్టయ్యసారన్నడు.

“సరే...” అనుకొని పోయింౘ్రు. మరునాడు సుమలత, రేణుక యిద్దరు మాత్రమే వచ్చింౘ్రు. మిగతా విద్యార్థులు ఉపాధ్యాయుల వద్దకు రాలేదు. చదువుకంటే పనికి ప్రాధాన్యమిచ్చే వాళ్లు. పొద్దస్తమానం పిల్లలతో పని చేయించుకుంటరు. బావికాడ ఏదన్న పనివుంటే బడిపిల్లలు బడికి ఎగనామమే.

“నమస్కారం సార్..? బాగున్నరా...!” అంటూ ఇంటర్‌వెల్ సమయంలో స్కూల్ టాపర్లు తొమ్మిదిపాయింట్ ఎనిమిదిగా వచ్చినవాళ్లు. సార్లు ప్రతినమస్కారం చేసింౘ్రు. “ఎక్కడ సదువుతుంౘ్రు. మంచిగ సదువుంౘ్రి. క్రమశిక్షణతో వ్యవహరించండి... మంచి పేరుదేవాలే..?” ఉపాధ్యాయులు ఉచిత సలహాలు యిచ్చింౘ్రు.

కిష్టయ్య, అంతగిరిసార్ కలిసి “బాగున్నారా బిడ్డా....!”అని అడిగింౘ్రు.

“బాగున్నం సార్.” సమాధానం వినయంగా “మమ్ముల పిలిచింౘ్రట సార్...!” భయంతో కూడిన భక్తితో అడుగుతంౘ్రు.

“ఏం లేదమ్మా! ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ వొచ్చింది. మీకు చెబుదామని పిల్చినం. మీరందరు మంచి గ్రేడు మీద వచ్చినోల్లంత అప్లయి చేయింౘ్రి. సీటొస్తే మంచిదేగదా” కిష్టయ్యసార్ అన్నడు.

"ఎంత ఖర్చు అయితది సార్..."

"ఎంతన్న ఖర్చుగాని మీరేం రంది పడకుండ్రి. మేమిద్దరం కిష్టయ్య సార్ నేను ట్రిపుల్ ఐటీకి అప్లైకి అయ్యే ఖర్చు, ఒక వేళ సీటోస్తే కౌన్సిలింగ్‌కు పోయేదాక మేమే భరిస్తం. అశ్వినికి, శ్రీలతకు, బ్రహ్మచారికి,... వాల్లందరికి చెప్పండి" అంతగిరిసారన్నడు.

"థ్యాంక్యూ సార్... తప్పకుండా చెపుతం సార్"

"మేం ఏమేమి తీసుకురావాలె సార్"

"మీరు ఒక బ్లాక్ అండ్ వైట్ ఫోటో పాస్‌పోర్టు సైజుది. మీ హాల్ టికెట్ నంబర్, కుల ధృవీకరణ, ఆర్థిక ధృవీకరణ పత్రంలు అందించాల్సి ఉంటుంది. అన్నట్లు మిగత వాల్లకు తప్పకుండా చెప్పుండ్రి. మరిచిపోయేరు. లంచ్ టైం వరకు తెచ్చి యియ్యుండ్రి. యియ్యాల్ల అప్లై చేస్తం ఇంటర్నెట్‌కు పోయి. మిగతవాళ్లు గంతదూరం పోమంటే మాకు వచ్చి చెప్పండి. మేము వాళ్ల అమ్మనాన్నలతో మాట్లాడుతం."

మరునాడుదయం మిగత పిల్లల్ని రమ్మన్న వాల్లందరు వచ్చి కోరస్‌గా "గుడ్ మార్నింగ్ సార్" అని నమస్కరించారు.

"వెరీ గుడ్‌మార్నింగ్ చిల్డ్రన్స్ బాగున్నరా...?" అని కుశల ప్రశ్నలు అడిగారు సార్లు. వీల్లంతా ట్రిపుల్ ఐటీ కోసమే వచ్చిండ్రని అర్థమయిపోయింది.

"మీరు ట్రిపుల్ ఐటీ సదువాలి. మంచి ఫుడ్. మంచి భవనాలు. మంచి క్యాంపస్.
విద్యార్థులందరికీ ప్రతిఒక్కరికీ కంప్యూటర్. సకల సదుపాయాలతో విద్య నందిస్తారు. అది మాములు విద్య కాదు. ఇంజనీరింగ్, సాంకేతిక విద్య, ఆ కోర్సు పూర్తి కాగానే మంచిజీతం మంచి భవిష్యత్తు వుంటది. మామూలు చదువు చదివితే మాములుగానే ఉంటది బతుకు. ఆలోచించుకోండ్రి నేను అంతగిరి సార్ అప్లై కర్చులు, కౌన్సిలింగ్ కర్చులు భరించుదామనుకున్నం" అని కిష్టయ్య సారన్నడు.

విద్యార్థులు ఒక్కసారిగా మాతోటి సాధ్యమయ్యే పనేనా? మాకు ఈ పూటకుంటే ఆ పూటకు బువ్వుండది. గసోంటల్లం అంత చదువు చదువుతమా? గంత గొప్ప నౌకరి జేత్తమా?" అని క్వశ్చన్ మార్క్ మాస్క్‌లు ధరించినట్లు ఒగల ముఖాలు ఒగలు చూసుకుంటున్నపుడు అంతగిరి సారొచ్చిండు.

"గుడ్ మార్నింగ్ సార్..." అని విద్యార్థులన్నరు.

"గుడ్ మార్నింగ్, సార్ చెప్పేది విన్నరుకదా. మంచి ఫ్యూచర్ మంచి సమయంలో మంచి నిర్ణయం తీసుకోవాలి. మంచి జీవితం వుంటది. చేతులు కాలినంక ఆకులు పట్టుకుంటే ఫలితముంటదా...?" అని అంతగిరి సారన్నడు.

ఒకమ్మాయి అశ్విని "సార్ దీపావళికి లగ్గం జేత్తరట. అసలు ఇంటర్మీడియెట్ కూడా వద్దంటుండ్రు. నాకు చదువాలని వుంది సార్..." అన్నది.

"సార్! నేను మావాళ్ల (తల్లిదండ్రుల)కు ఒక్కడినే కొడుకును నన్ను పంపియ్యరట సార్ ఎక్కడికీ పోయినా పొద్దుగూకే యాల్లకు వాళ్ల కండ్లముందట కనపడేంత దూరం పొయెచ్చుడైతే ఏంగాదన్నరు."

"సార్! సదివినకాడికి సాలుగాని యెవుసం బాగా వుంది. జీవాలున్నయి. సదువు బందు వెట్టాలె. పనికి ఆసర కావాలంటున్నరు సార్..." అని మరో విద్యార్థి.

.....అనేక సమస్యలని వారు ఉపాధ్యాయులకు ఒక్కొక్కరుగా చెపుతున్నారు. కిష్టయ్య సార్!

"ఇగో మీ తల్లిదండ్రులతో మేం మాట్లాడుతం. మీరు కూడా మీ తల్లిదండ్రులను ఒప్పించాలి."

"అవును మీరు వాళ్ళు చెప్పినట్టు యినకపోతే వాల్లకు గట్లనే అనిపిస్తది. వాల్లకొక నమ్మకం కల్పించాలి. నేను మంచిగ సదువుతనని ఒప్పించాలి" అని అంతగిరి సారన్నడు. "అరే.... బ్రహ్మి నా అల్మారి డ్రాలో కొన్ని కాయిదాలున్నయి తీసుకురాపో...బిడ్డా" ఆదేశించాడు కిష్టయ్య సార్.

"నిన్న ఆన్‌లైన్‌లో అప్లై చేయించాడానికి రాత్రి తొమ్మిదిటిదాక ఇంటర్నెట్ సెంటర్లనే ఉన్నం. మీ కోసం సాయం చేయడానికి మేమున్నం. జేస్తం. మీరు కూడా మీ కోసం మీరాలోచించాలి. అంతేనా కాదా...?" అని అంతగిరి సారన్నడు. బ్రహ్మచారి తెచ్చిన కాయిదాలను చూపుతూ కిష్టయ్య సార్.

"ఇది ఆన్‌లైన్ కాపి ఇవ్వి క్యాస్టు సర్టిపికేట్స్, ఇన్‌కం సర్టిపికేట్స్ వీటిని వీఆర్వో దగ్గర రాయించి తహసీల్దారు నుంచి తీసుకురావాలి. ఆ తర్వాత మనం గచ్చిబౌలికి పంపాలి. ఇగో గిట్ల మీ అందరివి పంపించాలె. యియ్యాల్ల మీ పోటోలు హాల్‌టిక్కెట్ల్ లంచ్‌టైం వరకు తెచ్చి ఇవ్వండి" అని అన్నడు.

"అదిగాదు. ఇల్లు అలుకగానే పండుగ కాదు. అప్లయి చేయంగానే అయిపోదు. ఎమ్మార్వో ఆఫీసుల నుంచి కులం, ఆదాయం సర్టిపికేట్లు తేవాలి. తెచ్చినంక జిరాక్స్‌తోటి అప్లయి చేస్తం. ఆ తర్వాత సీటు వచ్చినంక కూడా పోవాలె. లేదంటే ఇంత ప్రయాస వ్యర్థం. నాలుగు వందల రూపాయల ఖర్చు వృధా అయిపోతది. అందుకోసం మీరు పోతననుకొని నిర్ధారించుకున్నంకనే చెప్పండి. ఓకేనా పిల్లలు?" అని అంతగిరి సారన్నడు.

గుంపుగా సమాధానంగా "ఒకే సార్..." అన్నరు..

హెచ్ ఎమ్ సార్ కనపడంగానే "నమస్కారం సార్" అన్నరు.

"నమస్కారం ట్రిపుల్ ఐటీ కోసమా? అంతగిరిసార్, కిష్టయ్యసార్‌నే అడుగుండ్రి" అనుకుంటు ఆఫీస్‌లకు వెళ్లిపోయిండు.

"సరే ఇక వెళ్లండి.." అని చెప్పారు. ప్రార్థన గంట అవుతుంటే...

"పోతున్న పిల్లలని పిలిచి యివి సుమలతకు, రేణుకకు యివ్వండి. అంటూ కుల ధృవ పత్రం ఆదాయ ధృవపత్రం రాయించుక రమ్మనుండ్రి." అని బ్రహ్మచారికి యిచ్చిండు కిష్టయ్యసార్. ఇంటర్‌వెల్‌కు అశ్విని, శ్రీలత పాస్‌పోర్టు సైజు ఫోటో వెనుకాల పేరు, తండ్రి పేరు వివరాలు రాసి పంపించారు కాని పుట్టినతేది వేయలేదు. ఎంత ప్రయత్నించిన ఇంటర్నెట్‌కు సిస్టం జనరేట్ కాలేదు. వీరిద్దరికీ సెల్‌ఫోన్ లేదు. సుమలతకు ఫోన్‌చేస్తే, సుమలత ఫోన్ ఎత్తింది.

"హల్లో నమస్కారం సార్"

"నమస్కారమమ్మా... అశ్విని పుట్టినతేది పోటోమీద రాయలేదు. జర వాల్లింటికి పోతవా? పోయి పుట్టినతేది చెపితే వాల్లది కూడా అప్లయి చేద్దాం" అని అంతగిరి సారన్నడు.

"అయ్యో సార్! వాల్లయిండ్లు శానదూరమున్నయి సార్. ఇపుడు రాత్రి ఎనిమిది అయితంది. మేం పోం. మాదిగిండ్లల్ల మస్తు కుక్కలుంటయి. పొద్దుగాల పోయి తెలుసుకొని ఫోన్‌జేసి మాట్లాడిస్తం. యిపుడు వీలుకాదు సార్..." సుమలత అన్నది.

"నువ్వు, రేణుక యిద్దరు పోతరా? లేదంటే వాల్లింటి పక్కవాల్లయి ఫోన్‌నంబర్ ఉంటే యియ్యండి."

"లేదు సార్ వాల్లింట్ల. పక్కవాల్లకు ఉన్నాయో? లేవో? మాకుతెల్వయి. పొద్దుగాల చెపుతం సార్..."

"అన్నా వద్దు ఇయ్యాల గాకపోతే రేపాయే తియ్యి. చీకట్ల ఓటిపొయి ఓటి అయితది. రేపు వాల్లను బడికాడికి రమ్మను ..." అని కిష్టయ్యసార్ అన్నడు.

"సుమలత వాల్లిద్దరిని రేపు రమ్మను... వినవడుతుందా..."

"వినవడుతుంది సార్. రమ్మంట సార్... సరే ఉంట సార్" అని ఫోన్ పెట్టేసింది.

మరునాడుదయం శ్రీలత, అశ్విని ఇద్దరొచ్చింద్రు. కన్నీరు మున్నీరైంద్రు. వాల్లకు పెళ్లిల్లు చేత్తరని ఏడుస్తుంద్రు. చదివించరని అన్నరు. ఎంత దుర్భరమైన పరిస్థితి. శ్రీనివాస్ రెడ్డిసార్ జోక్యం చేసుకొని "మీరు ఎస్సీలు చదువుకుంటే బాగుపడుతరు. అంతగిరి సార్, కిష్టయ్యసార్‌తో పాటు నేను కూడా నా వంతు సాయం జేస్తా మీరు సదువుతాంటే...?"

ఉపాధ్యాయుల సమాధానాలు విద్యార్థులకు లెక్క లేని ప్రశ్నలై కళ్లముందు వేలాడుతున్నై.

"మీరైతే రాండ్రి. రేపు ఫోటోలతో అప్లయి ఐతే చేద్దాం. సీటు వచ్చినంక తల్లిదండ్రులను కన్విన్స్ చేద్దాం. ముందుగాల మీరు మాట్లాడుండ్రి. తర్వాత మేం మాట్లాడుతమని చెప్పి ఒక భరోస యిచ్చింద్రు." అంతగిరి కిష్టయ్యసార్లు.

బైక్ వెళుతున్నపుడు బైక్ స్కిట్ అయి జారిపడ్డరు. అంతగిరిసార్, కిష్టయ్యసార్ కాలుబెణికింది. చేయి ఫ్యాక్చర్ అయింది. ఒక వారంరోజులు బెడ్ రెస్ట్ తీసుకోవాలన్నరు డాక్టర్లు. డాక్టర్ సూచన మేరకు మెడికల్ లీవులు పెట్టింద్రు. అందువల్ల అప్లై లేటయింది.

తెల్లారి రేణుకను సుమలతను పాఠశాలకు పిలిపించాడు హెడ్‌మాస్టర్ రహీమ్. ప్రార్థన అనంతరం నేటి వార్తలు, నిన్నటి ప్రశ్న నేటి జవాబు. సూక్తులు, ఉపాధ్యాయుని సందేశం తదుపరి ప్రధానోపాధ్యాయులు మైక్‌లో అనౌన్స్ చేశారు.

"నిన్న మెదక్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం పొందిన మన పాఠశాల విద్యార్థులను మనము గౌరవిద్దామని జ్ఞాపికను విద్యార్థుల చప్పట్ల మధ్య అందజేశారు. ఆగష్టు 15న బ్రహ్మాండంగా సన్మానం చేద్దాం. మీరుకూడా వీళ్లలాగా

చదివి పాఠశాలకు గ్రామానికి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులమైన మాకు మంచి పేరు దేస్తరా?" అని ప్రశ్నించిండు.

గుంపు సమాధానంగా "తెస్తం సార్" అని గట్టిగా విద్యార్థులు అన్నరు. ఇపుడు విద్యార్థుల అభిప్రాయం అని హెడ్ మాస్టర్ మైక్ అందజేసిండు. ఇంత విజయానికి కారణమైన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు. మా పట్ల మీ ఆశలు నిజం చేస్తమని హామీయిస్తున్నం. సుమలత, రేణుక ఒకరి తరువాత ఒకరు చెప్పిన సారాంశం. వారం తర్వాత పూర్తిగా కోలుకోకుండానే పాఠశాల విధులలో చేరారు. సుమలతకు ఫోన్ జేస్తే వారి నుంచి వచ్చిన సమాధానం

"వీఆర్వో రాయలేదు, మండలం తీసుకపోలేదు సార్?"

"రేపు వెళ్లుండ్రి. ఆలస్యం చేయకండి. సర్టిఫికేట్స్ రాకపోతే మనం చేసిన తిప్పలంత వృధా...? అశ్విని శ్రీలత ఏమన్నరు?" అని అంతగిరి సార్ అడిగిండు.

"వాళ్ల చెయ్యరట? మిమ్మల్ని అప్లయి చేయకుమని చెప్పింద్రు సార్"

"సరే సరే...? ఎందుకటా?"

"ఏమో మిమ్ముల్ని అప్లయి చేయకుమన్నరు సార్"

"అట్లనే బల్మిటికి చేస్తమా? సర్టిపికేట్స్ నెగ్లెక్ట్ చేయకుండ్రి. మూడు రోజులలో మనం పంపాలె ఇవ్వాల్టికి కరెక్టు వారమేవున్నది. త్వరగా చేసుకోండ్రి"

"సరే...సరే...సార్"

ఒక రోజు, రెండరోజు,... నాలుగు రోజులైంది ఫోన్ స్విచ్చాప్ వస్తుంది. సర్టిపికేట్స్ లేవు. లంచ్ సమయంలో అంతగిరిసార్, కిష్టయ్యసార్ కలిసి ఇంటికి పోయింద్రు.

"మండలం పోయింద్రా?"

"పోలేదు సార్"

"వీఆర్వో లేదు సార్. ఊరికి రాలేదు సార్. రాయలేదు సార్"

మాజీ సర్పంచ్‌కి ఫోన్ చేసి వీఆర్వో నంబర్ తీసుకొని ఫోన్‌చేసి విషయం వివరంగా చెప్పితే వచ్చిరాసిండు.

"మీరు రేపు మండలం పోయి మీ సేవలనైన, మండలాఫీసులనైన యిచ్చి అర్జెంట్‌గా కావాలని చెప్పిరాండ్రి.

"సరే...పోతం సార్" విద్యార్థుల తల్లిదండ్రులు కూడా హామియిచ్చింద్రు.

ఐదోరోజు ఏదో సావు కబురు ఎర్కయితే అటే పోయింద్రు అందరికందరు. ఆ విషయం సార్లు 6వరోజున ఫోన్‌జేసే దాక తెలియదు.

"మీరు పోంద్రి ఆటోకు మేం దౌల్తాబాద్‌కు వస్తం బండిమీద" అని కిష్టయ్య సార్ చెప్పిండు.

మధ్యాహ్నం పూట సీఎల్ పెట్టుకొని బండిమీద పోయింద్రు. మండలంకు పోంగనే డిప్యూటి తహసీల్దార్ చేర్‌లో 1995లో చిన్నకోడూర్ మం॥లో ఆర్‌ఐగా చేసిన మహేందర్ సార్ ఉన్నాడు. ఆయన అంతగిరి సార్‌కు బాగా పరిచయం.

"సార్ నమస్తే... బాగున్నరా...?"

"బాగున్న సార్, కూర్చొండి. మీరు? మీరు..?"

"సార్ నేను అంతగిరిని మాది చిన్నకోడూర్ మండల్ సార్"

"ఓహో...! అంతగిరి చాలా మారిపోయినవు బాగున్నవా? ఏందిక్కడ?"

"సార్, నేనిక్కడ ఇందుప్రియాల్‌లో తెలుగు టీచర్‌ని. ఈ సార్ హింది గ్రేడ్ 1"

"నమస్తే కూర్చోండి"

"పిల్లలు బాగున్నరా సార్, ఏం చేస్తుంద్రు."

"పెద్దోడు బెంగుళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. చిన్నోడు స్టేట్స్‌లో సాఫ్ట్‌వేర్. మొన్ననే మూన్నెల్ల క్రితం పాపకు పెళ్ళయింది. అల్లుడు గ్రేడ్ వన్ ఆఫీసర్..."

"మంచోల్లకు మంచి జరుగుతది సార్"

"మొత్తమ్మీద అందరం బాగానే ఉన్నం. అసలు సంగతి చెప్పలేదు?"

"ఏం లేదు సార్ మా పిల్లలకు (విద్యార్థులకు) పది పాయింట్లకుగాను తొమ్మిది పాయింట్ ఎనిమిది వచ్చింది. సార్ యియ్యల్లనే ట్రిపుల్ ఐటీకి లాస్ట్ డేట్. వీల్లకు తెల్వక ఈ ప్రాసెస్ చేయలేదు. ఎట్లన్నన్న మీరే ఈ పుణ్యం కట్టుకోండి సార్" అని రెక్వెస్టు చేశాడు.

"తప్పకుండా... మనమున్నదే వాల్లకోసం. మ్యాన్యువల్ అయితే పదినిమిషాల పని మ్యాన్యువల్ యియ్యిమంటరా..?"

"వద్దు సార్. అసలే కంప్యూటర్ మయం సార్. ఎట్లనన్న కంప్యూటర్

ఆధారితంగానే యివ్వండి సార్"

"మా కంప్యూటర్ ఆపరేటర్‌కు కొడుకు పుట్టిండని నిన్న లీవు తీసుకున్నడు. యియ్యల్ల రావాలని తప్పకుండా రిక్వెస్ట్ చేద్దామాగు" స్క్రీన్‌టచ్ ఫోన్ తీసి ఫోన్‌కలిపిండు. రింగవుతున్న శబ్దం యినవడుతుంది. లౌడ్‌స్పీకర్ ఆన్ చేసి టేబుల్‌మీద పెట్టిండు.

"అవతలినుండి గుడ్ మార్నింగ్ సార్"

"కొడుకు బాగున్నడా... తల్లీకొడుకుల ఆరోగ్యమెట్లున్నది."

"బాగున్నది సార్! ఇద్దరు బాగున్నరు డాక్టర్ ప్రాబ్లం ఏం లేదన్నరు"

"సురేష్ ఒక చిన్న పని నీతోటి" "చెప్పండిసార్"

"ఒక్క సారి వచ్చిపోవా..? కంప్యూటర్ ఆన్‌చేసి పోయినాసరే..."

"పిల్లలయి (ధృవీకరణ పత్రాలు) సర్టిఫికేట్స్ మనమొక రిపోర్టు పంపాలె కలెక్టర్ ఆఫీసుకు ఒక్క అడుగు వచ్చిపో..."

"నేనొచ్చె వరకు నాలుగయితది సార్. అపుడు కరంటి వుండది గద్సార్"

"నేను ఏ.ఇతో మాట్లాడుత. నువ్వైతే రా.

"సరే సార్...వస్తా" అనడంతో ఫోన్ పట్టేసిండు మహేందర్ సార్.

"ఎంత సేపుంటరు సార్! అసలే దూరం తొవ్వ. సిద్దిపేట నుంచి జర్నీ అంటే మాటలు కాదు నాలుగ్గంటలకల్ల యిస్తా మీరెల్లండి"

"థ్యాంక్యూ సార్. మీరు ఎంతో గొప్ప మేలు చేసింద్రు" కుర్చీల నుండి లేచి షేక్ హ్యాండిస్తూ అన్నారు.

"దానిది ఏముంది? అంతగిరి" అని మేము వెళ్తున్నట్లు గ్రహించి కూర్చున్నడు.

బయట వేచి వున్న రేణుక తల్లిదండ్రులకు నచ్చచెప్పి యివ్వల్లనే అన్ని జిరాక్స్ సెట్టు చేసి అందులో వున్న అడ్రస్‌ను చూపి బైక్ స్టార్ట్‌చేసి బయలు దేరింద్రు. వీల్లకు నమ్మకుండా అదే పాఠశాలలో ఇంతకు ముందు వివిగా పని చేసిన భాస్కర్‌కు ఫోన్‌చేసి భాస్కర్ "నువ్వొక్క పని చేయాలి. కాదనొద్దు ప్లీజ్" అని కిష్టయ్యన్నడు.

"మీరింతగా చెబుతుంద్రు, తప్పకుండా చేస్తా సార్." అని భాస్కర్ అన్నడు. సర్టిఫికెట్స్ కొరియర్ చేయాలి. నువ్వు పోకపోతే రెండు జీవితాలను చిదిమేసినోళ్ళమైతం. ఏమంటవ్?" అని అన్నడు కిష్టయ్యసార్.

"ఒక్కనిమిషం అంతగిరి సార్ మాట్లాడుతడట" అని పోన్ ఇచ్చిండు. "భాస్కర్ సార్ నమస్తే. పెట్రోల్ డబ్బులు నేనుల యిస్తా. నువ్వు పోకున్న, నీకు వీలుగాకున్న, నువ్వు ఖచ్చితంగా పంపించే ఏర్పాటు చేయి. కాదుపోదు అనకు. ఓకే ఉంటా." అని ఫోన్ పెట్టేసిండు. అంతగిరి సార్.

"సార్ కొరియర్ చేసినం" మెసేజ్ చేసిండు. వివి గింత రాత్రిదాక ఏంజేసింద్రు. అవునుగని అతను తమ బర్లపాలు పిండుతడు. పనులన్ని పూర్తిచేసుకొని పోయినట్లున్నడు. ఫోన్ తీసి కలిపిండు.

"సార్ నమస్తే..." భాస్కర్ అన్నడు.

"థ్యాంక్యూ సార్. మీరు కొరియర్ చేయకపోతే ఈ ప్రయాసమంతా వేస్ట్ అయిపోవు." అని అంతగిరి సార్ అన్నడు.

"మీరు చేసిందాట్ల మేంజేసిందెంత సార్. మీరు మాపట్ల మా ఊరిపట్ల చూపుతున్న శ్రద్ధముందు మాదెంత సార్..." అని భాస్కర్ అన్నడు.

"సరే గాని రాత్రిపూట పైలంగా పోంద్రి. ఇల్లు చేరినంక ఫోన్ చేయ్యింద్రి. ఉంటమరి."అని అంతగిరి సార్ ఫోన్ పెట్టేసిండు. అనుకున్నట్టే ఇరువైరోజుల తర్వాత ట్రిపుల్ ఐటికి సెలెక్టు అయిన విద్యార్థుల వివరాలు ఇంటర్నెట్‌లో పెట్టారు. ముందుగా హెచ్ ఎం రహీం సార్ చూసి అందరికీ ఫోన్ సమాచారం పెట్టిండు. దాని సారాంశం ఏమంటే ఓపెన్ కాంపిటిషన్ కేటగిరిసీటుకు ఎంపికయ్యారని ప్రార్థనలో ప్రధానోపాధ్యాయుని సందేశం వేయి ఏనుగుల బలంతో మొదలైంది." రేణుక, సుమలత, ఓసిలో సీటు పొందడం పాఠశాల అదృష్టం. కృషివుంటే మనుషులు ఋషులవుతరు. మీరు కూడా అలా అయితరా? సాధిస్తరా...?"

"సాధిస్తం సార్" గుంపు సమాధానం.

"అందరు చప్పట్లు కొట్టింద్రు" చప్పట్ల చప్పుళ్ళు లయబద్ధంగా సాగినయి. అంతగిరి సార్ ఫోన్‌జేస్తే సుమలతకు లైన్ కలువలేదు. రేణుక ఫోన్‌కు కలిసింది. రేపు ఇద్దరిని రమ్మని చెప్పిండు.

మారునాడు రేణుక తల్లితో ఒక్కతే వచ్చింది."సమస్కారం సార్."

"ఆ..నమస్కారం. సుమలత ఏదమ్మా"

"రాదట సార్"

"ఎందుకు?"

"ఏమో సార్"

"ఇక్కడికి రాదట్నా? లేకుంటే బాసరకే రాదట్నా? అదే ఏమైంది? ఏం రోగం బుట్టింది?"

"ఆమె పెండ్లి చేసుకుంటదట్సార్" అని రేణుకన్నది.

"సదువుకున్నంక చేసుకోరాదట్నా?పెళ్ళి."

"వాళ్లమ్మ గూడా అదే విషయంలో ముందు సదువుకొమ్మంటంది. సుమలతనే యింటలేద్సార్"

"అదే...?"

"వాల్ల నాయిన సచ్చిపోయినంక మేనవాళ్లు కాయం జేసుకున్నరు. ఇపుడు వాళ్లు ఆగరట అందుకే సదువదట?"

"పిచ్చా ఏం సీటురాక చాలామంది విద్యార్థులు బాధపడుతుంటే ఈమెకు వచ్చినా పోను, సదవనని అంటంది."

"నువ్వైతే పో..." అని కిష్టయ్య సారన్నడు.

"మీరు రావాలె సార్" అని రేణుక తల్లి మల్లవ్వన్నది. అంతగిరి సార్ "అమ్మా మేం రాకున్న ఏంగాదు. అక్కడ చెప్పేది క్యాంపస్‌ల నాతోటి సదువుకున్న దోస్త్ తూరుపింటి నరేష్‌కుమార్‌కు చెప్పుత. అందులోనే మా చిన్నాయిన కొడుకు సదువుతున్నడు. మీకేం అవసరమొచ్చినా తెల్సినోల్ల సాయం తీసుకుందాం. భయపడకండి మీకేంగాదు" అన్నడు.

"యిప్పట్దాక ఎంతో సాయం చేసింద్రు సార్ మీరు. ఈ ఇంత పురాగ చేయింద్రి" మల్లవ్వన్నది. "ఎందుకమ్మా ఏం ఫికర్‌లేదు రందిపడకు" అని చెప్పింద్రు ఇద్దరు సార్లు.

"అవునా? సుమలత ఉన్నదా యింటికాడా?"

"లేద్సార్ స్వాతివాల్లకు పనికివోయింది." వాల్ల బాయి దౌల్తాబాద్ రూట్లనే వుంది సార్.

"సరే సరే..."

లంచ్ సమయం స్టాఫ్‌రూంల "సుమలత పోనన్నదట ట్రిపుల్ ఐటికి మనం

మాట్లాడుదామని అని రెడ్డిసార్ అన్నడు.

"లేనిది పెట్టేరా గునిది అన్నట్లుగా మీరెందుకు అప్లయి చేసింద్రు" మరోసారన్నడు. చర్చకు రాకుండా సాయంత్రం సమయం పాఠశాలకు ముగింపు తర్వాత వస్తూ వస్తూ స్వాతివాళ్ల చేనుకాడ అంతగిరి సార్, కిష్టయ్యసార్, రెడ్డిసార్, శ్రీనివాస్‌సార్, బాబాసార్ అందరం పోయినం. మా సార్లు వొస్తున్నారని స్వాతి సుమ మక్కచేనులోని చెట్లసాటుకు రెడ్డిసార్‌ని చూసి జాగుంటంద్రు. వస్తున్న సార్లను చూసి స్వాతి తల్లి "బాగున్నరా సార్?" అని అన్నది.

"బాగున్నమ్. స్వాతి, సుమలత ఏది?"

"అగో చెట్ట సాటుకున్నారు. రాంద్రా పిల్లలు అని పిల్సింది" స్వాతి అమ్మ.

భయపడుకుంటా సిగ్గుపడుకుంట ఎల్లుతూ "నమస్కారం సార్..." అన్నరు.

"నమస్కారంకు ఏం తక్కువ లేదుగని ఎందుకు పోనంటున్నవ్ సుమలత. నువ్వు పోవాలె ట్రీపుల్ ఐటికి. వింటున్నవు గదా?" అని రెడ్డి సార్ అన్నడు.

"ఊ. ఆ. లేదు" అని మూలుగనోము నోస్తుంది. సుమలత శాతనైనంతసేపు చెప్పి వెనుకకు దిరిగింద్రు సార్లు. సుమలత కాబోయే భర్తఫోన్ నంబర్ సేకరించి ఫోన్ జేసి "రాజు నంబరేనా ఇది"

"అవును మీరేవలు?"

"మేం మీ వూర్లె సార్లం"

"ఐతే ఏంది? ఎందుకు సేసింద్రు. నాతోటి ఏంపని?" అని రాజు అన్నడు.

"రాజూ ఏమనుకోవుగదా? మేము ఒక విషయం చెపుతం. మంచిగా అనిపిస్తేనే విను. లేకపోతే వినకు. చెప్పేది వింటవా? వినవా?"

"వింట సార్, ఎందుకు విన?"

"ఏం లేదు సుమలత మంచిగా చదివితే నౌకరొస్తది. నువ్వే బాగుపడుతవ్. ఊకె ఎన్నిరోజులు నడుపుతవు ఆ డొక్కు ఆటో. చదివించు. నౌకరి దొరికితే బంగారి బాతు గుడ్లు పెట్టినట్లుగా ఉంటది." కిష్టయ్య సార్ అన్నడు.

"ఏమో సార్ నాకేమి తెలువది."

"నీకెందుకు తెలువది. నీకు తెలుసని మాకు తెలిసింది. లక్ష్మిరాంగ తడక అడ్డం పెట్టకు. నువ్వే అటుపోయి ఆటో నడుపుకో. ఆమె అందులో సదువుతది.

నువ్వు ఆటో నడుపు ఆమె సదువుకుంటది. పెండ్లి అయినంక సదివినోల్లు ఎంతమంది లేరు? వినయ్యా." అని కిష్టయ్య సారన్నడు.

ఒక సారి ఇటియ్యి అని "రాజు ఆమె నౌకరి చేస్తే జీతం మాకు ఇస్తదా? మీకు యిస్తదా? ఎందుకయ్యా చెబితే వినరు. మేలుకోరి చెపితే వినరు. పట్టి పట్టి చెప్పం. ఇగ మీ యిష్టం" అని అంతగిరి సారన్నడు.

మెల్లగ రాజు "ఆలోచిస్తం సార్"

"ఆలోచించడం గాదు పంపిస్తున్నవు. రేపు పోతే ఎల్లుండికి అందుతరు. రేపు రేణుక వాళ్లు పోతున్నరు.

"సరే సరే సార్"

ఫోన్ పెట్టేసి కిష్టన్నా "పంపించేటట్లు లేరే ఏం చేద్దాం"

సుమలత వాళ్ల సుట్టపైనే హెచ్చెమ్ మల్లేశం సార్‌కు చెపుతానని ఫోన్ చేసి "నేను కిష్టయ్యసార్‌ని ఇంతకు ముందు కొడకండ్లల హింది పండిట్‌ను సార్"

"చెప్పన్నా చెప్పు బాగున్నవా? ఏందే...?"

"మీ సుట్టం సుమలత ట్రిపుల్ ఐటికి పోనంటున్నది"

"అన్నా నేను వాల్లింటికి పోయి మాట్లాడి పంపిస్త. థ్యాంక్యూ సార్."అన్నడు.

"రాత్రి ఎనిమిది గంటల తర్వాత అంతగిరి సార్ రాజుకు ఫోన్ జేసి ఒకసారి సుమలతకు యియ్యి మన్నడు. రాజుది కూడా అదేవూరు కాబట్టి తీసుకపోయి యిచ్చిండ్రు.

"ఏం సుమలత తిన్నవా?"

"తిండ్లే సార్. రేపు వెళ్లు ట్రిపుల్ ఐటికి "

"నేను వెళ్లను సార్."

"ఐతే ఒకసారి మా మేడం తోటి మాట్లాడు "

"ఏమమ్మ సుమలతా! ఎందుకు పోనంటున్నవు తల ఎత్తుకొని బతకాలని లేదా? మన తల్లిదండ్రి లెక్కనే ఎండల వానల కష్టపడి బతుకుదామా? మనలక్షణాలు పోగొట్టుకోవద్దా? ఎక్కడున్నా విలువగా బతకాలిగదా అంతేనాగాదా?"

ఏం మాట్లాడాల్నో అర్థంగాక నిశ్శబ్దంగా వుంది సుమలత, పిలిస్తే "ఓ" అంటుంది."సుమలతా!"

"ఊ వింటున్నా చెప్పండి"

"నా పరిస్థితి చెబుత వినూ నాకు డిగ్రీ ఫైనల్‌లో అంటే పదిహేను తరగతిల వున్నపుడు పెళ్లైంది. నేను మాత్రం నన్ను సదివిస్తేనే పెళ్లిచేసుకుంటాన్న. డిగ్రీ పూర్తయింది. బీ.ఈడి. పీజి పూర్తయింది. డీయస్సీ పడితే జాబ్ వస్తది. నేనిపుడు డిగ్రీ కాలేజిల కాంట్రాక్టు లెక్చరర్ జాబ్ చేస్తున్న. నెలకు ఇరవై ఒక్కవెయ్యి. మన ఎస్సీకి కమ్యూనిటిల జాబ్ తొందరగా వస్తది చదువు. అర్థం చేసుకునే వయస్సు కాదు నీది. మేము చెప్పేది నీకర్థంగాదు. ట్రిపుల్‌ఐటిలో వేళకు ఫుడ్. మంచి చదువు మనిషికి ఒక్క కంప్యూటర్ యిస్తరు. అందులకు పోతే నీ జీవితమే మారిపోతది. నెలకు కనీసం నలభై యాభైవేలు సంపాదించే ఉద్యోగం వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదు. మీ నాన్న లేడు అని తేలిసింది. మంచిగా చదువు నీ యిష్టం..." ఎన్నితీర్ల చెప్పాల్నో అన్నితీర్ల చెప్పింది. అయినా సుమలత ప్రతిస్పందన అంతంత మాత్రమే.

రేణుక వాళ్లు ఇచ్చిన అడ్రస్ మీదికేలి ట్రిపుల్ ఐటీకి బయలుదేరి పోయినంక సుమలత సుట్టం హెచ్చెమ్ మల్లేశం సారొచ్చిండు. నాలుగంటలకు ఏం పోత పోసిండో ఏమో? ఏం బోధ చేసిండో ఏమో? మొత్తం మీద రాజు ఫోన్ నుండి సుమలత ఫోన్ చేసి "సార్ మేం పోతున్నం రాజు, నేను, మాఅమ్మ" అంటూ చల్లని కబురు చెప్పింది. రాత్రి ఎనిమిది గంటలకు సంతోషపడి అంతగిరి సార్ కిష్టయ్యసార్‌తో ఒక సందిగ్ధం ముగిసిపోయిందని ఫోన్‌చేసుకోని మురిసిపోయారు.

"ఇల్లు అలుకంగానే పండుగైతదా? కౌన్సిలింగ్ పోయింద్రని మురుస్తన్నం గని ఎగ్గొట్టుడు ఎంతసేపు" అని కిష్టయ్య సార్ ఒక నోట్ బాంబు వేసిండు.

"కౌన్సిలింగ్ పోయొచ్చినంక చెప్పరా? వాళ్లనుభూతి" అంతగిరిసార్

"చెపుతరు చెపుతరు"

"బాసరకు పోయినంక బాయిలకప్ప చెరువుల చేరినట్లు అనిపించింది సుమలతకు. రేణుక సుమలత జాయిన్ అయి ఒక పూట భోజనం తిన్నరు.

"అంత మంచి అన్నం మన యింట్లకూడా ఉండదనుకున్నరట" మొత్తం మీ్మద ఇద్దరు చదువాలని నిర్ణయించుకున్నరు. జాయిన్ అయి ఊరుకి తిరిగి వచ్చినంక మళ్లీ స్టాఫ్‌కు కలువడానికి తల్లిదండ్రులతో బడికి వచ్చింద్రు రేణుక సుమలతలు.

"నమస్కారం సార్"

"నమస్కారం సార్ ఎట్లుంది బాసర?"

"బాగుంది సార్" అని సుమలతన్నది.

"చాలా బాగుంది సార్. ప్రపంచమంటే అది సార్" అని రేణుక చెప్పింది.

"నువ్వేమంటున్నవు సుమలత"

"సార్ నేను పోకపోతే నా బతుకే చీకటి అయిపోవు సార్" అని అన్నది.

సుమలత తల్లి, రేణుక తల్లి సంతోషపడుతూ వినయ పూర్వకంగా దండం పెట్టింద్రు.

"మీదే దీపం సార్లు. మీ రుణంల పడ్డం సార్. మీరే లేకపోతే మేం గంత దూరం పోదుమా? మాతోని అయేపనేనా? మిమ్ముల సచ్చినన్ని కాలాలు మరువం సార్."

"ఏం రుణం లేదమ్మా, మాపని మేంజేసినం గంతే."

"మీరు మావొల్లేనా సార్ ?" కులం ఉద్దేశించి అన్నారు తల్లులు

"అవును మీ వాల్లమే..."

"ఏమనుకోకండ్రి సార్ మీరు మావొల్లేనా?" మళ్ళీ తల్లులు అడిగారు.

"మీవొల్లమే. మీ బాగుకోరే పంతుల్లం."

సార్లు సందిగ్ధత తొలిగిపోయిందని సంతోషించారు.

2012 ఉపాధ్యాయ కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందినది.-
2012 .జూన్

ఎంతకంతే

ఎల్లారెడ్డి పేట ఎల్లడు జెయ్యంగ నా బిడ్డను ఎముని మూతి కాకులకు దారవోత్తి. వానింట్ల పీనుగెల్ల ఇల్లూ, జాగ, మంచిగున్నది. సాదుకొని బతికే రేవున్నోడని బొంకించి, బోర్లిచ్చి మమ్ముల మోసంజేసే. వాని కడుపుగాల. ఒకటాయే, రెండయే ఏ పదిగల్ల పంచాదులాయే ఎవ్వడేం సాపు జెయ్యక వోయిరి. కడుపు మసులుతున్న బాధను ఏడికాడికి ఎల్లగక్కుతంది ఎల్లవ్వ.

“గల్లర గల్లర ఎందుకొర్రుతవే. రానిపోని ఒర్రుడు. మనం బిడ్డను కన్నంగని బిడ్డ రాతను గన్నమా? జాగ భూమి సానున్నదని లేవలేనోనికి, పనికి భయపడెటోనికి దారవోత్తిమి. ఎన్నడు సక్కగా సాదుకోకపాయే, వీనియవ్వ రోసువడ్డ మొకంలా చెప్పు! ఊకోయే! ఊకో...” అని తన భార్యతోటి ఎల్లయ్యన్నడు.

“నీ మొకంగాల? నిన్ను చేసుకొని నేనేం సుఖపడ్డ! నీకడుపుల పుట్టిన నా బిడ్డకు ఏం సుఖం లేకపాయే! ఒద్దొద్దనంగా పట్టు పట్టి ఆ యింట్లకే దారవొత్తివి. నలుగుట్లే నవ్వులపాలు జేత్తివి. సంసారం సెంద్రసెంద్ర జేత్తివి” అంటూ పామొలె బుస కొట్టుకుంట ఎల్లయ్యను తిడ్తంది ఎల్లవ్వ.

“ఓ...! అవ్వ ఊకోయే, పోలీస్ కేస్ పెడ్తే, వాని పెండ్లి గట్టిగ జేత్తరు బాడుకావ్‌ను, గదే పెద్దమనుషులు, గదే పంచాది, గదే తశ్ప, ఆనికి బాగ లాగం ఐతంది. పోలీసోల్లకు అప్పజెప్పి మొత్తగ తన్నిపిత్తె మంటవాసు. ఆఖర్కి గదే అయితది సూడు” అని అవ్వ తోటి పమీల అన్నది.

“ఒద్దు బిడ్డా! పోలీసోల్లు ఇటు అటు రొండు సేతుల దింటరు. పోలీస్‌టౌన్‌లకు వొయింద్రు అని ఊల్లె ఎర్కయితే నలుగుట్ల సిన్నతనమైతది. కులంల

మాట్లాడుతనే ఉంటిమి. మనూరు, ఆవూరి కులస్థులు మల్లవారం తప్ష జేత్తమనిరి" కులాన్ని, పెద్దమనుషులను కాదని పోలీసుటౌన్‌కు పోవద్దని ఎల్లయ్య తన బిడ్డతోటటి సెపుతండు.

"నీకేది సాతగాదు? పెద్దమనుషులే గింత దూరం జేసిండ్రు. ఎట్లైతేంది? జడుపు బెట్టి యిడిసిపెడ్తె. మల్ల యిసొంటి తీరుగ జెయ్యడు" ఎల్లవ్వ అన్నది.

"ఆ గంతేనే. నాయిన ఒత్తెనేమో రాని లేకపోతే మనమే వోదాం పోలీస్‌టౌన్‌కి" అని పమీల అన్నది.

"ఈయింత నాలుగు రోజులు సూద్దాం. ఆ పంచాదిల పెద్దమనుషులు ఏ తప్ష జేత్తరో యిని ఇగ గదే పనిజేద్దాం." అని ఎల్లయ్యన్నడు.

నాలుగు రోజుల తర్వాత తప్షను జూసి "ఐతారం నాటి పంచాదిల మనకు మోసమైంది బిడ్డా! ఏంచేద్దాం! ఆఖర్కి గదే! మొన్న మనమనుకున్నట్టె జేద్దామా...?" అని బిడ్డను అడిగింది ఎల్లవ్వ.

"ఇగ వోదాం పాయె. నేను ఐదోతరగతి దాక సదివిన. నేనే రాత్త పా. ఏమేం జరిగిందో గది రాసిత్తె వాళ్లు(పోలీసోల్లు) కేసు జేత్తరు." అని పమీల తల్లితో అన్నది.

పోలీస్‌టౌన్‌లకు తల్లీబిడ్డలు ముచ్చట వెట్టుకుంట గడికి ఒగసారి భుజాల మీదేసుకున్న కొంగును సదురుకుంట, లోపలికి పోతండ్రు. పోలీస్ స్టేషన్‌లకు పోయేవరకు రకరకాల పంచాదులకు వొచ్చినోల్లు ఇక్కడో గుంపు, అక్కడో గుంపు, గుంపులు గుంపులుగా నిలవడ్డరు. అందరు నడీడు తిరిగినోల్లె ఉన్నరు. పమీల, ఎల్లవ్వ, ఎల్లవ్వ అన్న అందరు కల్సి ఓ మూలకు ముచ్చట వెట్టుకుంట నిలవడ్డరు.

'అబ్బ ఏ ముందిరా పోరి, అద్దం పొడుగు బందవస్తుంది. అటు ఎర్రగాదు అట్లని కర్రెగాదు. అటీటు గాకుండా ఛాయ నలుపున్నది. జాకెట్ సూడు ఎట్లేసిందో... అండ్లకేలి పొడుసుకొత్తున్నె యివుతల్కి యెనుక ముందు జోర్దారుంది. అరే! అట్లయితే ఒక దమ్ము సూడాలె దీన్ని' అనుకొని గపుడే డ్యూటీ దిగిన హోంగార్డు రాజు అనుకుంటుండు. ఏమన్నగాని పోతూపోతూ మాట్లాడిత్తనని వాల్లకేయి పోతండు రాజు.

పోతున్న రాజును జూసిన పీసి ప్రకాశ్ 'అమ్మ! కొడుకు సూసినదాన్ని ఇడిసిపెట్టడు. ఈడెప్పుడు నాకు పోటికొత్తడు. అటుదిక్కు సూసుకుంట కొంగుతో భుజాలను చుట్టిన దాన్ని యెనుక కేలి సూత్తనే ఎంత బాగుంది. పిగర్ మస్తుంది.

దాన్ని కసితీరా కొరకంది ఈ మొగజన్మనే ఉట్టిది' అనుకుంటండు.

"యేం! పెద్దమనిషి! ఎందుకొచ్చినవ్?" అని సివిల్ డ్రెస్‌లున్న హోంగార్డు రాజు అడిగిండు ఎల్లవ్వ అన్నను. "ఏం లేదు సార్, మాకోడలును ఆమె పెనిమిటి సంసారానికి దీసుక పోతలేడు. దీసుక పోయినపుడల్లా కొట్టుడు, తిట్టుడు ఎన్నోసార్లు పంచాది వెట్టినా ముండకొడుకు ఎప్పటోలెనే మసులుతుండు. గందుకొరకే కేసు పెడదామని వొచ్చినం" ఎల్లవ్వ అన్న గోనయ్య చెప్పిండు.

అప్పటి వరకు హోంగార్డు రాజు పమీలను అరికాల్లనుంచి నడినెత్తిదాక ఒక్కతీర్గ దుర్బిని వెట్టి సూసినట్లు సూత్తనే ఉన్నడు. 'దొంగది ఎంత మంచిగున్నది. ఎవనితోటి వోతుందో....? ఖజ్జం ఖజ్జం ఉన్నట్లు ఉన్నది. దీన్నిడిసి పెట్టొద్దు" అనుకుంటున్నపుడు గోనయ్య ముచ్చట బందైందని ఇటుదిరిగింది

"ఇంటన్న! ఇంటన్న! అరే మిమ్ముల జూస్తే ఒట్టి అమాయకుల లెక్కున్నట్లు ఉన్నరు. కేసు పెట్టుండ్రి. ఆ లంబ్డి కొడుకును లోపటేసి రాసుడు రాద్దాం" అంటున్నపుడు ఈ సారు మంచోడున్నడు అనుకుంది యెల్లవ్వ.

"సారూ! ఒక్కనాడు సుకం లేదు. నా బిడ్డకు శీత శెర ఉన్నది. ఒక్కనాటి కట్టంగాదు సారు. ఏం జేద్దు, ఎట్లజేద్దు. జర నా బిడ్డ సంసారం నిలవెట్టుండ్రి సార్. వానికి జదుపు బెట్టుండ్రి" అని ఎల్లవ్వన్నది.

"సరె సరె గని ముందుగాల ఓ పిటీషన్ రాయిండ్రి. ఏమమ్మ నీకు రాయొస్తదా...?" అని పమీల నడుగుతుండు.

ఇటుకేయి జూత్తున్న ప్రకాష్ 'ఐపోయింది. దోమతెరల జిక్కిన దోమలాగ. పెనెం మీదికెలి పొయిల వడ్డట్లయిందామెకు. వాడు తొవ్వజేస్తే నేను ఆ తొవ్వల వాడు లేకముందు నేను నడువలేదా?' తనలో అనుకుంటండు.

"ఆ రాయొత్తది సార్! నేను ఐదో తరగతి సదివిన." పమీల రాజుతో అంది.

"ఏంగాదు రాయి! నేనున్నపుడు కేసు జేపిత్త. ఇయ్యాల్ల ఎస్సై సారు లేడు. ఒకవేళ వత్తె మూడుగంటల వరకొత్తడు. మిగతాయి నేన్ జూసుకుంట. రాయి రాయి" అని హోంగార్డు రాజు కేసుకు పురికొలిపిండు.

గోనయ్య, యెల్లవ్వ, చెప్పినాకొద్ది పమీల నల్లపూసలు కుచ్చుకున్నట్లు రాస్తంది.

"మీరు రాయిండ్రి"అని చెప్పి లోపటికి వోయిండు. పోతన్న రాజును పిల్సి "మంచి కేసే వట్టినట్లున్నవ్ గదా!" అని ప్రకాష్ అన్నడు.

"పాపం వాళ్లు అమాయకులున్నరు. పిటిషన్ రాయిమని చెప్పిన" అని రాజన్నడు.

"సరే! కానియ్యి! కానియ్యి! రకరకాల పుణ్యాలు జేసేది నాకు దెల్వాదా..." ప్రకాష్ వ్యంగంగా అన్నడు.

"కోడికి ఎండగ మీదున్నట్లు ఏదైనా? నా మీదుండదా? నీకు" అని రాజన్నడు. లోపటికి వోయి తిరిగొచ్చె వరకు పమీల రాసుడు అయిపోయింది గమనించి పమీల దిక్కు వోతండు.

"ఐపోయిందా..." రాజు అన్నడు.

"ఆ... ఐపోయింది... సారు" అని పమీలన్నది.

"ఏదీ! యిటియ్యి పిటిషన్"

"ఇగో!..."సేతుల వేట్టింది పమీల.

"రంగ్రీ కౌంటర్ల దాఖలు చేద్దాం" అంటూ తోలుక వోయిండు.

లోపటికి వోయి "గిది సూడు సాబ్" అని సేతికిచ్చిండు.

"మీరు బయటికి పోండ్రి" హోంగార్డు రాజు అనంగానే బయటికి పోయింద్రు. కొంతసేపటికి మల్లా వాల్ల దగ్గరికివోయి "నేను యింటిదాక పొయ్ స్నానం జేసి, భోజనం జేసివస్తా. ఇగో నా నంబర్, అర్జంటుంటె నాకు ఫోన్ జెయ్యండ్రి సర్రనొస్త." అని పమీలకు ఫోన్ నంబర్ సెప్పిండు. యెల్లవ్వ, గోనయ్య సరే అన్నరు.

అనుకున్న దానికంటె గంట ముందున ఎస్సై వొచ్చిండు. వొస్తున్న ఎస్సైని జూసి పోలీసులు, చిన్న చిన్న లీడర్లు, వాదులు, ప్రతివాదులు అందరు ఒక్కసారి నిశ్శబ్దంగా ఉన్నరు. పోలీస్ జీపుల కేలి దిగి నాలుగడుగుల్ల స్టేషన్ ఎక్కిండు. జర్రున జరిపి, కుర్సిల కూసోంగనే కానిస్టెబుల్ ఫ్యానుకట్క యేసిండు. ఇంకో కానిస్టేబుల్ కంటైపిస్టు నీళ్లు బాటిలియ్యంగనే గట గట నీళ్లు దాగుతూ "కొత్తగా యేం కేసులొచ్చినయ్ సీనూ" అడిగిండు ఎస్సై.

"రెండొచ్చినయ్. ఒకటి భార్యభర్తలది. రెండోది గెట్టు పంచాదిల కొట్టుకున్నోల్లు" అని టైపిస్టు శీను జెప్పిండు.

"వాడు హోంగార్డు రాజుగాడున్నడా? వానికి ప్రమోషన్ వొచ్చింది. వాడియ్యాలటి నుంచి మనకు పీసీ" ఎస్సై అన్నడు.

"సార్..., పేచీదార్లను పిలువమంటరా...?"

"ఆ పిలువు, అట్లె ఆఖర్కి రాజుగాన్ని పిలువు."
పేచి పెట్టుకున్న వాల్లతో మాట్లాడి మీ సమస్యలు పరిష్కరిస్త అని చెప్పి వాల్లను పంపించగానే డోర్ కాడ డోర్ దీసినపుడు నిలవడ్డడు రాజు.

"అరేయ్ రాజు ఇట్రారా బయ్" ఎస్సై అన్నడు.
డోర్‌దీసి "సెల్యూట్ కొట్టి! సార్ నన్ను పిలిచింఁడ్రాట" అని వినయంగ అడుగుతున్నడు రాజు.

"ఏం లేదురా! నీకు పర్మనెంటైంది. ఇక ముందు నేనున్న లేకున్న నీకు అన్ని డ్యూటిలు పడ్తయ్. నేను డీఎస్పీతో చెప్పి నీకు పర్మనెంట్‌కు ప్రపోజల్ పంపించిన జెపిచ్చిన."

"థాంక్యూ సార్, మీ మేలు మరువలేనిది సార్. ఈ జన్మల మీ పాద సేవ జేసి తరిస్తా సార్!" అని రాజు అన్నడు. చిన్నగా ముసి ముసిగా నవ్వుకుంటూ 'రాజుకేయ్ జూసిండు' "ఏం లేదు సార్, ఆలుమొగల కేసు మీరు నాకియ్యరా...సార్" రాజు అన్నడు.

"ఎందుకురా! పిట్ట మంచిగున్నదని ఆకేసు అడుగుతున్నావురా? నువ్వు లంగవని అందరంటర్రా. అందుకేనారా...?" ఎస్సై అన్నడు.

"ఛీ! ఛీ! సార్. నాకు అటువంటి ఆలోచనే లేదు. నా పని ఓర్వలేకనే గట్ల అంటరు సార్. పీసీని కాకున్న ఎంత మంచిగా జేత్తనో నా పని జూసింఁడ్రు గద్సార్. అందుకే నేనంటే ఈల్లందరికి మంట సార్" రాజు ఎస్సైతో అన్నడు.

"పిలుసుక రాపోరా...!"

"ఓకే సార్" అనుకుంట యివుతలికి వొచ్చి పిలుసుక వోయిండు. పమీల వాల్లను ఎస్సై బాధంత తెల్సుకున్నడు. ఇగ రాజును అప్పజెప్పుతున్న. ఈ కేసును జల్ది జేసుక రారా!" అన్నడు సార్. ఇవతలికి వొచ్చిండు రాజు.

"ఇగ సుసుకుందాం! మరి పమీల అత్తగారింటికి వోవాలె కర్చైతది. ఆ కర్చు యియ్యాలే..." హోంగార్డు రాజు అన్నడు.

"ఒగ నూరు యిత్తం. అంతకంటే ఎక్కువంటే యియ్యాల్ల దేలే. రేపు యిత్తం" అని ఎల్లవ్వ అంటుంటే "ఆ... గంతే సార్" గోనయ్య అన్నడు.

"ఐతెవాయెగనీ? మీ పమీలతోని నేను మాట్లాడేది ఉంది. నువ్వు ఇగరా...!" వాళ్లున్న జాగకంటె పది అడుగుల దూరం నడిసి నిలవడ్డరు. రాజు పమీల

"చెప్పమ్మా! పమీల! నేను అడుగుతున్ననని నువ్వేం అనుకోకు. నేనడిగేదంతే ఉంటుంది. ఏం ఫీలుగాకు" అని రాజు అడుగుతున్నపుడు 'సరే' అన్నట్లు తలూపుతంది పమీల.

"నీ మొగనికి ఇంక వేరే ఆడోల్ల షోకుండి నిన్ను సంసారంకు తీసుకపోతలేడా.? లేకపోతే వానికి మొగతనమున్నదా? లేదా? ఇన్నిరోజులు సంసారం మంచిగ నడిసిందా చెప్పు" రాజు అడుగుతండు. నేలకు సూసుకుంట కాలి మునివేళ్లతో ఏదో ఆలోచించుకుంట పొక్కిలి జేస్తుంది.

"ఏయ్ నీకే! అడిగేది నిన్ను కాదనుకుంటన్నవా? నీకు సంసారం మీదరోకు లేదా? వానికి సంసారం జేస్తవా? జెయ్యవా? నీకు ఇంకెవదన్నా ఉన్నడా? సెప్పు నేనైతే ఇంత మంచిగ అడుగుతున్నగని ఎస్సై ఐతే ముందుగాల సిగ్గులేకుండా అడుగుతడు. నేను మంచివాన్ని. నిన్ను సూత్తుంటె నాకే జాలి కలుగుతంది" అంటూ ఓ వైపు గంభీరంగా మరొవైపు జాలిగా ద్వి పాత్రాభినయం జేస్తుండు రాజు.

"సరే! ఇయ్యాల్ల చెప్పకపోతే రేపురా? ఆలోపు నేనువోతా మీ యత్తగారింటికి" అని ఎల్లవ్వను, గోనయ్యను పిల్సి "రేపు రండ్రి"అని పంపించిండు రాజు.

"అట్లైతే అట్లనేనని యెల్లిపోయింద్రు." యింటికి

తెల్ల తెల్లారంగానే పోలీస్ స్టేషన్ కొచ్చింద్రు, పమీల, తల్లీదండ్రీ.

"ఒచ్చింద్రా! యేం అమ్మా! మీ బిడ్డ యేం చెప్పుతలేదు. మాకు ఏమన్న ఎర్కైతేనే గదా! ఏమన్న జెయ్యొచ్చేది. అడిగిందేది చెప్పుతలేదు" అని పమీల తల్లిదండ్రులతో రాజు జెప్పిండు.

"ఇగో బిడ్డా! మన కర్మమే గిట్ల కాలవడింది. ఏంగాదు బిడ్డ ఏ ముచ్చటకు ఆ ముచ్చట జెప్పాలె" అని తల్లి సెప్పింది. మల్ల పక్కకు పిల్సుకొని మల్లడుగుతండు రాజు.

"మంచిగ నడిసిందా సంసారం"

"మంచిగనే నడిసింది" లేనిపోని అడ్డమైన ప్రశ్నలతో అడిగి అడిగి సంపుతండు. అప్పటికి పొద్దున తినిరాకుంట వొచ్చిన పమీలకు ఆకలైతంది. ఆ ఆకలిని జూసిన రాజు పార్సల్ దెచ్చి, అన్నివిధాల వెడ్తుండు. ఇట్లా! రొండు మూడు రోజులకు ఒకసారి పిలుస్తండు. పమీల అయ్యవ్వకు తిండికి, టిఫినికి పైసలిత్తండు రాజు. ఒకరోజు పమీల భర్తను తోలుకొచ్చిండు. వాడిని అడిగితే ఏది పురాగ జెప్పుతలేదు. వీడికి

నాలుగు దెబ్బలేస్తే నిజం దెలుస్తది. పమీల ఎత్తులు, తానేసిన అడుగులు, అందు కోసం ఖర్చులు. ఏం కాను? అనుకొని మల్ల రెండుమూడు రోజులకు రమ్మన్నడు. "సరే" అని పోయిండు పమీల భర్త పర్షరాములు.

"ఏమయింది సారు? మా పంచాది ఏడిదాక వొచ్చింది? ఏం జెప్పకపోతిరి. జ(ర కానియ్యిరి" అని ఎల్లయ్యన్నడు.

"మొన్న మీ అల్లున్ని పిలిపిచ్చి మాట్లాడినం. అంతా మీ బిడ్డదే తప్పనట్లుగా మాట్లాడుతండు వాడు. మీ బిడ్డనే పురాగ జెప్పుత లేదు. ఎస్సై ఏమో కేసు ఎంత దూరమొచ్చిందని మమ్ముల సొట్లవెట్టండు. మీ బిడ్డ ఏం జెప్పుతలేదు." రాజన్నడు.

"మా మీదికి తింపిండా వాడు. వాని మొందారం తెగ" కోపాన్ని కక్కింది ఎల్లవ్వ.

"దా...ఇటురా పమీల. నిన్న మీ ఆయనో విషయం జెప్పాడు. లోపలికి తీసుకవోయిండు. లోపట రూంల నీకు వేరే ఎవనితోటో సోపతి ఉందాట గదా! నిజమేనా?" రాజన్నడు.

"లేదు లేదు, అమ్మతోడు ఏ యిమానమంటే ఆ యిమానం. ఏ పమానమంటే ఆ పమానం జేత్త సారు. నేను అసొంటిదాన్ని గాను సారు." గంటకు వందసార్లు కొట్టుకుంటున్న గుండెతో మొస తీసుకుంట సెప్పుతంది.

"నాకు దెల్వదా...? పమీల గంతగనం ఎందుకు బాధ పడ్తన్నవ్" అని యీపుల నిమురుకుంట "ఊకో..ఊకో" అంటండు. ఇటు అటు బాధతో కండ్లల్ల నీళ్లు జల జల రాలుతుంటే దగ్గరికి, సంక కిందికి తీసుకొని పమీల జాకెట్ల నుండి పొడుసుకొస్తున్న చాతిని సందులేకుంట ఆనిచ్చుకొని "ఏడవకు ఏడవకు" అని ఓదార్చుతున్నాడు.

"ఛీ ముండాకొడుకా! చెల్లె అసొంటి దాన్ని కాదుర. నన్ను ముట్టుకుంటన్నవ్ బాడుకావ్" అని అంటున్నపుడు చెంప ఛెల్లుమనిపించాడు రాజు.

"నా కోరిక తీరువు. లేకపోతే నేను ఇండ్లనే బలాత్కారం జేస్త." అని రాజన్నడు.

"వొద్దు వొద్దు నీ కాలుమొక్కుతా...నన్నేం జేయ్యకు నాకు దూపైతంది. జ(రని నీళ్లయ్యి" అని బతిలాడితే "నేను జెప్పినట్లు యింటనని అను లేకుంటే నీ గతి ఇంకా కష్టమైతది." అని రాజు అన్నడు.

"నేను సచ్చినా సరే! మా పర్షయ్య గాకుంట ఇంకొగలకు నా బొక్కలు

కిందేసేది లేదు.”

“లేదు. పమీల! ఉట్టిగనే అన్న ఉట్టిగనే కొట్టిచూసిన. మేం నిజం చెప్పడానికి ఎన్నో రకాలుగ ఇట్ల జేస్తం.” అని చెప్పి కొకకోలల విస్కి కలిపి యిచ్చిండు రాజు పమీలకు ఎర్కలేకుంట. గట గట దాగింది పమీల సోయి దప్పుతున్నపుడు. రాజు మెల్లగ మెల్లగ పెయి పునుకుతండు. జాకీట్ల ఉక్కులు ఊడదీత్తండు. ‘ఆ మత్తుల పమీల పర్షయ్య ఇద్దరు కల్లుతాగినపుడు జేసిన సంతోషం యాదికొచ్చింది. ఇపుడు ఏడాది నుంచి దూరమున్నా గిన్నొద్దులకు మల్ల కలుస్తున్నమా..?’ అని పమీల అనుకుంటంది. నిమురుతున్న పాలిండ్లను, ముద్దులతో నింపుతున్న తనకు ఉద్రేకం ఆపుకోలేక తనకోరికను విచారణ పేరుజెప్పి విధ్వంసం జేత్తండు. మైకంతో పమీల. కోరికతో రాజు. పాములు పెనవేసుకుంటున్నట్లు అలుముకుంటండ్రు కోరిక తగ్గింది. అవసరం దీరింది. రాజుకు అలసటొచ్చింది. ఒంటిమీదున్న దుస్తులను సరిజేసుకొనే స్థితిల లేదు. రాజు బయటికి వొచ్చినపుడు పీసి ప్రకాశ్ దొరికిందిదే పరమార్థం అని అనుకున్నడు. విచారణరూంల సజీవ శిల్పంలా, సోయితప్పి రతీదేవిలా వెల్లకిల పడుకొన్నది. ఆకలిగొన్న పులికి కష్టపడకుండ దొరికిన లేడిలాగున్నది. అపుడు ప్రకాశ్ కోరికలు కట్టలు తెంచుకొని ఉప్పెనలా లోతట్టు ప్రాంతాన్ని ముంచెత్తుతున్నపుడు. మైకంలో పర్శయ్యతో పొందిన సుకను గుర్తుకు దెచ్చుకుంటంది. ఇద్దరు రాజు, ప్రకాశ్ కుతిదీరా కసిదీరా తమ కౌరానికి, మగతనానికి పూర్తిగ పని జెప్పిండ్రు. గంట సేపటికి క్యాలికి వొచ్చింది. ‘గపుడు సోకం బెట్టుకొని ఒక్కతీరుగా వొలపోత్తంది. ఈని మొగతనం శెదలు దిన. నీయక్క జెల్లెండ్లైతే గిట్లనే సేత్తరారా? న్యాయానికి వస్తే అన్యాయమైపాయె బతుకు. అంటూ అర్థగంట సేపు విచారణరూంల ఏడుస్తూనే ఉంది. టైపిస్టు శీను విచారణరూంల కొచ్చి “ఓ...ఏం ఏడుస్తున్నవ్. ఇంకేమన్న గావన్నా? ఇది సాలలేదా...?” అని బెదిరించిండు.

‘ఈల్ల బలుపు బండల్లవోను ఇంకెట్ల అంటుండ్రో సూడు. వీని యాలి ముండమొయ్య’ ఇంక గావాల్నా అంటండు ఈల్ల సేతుల్ల జెట్టలు పుట్ట. నరుప్పులు వుట్ట” అని తిట్టుకుంటున్నపుడు.

“జర్గిందంత మర్చిపో...! ఈ ముచ్చట నీ మొగనికి ఎర్కయితే యిపుడు కాయిదం యిస్తాంటడు. మారుమనం పోతాన్న ఎవడు దీసుకపోడు? గందుకే గమ్మున ఊకో” అని టైపిస్టు శ్రీను అన్నడు.

బట్టలు సదురుకొని స్టాప్ టాయిలెట్లకు వోయింది. ఎప్పటోలే

ఏడుచుకుంట, లోలోపల కుమిలి వొత్తన్న బిడ్డని చూసిన ఎల్లవ్వ పక్కున పల్గి యేడ్చింది. తల్లిబిడ్డల్ని జూసిన ఎల్లయ్య అన్ని సొచాంచికొని ఒక్కతీర్గ ఏడస్తండు. గాలి ఊపుతున్న సెట్లు, తెంబకు తెంబకు సూత్తన్న గుంపులు "ఏమయిందేమయింది?" అని అడుగుతుంటే "ఈమె పెనిమిటి తీసుకపొమ్మంటే తీసుకపోతలేదని కేసువెడితే, ఈమె పెనిమిటి పోలీసోల్లకు పైసలు వోసి ఈల్లనే కొట్టిపిచ్చిండట గందుకే ఏడుస్తుంండ్రు" అని ఆగుంపుల ఈల్ల గురించి చెప్పింది ఒకామె.

ఇరువైరోజుల తర్వాత ఎస్సై బదిలి కాగానే పాత రికార్డులు కొత్త ఎస్సై మర్రేసి మర్రేసి సూత్తుంటే, పమీల కేసు దొరికింది. యెంటనే సుబ్రమణ్యం అనే కానిస్టేబల్ తోలి పమీల పెనిమిటిని తోలుకొచ్చి ఎస్సై విచారిస్తుండు. రాజు ప్రకాశ్‌లు చూస్తుంండ్రు. ఏమి జరుగుతుందో అని.

"ఎందుకు తోలుకపోతలేవురా... నీ పెండ్లాన్ని?" భీంకరంగా అడిగిండు ఎస్సై.

"నా పాణం బాగుంటలేద్సారు." పర్షయ్య భయపడ్తూ సెప్పిండు.

"ఏమైందిరా నీకు? లాగుల తొండలు సొర్రగొడుత భే...,చెప్పు. భే చెప్పు. వాల్ల స్థానంలో ఉంటే వాల్లను, వాల్ల బాధను అర్థం చేసుకో. నీ అక్కాచెల్లెల్లకైతే నీకెంత బాధుంటదో వాళ్లకు కూడా అంతే ఉంటదికదా" ఎస్సై అన్నడు.

"ఆ" అన్నట్లు తల ఊపిండు.

"తల ఊపుడు కాదురా బద్మాష్. కరెక్ట్ చెప్పు. కరెక్ట్ చెప్పకపోతే చాలా ప్రాబ్లమ్స్ ఫేస్ చేయాల్సి ఉంటది. నీ పానంల షెటాకు మాంసం కూడా లేదు. ఆలోచించుకో. ఇబ్బంది పెట్టకు. చెప్పురా. ఫైనల్‌గా చెపుతున్న వరకట్నం, గృహహింస, అటెంప్టు మర్డర్ కేసులైతయ్. నువ్వు. నీ వోళ్ళు అందరు బొక్కలవద్దరు.చెప్పు భే చెప్పు."

"ఏమో పాణం బాగుంటలేదు. అన్ని టెస్టులు చేయించితే డాక్టర్ హెచ్.ఐ.వి. అన్నడు సార్. ఆలుమొగల సోపతి వొద్దన్నడు సార్. గందుకే నా పెండ్లాన్ని నేను అవ్వగారింటికి యెల్లగొట్టిన్సార్. గందుకే వొద్దన్న సార్. జరనన్ను తక్లీవ్ బెట్టకు సార్ ఇగో! ఇవి డాక్టర్ కాయితాలు" అని సూపెట్టిండు పర్షయ్య.

ఆ మాట వినగానే రాజుకు తన కాళ్లకింద భూకంపం వచ్చి నోరు తెరిచినట్లైంది.

అమరుల యాది

కలె మబ్బైందని బర్రెను కొట్టుకొని, సేతుల కట్టె ఇంకోసేత నెత్తిమీద గడ్డిమోపు పట్టుకొని సర్రసర్రయింటి మోకాన వత్తాంది. ఆకిట్లకు రాంగనే యింటికాడ తీర్థమోలె టీవి సూత్తుంద్రు మాదిగిండ్లల్ల పోరగండ్లందరు. ఆళ్లను జూసిన గోనవ్వ గీ పోరగండ్లు ఎపుడు గ్యానానికి వొత్తరో, ఎపుడు బాగైతరో... అరెరె చెబ్బీస్‌ఘంట టీవిల ఆట సూత్తనే వుంటరు. ఈల్ల ఆట అమ్మగాను. ఈల్ల సూసుడు సల్లగుండ. ఒక్కడు ఒయి వట్టడు. నెరినెరి మా నడిపోడు ఐతే వానిట్టమున్నట్టే సేత్తడు. వాడు జెయ్యంగనే ఈ యింటికాడ గింతమంది కటార కట్టింద్రు. వానితోటి మాకు శమున్నది. అనుకుంట బర్రెను గుంజకు కట్టేస్తంది. కాల్రెక్కలు కడుక్కొని యింట్లకొచ్చెవరకు అందరు ఒక్కతీరుగ సూత్తంద్రు. సూసెవరకు ఆటగాదు. వార్తలొత్తన్నయ్.

“గింతమంది సూత్తంద్రు ఓ ఆటగాదు సీనుమ కూడ గాదు ఎందుకు సూత్తంద్రా వారీ బాల్రాజ్” అని నడిపికొడుకును అడిగింది. వాళ్ల వాళ్ల మాటల్నుంచీ గపుడే తేరుకొని “ఏమో! పోయే మనకులమోల్లు మాదిగ దండోరోల్లు కాలవెట్టవోయి ఆ మంటల్లనే కాలిపోయింద్రటనే. గది టీవిల ఒక్కటే తరీఖ సూపెడుతంద్రు. గందుకే మనపోరగండ్లు గీడనే సూసుకుంట వున్నరు.” అని చెప్పిండు బాల్రాజ్.

‘అగో గట్లైట్లయిందిరా? అయ్యో కొడుకా! అయ్యవ్వకు ఎంత అన్యాలం జేత్తివి. కన్నోల్ల కడుపుల కార్జాలు ఎంత బోర్లవడుతన్నయో...? దుక్కం ఎంత యేరులై పారుతందో..?’ అనుకుంటున్నది గోనవ్వ.

“ఓ అవ్వ ఐనె బతుకుడు కష్టమన్నరే డాక్టర్లు. ఇరువైనాల్గంటల్దాక! ఏం జెప్పరాదన్నరు. ఐనా అంతగునుసుకుంట దనుసుకుంటనైన టీవిలల్ల ఎట్ల మాట్లాడుతుండు ఎర్కేనాయే?

"ప్రాణాలైన అర్పిస్తం! ఏబిసీడిలు సాధిస్తం" అని గింత తొత్తర వొకుంట గట్టిగ మాట్లాడతండే ..." అని అవ్వతో బాల్రాజ్ సెప్పిండు.

"అయ్యో కొడుకా! ఎంత పని అయిపాయె! గంత అవుస్తమీద కూడా ప్రాణాలు పోయినా సరే ఏబీసీడిలు కావలన్నడంటే ఎంత గొప్ప వీరుడాయినె. పెడితె పెండ్లికోరుతరు లేకుంటే సావు కోరుతరు. ఓ దిక్కు జీవునం వుంటదో? వుండదో? నని తెల్సినాగని గంత దీర సెప్పుతండంటే ఆయనను కన్నతల్లిదండ్రుల పాదాలకు చేతులెత్తి మొక్కాలె. నేనైతే నా కొడుకులు, నా సంసారం నీ యిల్లు అంతమంచిగుండాలని కోరుకుంట గని ఎంత పౌరుషం కొద్ది, ఎంతధైర్యంతోటి పెంచింగ్రో గందుకు మొక్కాలె బిడ్డా! ఇంకోటి ఏ తల్లిదండ్రులుగాని తమకోసం పని చేయించుకుంటరు గని వాల్లైతే మన మాదిగ జాతికోసం గంత త్యాగం జేసేతందుకు, యిడిసి పెట్టింగ్రో గందుకు మోక్కాలె? అని, మంచికోసం పాణం ఇచ్చినోళ్లను గుండెల్ల ఈరునిలాగ గుడి కట్టి దాసుకుంటరు బిడ్డా!" అని కొడుకు బాల్రాజ్‌తో సెప్పింది అవ్వ.

టీవి సౌండ్ ఎక్కువ జేసిండు. టీవిలో ఎం ఆర్ పీ యస్ మెరుపుదాడిలో తగులబడిన గాంధీభవన్, గాయాలపాలైన యస్పిజీ పోలీస్ ఆఫీసర్, మరికొంత మంది ఎం ఆర్ పీ యస్ కార్యకర్తలకూ ప్రాణాపాయం అంటూనే వాయిస్ ఓవర్ జేస్తూ సోనియ మాటల్ని ఒకవైపు, కిరసనాయిల్ పోసి అగ్గి అంటు పెడుతున్న దండోర కార్యకర్తలు వాళ్లను, వాళ్లు జేసినప్పటి పరిస్థితికి అనుగుణంగా మాటలు. మృత్యువుకు దగ్గరైన పోలీసాఫీసర్ విద్యుక్తధర్మంలో విషాదగాద. గాయాల బాధకు చెప్పలేని అవస్థ. అవస్థను జూస్తూ పోలీసు కుటుంబ సభ్యులతో దండోరా కార్యకర్తలకు, వారి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుంట పోతుంది. వారి చర్యలను ప్రభుత్వమే నియంత్రించాలి అన్నట్టు వేడుకోలు. మరోబైట్‌లో సాహసికులు గాయాలపాలైనా ఒల్లంత బ్యాండేజ్ కట్లతో కెమరా ముందు మాట్లాడుతూ కదిలించినా నొప్పికలిగే దేహంతో మెసులుతూ, మూలుగుతూ మూలుగుల బలం మరిసిపోయి గుంజుకొని విజయ సూచిక గుర్తుతో 'V' గుర్తును చూపెట్టి "ఏబిసీడి' లు సాధించాలి. ప్రాణాలైనా అర్పిస్తాం ఏబీసీడీలు సాధిస్తాం. నా జాతి హక్కులకు నా ప్రాణంబోయినా పర్వలేదు. ఏబిసిడిలు గావాలె. నేనొక్కడిన్నే గాదు. అనేక మంది మాదిగ యువ కెరటాలు తమ నెత్తురును పారిచ్చేతందుకు, జివునాలను సుతారంగ బలి పెట్టెతందుకు, హారం అయ్యేతానికి

తయారుగున్నరు. ఖబర్ధార్ సర్కార్! ఖబర్ధార్! ప్రాణాలైన అర్పిస్తం ఏబిసిడిలు సాధిస్తం." అని సురేందర్ మాదిగ అన్న మాటల్ని కండ్లకట్టినట్లు చూపెడుతున్న టీవి. ఆ మాటలని వింటున్న మాదిగ యువకులకు శరీరం నెత్తురు సలసల కాగుతుంది. కడుపంత మసులుతుంది. అయ్యవ్వ కడుపుల ఆయాలు గదులుతున్నై. మాదిగజాతి మొత్తం అతులకుతుమై అట్టుడుకుతుందనడానికి అక్కడ మాదిగలే సాక్షం. అంతలోనే మాదిగ దండోర కార్యకర్త పొన్నాల సురేందర్ మాదిగ కుటుంబాన్ని పరామర్శిస్తూ మాదిగ జాతికి చూపెడుతున్న టీవిని చూస్తూ, మత్తడి దుంకుతున్న కండ్లు, పొగలు గమ్మిన రెటీనా పొరలు, మాట్లాడ లేక వలపోత్తున్న అవ్వ. నా అన్నా...! నా అన్నా...! అంటూ అక్కా చెల్లెండ్ల ఆర్తనాదాలు ఇంకో పక్కా ఉడుకురక్తం నినాదాల జడివానలో సునామి కెరటాల్ల నిలదొక్కుతున్న పిడికిళ్ల లొల్లి. వినబడీ వినబడని మాటలు. వినబడిందల్లా! ముక్తకంఠంగా "ఎమ్మార్పీయస్ జిందాబాద్, ప్రాణాలైన అర్పిస్తం. ఏబీసిడీలు సాధిస్తం." అంటూ మాదిగ దండోర గుంపు స్లోగన్స్.

అతి కష్టమ్మీద సురేందర్ మాదిగ తండ్రి పొన్నాల యాదయ్య మాదిగ బైట్ :".......ఓ వైయస్ రాజశేఖర్ రెడ్డీ! ముఖ్యమంత్రీ నీకొక్కడే కొడుకు. నాకొక్కడే కొడుకు. నాకొడుకు పాణం నా జాతికోసం ఇచ్చిన్నని బొచ్చెకొంటున్న బాధలో వైయెస్సూ ఈ రాష్ట్రం కోసం నీ కొడుకు పానం బెడుతవా? పెట్టకపోతె దేవుడు వెడుతడు నీకు శిక్ష..." అని చెబుతున్నపుడు టక్కున కట్‌చేసి "ఈరోజు పేరేడ్ గ్రౌండ్ మీటింగ్‌లో సోనియా మాట్లాడుతూ..." అని అంటున్నపుడు టీవి సౌండ్ తక్కువజేసిండు బాల్రాజ్.

సరిగ్గ గప్పుడే మూడేండ్ల కింద అనుకోకుండ కాలిన తన బిడ్డ మనెవ్వ యాదికొచ్చింది, మనెవ్వ వద్ద బాధను సురేందర్ మాదిగ పడుతుండని మతిల తెలువంగనే మనసులు తుపాన్‌లై "ఓ బిడ్డా! కాలిన మంటల్ల బిడ్డా! మంటలు పోట్లూ సులుకు సులుకున పొడుత్తన్నయా...బిడ్డా! నా బిడ్డా.. నన్ను కాటగలిపినట్టు బిడ్డా..! ఓ...బి...డ్డా నీ అయ్యవ్వను కాటగలిపితివా...బి డ్డా! నీ అక్కజెల్లెండ్లు బిడ్డా.. రాకీల పండుక్కు బిడ్డా! అన్నా... త..మ్మీ అనుకుంటెవలకు 'రాక' గడ్తరు బిడ్డా.." కొంగు అరచేతుల్ల పరుసుకొని మొకాని అడ్డంవెట్టి ఒక్కతీర్గ ఒలపోసుకుంట ఏడిసేదే ఏడుస్తంది గోనవ్వ.

"ఎంత ఘోరమాయెరా! కాలిపోయి ఎవలు సత్తుండ్రన్నా...మా అవ్వకు మా సెల్లెకు యాదికొచ్చి ఒకదమ్ము ఏడుస్తదిరా. జర్‌సేపు ఏడిసి ఊకుంటదిరా. అనుకుంట దగ్గరికిపోయి "అవ్వా! ఊకోయే" అనుకుంటు కొంగుతోటి దు:ఖం ఆపుతూ

ఒగ్గాలమీద కూసుండి ఊకుంచుతుండు బాల్రాజ్. వాళ్ల దోస్తుముంగట జర్రనిమ్మలమయెదాక ఆక్కడనే ఉన్నడు.

"అరేయ్. నవీ, మయి, మీరిద్దరు కిట్టుగాన్ని, అక్కడి పాతిండ్లోల్లను పెద్దోల్లను పిలుసుక రాపోండ్రి, ప్రభ, కర్ణాకర్ ప్రెసోల్లకు ఫోన్‌జెయ్యిర్రా! యిపుడు యింత గడ్డి బొమ్మజేసి రోడ్ మీద ధర్నజేసి కాంగిరేసు పార్టీని కాలవెడుదాం. ఛల్ నడువుండ్రి"అని బాల్రాజ్ అనంగనే ఎక్కడోడు అక్కడికే పోయిండ్రు. మాదిగల్నందర్నీ పిలుసుకొచ్చిండ్రు.

ర్యాలీదీసుకుంట వర్థిల్లాలి! మాదిగల ఐక్యత అనుకుంట నినదిస్తన్నరు. ర్యాలితోటి చౌరస్తాలకువోయి ధర్నాలగుసున్నరు ఆ ధర్నాకు మండల ఎమ్మార్పీయస్ నాయకులను, డివిజన్ నాయకులను సూడంగనే ఊరి మాదిగలకు ఎక్కడలేని బలమొచ్చినట్లయింది. కాంగిరేసు పార్టీని, ముఖ్యమంతిరిని సర్కారు మీద చోటా మోటా నాయకులు దుమ్మెత్తిపోత్తండ్రు. ఉపాన్యాసలు యిస్తున్నపుడు సర్రన పోలీస్ జీపు ఆగింది. చెంగన దుంకి ఒక్క జంగల మండల ఎమ్మార్పియస్ అధ్యక్షుని దగ్గరికివోయి "పెద్దమాతరి పెంటయ్యమాదిగ గారు! ఇంకా మాదిగ పెద్దలందరు వినుండ్రి. ధర్నాచేయడం ప్రజల్ని ఇబ్బందికి గురిచేయడం సరైనదికాదు. మీరు వినండి. ఇది రాష్ట్ర రహదారి. దీని దిగ్బందించడం నేరం. మాదిగ దండోర కార్యకర్తల దాడిలో మా పోలిసాఫిసరు ఆల్రడి సచ్చిపోయిండు. ఐదునిమిషాల్లో కాలీచేయాలె, లేదంటే లాఠీకి పనిచెప్పాల్సి వస్తది. మర్యాదగ పొమ్మంటున్నపుడు ఇనుండి. పెంటయ్య మీరు జేస్తున్నది న్యాయమైనా మేమేం జేయలేం కాలీజెయ్యిండ్రని" ఉకుం జారి చేసే ఎస్సై సిద్దయ్య.

"మాదిగ ప్రజలారా! మాదిగ పెద్దలారా! గాంధీభవనుల మనవాల్లకు కాలింది నిజమే గని యిపుడు మనం నేరుగా మన మాదిగిండ్లల్లకు పోయి అక్కడ మాట్లాడుకుందాం. ఈడ ధర్నా బంద్ వెడ్దాం. రేపు ఏంజేద్దామో? గది యియ్యాల మాట్లాడుకుందాం పాండ్రి"అని పెదమాతరి పెంటయ్య అనంగనే యింటి మొకాన బయలు దేరిండ్రు మాదిగ జనం. అప్పటికి రాత్రి తొమ్మిదైతుండడంతో పదిఇరువై మంది పోరగండ్లు పోషమ్మ ఆకిట్ల గూసుండి మాట్లాడుకుంటండ్రు. గపుడే పోషమ్మాకిట్ల ఎల్లయ్య "బాల్రాజ్! గీ టీవి గటువెట్టుకొని అందరు సూత్తురాండ్రి బిడ్డా!" అని పిల్సిండు.

"మనోల్లు తినెతందుకు వోయిండ్రు. తినెదాక రారు. అంతదాక మనం ఆ టీవిల ఏం జరుగుతుందో సూద్దాం! పెట్టుపోండ్రన్నా" అని బాల్రాజ్‌కు, మయేష్‌కు పనిజెప్పిండు పెంటయ్య.

"టీవి మూతిని ఆకిట్లకు మలిపిపెట్టింఁడ్రు" బాల్రాజ్, మయి పదయితంది దప్పు మోగిచ్చింఁడ్రు. అందరు వొచ్చింఁడ్రు. గప్పుడు పెంటయ్య మాదిగ వొచ్చిండు. అన్నాలారా! అందరికి దండం బెట్టి సెప్పుతున్న. ఇంతదాక మంల్ల మల్ల అదే ముచ్చట టీవిల వొత్తెనే వుంది. సురేందర్ మాదిగ, దామోదర్ మాదిగ, మహేష్ మాదిగ వీళ్లంత చావు బతుకుల మధ్య కొట్టుకాడుతనే వున్నరు. ఏదీ ఏమైన వాళ్లు పాణాలకు తెగించి, గాంధీభవన్‌ను కాలవెట్టవొయింది మామూలు ముచ్చటగాదు. అది మన మాదిగజాతి కడుపుల మండుతున్న మంటల ప్రతీక. మాదిగ జాతి కోపానికి చిన్నపాటి కొలమానం. మాదిగ జాతి ధైర్యానికి ఇది ఒక మచ్చుతునకనే గాని దురదుష్టవశాత్తు అక్కడ జరిగిందేందంటే ముందు వోయినోల్లు లోపటికి వోయి గాంచునూనే సల్లింఁడ్రు. యెనుకున్నోల్లను పోలీసులు ఆపుతుంఁడ్రు. పోలీసులు యింక ఎక్కువొస్తే ఈంత గూడా మనం అంటువెట్టం అని యెనుకున్నోలు అంటువెట్టేవరకు మంటలు లేచినయ్. గా మంటలు అంతట అలుముకున్నయ్ ముందు వోయినోళు ల్లు అండ్లనే కాలింఁడ్రు. యింతదాక కృష్ణన్న మాట్లాడిండు. విలేకర్లు అడిగిన ప్రశ్నలకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అలజడికి, ధర్నాలు, ర్యాలీలకు ఎమ్మార్పియస్ బాధ్యత వహిస్తుందా? అని అడగ్గానే ఆ అలజడి, ధర్నాలు, ర్యాలీలకు బాధ్యత వహించేది సర్కారే. ఇన్ని రోజులుగా మాదిగలు ఓపిక పట్టింఁడ్రు.యిపుడు ఎవలు జెప్పినా ఇనే పోజిషన్‌ల లేరు. ఈ సమస్యంతటకీ మూలకారణము ముక్యమంతిరి గారే నని, మాదిగలు వాళ్ల నిరసనలను వాళ్లరీతులో వ్యక్తపరుస్తున్నరు. వారిని వద్దన్నా వినే పరిస్థితుల్లో లేరు. వాళ్లని దావఖాన్ల సూడనీకి వొచ్చినపుడు మాట్లాడిండు. అంటే మాదిగ దండోర కార్యకర్తలు ర్యాలీలు ధర్నాలు చేత్తరు. మాదిగలమైన మేం చేత్తమన్నట్లే" నని అన్నడు.

రాష్ట్రకమిటి పిలుపు మేరకు "రేపు పొద్దుగాల పదింటికి ర్యాలి తీద్దాము" అందుకోసం అందరం ఉండి సక్సెస్ చెయ్యాలని అనుకొని ఎక్కడోల్లు అక్కడ, ఎవలిండ్లల్లకు వాళ్లు బోయింఁడ్రు.

గ్రామ ఎమ్మార్పీయస్ యూత్ సభ్యులైన బాల్రాజ్, మయి, కర్ణాకర్, ప్రభు... ఇంకొంత మంది ముందుండి అందరిని ఎగేస్తుంఁడ్రు. పదీటికి వరకు వచ్చుడు సురువైంఁడ్రు. పదకొండు గంటల వరకు అందరు ఏకమై ర్యాలీ దీస్తుంఁడ్రు. నినాదాలు యిచ్చుకుంట బోతంఁడ్రు. గా నడుమల పెంటయ్య మాదిగకు జిల్లానుంచి ఫోనొచ్చింది.

మాట్లాడెటాయెనె పురాగ మాట్లాడుడు అయిపోయినంక "అమరహే పొన్నాల

సురేందర్ మాదిగ! అమరహే! అమరహే!! జోహార్ పొన్నాల సురేందర్ మాదిగ. జోహార్! జోహార్!! వర్ధిల్లాలి! పొన్నాల సురేందర్ మాదిగ ఆలోచన విధానం వర్ధిల్లాలి!!" మూక్తకంఠంగా నినాదిస్తున్నారు. ఒకలకంటె ఇంకొగలు ఎక్కువ స్లోగన్స్ యిస్తుంద్రు.

పోలీసులకు ఉన్నతాధికారుల నుండి అందిన ఆదేశాల ప్రకారం ముఖ్య నాయకులను అరెస్టు జేసి, ముందుజాగ్రత్త చర్యగా పోలీస్ స్టేషన్‌లో బందించింద్రు. రెచ్చిపోయిన మాదిగ దండోరా కార్యకర్తలు విడతలు విడతలుగా రోడ్డుకడ్డంగా ధర్నాలు, బంద్‌లు జేసింద్రు. పోలీస్ స్టేషనంత కిక్కిరిసిపోయింది. దాదాపు నూటికి ఎనబైమంది మాదిగలు, మాదిగ యువకులు మొత్తం పోలీస్ స్టేషన్‌లనే ఉంచింద్రు.

"యిడిసి పెట్టుంద్రి సార్ యిడిసిపెట్టుంద్రి సార్" అని మాదిగలు ఎంతో బతిలాడింద్రు. "ఐదు గంటల దాక వొదులకుమన్నడు డీయస్పీ" అని ఎస్సై అన్నడు.

అడుగంగ అడగంగ మాదిగల్ని మూడుగంటలకు వొదిలిపెట్టింద్రు పోలీసోల్లు, "అందరు ఎల్లినంక పదినిమిషాలు మాట్లాడుకుంటా ఎవలు యిండ్లల్లకు పోవొద్దు. ఇది నా ఒక్కంది గాదు. నీ ఒక్కంది గాదు. మన జాతిది. అందుకోసం ఉందాం. ఎవలన్న కులం కట్టు దాటిబోతే కులం బాగుండది సుమా! అందరు ఉండుంద్రి" అని చెప్పిండు పెదమాదిగిఎల్లయ్య. మాదిగలందరు ఒకతాటి మీదున్నరు. పెదమాతరి పెంటయ్య మాదిగ, డివిజన్ కార్యదర్శి కనకయ్య మాదిగ ఒగొలెనుక అందరు మాట్లాడుతుంద్రు, ఆ ఊరికి అల్లుడైన ఒక సారు అత్తగారింటికి వొచ్చి, అట్లనే వీళ్ల దగ్గరి దాక వొచ్చిండు. వాల్లందరి మాటలు బాగావిని ఊకున్నడు.

పెదమాదిగి ఎల్లయ్య ఒకసారి "మల్లయ్య పంతులు మనకు, మన జాతిగురించి మాట్లాడాలె"నని పిలిసిండు. అందుకు "సరే"నని మల్లయ్య పంతులు లేసి నిలవడి సురేందర్‌మాదిగ అమరుడయ్యాడని వివరిస్తూ..

అందరికీ నమస్తే జేసి మాట్లాడుతున్న. అవ్వలు,అక్కలు, అన్నలు, తమ్ములు, వరుసయెటోల్లు, అందరం శాంతంగ ఉందాం. తెలువని ముచ్చట్లు ఏమున్నా తెల్సుకుందాం. మనం అద్దగంట నుంచి మాట్లాడుకుంటనే ఉన్నం. పొద్దటి నుంచి మీరేం తినలేని ముచ్చట నాకెరుకె, ఐనాగని మన కోసం మనం ఓపిక పట్టాలె. యియ్యాల పొన్నాల సురేందర్ మాదిగ ఎవలకోసం, ఎందుకోసం, ఎట్ల సచ్చిపోయిండనేది మనకు మనమే ప్రశ్న యేసుకోవాలె. ఐనె సచ్చిపోయింది వాళ్లయ్యవ్వ గెట్టుకాడ దెచ్చిన పంచాది కోసం కాదు. గిచ్చి కయ్యం పెట్టుకొని సచ్చిపోలే. బగ్గతాగి సోయితప్పి మోటర్‌కిందనో? ఇంక దేనికిందనో పడలే. నల్లకాడి పంచాదిల నడమకు

వోయి జగడందేలే. దాదగిరి జేసి వాన్ని వీన్ని కడుపుగొడితే ఎవడో పగదీర్చ సంపలే. కోట్లాటకు వోయిండు. ఐన సచ్చిపోయింది మన జాతికోసం. నాయంకోసం. మనజాతి హక్కులకోసం. నియ్యతికి నిలవడి కయ్యానికి వోయిండు. వంచనొద్దని పంచాదికి వోయిండు. చెయ్యాలనుకున్న పంచాది సెయ్యవోయిండు. చేసిన కాడనే చెల్లిపోయిండు. కొరిజీవునాల్తోటి "ప్రాణాలైనా అర్పిస్తం. ఏబిసీడీలు సాధిస్తం" అని గట్టిగ చెప్పిండు.

పరిస్థితుల్ని బట్టి అప్పుడప్పుడు ఓపికలేక మనం ఏదన్న ఊరికో పల్లెకో వోతూంటే పుసుక్కున పోటురౌతు తాకిందనుకో 'అవ్వ! ఏం ఊరు పాడువడ్డది పోతాని అనుకున్నమోలేదో గిట్ల ఆటంకమాయే' అనుకుంటం. పెడితె పెండ్లి లేకుంటే సావుగోరుతం. జీవునం బోంగ కూడా చెక్కు చెదరకుండ మాట్లాడుతండంటే మనజాతిపట్ల మనపట్ల ఎంత నీతి ఉందో, నమ్మకముందో మనకర్థమయితంది. యుద్ధంల సచ్చిన వీరునికి వీరమరణం దొరుకుతదంటరు. మాదిగల కోసం సచ్చిన సురేందర్‌మాదిగ మన గుండెల్లో నిలిచిపోతడు. ఆయనకేగాదు మన జాతికోసం మరణించే వీరుల గుడి మనజాతి గుండెలే. అని అంటుండంగా

"అమరహే! పొన్నాల సురేందర్ మాదిగ అమరహే!! అమరహే!! జోహార్! మాదిగ జాతి అమరవీరులకూ జోహార్! జోహార్‌లంటూ నినాదాలు అందరు కల్సి ఒక్క తీరుగ యిస్తండ్రు" మల్లయ్య పంతులు ఆగుండ్రాంగుండ్రి.

చేతులతో సైగ జేసుకుంట ఓదార్చిండు. ఇంకో విషయం మనమ్మాట్లాడుకోవాలె. అమరుల ఆశయాలకు దీటూగా మనం పనిచేయాలె. సురేందర్ మాదిగ ఆత్మంటూ ఉంటే లేచివస్తే మనతో ఏమంటదో తెలుసా? నాకు తోచిన కాడికి చెప్తుతున్న. మీకు ఎంతవరకు నిజమనిపిస్తదో తెలువది.

ఇగ సురేందర్ మాదిగ ఆత్మ.

నా జాతి కొడుకులారా! బిడ్డాలారా! అవ్వలాల! అయ్యలారా! మమ్ముల ఊకే పొగడొద్దు. మమ్మల్ని, నాపేరు వెట్టి గాకుంటా మాదిగ దండోర జండలాగా మాదిగ పల్లెల్లో, మాదిగ వాడల్లో, మన వీధులల్లో ఎగురేయండ్రి. గుడిసెలమీద, పెంకుటిండ్ల మీద, బంగులల మీద, జండపాతుండ్రి. మనజాతి ఆత్మగౌరవముతో రెపరెలాడుతూ ఉంటం. మనపాలిట, మనకు మోసం జేసిన రాజకీయ పార్టీ ఆఫీసును కాలవెడుతూ కాలిపోయి, ఎక్కడికక్కడ పచ్చెలూడిన నా శరీరాన్ని బొందవెట్టకుండ్రి. చితిమంటల్లో కాల్చకుండ్రి, నల్లటి చౌరస్తాలో నాలుగు రోడ్ల కూడలిలో మాదిగ దండోరా జండాగా ఎగురేయిండ్రి. జాతికోసం, జాతినీతికోసం, నినాదాలిస్తున్న మీ కీకెలకు

గాల్లో చెయ్యెత్తి సెల్యూట్ నిత్యం జేస్తుంటం. సురేందర్ అనుకుంటుండొచ్చు." అని మల్లయ్య పంతులన్నపుడు

"వర్ధిల్లాలి మాదిగ, మాదిగ ఉపకులాల ఐక్యత. వర్ధిల్లాలి! వర్ధిల్లాలి!! నినాదాల జోరైంది."

సురేందర్ మాదిగలాగ ఎవరు ఆవేశాలకు దయచేసి లోనుకావొద్దు. పోయిన అంతటి వీరుడు పుట్టేవరకు ఎంత సమయం గావాలి? మాదిగ యువకులారా! రాజ్యాంగ బద్ధంగా నిరసనలు, నిలదీతలు చేద్దాం. సురేందర్ మాదిగ అన్నగారు వాళ్ల కుటుంబానికి లేని లోటు మనమెవరమూ తీర్చలేము.

యువకులారా! మీరు పిల్లర్ల వంటివారు. ఒక్క కుటుంబానికే గాదు జాతికన్న విషయం కూడా మరువరాదు. యిది మొదలు పెదరమాసకు మనపెద్దలను యాదుంచుకున్నట్లు మన మాదిగ పెద్దగా ఎప్పుడు సురేందర్ మాదిగన్న గార్ని యాదికి చేద్దాం. యాది తెచ్చుకుందాం. ఇకపోతె ఎమ్మార్పీయస్ యిచ్చే ప్రతి పిలుపును ప్రతిఒక్కరు అమలు చేయాలని కోరుతూ నావంతు పాత్ర పోషిస్తనని సహృదయంగా సెలవు తీసుకునే ముందు సురేందర్ మాదిగను కన్న అయ్యవ్వ పాదాలకు దండం బెడుదాం.

మాదిగ అమరవీరుల తల్లిదండ్రులందరికి మొక్కుదాం. వారి ఆశయాలను కొనసాగిద్దాం. అందరొకసారనుండ్రి గట్టిగ అమర్‌హై పొన్నాల సురేందర్ మాదిగ. అమరహై! అమరహై!! జోహార్ మాదిగ అమరవీరులకు జోహార్! జోహార్!! అందరు మూకుమ్మడిగా అన్నరు.

అప్పటిదాకా మనకు నో సెలవంటూ మల్లయ్య పంతులు ఉపన్యాసం ముగించిండు. పెదమాతరి పెంటయ్య మాదిగ లేసి రాష్ట్ర కమిటి పిలుపుకు అందరు భాగస్వామ్యులు కావాలని కోరుకుంటూ అందరికి దండాలు. అమ ర వీరులందరికి జోహార్లు అర్పిస్తూ, అమరుల ఆశయాలకు అనుగుణంగా ఐక్యతగా పోరాడుదామని, వర్గీకరణ సాధిస్తామని ప్రతిన బూనారు. గోనవ్వ కళ్లలో సంతోషం తడి ఉబికింది.

సావు

ఫోన్ రింగయితంది. రింగవుతున్న ఫోన్‌ను చూస్తుంటే ఏదో దుర్వార్తను మోసుకొచ్చినట్లుగా అనుమానం కల్గింది. ఫోన్ ఎత్తుదునా? వద్దా? అనే అనుమానంలో ఫోన్ అందుకున్నడు కరుణాకర్. ఏమైంది? ఎన్నడు ఫోన్ చేయని వ్యక్తి ఫోన్ చేస్తుండేంది? భయం భయంగా "హల్లో..." అన్నడు కరుణాకర్.

అటువైపు నుండి "హల్లో పిల్లగా కరుణయ్యా! పెద్దమ్మ చనిపోయింది."

"ఎప్పుడ బావా!"

"ఇపుడే పది పదిహేను నిమిషాలైంది" అన్నడు.

కనకయ్య అదుర్థాతోటి "అబ్బా! ఎంత పని అయిపోయెనే బావ. ఇంతమాయెల్లమే చనిపోయిందా? ఇంకా కొన్ని రోజులు బ్రతుకుతదేమో అనుకుంటిమి." అన్నడు కరుణాకర్. "చావుకు లేతా? ముదురా? అంతకుముందే ఆయెపోయే పానాల మీదుండె. జరిగేదేదో జరిగిపోయింది. జరిగే కార్యగతాలు జరిగించాలె. పెద్దమ్మ ఎట్లాగో చర్చిల బాప్తిస్మము తీసుకుంది గదా! సావు కూడా కీరస్తన్ల చేయుండ్రి. మేమైతే శవాన్ని ముట్టం పట్టం. ఆ చర్చివాళ్లకు పోయి చెపుతవా? ఫోన్ జేస్తవా? ఆళ్లనే రమ్మను. చావు వాళ్లనే చెయ్యుమను. ఉంటున్న జల్దిరా!" అని కనకయ్య ఫోన్ పెట్టిండు.

'ఎంత పని జరిగిపోయె. పాడురోగమొచ్చే. వచ్చిదంటే వడిసెదాకా వదులకపాయే. తలసుట్టుగడ్డలాయే. సేపు అంత గడ్డలు నెత్తిసుట్టు సూడ గోరమాయె.

కన్నుకు క్యాన్సర్ సోకి సపోట పండుకంటే పెద్దగయి ఆ గుడ్డులోంచి సీమునెత్తురు కవుసవట్టే. కంపువాసన గొట్టవట్టే. రూపాన్ని చూస్తే భయపెట్టే తరీఖ ఆయిపాయే. ఆమెకు ఎన్మాముందు ఎవలు లేకపోయిరి. ఎట్లా? మందిపిల్లలు వాళ్ళువీళ్ళు అందరు చేతులు ఎత్తేసి మొఖం సూపెడ్తలేరైరి." అనుకుంటూ తనలో జరుగవోయేదెట్లా ఆలోచిస్తూ పాస్టర్ దగ్గరికి బయలుదేరిండు.

సువార్త మీటింగ్‌లా పాస్టరన్న వాక్యం అందిస్తున్నడు. చేయి సైగలతోటి పిలిస్తే పాస్టరక్కకు ఎరుకకాంగానే మందిరం బయటకొచ్చె. 'ఏమైందన్నా!" అని అనగానే "అక్కా! కరుణవ్వ(గోనవ్వ) చనిపోయింది" అని నీళ్ళు నిండిన కళ్ళతో చెప్పేకరుణాకర్. "ప్రభు పిలుచుకున్నపుడు ఎవరైనా పోవల్సిందే? బాధపడుడు ఎందుకన్నా? వాళ్ల కులపోల్లు, పాలివాళుఏమన్నరన్నా. ఏ సావు చేద్దామన్నరు.? మనదేవున్ల చావా? వాళ్లచావా?" అని అడిగింది.

పాస్టరక్కా "వాళ్ళైతే ఆమెను ముట్టుకోవటంగాని పట్టుకోవటంగాని చేసేటట్లు లేరక్కా! ఎట్లవుద్దో చూద్దాం అన్నట్లు చూస్తున్నరు. ఫోన్‌జేసిన కరుణవ్వ మరిది కొడుకు మన దేవున్ల చావే చేయుమన్నడు. ఎవలు ముందుకొచ్చెటట్లు లేరు." అని పాస్టరక్కతో కరుణాకర్ అన్నడు.

"సరే అన్నా! సంతోషం. మనం చేద్దాం దేవుని కార్యం. ఏం భయపడకన్నా. నేను ఇలాంటి పేషేంట్‌లు హెబ్రోన్ (హైద్రాబాద్ సంఘం)లో చాలా చేసిన. సువార్త సాక్ష్యం అయిపోగానే పాస్టరన్నను త్వరగా పంపించేస్తాను. సంఘస్తుల మందరం ఆటోల్లో వస్తం. ఏది ఏమైన అంతిమ కార్యాలను జరిపించేద్దాం. చాలా ప్రాబ్లమ్స్ కావచ్చు. ఎందుకైనా మంచిది ఇవాళే చేసేద్దాం. వాళ్ళెవరు సహాయం చేయకున్నా అన్నీ మనం చేసుకుందాం. సరే ఏర్పాట్లు చూసుకొండి అన్నా!" అని చెప్పి మందిరంలోకి వెళ్ళిపోయింది.

లోపలికి వెళ్ళి ఇమ్మానుయేలుని పిలిచి అంకుల్‌కు చెప్పు. కరుణవ్వ చనిపోయిన విషయం చెప్పి పాస్టరన్నకు చేరవేసింది. ఆరోజు యథాలాంగా రోమాపత్రికలోని వచనం బోధిస్తూ క్రీస్తు ప్రేమనుండి ఎడబాపు వాడెవడు. వస్త్రము కంటే దేహము, దేహము కంటే ప్రాణమును గొప్పవి కావా? అనే మరో వచనం. మనపౌరస్థితి పరలోకమునందున్నది అనే వచనాల ఆధారంగా పాస్టర్ ప్రసంగం సాగుతున్నపుడు ఇమ్మానుయేలు పోయి చీటిపై వ్రాసి జరిగిన విషయం తెలియజేశాడు.

ఒక్కసారి పాస్టరన్న చీటిచూసి "బ్రతుకుట క్రీస్తే చావైతే నాకెంతో మేలు" అన్న అపోస్థుల పౌలు జీవితాన్ని వివరిస్తూ ఈ రోజు మన సంఘం నుండి దేవుని బిడ్డకు పౌరస్థితి (ప్రమోషన్) పరలోకం దొరికినది. అవసాన కాలంలలో ఎంతో ప్రయాసపడుతున్న గోనవ్వను దేవుడు రక్షించుకున్నాడు. అందుకామె నమ్మి బాప్తిస్మము పొంది, దేవునిపట్ల ఎంతో శ్రద్ధాసక్తులు కలిగి ప్రభువునందు నిద్రించినది అని తెలుపుతున్నాను. మనం త్వరగా ముగిద్దాం. వెంటనే వెళ్ళి ఆమె సమాధి కార్యంలో సంఘంగా మనం పాలుపంచుకుందాం. ఆమెతో మనమందరం ఎంతోప్రేమతో దేవుని కృపను పరస్పరం పంచుకున్నాం. ఆమెకు ఆమెవాళ్ళు ఎవరు సహకరించనపుడు అన్ని విషయాల్లో తోడున్నాం. మనం సహోదరి సమాధి కార్యక్రమం వెళుదాం. అందరు రావాలని ప్రభుపేరిట కోరుతున్నా"నని పాస్టర్ జాషువాగారు ప్రకటించి ముగింపు ప్రార్థన చేసి మరో సహోదరుని వెంటబెట్టుకొని ముంద్రాయికి వెళ్ళాడు. అక్కడి పరిస్థితులను గమనిస్తే ఎవరు బాధ్యత తీసుకునేటట్లు లేరనిపించింది. కరుణాకర్ అందరికీ, చుట్టాలకు బంధువులకు ఫోన్‌జేసి చెబుతూ సంబంధిత వస్తువులను కొనుగోలు చేసుకొని వెళ్తున్నాడు.

కరుణాకర్ ఊరు దగ్గరికొస్తున్నందుకు కళ్ళలో దు:ఖం ఊరుతోంది. తెరలు తెరలుగా పొంగుతుంది. ఎంతబాగా చూసుకునేది. ఊళ్లె చెరువుల చేపలు పట్టినపుడు కొర్రమీనును పట్టుకొచ్చి మా అల్లునికి పానమని తెచ్చేది. ఆపతికి సంపతికి ఎంతబాగా తోడుండేది. తలపోసుకుంటూ వెళుతున్నాడు. దగ్గరికి పోయేకొద్ది ఏడుపు ఎగతన్నుకొస్తుంది. ఎంతో మదనపడి ఏడుస్తున్నాడు. మామ మీదపడి, తలుచుకొంటూ ఏడుస్తున్నపుడు చూసెతందుకు వచ్చిన చాలా మంది ఏడుస్తున్నారు.

"ఎంతసేపు ఏడుస్తవ్ బిడ్డా! మీ మ్యానత్త వస్తదా కరుణయ్యా! ఊకో...ఊకో..." అంటూ ఊకుంచి పక్కకు పిలుచుకపోయి

"జర ససు జర ససు జరుగవోయేది చెప్పు" అని ఎల్లయ్య అడుగుతున్నడు.

చూసెతందుకు వచ్చిన వాళ్ళలో చాలామందిలో చాలా రకాలుగా మాట్లాడుతున్నరు. ఆయిన వాళ్ళ మ్యానత్తను భూమి పుట్టిన కాడిదాక తింపుకొచ్చిండు. పట్నం తీసుకపోయిండు. ముస్తాబాద్ తీసుకపోయిండు. కరుణాపురం తీసుకపోయిండు. తీరొక్క జాగల్లకు తీసుకపోయి తింపిండు. అందులో నోట్లెమాట బయట పడకుంట పైస ఫలం అంతావానికే తెలుసు. ఒక్కొకరు ఒక్కోవిధంగా

మాట్లాడుకుంటున్నరు. వానికేం తెలుసు ఉన్న పైసలన్ని తనకే ధారవోసుకున్నది... అని కొందరు.

"నేనేమి చెప్పుతనే మామ. మామెట్ల చెప్పుతె గట్ల జేద్దాం సావు? గోనవ్వ దేవున్ని నమ్ముకునే మన సావు జెద్దామా? కిరాస్తన సావుజెద్దామా? ఏది అంటావో అను. నువ్వనే దానిమీదికేలి జరుగవోయే కార్యం చేద్దాం." ఎల్లయ్యన్నడు.

"అన్నా నేనేం జెప్పాలె. బీరాకు పసరు కాన్నుంచి నీకు తెలువందేముంది? మాట్లాడిచ్చెతందుకు వచ్చినోడు లేడు. తొంగిచూసినోడులేడు. మర్రి చూసినోడులేడు. యియ్యాల్ల సచ్చినంక తీసుకొచ్చి బయట పారేద్దామనుకుంటే ఎవలురాలె. నువ్వొచ్చిన కాన్నుంచి కూడా సూత్తన్నవ్ గదా! ఎవలన్నా వొచ్చిండ్రా? ఏడుసుకుంట ఉన్న నన్ను ఓదార్చాలె. ఓదార్చెతందుకు రాలేదు. పీనుగు సూసెతందుకు రాకపోయిరి. ఎవల్ని బతిలాడాలె. ఏమని బతిలాడాలె. వాళ్ళకు తెలువదా? అద్దైతే నడుమంత్రాన దేవున్నమ్ముకున్నది. చెర్చివాళ్ళు అపుడో ఇపుడో వాళ్ళే వచ్చిండ్రు. ప్రార్థన జేసుకుంట మంచిచెడ్డలు సూసుకుంట పోయిండ్రు. ఇయ్యాల్లకూడా యేసుమతపోల్లు జెయ్యాని. ఎందుకంటే ఇప్పటికే వాసన కొడుతంది. సూడ భయంకరంగుంది. దేవుల్లనే సావు జెయ్యిమంటున్న" అని నర్సయ్య అన్నడు.

ఇవ్వన్ని చెపుతున్నపుడు తమ్ముని కొడుకు కనకయ్య. నర్సయ్య చిన్నాయిన కొడుకు మల్లయ్య అందరున్నరు. ఈ పాలివాళ్ళు ఆ పాలివాళ్ళు కూడా అందరున్నరు.

"ఔరా! నర్సా! మీ తమ్ముడు ఏమన్న అంటడా ఏంది? నేను రాకముందు ఎట్ల జేసిండ్రు అంటె ఎట్లా?" అడిగిండు ఎల్లయ్య.

"పొద్దుగాల తొమ్మిదీటి నుంచి పోన్ జేత్తన్నం. ఆయెపాయే జీవునాల మీద ఉందని చెప్పినం. ఇప్పటి వరకు రాకపాయే. మా మరుదండ్లు వచ్చిరి కని వాడు రాకపాయే. దండి దూరముందా? మన పక్కూరు మూడు కిలోమీటర్లేనాయే. రావాలనుకుంటే ఎంతసేపు. వాడేమనడు. ఏమన్న అంటే నేనున్న. మీరు జేసేది చెయ్యిండ్రి" అని నర్సయ్యన్నడు.

ఆఖరుసారి చూసెతందుకు వచ్చిన లింగరెడ్డి "నర్సయ్యన్నది మంచి మాట. ఇయ్యాల ఒడి బియ్యాలు పోసుకునేది ఉన్నది ఊల్లె. సుట్టాలు బంధువులు వచ్చిండ్రు. దుర్గమ్మలు, బాలమ్మలు చేసుకునేటోల్లు ఉన్నరు. సందపీనుగు కాక ముందు తీసెయ్యిండ్రి ఇపుడు ఐదైతంది. గంటల బొందతోడుతరు. ఏడుకాని, ఎనిమిదికాని

రాత్రి సందం జెయ్యిండ్రి. బీమారి పడ్డ మనిషి చూసినోల్లకు మంచిది కావాలె. చేసినోల్లకు మంచిది కావాలె. తెల్లారితే శవం పట్టరాదు ముట్టరాదు. జెల్ది జెల్ది చెయ్యిండ్రి"

"అంతే! ఏ సావు జేద్దామన్న దానిమీద ఆగినం. ఎంతసేపు జేస్తే? దేవునిసావు పెట్టేనాయే. ఏమంటవురా కనుకా? మల్లయ్యా?" అని అడిగిండు ఎల్లయ్య

"ఓ...అన్నా! ఎట్లా జరిగితేందే? పని జరుగాలె" అని మల్లయ్య, "కార్యగతాలు ఎల్లిందే ముఖ్యం" అని కనకయ్య అన్నడు? "అట్లయితే ఆ తలారోన్ని పిలువు" అనంగనే "నేను ఇక్కన్నే ఉన్న" అని తలారి రాజు అన్నడు. "బిడ్డా! రాజు బొందతోడు. మేము వొచ్చి సూపెడుతం. కరుణాకర్ పాస్టర్‌కి జెప్పి పార్థన జేయించు. పెట్టే ఇంకా ఆ సావుకు ఏమేం కావాల్నో అవ్వన్ని తెప్పియ్యిండ్రి. ఇగజేసేద్దాం. కానియ్యిండ్రి." అని ఎల్లయ్యన్నడు. అపుడే బొంద తోడడానికి పోయిండ్రు. కర్నాకర్ చుట్టాలకు ఫోన్‌జేస్తుండు. పెట్టెకొనుక్కరమ్మని పంపించిండు. సమాధి కార్యానికి కావలసిన అన్నీ తెమ్మని సంఘు విశ్వాసిని పంపించిండు. అలా సమయం అద్దగంట దాటిందో లేదో? కర్నాకర్ బొందతోడెటోల్లకు ఫోన్ జేస్తే "మీ కనకయ్య గిట్ల వద్దన్నరు. మొదలే పెట్టనియ్యలేదు. ఎంత అయితదన్నా" అని ఎదురు ప్రశ్నయేసిండు తలారి రాజు. కర్నాకర్ ఒక్కసారిగా కంగుతిన్నడు. బొందతోడుత లేరట. బొందకాడ్కి పోయినా వద్దన్నరట ఏందిది? ఏం కులమిది? మాటంటే మాటుండాలె కని ముందో మాట యెనుకో మాట ఉంటాది?" అని అన్నది.

కర్నాకర్ భార్య లీల "ఓ అయ్యా! గోనవ్వ మరిది కొడుకు తోటి వాళ్ళు తలకొర్రాయి పెట్టిస్తరట. ఈ ఇల్లు, వీళ్ల ఆస్తిమీద వాళ్ళకు హక్కు పుడుతదట. ఇక్కడ ఆడోళ్ళ అనుకుంటే నేను విన్న. ఈ వూరి మనుషులు ముందుకి తోలి వెనుక కొంకులు తెగ్గొడుతరు. నువ్వెందు కంటివి దేవుని సావు" అని గట్టిగ అన్నది.

"నేనేమన్ననే? మామా చెప్పిందాని మీదికేలి ఎల్లయ్య మామగిట్ల దేవున్ల సావు జెయ్యిమనిరి. అంత అయినంకా ఇపుడెందుకు ఇట్లా? గూళ్ళు గూళ్ళు కదుతండ్రో నాకర్థమయితలేదు.

"బావా యిటు రండ్రి" అని దూరంగా ఉన్న కనకయ్యనుపిలిచాడు. వచ్చిరాగనే అతినెమ్మదిగా "బావా బొందతోడుతలేరా?"

"తోడుతలేరు" "ఎందుకు?"

"మా నర్మెట రాజయ్య నాయిన రావాలె. అయినె వచ్చెదాక ఏం జేసేదిలేదు."

"మీరంటేనే కదా! నేను పెట్టెకు ఆర్డరిస్తి. మా సుట్టాలకు ఇయ్యాల్ల రాత్రె సావు అయితదని చెప్పితి. అన్నట్లే వాళ్లందరు రావట్టిరి. గోనెపల్లివాళ్ళు, నర్మెటోల్లు,ఆ వూరోల్లు, ఈవూరోల్లు అందరు రానేవట్టిరి. మీరు ఎందుకు వద్దన్నరు? ఎట్లా వద్దంటరు?" అని అడిగిండు.

"మా చిన్నాయిన వచ్చేదాక తీసేదిలేదు" అని కనకయ్య అన్నడు. "పెట్టెకోసం ప్లైవుడ్ చెక్క తీసుకొని వత్తుండ్రు. యిపుడు యియ్యాల్ల కాదంటే ఎట్లా? రాజయ్య తోలుక రావటానికి బండ్లు ఉన్నయి. ఆటోలున్నయి. జరిగే కార్యం జరుగ నియ్యిండ్రి. ఆలోపు మామను తోలుకోద్దాం." అని కర్నాకర్ అన్నడు.

"లె,లె, రాజయ్య నాయిన వచ్చినంకనే లెక్క" మొండిగా వాదిస్తున్నడు.

"ఏ కనుకయ్య నీది నాలుకనా? తాటిమట్టనా? ఎట్ల ఒప్పుకుంటరు? మల్ల ఎట్ల వద్దంటరు? రాజయ్య మామ వచ్చెదాక ఉండనీ అని ఒక్క మాట అనకపోతివి. ఇపుడేమో గంట్లు పెడుతున్నవ్? మా బంగారం పొయి అడివిల కల్సింది. ఉత్తచెత్త కోసం కొట్లాడుడు ఏంది? మీరే జేసుకోండ్రి పో. మేం పోతం. కానియ్యిండ్రి" అని కర్నాకర్ అంటండు.

కనకయ్య తల్లి యేశవ్వ "అరేయ్ కనకా! ఏం రోగం బుట్టిందిరా. నువ్వెందుకు వద్దంటున్నవురా? కర్సులు రయాలు పెట్టుకునేది వాడు. అప్పుడేం మాట్లాడినవ్? ఇపుడేం మాట్లాడుతున్నవ్? నోరా? మోరిరా నీది?" అని గదరించి పెడుతున్న లెక్క చేస్తలేడు.

"పోతే పో. లావు బెదిరిత్తన్నవ్. సచ్చిన పీనుగు ఆగది. వండిన కుండ ఆగది. అయ్య సత్తె అమాస ఆగుతదా? పో. పో ఎవ్వని బెదిరిత్తున్నవ్" అని పాలమాకుల మల్లయ్య గుడ్లురిమి కరణయ్యను సూత్తండు. కరుణాకర్ అయ్య కమలయ్య గోనవ్వ అన్న గమనిస్తుండు.

"నీయక్క. నాచెల్లె జివ జివలాడంగా ఏపాలోడు రాకపాయెనేంరో? పుట్టెడు రోగంల ఉండి ఇల్లిల్లు దిరిగి నన్ను దావఖానకు కొంటవోండ్రి. ఎవల్ని బతిలాడిన ఎవ్వలకు చెవుమీద పేనుపారకపాయే. మేమొచ్చి చేసేదాక తెల్లారకపాయే. అమాస ఆగది. సచ్చిన పీనుగు ఆగది. నీ అన్నగాంది ఒక్కనిదే సంసారం. మా చెల్లె చెయ్యలేదా?

ఎనుకోటి ముందటోటి మాట్లాడుతరు? గడ్డితింటం(డ్రా? అన్నం తింటం(డ్రా? మీ నాలుకనా? తాటి మట్టా? చేసుకోం(డ్రి. వాళ్ళ ఆస్తి గావాల్నా వాళ్ళ సంపాదన కావాల్నా? ఆడివిల్ల సొమ్ము తినెటోని లెక్క కనవదుతున్ననా? నా కొడుక్కు కొలువు. నాకోడలుకు కొలువు. నాకు ఎకురంనర పొలం. బోరు. భగంతుడు నా బుక్క నాకు పెట్టిండు. మీరే సందం జెయాలే! మాటలు మాట్లాడినట్టుగాదు. చేసి చూపకపోతే చూడు" అని అసహనాన్ని వెళ్ళగక్కిండు. అంతెల్లమే సర్పంచ్ వెంకట్ వచ్చిండు.

"ఎయ్ ఏమి లొల్లి. సచ్చి వాళ్ళేడుస్తుంటే లొల్లి పెట్టుకుంటం(డు. ఆగుం(డి. కనకయ్య ఆగు. నేను చెప్పేది విను. సార్ ఆగు. నేను మాట్లాడుతా" రాజును పిలవగానే సర్పంచ్ దగ్గరికి వచ్చి నిలవడ్డడు. ఎల్లయ్య మీరందరు కులపోల్లు. సావు ఇయ్యాల్ల చేద్దామనుకున్నరా? రేపా?" "ఇయ్యాల్లనే సేద్దామనుకున్నం. ఆతనికి చెప్పినం. ఆ సారు చర్చిలసావుకు ఏమేం తెత్తరో అవన్ని కూడా ఫోన్‌జేసి తెప్పిత్తండు. ఇయ్యాల్లా ఏ రాత్రైనా సావు జేద్దామని వీళ్లకు వాళ్ళకు చుట్టాలకు ఫోన్ల్ జేత్తండు. నేను, వీడే ఈ కనకయ్య, నడిపోల్ల మల్లయ్య అందరం కల్సే కులపోల్లం చెప్పినం" అని బదులిచ్చిండు ఎల్లయ్య. వినేది వింటుండంగా చర్చి(మందిరం)వాళ్ళు పాటలు పాడుతున్నరు. పాస్టర్‌గారు వాక్యం అందిస్తున్నడు. గోనవ్వ అవ్వగారు గోనెపల్లి వాళ్ళు ఒగలమీద ఒగలువడి ఏడుస్తుం(డు. ఊళ్ళోల్లు గుస గుసలాడుకుంటు అయితే సూద్దామన్నట్లున్నరు. నువ్వెంత అంటే నువ్వెంత అనుకుంట లొల్లి సురువైనకాడ సర్పంచ్ చుట్టూ గుంపుగూడినోళ్ళు ఏం జెప్తుతడో సర్పంచ్ అని ఎదురు సూత్తం(డు. ఆ వాడకట్టు వడ్డోల్ల దుర్గమ్మ కొలుపు ఆగిపోయింది. పక్కవాడల కమ్మరోల్లు వడిబియ్యం ఆగిపోయినయి. మొదలైనవన్నీ వెనుకా ముందూ ఆలోచించండి.

"కనకం మీ పెద్దమ్మ బతికిన బతుక్కు రేపు జేసుడే ఉత్తమం. ఆమె కింద పడెదాక ఆమెనే గ్రామైఖ్య మహిళా సంఘం అధ్యక్షురాలుగా పనిజేసే. మహిళ మండల సమాఖ్య అధ్యక్షులుగా ముం(డాయి గోనవ్వను తెలువనోల్లే లేకపోయిరి. ఎమ్మార్వోనుగానీ ఎంపిడీవోనుగా ఎవల్నైన అడుగు. మంచిగ మాట్లాడు. మాట మాట్లాడితే అట్ల మాట్లాడాలెనని సూపెట్టెటట్లు తారీప్ జేసే మాట మాట్లాడు. అటువంటిది పాడు రోగమొచ్చి పాడయిపాయె. బాపనోల్ల లెక్క పూజలతోటి నీటుకంగా బతికేది. ఊరు ఊరంతా ఆమె ఒల్లు కోసం ఎదురు సూసెటోల్లు. శిగమూగి బొట్టువెడితే పానం చెట్టుకాయ దించినట్లగు. అటువంటిది ఆగమాయే, ఎల్లన్నా! మల్లయ్య మామ.

అయిందేదో అయింది. రేపు తీసినా గంతే యియ్యాల్ల దీసినా గంతే. అసలే ఎండకాలం పొద్దు పొడిసినా కొద్ది పానం గావరవుతది. అసలే గడ్డలు పలిగి శవం దగ్గర నిలబడరాకుంట యిపుడే వాసనొత్తంది. మీరుకూడా ఆలోచించుండ్రి. మీరైతే ఇయ్యాల్ల చేద్దామని ఆగ్రెడి చెప్పిండ్రని అంటున్నారు. ఏర్పాట్లు జరుగుతున్నై. సుట్టాలందరు వత్తండ్రు. కొంత మంది సావు అయితదనే వచ్చిండ్రట. పొరుగూరోల్ల గురించి కూడా మనం ఆలోచించాలె." అని సర్పంచ్ చెబుతూ ఉన్నపుడు ఇంతదాక ఇయ్యల్ల కాదు సావు రేపు జేద్దామన్నోల్లు కూడా ఆలోచనల పడ్డరు. వాల్లను రెండో సుతి (మద్యం) ఎగిరిస్తుంది. ఎగిరినోల్లు ఎనుకకు మర్రి సోచాయించుకుంటుండ్రు. సర్పంచ్ మాటలు పూర్తికాగానే సర్పంచ్ సాబ్ "నువ్వన్నట్లు యియ్యాల్లనే జేద్దాం. పోని ఎట్లయితేంది? రేపట్దాక ఉంచితే ఏం లాభం? ఎప్పుడైతే ఏంది తీసేద్దాం. వండిన కుండాగది సచ్చిన పీనుగు ఆగది." అని ఎల్లయ్యన్నడు. ఎల్లయ్య మాటలని ఎవరు వ్యతిరేకించే వారే లేరు. అందరి మొఖాలు చూసి సర్పంచ్ తలారిని "రాజూ! పోబిడ్డా! నీతో యిద్దర్ని తీసుకపోయి బొందతోడు. బైకులైట్లు పడుతరు. వెళ్ళి తియ్యిపోండ్రి. నేనుకూడా బొందకాడ్కి వస్తున్న పాండ్రి" అని సర్పంచ్ అన్నడు.

"సరే, సరే..." అనుకుంట కులపోల్లు సుట్టాలు కొంతమంది పోతండ్రు. అందరు తన మాట యిని పోతున్నందుకు సర్పంచ్ లోలోపల సంతోషపడ్డడు. గుంపులు గుంపులుగా పోతండ్రు. పోతున్నపుడు ఇద్దరిద్దరు ముగ్గురు ముగ్గురు ముచ్చెట పెట్టుకుంటు పోతున్నరు. వాడు పెట్టెటోడు ఉండంగ మనకేందిరా? చేసేటోన్ని చెయ్యనియ్యరు. తలకొర్రాయి పడితే రాజయ్య కొడుక్కు ఇల్లు రాసియ్యిమని అందుము అని మరొకరు. రేపురేపు ఆ ఇల్లు ఎవనికైతదో కదా! చేసినోడు తింటడు. తాగినోడు కదుతడు తాళ్ళపన్ను. వాడు తమ్ముడైనంత మాత్రాన నర్సయ్యను సూడకున్నా నర్సయ్య ఆస్తి రాజయ్య కైతదా? కానేకాదు. ఎనుకా ముందు ఆలోచించుకుంటూ పోతండ్రు.

బొందల గడ్డ కాడ్కి పోయినంక "ఇంకొక్కలు నాకు తోడుంటే నేను చేస్త. లేకుంటే నా ఒక్కని నుంచి ఏమైతది బొంద తోడుడు. వస్తానోడు రాలేదు. నన్నేం జెయ్యిమంటరు? నేను జెయ్యా అన్ననా పని" అని తలారి రాజు అన్నడు.

"ఓరి పిలగ మాకు వంతన లేదురా బొందతోడుడు. లేకపోతే నీతోటి పనిజేత్తుము" అని నడిపొల్ల ఐలయ్యన్నడు.

"ఈ చీకట్లయితే కాదు ఎవలు తోడు చెయ్యంది. నన్ను సావు మంటుండ్రా.?

ఏడున్నర అయితంది. నేను చెయ్య" అని రాజు అన్నడు. కర్ణాకర్ సర్పంచ్‌కు ఫోన్ జేసి "అన్నా! బొంద గట్టిగున్నదని తోడు ఎవ్వరు లేరని రాజు తోడ అంటండు. ఏంజేద్దాం" అని అన్నడు.

ఒకసారి రాజుగానికి ఫోన్ యియ్యి. "అరే రాజూ ఈ రాత్రి ఎట్లాయినా చేద్దాం. నేను చెప్పేది విను అంటూ సమాధానం చెప్పాడు. మళ్ళీపోన్ కర్నాకర్‌కి ఇచ్చె మాట్లాడించిండు. ఇగో కర్నాకర్ నర్మెట్ల రాజిరెడ్డిది జేసిబి ఉన్నది. నేను మాట్లాడుత. జేసిబితోటి బొంద తోడిద్దాం. రాజుగానికి ఓ వెయ్యి రూపాయలు ఇవ్వు" అని పోన్ పెట్టిండు. ఫోన్ పెట్టేసుడుతోటే పాస్టర్ నుంచి ఫోన్ వచ్చింది. పోన్‌లిఫ్ట్ చేసి "అన్నా వందనాలు. పెట్టెవచ్చింది. శవానికి స్నానం చేయించుమంటరా?"

"లేదు అన్నా ఇంకొంత సేపాగాలే" కర్నాకర్‌ది జవాబు. "ఎందుకు?"

"నేను వస్తన్న యింటికి వచ్చినంక మాట్లాడ్త"

"సరే, సరే స్నానం జేయించి తీసుకెళ్ళడమే" అని ఫోన్ కట్ జేసిండు. కొంత దూరమొచ్చిన తర్వాత మళ్ళీ సర్పంచ్‌కి ఫోన్‌జేస్తే జేసిబి డ్రైవర్ గంట ముందే వాళ్ల ఊరికి పోయిండట. రాజిరెడ్డిని ఫోన్ జేసి డ్రైవర్‌ను పిలువుమన్నా. డ్రైవర్ కూడా బయలుదేరవచ్చు అనే సమాచారం కరుణాకర్ తెలుసుకున్నడు.

పీనుగు కాడ్కి రాగానే పాస్టరన్న పాట ఎత్తి, వచ్చి కర్నాకర్‌తోటి జరిగిన విషయం తెలుసుకొని "మన సంఘస్థులు చాలా మంది బొంద తొవ్వుతరు. మనోల్లతోటి తొవ్విద్దాం. దేవుని పని అని సంతోషంగా చేస్తరు. ఏం బాధలేదు" అని పాస్టర్ చెప్పాడు.

"అన్నా! అట్లా అయితే అట్లే చేద్దాం. ఒక పదినిమిషాల్లో జేసిబి డ్రైవర్ వచ్చేది రాంది తెలుస్తది. అపుడు సంఘస్తులకు చెప్పి చేయించుదాం" అని కర్నాకర్ చెప్పాడు.

నర్మెట నుంచి నర్సయ్య తమ్ముడు, గోనవ్వ మరిది రాజయ్య వచ్చిండు. వచ్చినోన్ని చూసి "పానం పోతుందని ఫోన్ జేసింది పొద్దుగాల తొమ్మిదీటికి. నువ్వొచ్చింది రాత్రి ఎనిమిదిటికి. గింత లేటయితాదిరా? ఏం మనిషివిరా? ఇదేనా నీ పద్ధతి తిట్టి ఆరేసిండు" చిన్నోల్ల రాములు.

"మని ఉండగా మమ్ముల ఎంత తిరస్కారంగా తీసేసే. ఇపుడెట్ల రావాల్నె. పంచాదులాయె. కొట్లాటలాయె. దడువతులాయె దండుగాలాయె.... కడుపుల ఆత్మ

లేనిది కండ్లకు దు:ఖం వస్తాది?" అని నిర్మొహమాటంగా చెప్పిండు నర్మెట రాజయ్య.

"గవ్వన్నీ పట్టించుకుంటార్రా?" చిన్నోల్ల రాములన్నడు.

ఆడోల్లు, మొగోల్లు గుంపులు గుంపులుగా ముచ్చట్లు పెట్టుకుంటుంర్రు. మమ్ముల కాదని వీడు అన్ని జేత్తుండు. మమ్ముల ఏది అడుగుత లేడు. కులం ముందుపడి చేస్తే కులం మర్యాద వేరే వుంటది. కులం మర్యాదలేని కులపోల్లు, తలకొర్రాయి పడితే తనకే ఆస్తి దక్కుతదని తలంపులో రాజయ్య. తొందరగా చందమైతే ఎవల ఇంటికి వాల్లం పోదుం. సచ్చిదానికి పిల్లా జెల్లా? అవతల పారేత్తే ఐపొతది. కులపోల్లు సుట్టాలు పాలివాళ్ళు రకరకాలుగా ఊహించుకుంటున్నరు. ముందుగాల ఏదో ఒకటి తేలిపోతే కాని శవం తియ్యనియ్యనని తిష్టవేసుకున్న ఆలోచనల్తో రాజయ్య.

పాస్టర్ అన్న ఫోన్‌తో ఉలిక్కిపడి కాగల కార్యం మీదికి దృష్టిమల్లింది. సర్పంచ్‌కి ఫోన్‌జేస్తే "డ్రైవర్ వచ్చిండు. జేసిబి బొంద తోడుతంది. బొందకూడా అయిపోవచ్చు" అని చెప్పిండు. ఫోన్ పెట్టేసి పాస్టరన్నకు తెలిసిన విషయం చెప్పిండు. పదినిమిషాల తర్వాత మనిషి వచ్చి బొంద తోడిన విషయం చెప్పాడు. పాస్టరన్న పాస్టరక్కకు సిస్టర్లందరికి చెప్పిండు. 'కారుతున్న గడ్డల్ని పిండుతున్నరు. రసి అంతా తీసేస్తున్నరు. పాస్టరక్కకు కంపోండర్‌గా అనుభవముంది. కర్నాకర్ భార్య లీల ఎంతమాత్రం కూడా అసహ్యపడుతలేదు. స్నానం చేయిస్తున్నరు. పత్తితో కారుతున్న గడ్డల్ని తూడుస్తున్నరు. బయటికెల్లిన కన్నును క్యాన్సర్ సోకిన అన్ని అవయావలను కడిగారు. పాస్టరక్క, లీల, కనికరమ్మ మిగతా వాళ్లు కలిసి తెల్ల చీరను కట్టించారు. సెంటు కొట్టారు. తెల్లబట్టల నడుమ కరుణవ్వ పావురమోలే కనబడుతున్నది. అంతా పూర్తి చేసామని పాస్టరక్క చెప్పగానే పెట్టెని తీసుకొచ్చింర్రు. పెట్టెలో శవాన్ని పెట్టి 'ఎవరైన బంధువులు చుట్టాలు, దగ్గరి వాళ్ళు అందరు కడసారి కరుణవ్వను (గోనవ్వ)ను చూడటానికి రమ్మని పాస్టర్ మైక్‌లో పిలిచాడు. ఒక్కరంటే ఒక్కరు కూడా చూడడానికి రాలేదు. అదే పనిగా నాలుగైదుసార్లు పిలిచాడు. పిలిచి పిలిచి మధ్య మధ్యలో దేవుని వాక్యం అందిస్తున్నాడు.

"ఒక వైపు ఏం మాట్లాడంది ఎట్ల తీసుకపోతరు? ఇది ఊరు కాదు అడివా? మంచి చెడ్డ ఏది మాట్లాడరా? నాగురించి ఏం ఆలోచించరా?" రాజయ్య కులపోల్లతోటి పాలోల్లతోటి వాదం జేస్తుండు. పాలోల్లు కూడా అదే రీతిలో స్పందిస్తున్నారు. '

'ఎన్నడ్రా వచ్చింది. ఎన్నడ్రా నువ్వు చూసింది. పొద్దుగాల ఫోన్ జేస్తే గియాల్లకా? నువ్వొచ్చేది? నువ్వు చేసిన తప్పు నీకింద పెట్టుకొని కులం మీద మోపుతావురా?" అన్నారు. రాజయ్య చేసేది లేక నోర్మూసుకున్నాడు.

అప్పట్దాక అనుకున్న విషయాలు విని సావేలు "పాస్టరన్నతో శవాన్ని వాళ్ళుకూడా మోస్తరట. మీరెందుకు వద్దని అన్నారు."

"వాల్లను ఎందుకు మోస్తరు అనలేదు. వద్దనలేదు. వాళ్ళు మోస్తమంటే సంతోషం. వాక్‌మైక్‌లో కరుణవ్వకు ప్రియమైన వాళ్ళు చివరిగా పెట్టెను ఎత్తుకోండ్రి." అని చెపుతండు

రాజయ్య తోక తొక్కిన త్రాచులా కోపంతో లేసిండు. "ఓ పాస్టరయ్యా! ఎవల్ని అడిగి చేత్తుండ్రు యేసుమతం సావు. మేం ఎవలం ఎత్తుకోం. రేప్పొద్దుగాల మాట ముచ్చటైనంకనే బొందకు తీసుకపోవుడు. అంతవరకు ఏది లేదు. ఎయ్ నువ్ ముందుగాల మైక్ బందుజెయ్యి. బందుజెయ్యి. చెపితే నీక్కాదనుకుంటున్నవా?" అని అంటుంటే మౌత్ టిక్కుమని బందుజేసి "దేవా" అన్నడు పాస్టర్.

పొరుగూరైన "ఓ అయ్యా! పీనుగుండంగానే లొల్లి పెట్టుకుంటరా? ఏం రీతి. ఏం మర్యాదవయా? ఎతోడు ఎతకు ఏడుస్తున్నడు. కతోడు కతకు ఏడుస్తున్నడు. ఏందిది?. గిప్పుడా పంతాలు పట్టింపులు" అని అన్నడు.

"ఇగో ఏవూరునీది? ఒర్రుడు బంజెయ్యి. మా వుల్లె మేం జెప్పినట్లు జరుగాలె. నువ్వేంది నడ్మ,'' అని రాజయ్యన్నడు.

"ఓ రాజయ్యా! నీ తెలివికి ముందట పడి చెయ్యాల్సింది నువ్వు. చెయ్యాల్సింది చెయ్యక చేసేటోల్ల కొంకులు తెగ్గొడుతున్నవేంది? నీది కూడా ఈ వూరు కాదటకదా! అవ్వి ఇల్టం పోయిన మాటలా? మెప్పిత్తవా? నీ మాటల్ని. ఏం తర్వాయి. మెచ్చేటట్లు మాట్లాడాలె. పట్టినంత తినాలె." పోరుగూరైనకు రాజయ్యకు వాదం నడుస్తుంటే ఊరోల్లు బీరిపోయి సూత్తండ్రు. కర్నాకర్‌కు ఏం తోస్తలేదు. పాస్టరన్నకు సమాధానంగా ప్రతివనీచెయ్యాలని లొల్లి పెట్టుకోకూడదని ఆలోచన.

కర్నాకర్ భార్య "మేమున్నం మేమున్నం అని యిపుడు వత్తండ్రు. కడుపుల ఆత్మ లేనిది కండ్లకు దు:ఖం రాదు. బండి పంపిస్తే బల్మీటికి వచ్చి బాగా మాట్లాడుతండు. ఈ తెలివిని ఎవరు అడిగెటోల్లు లేరు. అంటంది.

ఆమె పుట్టెడు రోగాలతో చస్తున్నపుడు తొంగిచూడలేదు. కసికెడు మంచినీళ్ళు పొయ్యలేదు. జీవిగంజి పొయ్యడానికి రాలేదు. సచ్చినంక సావు కార్యంకు రాలేదు. సుట్టపు సూపుగానైనా రాలేదు. ఇప్పుడు లావు మాట్లాడుతుండు. సచ్చినంక పగ ఉంటాది? సచ్చినా రానన్నోనివి. పురుగులు పడ్డా సరే అని మాట్లాడితివి. నీ అన్న కోసమైనా చూసేతందుకు రావాలే. రానే రాకపోతివి. వచ్చి లొల్లి చేసుడేంది? మా ఆడివిల్లను దిక్కులేకుంట సూత్తమా? మా వదినను మేమే సావు చేత్తమంటే మేము వద్దందుమా? వద్దంటే బుద్ధిమంతులు అడుగక పోదురా?" అని రాజయ్యను ఉద్దేశించి అన్నది.

"ఇక్కన్నుంచి మా బావ ఎవలొత్తలేరంటేనే దేవుని సావు చేస్తున్నం.

ఇపుడొచ్చి మాట్లాడుతుంటే సప్పుడు జెయ్యవు బావా?" అని నర్సయ్య దిక్కు చూసి గోనవ్వ చెల్లె కనకవ్వ అన్నది.

తమ్ముని వైపు, పాలొల్ల దిక్కుచూస్తు "జరిగేది జరగ నియ్యుండ్రి. ఎందుకు అడ్డం తిరుగుతండ్రు? ఎందుకు వద్దంటండ్రు? ఎందిరా నువ్వు మాట్లాడేది? రమ్మనంగ రమ్మనంగా గిపుడొచ్చి లొల్లి చేస్తున్నవు. ఓ పాస్టరన్న జరిగేది జరుగనియ్యుండ్రి" అని నర్సయ్య అన్నడు.

"ఓ పాస్టరన్న మా అక్కను మేం పారేత్తం. నడువు నడువు" అని కనకవ్వ అన్నది.

"మొగోల్లకి చాతగాకపోతే మేం మోస్తం ఆడోల్లం" అని కర్నాకర్ భార్య అని

ఉరుకొచ్చి పెట్టె అందుకున్నది. ఆమెతో పాటు ఆడోళ్లు అందరు ఎత్తుకోవడానికి వచ్చిండ్రు. సుట్టాలు వచ్చిండ్రు. అందులో కనకయ్య ఎత్తుకుంటే 'అరేయ్' వదిలిపెట్టురా ఏన్నో పుట్టొచ్చింది. ఏందిరా మోసేది? ఇడిసి పెట్టు బే..." అని కనకయ్యను గుంజుతుండు రాజయ్య.

సావుకొచ్చినోల్లు రాజయ్య మీదికి గయ్యన లేసిండ్రు. లొల్లి జోరందుకుంది. అంతలోనే సర్పంచ్ అందిండు.

"లొల్లి ఎందుకు" అంటూ సముదాయించిండ్రు. పెద్దలమాటతో ఇదేమి పట్టనట్లు 'ఈ లోకం మనది కాదు. మనతో ఏదీ రాదు' అనే పాటతో శవ యాత్ర రాత్రి తొమ్మిదిన్నరకు సురువైంది.

– మార్చి 2016

నాయినమ్మ

ఎడతెరిపి లేకుండా పోన్ మోగుతుంది. ఇంచార్జి హెచ్చెం ఏదో రాసుకుంటూ ఉన్నాడు. అదే పనిగా పోన్ మోగుతున్నపుడు తల ఎత్తి ఒక్కసారి చూసాడు. 'తెలుగు సార్‌కు పోన్‌లే రావు. పదే పదే ఎందుకొస్తుందో...? ఏదైనా ఆపదా? ఏమైనాకానీ పోన్ ఎత్తి. ఏ విషయమో కనుక్కొందాం' అని పోన్ ఎత్తి వివరాలు తెలుసుకున్నాడు.

ఇంట్రవల్ కాగానే ఉపాధ్యాయులందరు ఆఫీసులోకి ఒక్కొక్కరుగా వస్తున్నారు. ఆన్సర్ పేపర్ల చూస్తూ హిందీ సార్. పేపర్ చూస్తూ గణితం సార్. కష్టాసుఖాలు పంచుకుంటూ మరో ఇద్దరు సార్లు. దినపత్రికలోని పోటిపడి అక్షరాలు నములుతూ చర్చలో ఇద్దరు ఉపాధ్యాయులు. వస్తున్న సార్‌ని పిలిచి "తెలుగు సార్ మీకు పోన్ వచ్చింది. ఇదిగో పోన్" అని ఇచ్చిండు. రిసీవ్డ్ కాల్‌ని చూసి "ఏమన్నరు సార్?" అని అడిగిండు. "మీ నాయినమ్మ బాగాలేదా? అవునుగని మొన్న చెప్పినవు గదూ. అందుకోసమే" అని శివారెడ్డి సార్ జవాబిచ్చిండు.

రీడయల్ చేసి పోన్‌ద్వారా సమాచారం తెలుసుకున్న సంపత్‌సార్. ఖాళీ పేపర్ తీసుకొని సెలవు పత్రం రాస్తున్నడు. సంపత్‌సార్‌ని గమనించిన శ్రీహిత్‌సార్ "ఏమయింది సంపత్‌సార్"అని అడిగాడు.

"మా నాయినమ్మ బాగాలేదు. సంపతి సంపతి అని కలువరిస్తుందట. గట్టిగ పిలిసి అడిగితే కళ్ళు తెరసి సంపతి సంపతి అంటుందట. కళ్ళు మూసిన కూడా సంపతి సంపతి. దేవుడా దేవుడా అని కలువరిస్తుందట. పోదామని సెలవు పత్రం

రాస్తున్న" అని జవాబిచ్చాడు.

"నువ్వంటే మీ నాయినమ్మకు పానం ఉన్నట్లున్నది"

"అవును అన్నా! ఒక్కన్నే మనుమన్నికదా!...."అంటూ సెలవు పత్రం రాస్తూనే ఉన్నడు.

"మీ నాయినమ్మ నూరేండ్లదాకా వుంటదా?" శివారెడ్డిసార్ ప్రశ్న.

"ఉంటది సార్. మా నాయినే డెబ్బైయేండ్ల మీదుండే. మా నాయిన ఐదో సంతానం." అని సమాధాన మిస్తూనే సెలవు పత్రం పూర్తిచేశాడు. కుర్చీలోంచి లేచి పెన్ను జేబులో పెట్టుకొని సెలవు పత్రం శివారెడ్డిసార్‌కిస్తూ "సార్ లీవ్ లేటర్" అని అనగానే ఏదో రాస్తూ ఉన్న సార్ తలెత్తి అర్థం చేసుకొని "ఎందుకు బాధపడుతున్నవ్ సార్ ? నూరేండ్లు బతికింది. ఆమె అంత బతుకు బతుకుతమా? నారాజెందుకు సార్? ''అని వాస్తవాన్ని వివరిస్తూ సెలవు పత్రం తీసుకున్నడు.

"మా నాయినమ్మ నన్ను మస్తు చూసుకుంది సార్." అంటు వెళ్ళుతున్నపుడు సంపత్ సార్ వెనుక శివారెడ్డి సార్, శ్రీహిత్‌సార్ వస్తున్నారు.

"సరే! సరే!! మెల్లగా పో" అని శివారెడ్డి సార్ అంతకు ముందే తీసుకున్న సెలవు పత్రం మీద సెలవు గ్రాంటెడ్ అని రాసుకున్నడు.

"పయిలం పయిలం" అని శ్రీహిత్ సార్ అన్నాడు.

"ఓ.. సార్ ఎందుకు బాధ పడ్తవ్? ఆమెకు ఏంగాదు? ఇలాంటి జలక్‌లు ఎన్ని సార్లు యివ్వలేదు. నువ్వైతే నిమ్మలంగా పో...." అంటూ నరేందర్‌రెడ్డి ఓదార్పు మాటలు

వెళ్తున్న సంపత్‌సార్ వెనుకాల వరండదాక వచ్చిన సార్లు ఓదార్చుతూ పంపిస్తున్నారు. వారి మాటల్ని అర్థం చేసుకునే స్థితిలో సంపత్ లేదు. బండి స్టార్ట్ చేసుకొని వెళ్తున్నడు. బండిలాగానే మనసు వేగంగా పరిగెడుతుంది. ఆలోచనలు ఒక్కొక్కటి నిశ్చలమైన నీళ్లల్లో రాయి విసిరితే నీరు తరంగాలుగా విస్తరిస్తుందో నాయినమ్మ అనుబంధాలు, ఆత్మీయత, ఒకటేమిటి అన్నీ తెరలు తెరలుగా కుప్పలు తెప్పలుగా బాధ విస్తరిస్తోంది.

సంపత్ సారోల్ల నాయినమ్మ బతికెటట్లు లేదట. చాలా సీరియస్.

మనకెపుడైనా పోన్ కాల్ రావొచ్చుననే విషయం ఆఫీసులోకి అడుగుపెడుతూ సూచనప్రాయంగా శివారెడ్డి సార్ తెలిపాడు.

బండిమీద వెళ్తున్న సంపత్‌కు నాయినమ్మ చేసిన సేవలు గుర్తుకొస్తున్నాయి. తనకు బుద్ధి తెలిసేదాకా నాయినమ్మే తినవేట్టేది. నేను తింటనే అని అన్నప్పటీకి "నేనుండగా నీకెందుకోయ్" ఎదురు ప్రశ్నలతో బెదిరించేది.

ఊరు ఊరంతా తిరిగి తెచ్చినయి. అడివిల తెచ్చినయి సాటుకు పిలిచి తినవెట్టేది. ఏ చిన్నపండుగైనా మెత్తటి తున్కలు,కార్జాలుతినేటట్లు జూసు. ముదుసు బొక్కల పూలుగు జుర్రుమను. తనకూర కూడా నాకే వేసేది. తినేదాక పట్టు పట్టు. అక్కా చెల్లె అన్ని వానికే పెట్టు. మాకేది యియ్యకు. అని అంటే మెల్లగ బుదగరిచ్చు. అట్లనే విసిగిస్తే సమాధానం చెప్పు. తమ్ముడొక్కడు మొగపిలగాడు. వాడు మంచిగుంటనే మీకు రాకడ పోకడ. మీరు ఒగల యింటికి యిత్తె పాయేటోల్లు. వాడు మన యింటి దీపం అని ఎన్నిసార్లో చెప్పేది.

మీరు తినక వానికి పెట్టాలె అనేది. చింతగింజలు మంగులం పెంకల ప్యాలాలు ఏంచి బుక్కసా బుక్కుమంటుండేది. తున్కలు పొయిల కాల్చి యిచ్చుడు. పచ్చిచేపలు, ఎండిన చేపలు కుందేలు కూర, ఉడుము, అడవి పంది రకరకాల మాంసంతో తినవేట్టేది. అపుడపుడు అక్కాచెల్లెలతో గాకుండా పక్క ఇండ్ల వారితోటి ఏం తింటడు? ఏంతినడు. ఒక్కొక్క పిల్లలు మంచిగ తింటరు. మావోడు కటాన కర్ర కొరుకడు. షెటాకు బలం లేదు అని చెప్తుండేది....

కడుపుచూసిన ఆత్మ పట్ల కండ్లల దు:ఖం కమ్ముకుంటంది సంపత్‌కు. బడికి వస్తుండె. పంతుల్లకు సలాం జేసేది. నాకొక్క మనుమడు. మీదే దీవేన. సదువు రావాలే. శాత్రం రావాలె. నలుగుట్ల తెలివోడు గావాలె. దండంబెట్టి మరీమరీ చెప్పేది. పోతూ పోతూ బిస్కిటో చెక్కరిగోలో యిచ్చిపోయేది. నాయిన, అవ్వ కొట్టొచ్చినపుడల్లా... ఉన్నొక్క పోరన్ని కొట్టెతందుకు చేతులు ఎట్లొత్తున్నై అన్నం తింటన్నవా? అశిద్దం తింటన్నవా? నీ యయ్యకునా....అంటు మా నాయినతండ్రిని కసిదీరా కడిగిపారేసేది. నువ్వు జెయ్యంగనే వాడు అట్లా తయారైతండు. ఊరపందులకు తిన నేర్పేదానివి అని నాయినంటే అవురా ఏమంటున్నవు నా పిల్లలంతా ఊరపందులు. నువొక్కనివే

అడివి పందివి. మాట్లాడుతున్నవ్ కని మర్యాద దక్కది కొడుకా? సూసుకుందాం రారా అని సవాల్ విసురు.

ఏమో లావు బెదిరిస్తున్నవ్, నా అత్తమామ సంపాదించిన జాగ నేను నా మనుమడు పాలుకు ఇచ్చుకోని బతుకుతం. ఇంత పింఛను వత్తనే వుండే. ఇంకేం గావాలె. నువ్వుసాదేది ఏందిరా? అని మా నాయినను బెదిరిచ్చు. మా అవ్వ నన్నెపుడన్న కొట్టాలంటే మా నాయినమ్మ నోరుకు భయపడేది. చుట్టాలిండ్లల్ల జరిగే పండుగలకు పబ్బాలకు తల్లి కోడోలే తింపేది. అందర్ని పరిచయం చేసి వరుసలు కలిపేది. నాయినమ్మ బోధలన్ని గురుతుకు వచ్చినా కొద్దీ పానం చెరువవుతుంది.

బడికి పోయినపుడు కాలేజికి పోయినపుడు తలనిమిరేది. కంతలకు అద్దుకొని మురిసిపోయేది. ఎపుడో ఐదు రూపాయలు సేతులవెట్టు. డిగ్రీల ఉన్నపుడు పెళ్లి చేసుకొమ్మని పోరుపెట్టింది. పెద్దచదువు యూనివర్సిటీల చదివేటపుడు నా రాకకోసం కంట్లె ఒత్తులు పెట్టుకొని చూసు. ఊరికి పోయినా, పండుగకు పోయినా, నా మనుమడు పట్నంల సదువుతండు మీ బిడ్డను యిస్తరా? అని నిర్మొహమాటంగానే అడుగు. పెళ్లికి సోల్తిల మీద సోల్తిలు పట్టుకొచ్చు. పట్నం నుంచి రాంగా పోంగా పయిలం పయిలం మంచిగ సదువు. ముగ్గురున్నకాడ ముచ్చట వెట్టకు. నలుగురున్నకాడ నవ్వకు. ఎర్రగున్నవని ఎంటవడుతరు జాగర్త. అని బుద్ధి చెప్పేది. పట్నం నుంచి ఎపుడు పోయిన మునుపటోలే లేవేంరా? తన ఆప్యాయతను గుండెల్లకేలి పాతాల గరిగెలెక్క దేవులాట యాదికొస్తుంటే నాయినమ్మ సంపద కోల్పోయినట్లు బాధపడ్తున్నాడు.

కొలువుకు పోయేటపుడు జిప్టిటీసింది. ఎపుడు దాసుకుందో ఏమో? సంపత్‌కి మాత్రం నూర్రూపాయల నోట్లు రెండు చేతులవెట్టింది. మా అవ్వ అన్నం వడ్డిస్తున్నపుడు పక్కకు కూసుండి ఇంకొంచెం ఇంకొంచెం అని కొసిరి కొసిరి అన్నం పెట్టిచ్చు. కట్టెమీద కెట్టెమీద పోయి నీళ్ళు దెచ్చు. ఎంత తిన్నా మా సంపతి ఆర్సికంకెడు తినడు. ఓర్సి పని ఎట్లజెత్తడో ఏమో? వయసు పిలగాడు పయిస కల్లు తాగడు. ఏం బలమున్నది.? ఒంటంక్క పానం ఒలువవోతే నార లేదు. చెత్తల పావుశేరు రక్తం లేదు. ఇవుతలి అవుతలోల్లతోటి పరేషాన్‌గా ముచ్చట పెట్టేది. బండిపోతుంది (సంపతి)గుండె బరువవుతూనే ఉంది. మనసులో దుక్కపు సుడులు కళ్లలోతిరుగుతున్నై.పిల్లను చూడవోయేటపుడు దేవునికి మొక్కేది. ఏ దిక్కు దొరుకుతదో.... గాచారం ఉందో లేదో? కనుక్కునేది. కొత్తగా ఎటుపోతున్న మనవాళ్ల

దగ్గర ఓ పైస తీసుకోవాలె అంటూ ఇచ్చేది. నా ఉప్పసకు నేను ఇస్తున్న అని అనేది. నచ్చినంక పిల్లను చూపెట్టెతందుకు తీసుకపోయిన. పిల్లతో మరుగున పెట్టి మాట్లాడుడు సురువు జేసేది. ఓ పిల్ల నీళ్ళు తీసుకరాపో అని ఆజ్ఞ జారిచేసేది. నీళ్ళు తేవడానికి లోనికి నడిచినపుడు నడక చూసింది. చూపు ఆనకున్నా ఎగనాకుడు పరిశీలించి చూసింది. రోమాల్ని, సరిసమాన పాదాల్ని....రకరకాలుగా టోటల్ బాడీని స్క్రీనింగ్ టెస్టు చేసి చూసింది. అత్తగారింటికాడ ఒద్దికగా బుద్ధిగా నడుచుకోవాలని చెప్పింది. పెండ్లిల గజ్జుమనేటట్లు బెదిరించింది. మా నాయినమ్మను ఏమి పట్టించుకోకండి అని సంపతి సర్దిచెప్పేటోడు, తర్వాత్తర్వాత సంపతి బాగు కోసమేనని అందరికి అర్థమయి పోయింది.

పెళ్లి తర్వాత సంపతి భార్యదోస్త్. పొయి వేయడం జొన్నరొట్టెలు చేయడం నేర్పింది. నెల తప్పిన తర్వాత నాయినమ్మ హైరానా సూడాలె. పొల్ల ఏం తింటలేదు ఏమన్న తీసుకరాపోయినవు? పండో ఫలమో తేవాలె. కడుపుతో ఉన్నపుడు తినాలనే కాయిసు ఉంటది. తీసుకరావాలె. పతికి సతి. సతికి పతి. అని భార్యభర్తల సంబంధం బందోబస్తుగా నూరిపోసేది.

ఒగసారి ఎందుకో ఏమో? అత్తా కోడండ్ల పంచాదిల వశపడక గదరిచ్చి కొట్టినంత పనిజేసిన. ముందుగా పసిగట్టి అడ్డం నిలబడి ఆడిదాన్ని కొట్టొచ్చుడు మొగోని తెలివి అనుకుంటున్నవా? మాగిన దున్నపోతోలే మారేసి సూత్తన్నవేంది? సార్‌వేమో కదా? ఒగలకు బుద్దిచెప్పెటోనివి. ఒగొలతోటి చెప్పించుకుంటవా? నలుగురు నవ్వే సంసారం జెయ్యొద్దు. పచ్చని చిలుకలోలే పదిమంది మెచ్చే సంసారం జేయ్యాలని చెప్పేది. నా కోపం పాదరసం పడిపోయినట్లు చల్లార్చేది. కోపంలో వెన్న పూసే మృదువైన మాటలు ఇక వినలేనా? అని తర్కించుకుంటూ బండి సాగుతుంది సంపతి మాత్రం నాయినమ్మ జ్ఞాపకాల ముంపులో కొట్టుకపోతున్నడు.

చెప్పొద్దుగానీ నా భార్యకు మా అమ్మకంటే, వాళ్లమ్మకంటే మా నాయినమ్మకే ఆరాటం ఎక్కువ. మిగిలిపోయిన పెట్టుబోతల గురించి మా నాయిన ఆరా తీసినపుడు ఆడిదాని సొమ్ముకు ఆసపడ్తవా? అని తనగురించి చెబుతూ నా తల్లిగారు తలెముంత కూడా పెట్టలేదు. నేను సంసారం చెయ్యలేదా? అలిమా? బలిమా? అరుణపు సొమ్ము ఇచ్చిన్నాడు తీసుకోవాలె. తిట్టినా తీవ్రమైన బోధజేసు. ఆమె మాటలు రెండంచుల కత్తివలె తగులు.

నాకు బిడ్డపుట్టినపుడు రాసిరాసి కడిగి స్నానం పోసేది. జర్ర సర్ది అయినా ఓమ దంచి మెడ సుట్టు కట్టేది. జరమొచ్చినా తడిగుడ్డతో తుడిసేది. రాతిరి మెలుకువున్నంత సేపు చేతులల్ల ఆడించు. ఉయ్యాల వద్ద కూసుండి ఊపుతుంటే కన్ను మూయని సైనికునిలా అనిపించేది. తను కంటికి రెప్పలా చూసుకునేది. మా అవ్వ తానంబోసేతందుకు వస్తే, నేను లేనాయే ఇంకేమన్న పనిచేసుకోపోయే. నీ మనుమరాలుకు జీతగాల్లం ఉన్నమవ్వ అంటూ ఎల్లగొట్టేది. చంటిదానికి నువ్వేది తిన్నా బయట పడుతదని ముక్కుచికం పెట్టినట్లు గుర్తుచేసేది. నా బిడ్డను ఆడపిల్లనా అని అందరంటుంటే నువ్వు ఆడిదానివి కాదా? అని వాళ్లమీదికి కస్సుమనేది. ఆడపిలద్లే ఆత్మగల్ల గుణం అని పోతపోసేది. సెక్యూరిటి గార్డులెక్క. దర్వాజల కూర్చుండేది. మర్చిపోయి వస్తూంటే ఏమో వత్తున్నవు? కాళ్ళు కడుక్కొనిరాపో అని బుసకొట్టేది. నాకు తినిపించినట్లు, నన్ను తిప్పినట్లు నా బిడ్డను తిప్పుతుంది.
ఉద్యోగ రీత్యా ఊరెల్లి పోతున్న మమ్ములను చూసి గుండె పగిలింది. మా తోటి నువ్వుకూడా ఉందువన్నందుకు తూరుపున పొడిసే సింగిడి నాయినమ్మ మొకంలో సూసిన. సిద్ధిపేటకు వచ్చి ఇరుకు గదుల ఇండ్లలో ఇమడలేక భారంగా ఇంటికి వెళ్లి పోయింది. అనవసరంగా ఆరోపణలు ఎవరిమీద జేసేదికాదు. వీలున్నంతవరకు తానే భరించేది. తొక్కుడు బండకున్నంత ఓపికుండాలే నని భరించి చూపించేది. భరించ శాతకానపుడు నన్ను తీసుకోక ఎందుకు ఉంచుతున్నవు దేవా? అని దేవుని మీద కోపాన్ని ప్రదర్శించేది. అందరి పొత్తుల నేను సచ్చిపోతే ఒక్కచిత్తమయ్యేది అని అను. ఎందుకే గట్లంటవు? అని అడిగితే, ఉండి ఎవన్ని ఉద్ధరించేది ఉంది. సావుల మన్నువడ నాకు సావొత్తలేదు. అని తన్నుతానే నిందించుకునేది.

పరాయిలను పల్లెత్తు మాటనేది కాదు. ఆరాతీస్తే అమ్మనో నాయినో కోపగించినందుకు తన మాట పారనపుడు అలిగిన ముచ్చట తెలిసిపోవు. ఎల్తిపడకపోవు. నిండు కుండలాంటి గుణం. నివురు కప్పిన రేషం. నిలువెత్తు విలువగల నాయినమ్మ ఎట్లున్నదోనని బాధ నీడలా వెంటాడుతుంది. ఇరుసు మీద బండి చక్రం తిరిగినట్లు సంపత్‌లో నాయినమ్మ ఆలోచనలు సుడులై తిరుగుతున్నై.

సెలవులల్ల ఇల్లు చేరగానే ఎండిన చేనుకు నీళ్ళు పారిస్తే పానం బోసుకున్నట్లు పచ్చగా పరవశించు. నాయినమ్మ కోసం ఏది తీసుకొచ్చినా మాకింత పెట్టంది తినకపోవు. నీకని తెస్తే ఎందుకు పెడుతున్నవే అంటే మీరు తింటే కాదుబిడ్డా! నా

కడుపు నిండేదని వివరించేది. మనిషింత దానంలో దానమని పంచిపెట్టేది. పండో? ఫలమో? దాచిపెట్టింది తీసి నా బిడ్డకిచ్చు. రాంగనే నన్ను నాబిడ్డను పునికి చూసుకును.

ఊరు దగ్గరికి వచ్చింది. ఊళ్లె అనుభూతులు ఎగిసిపడుతున్నాయి. నాయినమ్మ కోమటి రంగయ్య ఇంటికాడా కొనిచ్చిన చెక్కరిగోలీలు. పీరీల పండుగకు బచ్చీసపేర్లు, జిలేబి సేకరించిన పదార్థాలు తన కొంగు ముడివిప్పి తినిపించేది. నాయినమ్మతో నడిచిన అడుగులు సిమెంటు రోడ్ అయినా చాలా స్పష్టంగా నాయినమ్మ ముద్రికలు కనబడుతూనే ఉన్నాయి.

బండి ఇంటి ముందట ఆగింది. తొవ్వలు చూసే నాయినవ్వ మంచంలో పండుకొని సంపతి సంపతి అని తన సంపదను కలువరిస్తుంది. తను నిర్మించుకున్న ఆత్మీయతల గుంపు నిర్వేదంగా చూస్తున్నారు. నేను దగ్గరికి పోయి నాయినమ్మ నాయినమ్మ అని పిలుస్తున్న. సం..పతి, సం ప తి అంటూ కలువరిస్తుంది.

తనకు ఒరిగించుకొని కూర్చున్న సంపతి భార్య ఏడుస్తుంది. తనకు ఏడుపు ఎగతన్నుకొస్తుంది. నాయినమ్మ నాయినమ్మా...అని పిలుస్తున్నడు. బల్మీటికి కండ్లు తెరుస్తుంది. మూస్తుంది. మల్లీ పిలిచి లేపిన. కండ్లు తెరిచింది. తను చెంచాతో పోస్తున్న పాలు తాగుతుంది. కండ్లు తెరుస్తుంది. మూస్తుంది. నేను సంపతినే. సంపతిని మాట్లాడుతున్న అనగానే కళ్లు తెరిచింది. ఏదో చెప్పాలనుకుంటుంది. ఏది చెప్పలేక పోతుంది. కళ్ళు మూస్తలేదు. తెరిచిన గాజు కళ్ళమీద సంపత్ చిత్రం కనబడుతుంది. ఉగ్గుబువ్వ,అన్నం తినపెట్టినది. కొసిరి కొసిరి తినపెట్టిన గుర్తులు ఒకటేమిటి? ఎన్నో గుర్తుకు వస్తున్నై. మా నాయినకు, నాకు నా బిడ్డకు తినపెట్టివు. నీకు తినపెట్టి నా ఋణం తీర్చుకుంట. తినే నాయినమ్మ. ఒక్క బుక్క, ఒక్క బుక్క జర్రతినే అని ఊహించుకుంటూ మనసు కన్నీళ్లను ఒలికిస్తూ తాగవెడుతున్నడు. తాగినట్లు అనిపిస్తలేదు. తాగే తాగు అని తలను ఊపుతున్నాడు.

అవ్వా! అవ్వా! అంటూ సంపతి తల్లి ఓ...అక్క తాగవ్వా! సంపతి సంపతి వచ్చిండు. అని చిన్నమ్మలు,పెద్దమ్మలు,అమ్మా! అమ్మా! అంటూ సంపతి భార్య కళ్లుతుడుచుకుంటూ దీనంగా పిలుస్తుంది. ఆమె చుట్టూ దడిగట్టుకున్నట్లు సుట్టు మంది వున్నరు. సంపత్ మనసు కార్చుతున్న కన్నీళ్లను చూసినోల్లు ఊకో బిడ్డా! ఊకో నాయినమ్మ కోసం చిన్నపిలగానివై పోతున్నవు. అని ముక్కు చీదుకుంటూ కన్నీళ్లు

కార్చుతూ ఓదార్చుతున్నారు.

అప్పట్దాకా కొంచెం కొంచెం తాగుతున్న జీవిగంజి గడగడా అని ఇవుతలికి వచ్చింది. కళ్లు తెరిచే ఉన్నాయి. సంపతి చేతుల్లో తలతిప్పుకొని వాలిపోయింది. రెండు చేతుల్లో నానమ్మ ముఖం అద్దుకొని ఎండిన కనకాంబరాల చెట్లమీద వాన చినుకులువడితే చిటపట చిత్తినట్లు సంపతి పక్కున పలిగి ఏడుత్తుండు. గుంపు గుండెల్లోని కన్నీటి దు:ఖం డ్యాం తెగిపోయింది. ఏడుపుల సంపతికి నాయినమ్మ సంపతి గుర్తోచ్చినపుడల్లా.......

దళిత శక్తి మాస పత్రిక ఆగష్టు, 2016.

తప్ష

అందరికీ ఉదయంతో దినచర్య ప్రారంభమవుతుంటే ఎ ా ల ె క ే ం న గ ే ం ె ల ో ని ఉద్యోగులందరికీ నడకతో దినచర్య ప్రారంభమవుతుంది. వర్షం కురువనీ, వరదలు పారనీ, చలి గజగజ వణికించనీ నడకను మాత్రం ఆపరు. ఉద్యోగులు కాలనీ సోసైటీగా ఏర్పడ్డరు. కాలనీవాళ్ళు కష్టసుఖాలను పంచుకుంటారు. పండుగలకు పబ్బానికి తోడుంటారు. ఆపదకీ సంపదకీ అండగుంటారు. కాలనీ వాసులను, వారి అనుబంధాల్నీ చూస్తే పక్క కాలనీ వాళ్లకీ అసహ్యం కలిగే విధంగా కలసిమెలసి ఉంటారు.

ఈ మధ్యకాలంలో కాలనీలో కొత్త ఇళ్ళు పుట్టుకొస్తున్నాయి. అందులో భాగంగా రాకేష్‌తో కాలనీ ఉద్యోగులు కూడా కలసి పోయారు. వెల్‌కంనగర్ కాలనీ చుట్టూ ప్రభుత్వ భూమిని అనుభవించిన వాళ్లు కొంత కొంత అమ్ముకుంటున్నారు. అది ఈనాం ఇచ్చిన భూమి, అమ్మినా కొన్నా శిక్షార్హమే అని తెలిసినా ప్రభుత్వ భూమిని కొంటున్నారు. కొన్నవెంటనే ఆ జాగలో చిన్నగ గుడిసె వేసుకొని కబ్జమీద ఉంటున్నారు. అలా కబ్జామీదికి వస్తారు. తిరుగుబాటు చేసి అమ్మిన భూమి మలుపుకుంటారని. లేదంటే వేరొకరికి అమ్ముతారు. ఇదంతా ఎందుకు అని కొన్నవారు తమ ఆర్థిక శక్తిని అనుసరించి కొన్నజాగలో చిన్నదో పెద్దదో రేకులతో గుడిసే వేసుకుంటారు. వెల్‌కంనగర్‌లో రిజిస్ట్రేషన్ జాగ గజానికి దాదాపు నాలుగువేల రూపాయలు దాకా పలికితే ఆ పక్కనే ఆనుకొని ఉన్న అసైన్ భూమిని కొనడానికి అయ్యే ఖర్చు దాదాపు రెండువేలు. రిజిస్ట్రేషన్ జాగ

కొనలేని వాళ్ళు అసైన్డ్‌భూమి కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. నర్సయ్య సార్ కూడా కొనాలనే ఆసక్తిలో ఉన్నాడు.

నర్సయ్య సార్‌ది దయనీయమైన స్థితి. చిన్నప్పటి నుండి రకరకాల కష్టాలను ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చాడు. వారానికి నాలుగు రోజులు పనికిపోయి కిందపడి మీదపడి నడువాల్సిన చోట పాకినట్లు పాసయిండు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా పెద్ద చదువులు చదువలేక వచ్చిన చదువును వదులుకోలేక బతుకు జట్కాబండి మూడడుగులు ముందటికి ఏడడుగులు వెనక్కిపోతుంది. నర్సయ్యకు ఎండలేదు. వానలేదు. ఎడ్డుర్కం లేకుంట పనికిపోయేటోడు. ఇంటర్‌లో మూడేండ్లు చదివాడు. ఎపుడొస్తదో తెలువని ఎండకాలం వానలోలే డిగ్రీ సదువుతున్నపుడు అనుకోకుండా మిగిలిపోయిన ఉపాధ్యాయ కొలువులు ప్రభుత్వహహవేసింది. గుడిసెలాంటి మిద్దె యింట్ల తనకంట్లో దీపం వెలిగించుకుని చదివాడు. పొద్దంతా పనికి రాత్రంతా ఆవలింపులు తీసుకుంటూ సదివేది సదివిండు. నర్సయ్యకు కొలువు వచ్చిందని జాండకాడ ముచ్చెట పెడ్తుంటే నమ్మినోడే లేడు. ఒర్రెక్క నర్సిగానికి ఎపుడొచ్చెరో కొలువు. ఎపుడు తట్టపార పట్టుకొని పనికి పోయెటోడు. ఎట్ల వచ్చెరో అనుకుంటూ ముక్కుమీద వేలేసుకొని ఆశ్చర్యపోయింద్రు. అన్నట్లు ఊరొల్లకే గాదు నర్సయ్యకు నమ్మకం లేదు. కొలువుల షేరీక్ అయిండు.

నర్సయ్య ఉద్యోగంలో భాగంగా కిరాయి రూంల కోసం తిరిగినపుడు కులవివక్ష కట్లపామై కలెవడ్డ అనుభవం కల్గినోడు. విసిగిపోయాడు. బాధపడ్డాడు. కోపగించుకున్నాడు. ఏం లాభం? పేదవాని కోపం పెదవులతీట అన్నట్లు అతనిలోని కోపం అతనిలోనే చల్లబడింది. దూర ప్రాంతాల్లో సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాల్లో అవసరం అవతారాన్ని మార్చింది గూడు. స్థానికంగా సంబంధాలు వుండవు కాబట్టి కులం తప్పు చెప్పినా పెద్ద ప్రభావం కనబలేదు. ఈ మధ్య జరిగిన బదిలీల్లో సిద్ధిపేట పరిసర ప్రాంతంలో పోస్టింగ్ తీసుకున్నాడు. ఇంటినుంచి పాఠశాల సమయానికి అందలేక సిద్ధిపేటలో నివాసము ఏర్పచుకున్నాడు. అనుకున్నదే తడవుగా రూంల కోసం వెతుకుతున్నపుడు కులం రకరకాలుగా వెంటబడి వేధించింది. రూం కిరాయికి యివ్వనని మొఖమ్మీదనే వెక్కిరించింది. ధిక్కరించింది. అంటారానిచ్ఛాయలు రకరకాలుగా బాధిస్తుంటే అగ్గువనో సగ్గువనో ఇంత జాగ కొనాలని నిశ్చయించుకున్నాడు. సిద్ధిపేటలో ఇండ్లు ఇయ్యని పరిస్థితి. అందుకోసమే ఏదో ఒకటి తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. జాగ తీసుకునే ముందు బాగా ఆలోచించి నేను పుట్టింది గుడిసెలో. పెరిగింది గడిసెలో. ఇవ్వాల్ల ఉ

ద్యోగం వచ్చినా గొప్పలు పోవద్దని తీర్మానించుకున్నాడు. అసైన్డ్ భూమిని తీసుకోవాలనుకున్నాడు. అగ్గువని కాదుగాని తన తాహత్తుకు తగినది ఆలోచించాడు. అప్పు సప్పో చేసి జాగ తీసుకొని రెండు రూంలు నాలుగు రేకులన్నట్లుగా గూడు నిర్మించుకున్నాడు. అందరితో పాటు ఆరోగ్యం మీది శ్రద్ధతో నడక సురువు చేసాడు. రాకేష్ సార్, నర్సయ్యసార్, వెంకయ్యసార్ వీళ్లు ఒకే గూటి పక్షులు వరుసలు కలుపుకోని సంబోధించు- కుంటారు. రాకేష్‌ది, వెంకయ్యది డాబా యిండ్లు. నర్సయ్యది మాత్రం రేకుల గడిసె. రోజూ ఉదయం నడక ప్రారంభం అవుతుంది. ఆదిలో పిల్లకాలువ లాగా ప్రారంభమై నదీ ప్రవాహం విస్తృత రూపమైనట్లుగా పోతున్న గుంపు అంతకు అంత రెట్టింపవుతుంది. ఊరుమీది సుద్దులు, ఉద్యోగాల మీది హద్దులు , గల్లీనుంచీ ఢిల్లీ దాకా రకరకాల చర్చలు జరుగుతుంటాయి. చర్చ పల్లెనుంచి ప్రారంభమై ప్రపంచమంతా తిరిగేది. వీటితో పాటు కాలనీలోని మంచి చెడులు చర్చకు వస్తుంటాయి. కాలనీలో ఉన్నత చదువులు చదువుతున్న వాళ్ల గురించి రకరకాల తగాదాలు అన్ని కాదేదీ చర్చకు అనర్హం అన్నట్లు ఉంటుంది. కాలనీలో నివాసమేర్పచుకొన్న వారి తలిదండ్రులు చనిపోతే జట్టుగా వెళ్లి పరామర్శిస్తుంటారు. రాజయ్యసార్ కాలనీ ప్రెసిడెంట్. రాజయ్యసార్ ఏది చెప్పినా అరటిపండు ఒలిచి నోట్లో పెట్టినట్టుంటది. కాలనీ వ్యక్తుల మధ్య చిన్నచిన్న మనస్పర్థలను తనే పరిష్కారిస్తుంటాడు. పరపతి ఉన్న వ్యక్తి. పైస ఉన్న వ్యక్తి. చెప్పొద్దుగానీ కాలనీని ముందుండి నడిపిస్తూ ఉంటాడు.

ఒకనాటి ఉదయము నడక సాగుతుంది. పెళ్ళిల సీజన్‌ల ముచ్చట అందుకున్నరు. “మా వదినె కొడుకుది పెళ్ళి ఉన్నది. అదే రోజున మా దోస్తు కొడుకు పెండ్లి ఉన్నది. ఈ రెండు పెళ్ళిళ్ళు కూడా ఒకే రోజున ఉన్నయి. ఏ పెళ్ళికి పోకున్నా బాధే అన్నట్లు ఉంది” అని రాజయ్య సారన్నడు.

“పెద్దమనిషివైతివి అందరి పండుగలకు హాజరు కావాలి సార్. అక్కరకు వచ్చెటోనివి తప్పకుండా పోవాలె.” అని నగేష్‌రెడ్డి సార్ అన్నడు. “అదే వున్నది పరేషాన్. రేపు మన కాలనీ కార్యదర్శి కన్నయ్య కొడుకుకు పూలు పండ్లు పెట్టెతందుకు పోవాలి. ఆ పెళ్ళి ఎన్నడొస్తదో?...” అని రాజయ్య సార్ అన్నడు.

“సార్ మీరేమనుకోను అంటే నాదొక మాట. మీరు రిటైర్ అయి పదేళ్ళు అయినా మా కంటే ఉషారుగున్నారు. మీరు పెళ్ళిల్లకు తప్పక హాజరు కావాలిసిందే.

ఎందుకంటే డ్యూటి పేరు చెప్పి తప్పించుకోవటానికి వీల్లేదు కదా సార్” అని రాకేష్ సారన్నడు.

రెండోరోజు నడకలో “నిన్న వరపూజకు వెళితిరిగదా? ఎన్నడొచ్చింది పెళ్ళి” అని వెంకయ్య సార్ అడిగిండు.

“మీరొస్తరేమో అనుకున్నాను. ఎవరూ రాలేదు.” తలా ఒక కారణం చెప్పి తప్పించుకున్నారు. అసలు విషయం ఏమిటంటే కాలనీ ప్రెసిడెంట్ చెప్పినంత గట్టిగాకార్యదర్శి కన్నయ్య చెప్పలేదు. చెప్పలేదు అనకుంట చెప్పాడు. పిలువలేదు అనకుంట పిలిచాడు. తేలికగా తీసుకొని ఈ ముగ్గురిలో ఎవరు పోలేదు.

“ముచ్చట సంబురాన కాలు కదులుతలేదు. స్పీడు పెంచుండ్రి” అని నర్సయ్య సార్ అన్నడు.

“అవును గని రాజయ్య సార్? పెళ్ళి ఎపుడు అని మేము అడుగుతే మీరు రాలేదు? అని రాజయ్య సార్ ముచ్చట పక్కతోవ పట్టిచుండు ఏంది? అని అనగానే తప్పెటట్లు లేదనుకొని నెత్తి గోక్కుంట ఎన్ని రోజులు ఏమున్నది సార్? ఇవాల్టి దినమే పెళ్ళి. ఆనాడు ఆనాడే. ఈనాడు ఈనాడే. నడమ ఆరు రోజులేనాయే? వారం రోజుల్ల పెళ్లి జరుపడం ఎంతైనా కొంత కష్టమే....” అని వివరించాడు రాజయ్య సార్.

“మగ పెళ్ళికి ఏం కష్టం సార్? పైసతోటి పని. పైస పేకో తమాషా దేఖో?పైసలుండాలెగని రావలసినవి అన్నీ పోన్‌లల్ల వస్తనే ఉంటయి అని నగేష్‌రెడ్డి సార్ అన్నడు. మగపెళ్ళి ఖర్చుకు ఆడపిల్ల కట్నం అందుతనే ఉండే. కష్టము ఉందంటే కేవలము ఆడపెళ్ళి వాళ్ళకే.” వెంకయ్య సార్ చెప్పిండు. అంతలోనే నర్సయ్య సార్ కల్పించుకొని ‘‘మనునంటే మార్గముంటది. నెలరోజులు సమయమున్న ఆఖరు వారం రోజులు ఆగమే ఉంటది.” అన్నడు.

“అవునవును” నగేష్‌రెడ్డి సార్ మద్దతు పలికాడు.

నాలుగో రోజు సమూహం నడుస్తున్నది. ఎటొచ్చినా చర్చ కన్నయ్య కొడుకు పెండ్లి గురించే. పెట్టుబోతలు. కొనుగోల్లు, షాపింగ్‌లు రకరాల చర్చకు తగినంత సామాగ్రి అయింది. ఐదో రోజు నాడు శుభలేఖలు పంపిణీ కార్యక్రమము ప్రారంభమైనది. పెండ్లికి వారం రోజులు కారు తీసుకున్నారనీ, కారులో ప్రయాణిస్తూ వెడ్డింగ్ కార్డ్స్

పంచారనీ చర్చ జరుగుతూనే ఉంది. ఆ రోజున కన్నయ్య దంపతులు ఇల్లిల్లు తిరుగుతూ బొట్టుపెట్టి శుభలేఖల్ని అందజేస్తూ కాలనీ మొత్తం ఆహ్వానం పలుకుతున్నారు. రాకేష్ సార్ ఇంటికి వెంకయ్య సారింటికి కూడా వెళ్ళారు.

కన్నయ్య దంపతులు ఇంటికి వచ్చి బొట్టు పెట్టి ఆహ్వానించడం ఎంతో ఆశ్చర్యానికి గురిచేసింది. రాకేష్ సార్ ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. తనను ఆహ్వానించగానే అంబేద్కర్ వాంఛించిన ప్రపంచం ఆవిష్కృతమైందన్న సంతోషంతో పొంగిపోతున్నాడు. ఈ సంతోషాన్ని ఎవరికో ఒకరికి చెప్పితే బాగుండునని ఉవ్విళ్ళూరుతున్నాడు. ఎపుడు చెప్పాలో్న అని ఆలోచిస్తున్నాడు. కన్నయ్య దంపతులు వెళ్ళిపోయిన కొద్దిసేపటికి నర్సయ్య ల ో డ ు ల ె డ ి వెళ్తున్నాడు. నర్సయ్య సార్‌ని చూసి “నర్సన్నా! ఓ...నర్సన్నా” అని పిలిచే సరికి విషయమేంటో తెలుసుకుందామని బండి ఆపి ఏమిటి అన్నట్లుగా చూసాడు. ఆగిన నర్సయ్య సార్ దగ్గరికి రాకేష్ ఇంట్ల నుంచి ఇవుతలికి త్వరత్వరగా వస్తున్నాడు. వచ్చీ రాగానే “అన్నా! ఎటుపోతున్నవే” అని ఆప్యాయంగా పలుకరిస్తున్నాడు.

“లోకల్‌కి పోతున్న అన్నా! ఒగసార్‌ని ఉండుమని చెప్పిన. అందుకోసమే వెళ్తున్న.” అని బదులుగా పలికిండు నర్సయ్య సార్. కన్నయ్య దంపతులు ఆహ్వానంలో తడిసి ముద్దయిన సంబూరంలో తనను తాను మరిచిపోయి, “అన్నా! కన్నయ్య సార్ వాళ్ళు కార్డ్ ఇచ్చిండ్రా?” అని అడిగాడు.

“లేదు, ఇవ్వలేదే?” అని ప్రశ్నార్థకం మొఖం పెట్టిండు నర్సయ్య సార్. ఒక్కసారిగా ఫ్లాష్ బ్యాక్ డిగ్రీ చదువుతున్న కాలంలోకి వెళ్ళిపోయాడు. చుక్క తెగినట్లు పోకపోక కాలేజికి పోయిన్నాడు ఆడిటోరియం హాల్లో విన్న కమ్యూనిస్టు ప్రసంగం స్ఫురణ కొచ్చింది పాత జ్ఞాపకం. రాకేష్‌ది, వెంకయ్యది, కన్నయ్యది, కాలనీ వాల్లందరిది బిల్డింగ్‌లు వాళ్లు ధనిక వర్గం. నాకు రేకుల షెడ్డు ఉంది. బీదవర్గం అని గుర్తుకు వచ్చింది.ఎటొచ్చి ధనికులంతా ఒక వర్గం. లేనివారంతా ఒక వర్గం అని విభజించుకున్నాడు. కయ్యానికైనా వియ్యానికైనా తగ్గ తహతుండాలి కదా? అయినా బిచ్చానికి పోయి ఆమిల్లు కరిసినట్లు పిలుచుడు పిలువక పోవడం పిలిచేవాళ్ల యిష్టం. నేను వారి స్థాయికి సరితూగలేదని యివ్వలేదా? ఇవాళ్ల యివ్వకపోతే రేపు కూడా యివ్వవచ్చు కదా? రాకేష్‌ని పిలిచి నన్ను పిలువక పోవటమేంటి. నన్ను కూడా పిలుస్తరు కావొచ్చు. అనే ఆశావాదా

దృక్పథంలో ఉన్నాడు. కొద్దిసేపు మౌనం ఆవరించుకున్నది.

"నర్సన్నా! ఏమో ఆలోచిస్తున్నవేందే?" అని అనగానే "ఏం లేదన్నా" అని బదులు పలికిండు. "ఒక కాలనీలో ఉంటంకదా? పోన్ జేసినా పోదాం ఏమంటవే అన్నా" అని రాకేష్ అన్నడు. 'లోపల ఆత్మగౌరవం పెల్లుబుకుతున్న రాకేషన్న మాటలకు ఎందుకు ఎదురు చెప్పాలి?' అనుకొని "సరే! సరే!" అన్నడు. ఇంకా సమాధానపడని రాకేష్‌తో "లక్ష్మయ్య సార్ పిలుస్తే మనం పోలేదా? మేం యింటి వద్ద లేనపుడు శు భలేఖ ఇంటి తలుపుకు పెట్టాడు. మనకంటే ఎంతో పెద్దవాడైనా మర్యాద పూర్వకంగా పోన్ జేసి రమ్మనందుకు తప్పకుండా వెళ్ళితిమి. అన్నా వెళ్ళాలి. అక్కడ సార్ నా కోసం ఎదురు చూస్తున్నాడు." అంటూ బయలదేరాడు.

బజాట్ల నుండి వెళ్తున్న రాకేష్ సార్‌కి సందిగ్ధం అలుముకుంది. బ్రిటిష్ వాని విభజించు పాలించు విధానమా? మనువుగాని కుల మారణహోమమా? నర్సయ్య సార్‌ని ఎందుకు పిలువలేదు? నన్నెందుకు పిలిచాడు? ఆలోచిస్తూన్నాడు. మరునాడు ఉదయం రాకేష్ భార్య "ఏమైంది నిన్నటి నుండి ఆలోచనల పడ్తున్నావు?" అని అడిగింది.

"ఏమి లేదే? మనల పెళ్ళికి పిలిచారు కదా! నర్సయ్య సార్‌ని పిలువలేదట. అందుకే ఆలోచిస్తున్న." అని రాకేష్ అన్నడు.

"మనల్ని పిలిచింద్రని సంకలు గుద్దుకుంటున్నవా? ఆగయ్యగౌడ్ వాళ్ళు మనం పక్క పక్కకు ఉంటం. వాళ్ల మనవడిని మన పిల్లలు ఆడిస్తరు. వాళ్ళమనం మంచిగుంటమని ఆగయ్యగౌడ్ భార్య తారవ్వ ప్రోద్భలంతో ఇచ్చినట్టే ఉన్నరు. కన్నయ్య సారోల్లు ఇష్టపూర్వకంగా ఇచ్చినట్టు అనిపించలేదు. తారవ్వ కూడా పెండ్లికి ఇద్దరం పోదాం వదినా? అని నన్నూ ఎగేసింది. నేను వెళ్లుదునా? వద్దా? అన్న సందేహము నుంచి తేరుకోక ముందే ఇంతగా పిలిస్తే సరే పోదామనుకొన్న. పోయేటపుడు కల్సి పోదామన్నది. నాకు చెప్పక చెయ్యక వెళ్లిపోయింది. నన్నింతగా రమ్మని ఒంటరిగా వెళ్లి పోయిందని నేనూ ఆలోచిస్తున్న. ఏమన్న కాని అని తారవ్వ కోడల్ని పిలిచి అడిగితే పసువులు ముట్టడానికి మీతో పోతాని అన్నది. మీ దగ్గరికి రాలేదా? అని ఎదురు ప్రశ్నేసింది. అబ్బా! చెప్పుతాన్నది. చెప్పకుంటనే పొయ్యిందా? నేను ఆలోచించి ఆలోచించి మరిచిపోయిన. కన్నయ్య సారోల్ల భార్య తారవ్వ వాల్లింటికి వచ్చి ముచ్చట్ల మునిగిపోయిందట. తారవ్వ మనువడిని ఎత్తుకరానుమన సుజాత వెళ్లింది. వాళ్ల

ముచ్చట్లను గమనించుకుంట పక్కకు జరిగి కనబడకుంట అన్ని విన్నదట.

“ఏమనుకున్నరట్నే....?” అని పూర్తిగా చెప్పక ముందే ఆతృంగా అడుగుతుండు రాకేష్. నీ ఉరుకులాటంత ఉట్టిసంచికాడ మేల్కతోటి ఉన్నట్టె. చెప్పుతుంటే నడ్మ అడ్డగాళు ఏస్తున్నవేంది? అని ప్రశ్నించింది రాజమణి. సుజాత విని ఆ ముచ్చట మరుగున పెట్టి అమ్మా! మనం ఆ పెళ్ళికి పోవద్దే అన్నది. సుజాత ఎందుకు వద్దంటున్నదో ఆలోచిస్తూ “సరే తియ్యి బిడ్డా! ఇవ్వాల్ల మనకు ఇరుకోడులో ఇంకో పెళ్లిలేదా? మన చుట్టాలది అని చెప్పిన. తర్వాత నిదానంగా ఎందుకు వద్దంటున్నవురా? అని అడిగినా కొద్దిసేపట్దాక చెప్పలేదు. మళ్లీ మళ్లీ అడిగిన. గుండెలు కాదు రాతి బండలు బద్దలయ్యే ముచ్చట చెప్పింది. కన్నయ్య భార్య కమల తారవ్వని పిలిచి వదినా? వదినా? మనకు మంచిది కావాలె? పసుపులు ముట్టెకాడ్కి గావాల్లు ఎందుకు? నువ్వే చెప్పు వదినా? వాళ్ళూ వీళ్ళూ ఏమనుకుంటరు? బయటికి అనకున్నా లోపట అనుకోరా? పసుపులు ముట్టెతందుకు నువ్వొక్క దానివే రా! వాళ్ళకు ఎట్లాగో పెళ్ళికి రమ్మని చెప్పినం. పెళ్ళికి వస్తరు. పచ్చని పందిట్లకు రాశిమీద ఎవరు వచ్చినా తప్పుకాదు కనీ నువ్వైతేనేరా అని చెప్పి వెళ్లిపోయిందట. కమల చెప్పింది చెప్పినట్లు తూ.చ తప్పకుండా తారవ్వ జేసింది. పిలువలేదనకుంట పిలిచినట్లే పిలిచింది. పోలేదు అనకుంట మనం పోతే పోదాం, లేకుంటే లేదు.” అని చెప్పింది.

“అమ్మీ! పోనందుకో బిడ్డా!” అని సుజాతను పిలిచాడు. కూతురు పోన్ తెచ్చి యివ్వగానే వెంకయ్య సార్ నంబర్ తీసి డయల్ చేసి

“హల్లో ఎంకన్నా! కన్నయ్య సారోల్లు పెండ్లికి పోదామా?” అని అడిగాడు.

‘‘అందరికేమో కన్నయ్య దంపతులు ఇంటికి వచ్చి, బొట్టు పెట్టి ఆహ్వానించిండ్రాటా? నాకేమో మన కాలనీ ఊడుస్తడు సూడు సత్తయ్యతో పంపిండు అన్నా! ఎవలన్నా మనోల్లకు యిచ్చిండ్రా? పోదామా లేదా? అని ఆలోచిస్తున్నాను.” అని వెంకయ్య సార్ అన్నాడు.

“అన్నా నువ్వు, నేను నర్సన్న కలుసుకుందాం. తరువాత పోదామా? వద్దా? డిసైడ్ చేసుకుందాం’’ అని పోన్ పెట్టేశాడు.

కొద్దిసేపటికి ముగ్గురు కలుసుకున్నరు.

"నిన్నొక తీరు. నన్నొక తీరు పెండ్లికి పిలిచారు. నర్సన్నను యిప్పటి వరకు పిలువలేదు. మనకంటే మృదు స్వభావి. ఎవరినీ నొచ్చిన నోట మాట అనడు. అందరితో వినయంగా మెదులుతుంటాడు. విలువ యిచ్చేటోడు మనము అస్సలే పోవద్దు. ఏమంటవు అన్నా" అని రాకేష్ అన్నడు.

"అసలే మనము చుట్టూ పగదారుల నడుమ ఉన్నం. మనము మరింత ఎదురు తిరిగితే మరింతగా మంది మనకు పగదార్లు అవుతరు. శత్రువులు పెరుగుతరు.పాలకూరలో పాలు, నేతిబీరలో నేతి ఉన్నట్లు సమాజంలో కూడా కుల వివక్షా లేదు అంటే అంతే నమ్మశక్యంగా ఉంది. కుల పిచ్చి ఎందెందు వెతికినా అందందే గలదు అన్నట్లుగా ఉంది" అని వెంకయ్యన్నడు.

"మీరు వెళితే వెళ్లండి కానీ నేను రాను. పెద్దలు చెప్పిన మాట విలువలేని చోట నిలువ కూడదన్నారు కదా! ఇక మీ యిష్టం. వాళ్లు నన్ను పిలువాలని రూలేం లేదు. పిలువనంత మాత్రాన బాధ పడేది లేదు. పిలుస్తే సంతోషపడేది లేదు. "అంబేద్కర్ చెప్పాడు కృతజ్ఞతా పూర్వకంగా పురుషుడు తన ఆత్మగౌరవవాన్ని, స్త్రీ తన శీలాన్ని, దేశం తన సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టొద్దంటాడు కదా! పిలువకపోతే బాధపడేదిలేదు? కొపపడవల్సింది కూడాలేదు.   అలిగేదిలేదు? పిలిస్తే వాళ్లు మీరు వెళ్లండి" అని నర్సయ్య అన్నడు.

లేదన్నా! పోతే అందరం పోదాం. లేకుంటే లేదు.

ఆ మహానీయుడు అంబేద్కర్ బాటలో ఆత్మ గౌరవంతో అందరం నడుద్దామని తప్ష చేసుకున్నారు.

(దళిత శక్తి మాస పత్రిక సెప్టెంబర్ 2016లో ప్రచురితం)

గమ్యానికి చేరువలో మా యాదగిరి

విజయాలను అడ్డుకునేవి ప్రతికూల ఆలోచనలే. కింద పడ్డావని ప్రయత్నం ఆపితే ఎన్నటికీ లక్ష్యాన్ని చేరుకోలేము. గమ్యాన్ని చేరుకోవడానికి రెండే మార్గాలు. ఒకటి స్వశక్తి, రెండు పట్టుదల. ఇవి రెండు కల్గి వున్నప్పుడే అనుకున్నది సాధించవచ్చును.

మాకు మా సిద్దెంకి యాదగిరిని చూసినపుడల్లా పై హితోక్తి స్ఫురణ కొస్తుంది. మా యాదగిరి స్వయంకృషితో ఎదిగినవాడు. గ్రామంలో విద్యనభ్యసిస్తున్న రోజుల్లోనే తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా సహాయం చేసేవాడు. వాళ్ల అమ్మ నాన్న అమృతమూర్తులు. తాను వారికి ఏకైక సంతానం. వ్యవసాయంతో పాటు చదువు, వివిధ పనులు కూడా చేసేవాడు. మేము అతి దగ్గరగా సన్నిహితంగా ఉండడం వలన సిద్దెంకి రాజయ్య, లచ్చవ్వలు అందరికి తలలో నాలుకగా మెదులుతూ, శ్రమను నమ్ముకొని వారి కుమారుడిని విద్యావంతుడిని చేసారు. వారి కలలను నిజం చేస్తూ యాదగిరి ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధి నిర్వహిస్తున్నాడు. తెలుగు బోధనపట్ల, సాహిత్యం పట్ల అమితమైన ప్రేమ, పట్టుదల గల వ్యక్తి. ఇంతకు ముందే రెండు కవితా సంపుటాలను 'మా తొవ్వ', 'బతుకు పాఠం' లను ప్రచురించాడు. ఇప్పుడు మూడవ పుస్తకం 'తప్ష' కథా సంపుటితో మన ముందుకు వస్తున్నాడు. ఇంతకు ముందువలెనే ఈ పుస్తకాన్ని కూడా ఆదరించాలనీ కోరుతున్నాం.

మా గ్రామంలో సాహిత్యం వాసనలు అబ్బినది మొదట గజ్జెల కనకరాజు. ఆ తర్వాత సిద్దెంకి యాదగిరి. వీరిద్దరు తెలుగును పాఠశాల స్థాయిలో బోధించే వారే. సిద్దెంకి యాదగిరి గ్రామానికి, తల్లిదండ్రులకు, మంచిపేరు తేవాలనీ, వారి కలం అనేక ప్రక్రియల్లో రచనలు చేయాలనీ, మరింత ఉన్నత స్థాయికి ఎదుగాలనీ, ఎదుగుతారని

ఆకాంక్షిస్తున్నాము. దేహానికి తప్ప
దాహానికి పనికిరాని ఆ సముద్రపు కెరటాలే
ఎగసి ఎగసి పడుతుంటే...
తలుచుకుంటే...
నీ తలరాత ఇంత అన్నవాళ్ళు కూడా
నీ ముందు తలదించుకునేలా చేయగల సత్తా నీది
సృష్టిలో చలనం ఉన్నది ఏదీ ఆగకూడదు
పారే నది
వీచే గాలి
ఊగే చెట్టు
ఉదయించే సూర్యుడు
అనుకున్నది సాధించాలని నీలో కసికసిగా
ప్రవహించే నెత్తురుతో సహా...
ఏదీ ఏదీ మరేదీ
ఆగిపోవటానికి వీల్లేదు...
చెమట చుక్కలని చిందిస్తేనే చరిత్రను
రాయగలవనీ తెలుసుకో
నీ కోసం ఆరాటంగా వున్న మీ అమ్మ నాన్న
సమాజపు కళ్ళలో మరింత వెలుగులు నింపేలా
నీ ఆరాటం ఉండాలనీ ఆశిస్తూ,
దీవిస్తూ.....

కూర మాణిక్యరెడ్డి
(ఎం.పి.పి. చిన్నకోదూరు)
కూర మహేందర్ రెడ్డి,
కూర మధుసూధన్ రెడ్డి.

డా. కూర రామ్మోహన్ రెడ్డి.(గోనెపల్లి),
టీఎస్‌పీఎస్సీ సభ్యులు
కూర రవీందర్ రెడ్డి, కూర రఘోత్తం రెడ్డి,
కూర రత్నాకర్ రెడ్డి, కూర రాజేందర్ రెడ్డి.

'గిరి'గీసి బరిలో నిలిచే అస్తిత్వ కథలు

స్పష్టమైన మాటలో చెప్పాలంటే హిందువులు మతం అని చెప్పుకునేది వాస్తవంలో (అది) చట్టం. దాపరికం లేకుండా చెప్పాలంటే ఈ శాసనాల స్మృతిని (కోడ్ ఆఫ్ ఆర్డినెన్సెస్) మతంగా పేర్కొనడానికి నేను అంగీకరించను.

– అంబేద్కర్

అంబేద్కర్‌కు కులం, కులసమాజం పట్ల ఒక కచ్చితమైన అవగాహన ఉండింది. కుల నిర్మూలన జరగాలని చెప్పినా, కులానికి నేర స్వభావం ఉంటదని ఆయన భావన. కులానికున్న నేర స్వభావాన్ని అర్థం చేసుకునేముందు అసలు నేరమంటే ఏమిటనేది తెలుసుకోవాలె.

చూస్తుంది. అందువల్ల పేదలు ముఖ్యంగా కిందికులాల వాండ్లు తమ సంపాదనలో సింహభాగం లిక్కర్‌షాపుల్లో తగలేస్తున్నరు. ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలు చేపట్టినా అవి మళ్ళీ లిక్కర్ రూపంలో గవర్నమెంట్, కాపిటలిస్టుల అకౌంట్లలోకే వెళుతున్నయి. ఒక వ్యక్తి జేబులో వెయ్యి రూపాయలుంటే దాన్ని ఎట్లా ఉపయోగించాలి స్పష్టమైన మాటలో చెప్పాలంటే హిందువులు మతం అని చెప్పుకునేది వాస్తవంలో (అది) చట్టం. దాపరికం లేకుండా చెప్పాలంటే ఈ శాసనాల స్మృతిని (కోడ్ ఆఫ్ ఆర్డినెన్సెస్) మతంగా పేర్కొనడానికి నేను అంగీకరించను. – అంబేద్కర్

* * *

ఇవ్వాళ వర్గీకరణ ప్రధాన సమస్య. కాదు అసలైన పరిష్కారం. దీనికి రాజ్యాంగబద్ధంగా పరిష్కారం దొరకనట్లయితే హింస చెలరేగే ప్రమాదముంది. ఓపికకు

కూడా ఒక హద్దుంటది. దళితులు సంఘటితం కాకుండా అడ్డుకునేందుకు అగ్రకులాల వాండ్లు 'వర్గీకరణం' ముందటేసింద్రని కొందరు వాదిస్తున్నరు. అయితే వర్గీకరణ ఎంత న్యాయమైందో సిద్దెంకి యాదగిరి ఈ కథల్లో చెప్పిండు. ఒక్క వర్గీకరణే కాదు ప్రత్యేక తెలంగాణోద్యమాన్ని రికార్డు చేసిండు. గ్రామాలకు తరలండి అని వామపక్ష భావజాల మేధావులు ఇచ్చిన పిలుపునందుకొని యూనివర్సిటీ చదువుల్ని వదిలి అడవుల్లోకి పోయిన అన్నలు అమరులయ్యింద్రు. ఇవ్వాళ తన తమ్ముళ్ళు, చెల్లెండ్లు ఆ దారిన పోవొద్దని ఐఐఐటిలకు, బడులకు తరలాలని యాదగిరి ఒక టీచర్‌గానే కాదు, సాహితీవేత్తగా న్యాయమైన పిలుపునిచ్చిండు. ఆత్మగౌరవానికి ఎక్కడ భంగం కలిగినా, వివక్ష ఎక్కడ చోటు చేసుకున్నా దాన్ని కథలుగా మలిచిండు. దోస్తీని, నాయినమ్మని నోస్టాల్జియాగా యాద్జేసుకుండు. 'కీలెరిగి వాత పెట్టిండు'. 'పంచుకోంద్రి' అంటూ 'బుద్దిమాట' చెప్పిండు. 'లెక్కలు'తీసి 'బోధ' చేసిండు. 'సందిగ్ధం' నుంచి 'మార్పు'కు పయనిస్తూ 'తప్ప' చెప్పిండు.

ఈ కథలు రాయడానికి సిద్దెంకి యాదగిరికి ఆయన సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక స్థితిగతులే గాకుండా తాను పుట్టి పెరిగిన సిద్దిపేట పరిసర ప్రాంతాలు, ఉస్మానియా విశ్వవిద్యాలయం అక్కడి రాజకీయాలు తోడ్పడ్డాయి. రెండున్నర దశాబ్దాలు వెనక్కి వెళ్ళి నట్లయితే ఈ కథలకు మూలాలు దొరుకుతాయి. తెలంగాణ సమాజంలో చోటు చేసుకుంటున్న మేలైన మార్పులకు తొవ్వ తెలుస్తది. అప్పుడు సిద్దెంకి యాదగిరి కథలను, కథకుడిగా ఆయన స్థానాన్ని లోకేట్ చేయడానికి వీలయితది. ఇవ్వాళ వర్గీకరణ ప్రధాన సమస్య. కాదు అసలైన పరిష్కారం. దీనికి రాజ్యాంగబద్ధంగా పరిష్కారం దొరకనట్లయితే హింస చెలరేగే ప్రమాదముంది. ఓపికకు కూడా ఒక హద్దుంటది. దళితులు సంఘటితం కాకుండా అడ్డుకునేందుకు అగ్రకులాల వాండ్లు 'వర్గీకరణం' ముందటేసింద్రని కొందరు వాదిస్తున్నరు. అయితే వర్గీకరణ ఎంత న్యాయమైందో సిద్దెంకి యాదగిరి ఈ కథల్లో చెప్పిండు. ఒక్క వర్గీకరణే కాదు ప్రత్యేక తెలంగాణోద్యమాన్ని రికార్డు చేసిండు. గ్రామాలకు తరలండి అని వామపక్ష భావజాల మేధావులు ఇచ్చిన పిలుపునందుకొని యూనివర్సిటీ చదువుల్ని వదిలి అడవుల్లోకి పోయిన అన్నలు అమరులయ్యింద్రు. ఇవ్వాళ తన తమ్ముళ్ళు, చెల్లెండ్లు ఆ దారిన పోవొద్దని ఐఐఐటిలకు, బడులకు తరలాలని యాదగిరి ఒక టీచర్‌గానే కాదు, సాహితీవేత్తగా న్యాయమైన పిలుపునిచ్చిండు. ఆత్మగౌరవానికి ఎక్కడ భంగం కలిగినా,

వివక్ష ఎక్కడ చోటు చేసుకున్నా దాన్ని కథలుగా మలిచిండు. దోస్తిని, నాయినమ్మని నోస్టాల్జియాగా యాద్జేసుకుండు. 'కీలెరిగి వాత పెట్టిండు'. 'పంచకోండ్రి' అంటూ 'బుద్ధిమాట' చెప్పిండు. 'లెక్కలు'తీసి 'బోధ' చేసిండు. 'సందిగ్ధం' నుంచి 'మార్పు'కు పయనిస్తూ 'తష్వ' చెప్పిండు. ఈ కథలు రాయడానికి సిద్దెంకి యాదగిరికి ఆయన సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక స్థితిగతులే గాకుండా తాను పుట్టి పెరిగిన సిద్ధిపేట పరిసర ప్రాంతాలు, ఉస్మానియా విశ్వవిద్యాలయం అక్కడి రాజకీయాలు తోడ్పడ్డాయి. రెండున్నర దశాబ్దాలు వెనక్కి వెళ్ళి నట్లయితే ఈ కథలకు మూలాలు దొరుకుతాయి.

తెలంగాణ సమాజంలో చోటు చేసుకుంటున్న మేలైన మార్పులకు తొవ్వ తెలుస్తది. అప్పుడు సిద్దెంకి యాదగిరి కథలను, కథకుడిగా ఆయన స్థానాన్ని లొకేట్ చేయడానికి వీలయితది. 1990వ దశకం ఇండియాలో అనేక కొత్తమార్పులకు వేదికయింది. గ్లోబలైజేషన్– ప్రపంచీకరణ పురుడు పోసుకుంది. మండల్ రిజర్వేషన్లు ఓబీసిలకు విద్య, ఉద్యోగావకాశాల్ని కేంద్రస్థాయిలో కల్పించాయి. 1992లో మండల్ రిజర్వేషన్స్‌కు వ్యతిరేకంగా కొంతమంది అగ్రకులాల వాండ్లు, ఎబివిపి లాంటి విద్యార్థి సంస్థలు చేసిన అలజడి కింది కులాల వారిని మరింతగా సంఘటితం చేశాయి. అయితే ఈ సందర్భంగా విద్యార్థులను కూడగట్టి రిజర్వేషన్లకు అనుకూలంగా సభలు, సమావేశాలు పెట్టడంలో దళితులే నాయకత్వ స్థానంలో ఉండి పనిచేశారు. అట్లాంటి వారిలో ఇప్పటి తెలంగాణ పబ్లిక్‌సర్వీస్ కమీషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి ఒకరు. ఆయనతో కలిసి ఉస్మానియా మెడికల్ కాలేజితో పాటు ఎన్నో సమావేశాల్లో నేను (సంగిశెట్టి శ్రీనివాస్) కూడా పాల్గొన్నాను. ఈ ఉద్యమంలో దళితులు, బీసిలు కలిసి పనిచేశారు. రిజర్వేషన్లకు అనుకూలంగా కవితా సంకలనాలను వెలువరించారు. ఇది ఒకవైపు ఇలా కొనసాగుతుండగానే హిందూత్వ వాదులు బాబ్రీ మసీదుని కూల్చి వేసింద్రు. ఒక చారిత్రక కట్టడాన్ని మతోన్మాదులు మాయం జేసింద్రు. అయితే అంతకన్నా వందలు, వేల రెట్లు ఆ సంఘటన ముస్లింలను సంఘటిత పరిచింది. ముస్లిముల ఓట్లన్ని పోలరైజ్ కావడానికి బాబ్రీ మసీదు తోడ్పడింది. ఇది కొంతమంది హిందూత్వ వాదులకు కూడా మేలు చేకూర్చింది. అయితే దీని వల్ల అభద్రతా భావానికి లోనైన ముస్లింలు దేశ వ్యాప్తంగా ఒక్కటయింద్రు. మరోవైపు బొంబాయి లాంటి ఘటనల్లో పాణాలు కోల్పోయింద్రు. ఇదే కాలంలో దేశవ్యాప్తంగా దళితులపై దాడులు

పెరిగినయి. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా అధికారంలోకి వచ్చిన కమ్మల నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ తమకులం బలంతో కారంచేడు ఘటనకు తెరదీసింది. ఈ సంఘటన 1985లో జరిగింది. కమ్మలకు మేమేమి తక్కువ కాదు అనే విధంగా రెడ్లు 'చుండూరు' ఘటనలో 1991లో దళితులను ఊచకోత కోసింద్రు. మెదక్ జిల్లా నారాయణఖేడ్‌లో కూడా దళితులపై దాడులు జరిగినయి. ఈ సంఘటనలు దళితులు తమ హక్కుల గురించి మాట్లాడేలా చేసింది. కార్యాచరణకు పురిగొల్పింది. ఈ కార్యాచరణ కొత్త విప్లవానికి తెరదీసింది. తుపాకి కాదు... పుస్తకం చేతిలో ఉండాలె అనే చైతన్యం కారంచేడు, చుండూరు హత్యలు, ఆ హత్యల నుంచి వచ్చిన సోయి తీసుకొచ్చింది. విప్లవం ఎప్పుడొస్తదో తెలియదు గానీ గద్దర్ దళిత పులులమ్మా అంటూ గానం చేసిండు. మావోయిజం దళితులకు స్మృతి గీతాలు తప్ప మరేమీ ఇవ్వబోదనే అనుభవం ఇచ్చింది. గోరటి వెంకన్న బహుజన సోయితో ఈ కాలంలోనే అనేక పాటలల్లిండు. పాడిండు. బి.ఎస్.రాములు, కంచె ఐలయ్య, ననుమాస స్వామి లాంటి బీసీలు ఈ సారి దళితులకు అండగా నిలబడ్డరు. ఇందులో మాస్టార్జీ, బోయజంగయ్య లాంటి దళితులూ ఉన్నరు. బీసీల నాయకత్వంలో పనిచేసిన ఈ సంఘం పాటలు, పత్రికలు, కథలు, ఉపన్యాసాలు, బుక్‌లెట్స్ ద్వారా దళిత సమాజంలో చైతన్యానికి పాదులు తీసింద్రు. దళితులు-బీసీలు కలిసి పనిచేయడానికి అదీ ఆయుధాల అవసరం లేకుండా పనిచేయడానికి ఈ సంఘం వీలు కల్పించింది. దాదాపు ఇదే సమయంలో జనశక్తి రాజకీయాల నుంచి బయటికి వచ్చిన వీరన్న మే-17 గ్రూప్ పేరిట కులాన్ని, విప్లవాన్ని మేళవించి ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టిండు. తెలంగాణ మహాసభను ఏర్పాటు చేసిండు. దీని తర్వాత తెలంగాణ స్లోగన్‌ని అందుకున్నది పీపుల్స్ వార్. తెలంగాణ జనసభ స్థాపితమయింది.

దాదాపు ఇదే కాలంలో అన్ని విద్యాసంస్థల్లో ఎన్టిరామారావు ముఖ్యమంత్రిగా ఎన్నికలను రద్దు చేసిండు. అంతేగాదు రాడికల్ స్టూడెంట్స్ యూనియన్‌ని నిషేధించింద్రు. అయితే తమ ఉనికిని కాపాడుకునేందుకు కొంతమంది విప్లవ సానుభూతిపరులు ఉస్మానియా వర్సిటీలో తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్‌ని ఏర్పాటు చేసింద్రు. దీంట్లో నేనుకూడా పనిచేసిన. తర్వాత టిఎల్ఎస్‌వో, దళితుడైన కాసిం నాయకత్వంలో తెలంగాణ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఏర్పడింది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, దరకమే, మారోజు వీరన్న, తెలంగాణ జనసభ

తదితర సంస్థలు తొలిదశలో పత్రికలు, బుక్‌లెట్స్, చర్చలు, సభలు, సమావేశాల ద్వారా ఉస్మానియాలో చదువుకుంటున్న విద్యార్థులను చైతన్యవంతుల్ని చేసింద్రు. అలిశెట్టి ప్రభాకర్ పెయింటింగ్స్‌ని ప్రదర్శనకు పెట్టింద్రు. ఆధునిక ఆలోచన, సబాల్టర్న్ దృక్కోణం, అస్తిత్వ సోయి పాఠాలు నేర్పింది. దాంతో అప్పటి వరకూ మావోయిష్టులతో అంటకాగిన నేతలు బయటికొచ్చింద్రు. అది శివసాగర్ కావొచ్చు. ఆయన అనుచరులు కావొచ్చు. బి.ఎస్. రాములు కూడా కావొచ్చు. ఇట్లా పీపుల్స్‘వార్’నుంచి బయటికొచ్చిన బి.ఎస్.రాములు కొంతమందిని కలుపుకొని ‘దళిత రచయితలు కవులు కళాకారులు మేధావుల’ సంఘాన్ని ఏర్పాటు చేసిండు. తొలిదశలో ప్రత్యేక తెలంగాణతో మమేకమైన వారందరూ కొంత వామపక్ష భావజాలమున్న వారే కావడం విశేషం. వీళ్ళంతా తెలంగాణ జనసభకు కార్యకర్తలు కూడా! ఇదే కాలంలో రాజన్న గ్రూప్ డఫోడమ్ అనే సంస్థను, కులాన్ని, విప్లవ రాజకీయాలతో జోడించి నడిపేందుకు ప్రయత్నం చేసినారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘాలు, ఉద్యమాలు, కేశవరావు జాదవ్ సార్ లాంటి వారి తెలంగాణ బోధనలు విద్యార్థుల్ని తెలంగాణ వైపు మళ్ళించాయి. తర్వాతి కాలంలో జయశంకర్, మధుసూధన్ రెడ్డి, గడ్డం లక్ష్మణ్, పి.ఎల్.విశ్వేశ్వరరావు, సింహాద్రిలు ఉస్మానియాలో, కాకతీయలో బియ్యాల జనార్ధనరావు, ప్రొఫెసర్ వినాయకరెడ్డి, నాట్యకళ ప్రభాకర్, మేచినేని కిషన్‌రావు తదితరులు ఉద్యమాలు నడిపించింద్రు. ఇగో ఈ సందర్భంలో 1990వ దశకం చివర్లో సిద్దెంకి యాదగిరి ‘దరువు’ కళాబృందం ద్వారా తెలంగాణ ఉద్యమంలోకి వచ్చిండు. దళితోద్యమానికి అండగా నిలిచిండు. తన తోటి సమాజాన్ని చైతన్య పరిచిండు. కారంచేడు దుర్మార్గం తర్వాత ప్రజాస్వామిక, హక్కుల సంఘాల ఒత్తిడి మేరకు కేంద్రంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం రూపొందింది. వివిధ హక్కుల, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు, మీడియా, సాహిత్యకారుల కృషి ఫలితంగా దక్షిణాఫ్రికాలోని దర్బన్‌లో సదస్సు జరిగింది. ఇందులో దళిత సమస్యను చర్చకు పెట్టింద్రు. 2007లో జరిగిన ఈ సదస్సులో తెలంగాణ నుంచి దళితులు, ప్రత్యేక తెలంగాణ వాదులూ పాల్గొన్నరు. ఇండిజీనియస్ సమస్యకు ఇంటర్నేషనల్ ఎక్స్‌ప్లోజర్ దొరికింది. గాయపడ్డ గుండెలకు ఉపశమన లేపనం దొరికింది. ఈ ఉపశమనం విద్యావంతుల్లో చైతన్యం తీసుకొచ్చింది. ఆ చైతన్యాన్ని సంస్థలు, సంఘాలు, రచనలు, పత్రికలు, పాటల రూపంలో మరింత దగ్గర చేసినారు. అట్లా కళాబృందం, రచనల ద్వారా

దళితోద్యమానికి, ఆ తర్వాతి కాలంలో తెలంగాణోద్యమానికి ఊపిరులూదినవాడు సిద్దెంకి యాదగిరి. ఇప్పుడు తన అనుభవాలను అక్షరాలుగా మలిచి కథలుగా మనముందుంచిండు.

సిద్దెంకి యాదగిరి కథల్లో నక్సలైట్ ఉద్యమానంతర జీవితం రికార్డయింది. ఇందులో ప్రత్యేక తెలంగాణోద్యమం, దళితోద్యమం కలెగలిసి ఉన్నయి. తెలంగాణ సోయి విస్తృతమైన తర్వాతే ఈ కథలు రూపుదిద్దుకున్నాయి. ఈ కథల్లో ఆత్మగౌరవం, స్వయంపాలన కోసం కొట్లాడిన (అప్పటికి కొట్లాడుతున్న) తెలంగాణ సమాజానికి ముఖ్యంగా దళితులకు విద్యావశ్యకత దాని ప్రాధాన్యతను సక్సెస్ స్టోరీస్‌గా చెప్పిండు. ఇండియా 'అభివృద్ధి' చెందుతున్నా దళితులపై నిరంతరం లైంగిక దోపిడి, హింస, దౌర్జన్యం జరుగుతున్న తీరుని విప్పి చెప్పిండు. అంతేగాదు దళితులు తమ ఉపకులాల పట్ల చూపించే వివక్షనూ, మూఢ నమ్మకాలను ఎత్తి చూపిండు. వర్గీకరణ ఉద్యమాన్ని భిన్న కోణాల్లో ఆవిష్కరించిండు. వర్గీకరణను సమర్థిస్తూ కథలు రాసిన అతి తక్కువ మందిలో యాదగిరి ఒకడు.

తెలంగాణోద్యమం ఊపందుకున్న తర్వాత దళితోద్యమం కొంచెం వెనుక తట్టు బట్టింది. నిజానికి తెలంగాణలోని సబ్బండ కులాలకు చెందిన కవులు, రచయితలందరూ ముందు భౌగోళిక తెలంగాణ కోసం కొట్లాడిండ్రు. అయితే యాదగిరి మాత్రం భౌగోళిక తెలంగాణను కోరుకుంటూనే సామాజిక తెలంగాణ డిమాండ్‌ని ముందుంచిండు. "తెలంగాణ వాళ్ళమందరం బ్యాలెట్ సైనికులమై మేలుకోవాలె.. గట్లయితెనే మన తెలంగాణ మనం ఏలుకుంటం".." యిపుడు రావలసింది అగ్రవర్ణ తెలంగాణా కాదు.. అట్టడుగు బలమీన వర్గాలతో మమేకమై బహుజన ప్రజాస్వామిక తెలంగాణ కోసం కలలు కనాలి" అని భూతం కాలంలోనే వర్తమాన కార్యాచరణను నిర్దేశించిండు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంలో దళితులు ఉద్యమంలో మమేకమై తమ ఆట, పాట, మాట, రాత ద్వారా ధూం ధాం చేసిండ్రు. 'సింగిడి' పూయించిండ్రు. దారి దీపాలయిండ్రు. సబ్బండ వర్ణాలు, సకల జనుల పోరాట ఫలితంగా ఇయ్యాళ ప్రత్యేక తెలంగాణ సాధ్యమయింది. ఈ తెలంగాణను 'సామాజిక తెలంగాణ' గా మార్చుకోవాలె. జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని రంగాల్లో సబ్బండ వర్ణాలకు, సకలజనులకు న్యాయమైన వాటా దక్కాలె.ఆ వాటా కోసం ఆనాడే అక్షరాయుధాన్ని సంధించిన వాడు సిద్దెంకి. అది తెలంగాణా వాటా కావచ్చు. వర్గీకరణ

వాటా కావొచ్చు. ఏదైతేంది న్యాయమైన డిమాండ్‌ని ముందట పెట్టిండు.
దాదాపు రెండున్నర దశాబ్దాలుగా సాహిత్య, కళా రంగాలతో మమేకమయిండు సిద్దెంకి. కళాజాతలతో ఊరూరా తిరిగిండు. ప్రజా చైతన్యానికి నడుం బిగించిండు. యూనివర్సిటీ చదువుతో వచ్చిన జ్ఞానాన్ని నలుగురితో పంచుకునేందుకు వేదికలను నిర్మించిండు. ధూంధాం చేసిండు. 'దస్కత్' కథావేదికలో భాగమయిండు. ఈ చైతన్యమే ఆయనతో కలం పట్టించ్చింది. యూనివర్సిటీ రాజకీయాలు రాటుదేలేలా చేశాయి. కవిత్వం, కథలల్లేలా చేశాయి. సిద్దెంకిని గాయపడ్డ సమాజం నుంచి 'సెల్ఫ్ సెంట్రిక్‌గా' ఎదిగిన కథకుడిగా చెప్పొచ్చు. ఈయన బాధల్ని, సమాజపు గోసలతో సమన్వయం చేసి చెప్పిండు. సజీవమైన భాషని అందించిన కథకుడిగా సిద్దెంకిని చూడాలి.

* * * *

ఇగ మళ్ళీ కథల విషయానికొస్తే ఇందులోని మొత్తం 15 కథలు దాదాపు ఏడెనిమిదేండ్ల కాల పరిధిలో రాసినవి. నిజానికి ఈ కాలంలో తెలంగాణను కుదిపేసిన ఉద్యమాలు ప్రధానంగా తెలంగాణ, వర్గీకరణోద్యమం. ఈ రెండింటికీ తన కథల ద్వారా సిద్దెంకి యాదగిరి శాశ్వతత్వం కల్పించిండు. పంచుకోంండ్రి, అమరుల యాది కథల్లో వర్గీకరణ ఉద్యమంలో ఉన్న న్యాయాన్ని, ప్రత్యర్థులు చేస్తున్న అన్యాయాన్ని, లేవనెత్తిన అన్ని అంశాలకు సర్వామోదంగా జవాబిచ్చిండు. చిన్న చిన్న పోలికలు, ఉ దాహరణలు, విషయం పదో తరగతి చదువుకున్న పిల్లలకు సైతం

సులభంగా అయ్యే విధంగా విడమర్చి చెప్పిండు. "అంబేద్కర్ మా అందరికి అయ్యలాంటోడు. అతను తెలివోడు అయి, ముందుగ నడిసి, మా జాతికి మా ఎస్సీ జాతికంతటికి ఆస్తిని, సద్దిని సంపాయించి పోయిండు. ఆ ఆస్తి అంత మాకే కావాలే. ఆ సద్ది అంత మేమే తింటమని, మీకు వద్దు అంటుండ్రు వీళ్ళు" అని వర్గీకరణ ఆవశ్యకతను 'పంచుకోంండ్రి' కథలో చెప్పిండు. సురేందర్ మాదిగ మరణాన్ని యాద్జేసుకుంటూ, పోరుబాట వీడొద్దంటూ "మాదిగ ప్రజలారా! మాదిగ పెద్దలారా! గాంధీభవనుల మనవాల్లకు కాలింది నిజమే, గని యిపుడు మనం నేరుగా మన మాదిగిండ్లల్లకు పోయి అక్కడ మాట్లాడుకుందాం పాండ్రి" అని ఉద్యమం తీరుని చెప్పిండు.

"అయ్యో కొడుకా! ఎంత పని అయిపాయె! గంత అవుస్తమీద కూడా ప్రాణాలు పోయినా సరే ఏబీసీడిలు కావాలన్నడంటే ఎంత గొప్ప వీరుడాయినె. పెడితె

పెండ్లి కోరుతరు లేకుంటే సావుకోరుతరు. ఓ దిక్కు జీవునం వుంటదో? వుండదో? నని తెల్సినాగని గంత దీర సెప్పుతుండంటే ఐనకు, ఐనను కన్నతల్లిదండ్రుల పాదాలకు చేతులెత్తి మొక్కాలె..” అంటూ సురేందర్‌ని స్మరించుకుండు.

వర్గీకరణతో పాటుగా దయనీయంగా ఉన్న దళిత జీవితాలను రికార్డు చేసిండు. దక్కలోల్లను అస్పృశ్యులుగా చూడడాన్ని నిరసించిండు. ‘గోదల కాడ్కి గోదలు పోతయి. గొర్లకాడ్కి గొర్లు పోతయిగని మనిషికాడికి మనిషిని పోకుంట జేసిండ్రురా” అని ‘బోధ’ కథలో నీతి చెబుతడు. పోలీసోల్ల చేతిలో దళిత స్త్రీ దగాపడ్డ తీరుని ‘ఎంతకంతే’ కథలో చెప్పిండు. ‘సావు’ కథలో సావు ఏ పద్దతిలో చేయాలన్న విషయంలో మతం మారిన క్రిస్టియన్లకు, మారకుండా ఉన్న దళితులకు వచ్చిన బేధాభిప్రాయాల గురించి చర్చించిండు. రేపటి సూర్యుడు కథలో దళితుడు సైనికుడుగా మారడాన్ని అదే సమయంలో దేశం కోసం అమరుడు కావడాన్ని కళ్ళు చెమర్చేలా రాసిండు. అందుకే దేశం కోసం పాణమిడ్సిన కొడుకుని యాద్జేసుకుంటూ కన్న తల్లి “ నీ గుడి గుండంగాను, నా కొడుకునే మింగినావురా దేవుడా! నీ గుళ్ళెరాళ్ళు రోళ్ళు పడ, మా సంబురాన్ని చూసి నీ కండ్లల్ల మన్ను పోసుకున్నావురా దేవుడా”! దేవుణ్ణి ఆడిపోసుకున్న తీరుని కండ్లముందర నిలబెట్టిండు. ‘తప్ష’ కథలో చదువుకున్న వారిలో పైకి కనిపించని వివక్ష ఎట్లుంటదో చెప్పిండు.

ప్రత్యేక తెలంగాణోద్యమానికి సంఘీభావంగా ‘లెక్కలు’, ‘కీలెరిగిన వాత’లు కథలు రాసిండు. ఇందులో ఆనాటి ముఖ్యమంత్రి ఒక్క రూపాయి కూడా ఇవ్వం అనే మాటను చర్చకు బెట్టి ప్రతి విషయంలోనూ తెలంగాణ ఎలా అన్యాయానికి గురవుతుందో, మొక్కవోని ధైర్యంతో పోరాడి ఎలా సాధించుకోవాలో బోధన చేసిండు. “నువ్వొద్దెనేరా... మనకు చరిత్ర దెల్సు. యిత్తేసి పొత్తు గూడినోడు పొయిమీద కుండను మాయం జేత్తండు... “మనం వొందుకున్నది మనకు వెట్ట వాడెవడు. మన పొయి మనంటను గుంజుకున్నడు. యిపుడు మండేది పెయిమంట. అదే కడుపుల ఆకలి మంట. గా మంట సల్లార్పెతందుకు ఎన్నడో ఒగనాడు మంచి కాలమొత్తది. గదేందో మనమే సురువు జేస్తే ఐపోతది గదా...!” అని ఉద్యమానికి విద్యార్థుల్ని సన్నద్ధం చేసిండు. ఇవి సక్సెస్ స్టోరీలకు ప్రతిరూపాలు. నాయినమ్మ యాదిని నోస్టాల్జియాగా చెప్పిండు. చదువు యొక్క విలువను గుర్తించి అందుకు ఎదురైన అవాంతరాలను ఆత్మవిశ్వాసంతో ఎదురొడ్డి అధిగమించిన విజయగాథను ‘సందిగ్ధం’ పేరిట రికార్డు చేసిండు. అలాగే చదువు ద్వారా సమాజంలో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వ చేపడుతున్న

చర్యలకు ఊతమిచ్చేలా 'మార్పు' కథను చైల్డ్‌లేబర్‌కు, వారిపై హింసకు వ్యతిరేకంగా రాసిండు. 'బుద్ధిమాట'లో నలుగురికి నచ్చేబాటలో, అందరినీ మెప్పించే విధంగా నడవాలని చెప్పిండు. నిజానికి యాదగిరి కథల్లో బలం అతని భాష. చదువుకున్న వారికి అర్థమయ్యే దళిత ఈస్థటిక్స్ ఉన్న నుడికారాలు, సామెతలు, పదబంధాలు ఈ పుస్తకానికి పుష్టిని చేకూర్చాయి. తెలంగాణ నిఘంటువుల్లోకి ఎక్కాల్సిన పదాలు ఈ కథల్లో చాలా ఉన్నాయి. చాలా అలవోకగా ముచ్చట పెట్టినట్టు చెప్పిన ఈ భాష ఆత్మీయుల్ని ఆలింగనం చేసుకున్నట్టు ఉంటది. 'నల్లటి దాని మాట పెదవుల తీట', 'ఎద్దు ఎగురంగనే గంట ఎగురది', 'తినరాని పండు తీపిల మెండు కడుపు పండు', 'బండ కింద నల్లులోలె పిసినార్లు', 'లోకమే పెద్ద బంజరుదొడ్డి', 'మైసమ్మ దున్నపోతోలె పాణంబట్టి', 'మిడుమాల మిడ్క', 'ఉన్నోక్క మెతుకు గంజిల పోగొట్టుకొని లెంకులాడు','ఐదేళ్ళు ఒక్క తీర్గ ఉన్నాయిరా?', 'కులం కుతికెల మంటి సముద్రం మొకాలు మంటి', 'బాపనోళ్ళ ఇండ్లళ్ళ బస్టోడు లేడా? మాదిగిండ్లల్ల మంచోడు లేడా', 'బదుత ఉన్నోంది బర్రె', 'లక్ష్మిరాంగ తడక అడ్డం పెట్టకు', 'నలుగుట్టె నవ్వులపాలు', 'దోమతెరల చిక్కిన దోమలాగ', 'పెడితె పెండ్లి లేకుంటె సావు', 'వండిన కుండాగది సచ్చిన పీనుగు ఆగది', 'ఈళ్ళ బలుపు బండల్లవోను', 'ఎవడు తోడుకున్న పొక్కల వాడేవడ్డడు', 'కడుపుల ఆత్మలేని కండ్లకు దు:ఖం రాదు', 'మెచ్చేటట్లు మాట్లాడాలె పట్టినంత తినాలె', 'ఓటిపోయి ఓటి అయితది' అని ఇట్లా అనేక నుడికారాలను సాహిత్యంలోకి తెచ్చిండు. అంతేగాదు ఇప్పటికీ అందరి నోళ్ళల్లో నాణని పదాలను పట్టుకొచ్చిండు. మిడ్క, పెట్టువోతలు, నౌకరి, సద్ది, ఇగవటసా, జెప్పన, పంచాది, సోపతి, ఇజ్జతి, నారాజు, శెడగొట్టె, తిప్పల, అట్లగాదు వాయి, బాపతి, శేరిక్, పొద్దుగుంజాముల, గడికోటి, బేవ్‌దీసి, మ్యాత, శమ, శెరుగు, సురుకు, ఇంటెన్క, ఈరగోల, ఇకమాతు, గింతగనం, నౌకరి, పోరి, ఎల్లం, కొంటవో, పాలసర్వ, సాట, మాఫ్, పికర్, బద్మాష్, రంది, బొడుసు, లగ్గం, యెవుసం, జీవాలు, కాయిదాలు, బల్మిటి, పెనిమిటి, మొకంగాల, మొందారం, ఈని మొగతనం శెదలు దిన, కాల్రెక్కలు, జిగిష్ట, బుక్క, సుతి, తలకొర్రాయి, బొందలగడ్డ, ఒర్రుదు పదాలకు సాహిత్య గౌరవం చేకూర్చిండు.

ఈ కథలు అచ్చంగా మెదక్ జిల్లావే అని సాక్ష్యమిచ్చేలా నంగునూరు, ఇందుప్రియాల్, రాయవరం, కొడకండ్ల, లకుడారం, దౌల్తాబాద్, చిన్నకోడూర్ తదితర

ఊర్ల పేర్లు నేటివిటీని, మెదక్ టోపోగ్రఫీని పట్టిస్తాయి. ఇవాళ తెలంగాణలో బలంగా కథలు రాస్తున్న వాండ్లు చాలా తక్కువ. ప్రత్యేక తెలంగాణ

ఉద్యమంలో వేలమంది పాణం దీసుకున్నా ఒక్క చేయి వేళ్ళమీద లెక్కబెట్టుకునేన్ని కథలు కూడా రాలేదు. ఉద్యమ సందర్భంలో అందరూ బిజీగా ఉన్నారు అనుకున్నా.. ఆనాటి జీవితాలను సాహిత్య చరిత్రలోకి ఎక్కించాల్సిన అవసరముంది. ఆ పని సాగడం లేదు. అయితే తెలంగాణలో వర్గీకరణ ఉద్యమానికి సంఘీభావంగా మాదిగలు కథలు చాలానే రాసిండ్రు. పసునూరి రవీందర్, సిద్దెంకి యాదగిరిలు ఆ కథలను ఆర్తితో రికార్డు చేసిండ్రు.

సిద్దిపేట జిల్లాతో పాటు ఒక కొత్త ప్రామిసింగ్ కథకుణ్ణి కూడా అందిస్తోంది. తన బలమైన భాష విషయంలో మరింత శ్రద్ధ పెట్టినట్లయితే మాదిగ కుల మాండలికం తెలంగాణ/ తెలుగు ప్రజలందరికీ అందుబాటులోకి వచ్చే అవకాశముంది. మాటలు సాహిత్యంలోకి రానంత వరకూ వాటికి గౌరవం ఉండదు. కింది కులాల వాండ్లు కథా సాహిత్యాన్ని ప్రపంచీకరణ నుంచే విస్తృతంగా రాస్తున్నరు. ఆ రాసిన సాహిత్యమంతా చరిత్ర కెక్కాలంటే దాన్ని అన్ని వర్గాల వాళ్ళు పట్టించుకోవాల్సిన అవసరముంది. సిద్దెంకి తన కథల పరంపరను కొనసాగించాల్సిన అవసరముంది. భౌగోళిక తెలంగాణ కల సాకారామైన తర్వాత ప్రజలు సామాజిక తెలంగాణ కోరుకుటుంన్నారు. ఈ సామాజిక తెలంగాణకు పునాది వర్గీకరణ వేస్తుంది. ఒక్కసారి వర్గీకరణ సాధ్యమయిందంటే మాలలకు, మాదిగలకు వారి జనాబా దామాషా ప్రకారం రిజర్వేషన్స్ దక్కుతాయి. ఆ హక్కుల ద్వారా ఎదిగొచ్చే మాదిగ సమాజం మిగతా ముస్లిం, బీసీల గురించి పట్టించుకునేందుకు వీలవుతుంది. అందుకు ఈ కథలు భూమికను ఏర్పరుస్తున్నాయి. అస్తిత్వాలకు ఆవుసునందిస్తున్న కథలివి. నల్లగొండ జిల్లాలో ముఖ్యంగా మా యాదగిరి గుట్ట ప్రాంతంలో ముఖ్యంగా ప్రతి శాలోల్ల ఇంట్లో ఒక యాదగిరి లేదా లక్ష్మీనరసయ్యలంటరు. అట్లాంటి పేరు పెట్టుకున్న యాదగిరి రాసిన ఇవి చదవాల్సిన కథలు మాత్రమే కాదు. ఆచరించాల్సిన కథలు కూడా! భవిష్యత్ తెలంగాణ బంగారు తెలంగాణగా మారాలంటే సామాజిక తెలంగాణ ద్వారానే సాధ్యమని చెబుతూ... ఇంత మంచి కథలు చదివేందుకు, ముందుమాట రాసేందుకు అవకాశం కల్పించిన మిత్రుడు సిద్దెంకి యాదగిరికి కృతజ్ఞతలు.

– సంగిశెట్టి శ్రీనివాస్

తేదీ: 10-09-2016

జీవితం తెలిసిన కథా రచయిత

"ఒక కథకుడికి రచనా సామర్థ్యం లేకపోయినా సరిచేయవచ్చు గానీ, జీవితం తెలియకపోతే సరిచేయడం ఎవరివల్లా కాదు." అని కొడవటిగంటి కుటుంబరావు అన్నాడు. కొందరు బతుకుతుంటారు. ఇంకొందరు జీవిస్తుంటారు. కళాత్మకంగా జీవించి కళాత్మకంగా వ్యక్తీకరించడం కొందరికే సాధ్యమవుతుంది. వాళ్లలో కొందరు రచయితలవుతారు. మరికొందరు కథా రచయితలవుతారు. రచనా సామర్థ్యం పెంచుకున్న వాళ్లు ప్రభావశీల రచయితలవుతారు. ఇవన్నీ సాధ్యం కావాలంటే ముడిసరుకు జీవితమే. అట్లాంటి జీవితం సిద్దెంకి యాదగిరికి ఉంది. ఈ జీవితాన్ని వ్యక్తీకరించే రచనాశక్తి ఉంది.

రాసినదంతా సాహిత్యం కాకపోవచ్చు. సామాజిక జీవిత వాస్తవాన్ని కళాత్మకంగా వ్యక్తీకరించి మెదడుమీద ప్రభావం వేయగలిగినది మాత్రమే సాహిత్యం అవుతుంది. జీవితానుభూతులకు రచయిత సామర్థ్యం తోడైతే సాహిత్యం సంపూర్ణమవుతుంది. కనుకనే జీవితాన్ని విమర్శించేదే సాహిత్యమని పెద్దలన్నారు. సాహిత్యరూపం కథ, నవల, నాటకం, కవిత ఏదైనా కావచ్చు, కానీ అది జీవిత వ్యాఖ్యానంగా ఉంటుంది. ఉండాలి. నిజానికి ఇవాళ్టి సాహిత్యం కల్పనా స్థాయిని దాటి భూమి మీద నిలబడింది. అందుకే జీవితానికి-కథా రచనకు మధ్య ఉండే వైరుధ్యాన్ని రచయిత పరిష్కరించాలి. అప్పుడే రచయిత సామాజికుడు అవుతాడు. రచయిత మానసిక స్పందనకు, పరిణతికి సాహిత్యం ప్రతిబింబంగా ఉంటుంది. 'రచయిత సహజంగానే ప్రగతి కాముకుడు. అట్లా కాకపోతే రచయితనే కాదని' ప్రేమ్‌చంద్ చెప్పి ఉన్నాడు. రచయిత తన జ్ఞానం వలన, భావాల

వలన సమాజాన్ని మేల్కొలుపుతాడు. పాఠకుల ఆలోచన పరిధిని విస్తృతం చేయగలిగిన శక్తి రచనకు ఉండాలి.

రచనలో కథ అనేది ఒక ప్రక్రియ లేదా సాహిత్య రూపమని కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. కథా అనే రూపానికి వేల సంవత్సరాల చరిత్ర ఉంది.

కథలు చెప్పడం మనిషి మాట నేర్చిన నాటి నుంచి ఉంది. జంతువు కథలు, ప్రేమ కథలు, అద్భుత కథలు, యాత్రా విషయాలు, విజ్ఞాన విషయాలు ఇవన్నీ ఆయా సందర్భాలను బట్టి గొప్ప కథలుగా విలసిల్లాయి. 'ఆదర్శాలు కలిగిన చిన్న సంఘటననే కథ' అని కథా విమంచెప్పి ఉన్నారు.

ఒక సంఘటనలో ఉండే పరిమితి కథకు ఉండాలి.

కథలను పాండిత్య ప్రకర్షకోసం రాయాలని ఎవరూ అనుకోరు. సామాన్య పాఠకులకు అర్థమయ్యే సరళత్వం కథాశిల్పంలో భాగం. కథ మనిషి జీవితంలో భాగంగా ఉంటుంది. కనుక జీవిత ప్రతిబింబం కథ అవుతుంది. జీవితాన్ని దాటినది కథ కాకుండా మరేదో అవుతుంది.

ఈ కథావరణంలో సిద్దెంకి 'విరిగిన కల'ను అర్థం చేసుకుంటే, మనకెన్నో జీవితాలు పరిచయం అవుతాయి. కానీ, జీవితం ఎంత సంక్లిష్టంగా ఉంటుందో, ఎంత గాఢతను నింపుకుంటుందో, ఎంత వైవిధ్యాన్ని కనబరుస్తుందో ఈ కథల ద్వారా తెలుస్తుంది. కలలు కనవచ్చు, ఇది మనిషి చేసే పనే. కానీ, ఆ కలను సాకారం చేసుకునే కృషి ఉండాలి. కొన్నిసార్లు కృషి ఉన్న కల విరిగిపోతుంది. 'విరిగిన కల' అని కథకు పేరు పెట్టడంలోనే ఈ రచయిత శిల్ప నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. అదొక కవితాత్మక వ్యక్తీకరణ. ఈ కథలో ఊశయ్య, ముత్యాలు, ఈరమని ప్రధాన పాత్రలు. ఊశయ్య, ముత్యాలు భార్యాభర్తలు. వారికి చాలా రోజుల వరకు సంతానం కలగలేదు. భార్య ముత్యాలు ఒత్తిడి వల్ల ఊశయ్య ఈరమనిని రెండో పెళ్లి చేసుకుంటాడు. ఇది ఈ కథ ఇతివృత్తం. ఇంతమాత్రమే అయితే, ఈ కథ గొప్పదనమేమీ లేదు. ఒక మనిషి పంచేంద్రియాల సహాయంతో తన మనస్సు సంపాదించిన జ్ఞానాన్ని ఇతరులకు సులువుగా అందించడానికి కథలు రాస్తాడనుకుంటే సిద్దెంకి తాను పొందిన లౌకిక సమాచారాన్ని ఈరమని పాత్ర ద్వారా ఈ కథలోకి ప్రవేశపెట్టి కథకు పఠించే గుణాన్ని

తెచ్చాడు. చాలామంది పాఠకుల స్మృతిపథంలో లేని విషయాన్ని చెప్పి చైతన్యం చేశాడు. కథను పతాకస్థాయికి తీసుకెళ్లాడు.

"గదంత గాదుగానీ ఇబ్రహీంనగర్ కాడ ఇదుపుకాయిదమయి ఇంటిమీదున్న దానికి ఊరుమీద కడుపయిందట. ఎవలకైన తోలుతరని మల్లమారి మల్లయ్య సోది తెచ్చిండు" ముత్యాలు ఊశయ్యతో అన్నది. సంతానం కోసం ఊరిమీద కడుపైనదాన్ని కూడా పెళ్లిచేసుకోవడానికి ఊశయ్య సిద్ధ పడడంతో కథలో నిర్మాణపరమైన బిగువు వచ్చింది. ఆనక ఇట్టే ఈరమనికి మగ సంతానం కలిగింది. ఆ ఇంట్లో సంతోషం వచ్చింది. కుటుంబమన్నాక ఘర్షణ సహజం. ముత్యాలుకు ఈరమనికి ఒక రోజు మాటామాట పెరిగింది. ఈరమనిని ఊశయ్య మందలించాడు. కానీ, ఈరమని భర్త మాటను కూడా లెక్క చేయలేదు. "వడ్లల్లదే బియ్యపు గింజ ముద్దాడవడితివి మురవవడితివి. రాజు, బూజు, కొండా, వెండీ ఎన్నెన్నో అనబడతివి. ఎక్కువ తక్కువ ఒర్రేది లేదు. నోరు మూసుకుంటేంది? ఏమిలేని ఇత్తారు ఎగిరెగిరి పడ్డదట. వాన్ని నువ్వే కంటివా? నీకే పుట్టిండా"? కథలో అసలైన జీవిత ఘర్షణ ఇక్కడ మొదలైంది. కానీ, రచయిత కథను ఇక్కడితో ముగించాడు. నిజానికి ఇట్లాంటి కొత్త వస్తువులను కథలో చిత్రించి పాఠకులకు అందించినందుకు సిద్దెంకిని అభినందించాలి.

సిద్దెంకి ఈ పుస్తకంలో మొత్తం 15 కథలు రాశాడు. ఏ ఒక్క కథావస్తువు మరో కథతో ఘర్షణ పడే అవకాశం లేకపోవడమే వీటి ప్రత్యేకత. వేటికవే భిన్నమైన వస్తువులు. రచయితకు ఉండే విస్తృతమైన పరిశీలన వల్ల భిన్న ఇతివృత్తాలను ఎన్నుకోగలిగాడు. కొత్త జీవితాలను పరిచయం చేశాడు. ఈ కథల్లో నాలుగు కథల గురించి తప్పక చెప్పాలి. నాలుగు కథలని అంటున్నానంటే నేను ఈ కథల మధ్యన పోటీ పెట్టే ప్రయత్నం చేయడం లేదు. ఒక పాఠకుడిగా నన్ను ఆకర్షించిన నాల్గింటి గురించి చెప్పడమే ఉద్దేశం.

'రేపటి సూర్యుడు' కథ మరో భిన్న జీవితాన్ని మనముందు ఉంచింది. సైనికుల మీద సినిమాలు చాలా వచ్చాయి. సాహిత్యంలో కూడా కథ, కవిత, నవలా ప్రక్రియలు సైనికుల జీవితాన్ని ప్రతిబింబించాయి. ఈ వరుసలో సిద్దెంకి 'రేపటి సూర్యుడు' అనే కథ ద్వారా సూక్ష్మమైన మానవ సంబంధాలను చిత్రించాడు. అంతేకాదు, కథను భావోద్వేగ స్థాయికి తెచ్చి ముగించిన తీరు బాగుంది. ఈ కథను అట్లా తప్ప మరోలా ముగించని వాతావరణం కల్పించాడు. నరేష్, సురేష్ ఇద్దరు మిత్రులు. ఇద్దరూ మిలట్రీలో

పనిచేస్తున్నారు. 'ఎక్కడన్న సంబంధం కుదిరిందా?" "ఎక్కడా కుదర్లే? మిలట్రీ అంటే ఎవదూ పిల్లనిస్తలేదు" నరేష్, సురేష్ ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. కథ ఎత్తుగడతో ముగింపునకు సమన్వయం కుదిరించడం అద్భుతంగా ఉంది. చేయి తిరిగిన రచయితలు మాత్రమే ఇలా చేయగలరని మనం కొన్ని కథలు చదువుతుంటే అర్థమవుతుంది. జీవితంలో భద్రత కోరుకునే భద్రజీవుల లోకమిది. నెలనెలా జీతం వచ్చినా సైన్యంలో కొలువంటే ఎప్పుడు ప్రాణం పోయేది తెల్వదు. ఇదొక వాస్తవ జీవితాన్ని కథలో చిత్రించాడు.

నరేష్‌కు ముందే పెళ్లయింది. భార్య పేరు శైలజ. ఆమె పురిటి నొప్పులతో హాస్పిటల్‌లో ఉంది. ఒక మగబిడ్డను కన్నది. నరేష్ ఫోన్‌లో శైలజతో మాట్లాడిండు. యోగక్షేమాలు కనుక్కున్నాడు. బిడ్డ గురించి తెలుసుకున్నాడు. ఇక్కడి వరకు కథ సాధారణంగానే నడుస్తుంది. నరేష్ ద్రాస్ సెక్టార్‌లో ఉన్న ఉగ్రవాదుల మీదకు దళంతో కలిసి వెళ్లాడు. ఆ పోరులో తీవ్ర గాయాలకు గురై చనిపోయాడు. ఈ విషయం సురేష్‌కి తెలిసింది. నరేష్ భార్య, బిడ్డను హాస్పిటల్‌లో పలకరించి వద్దామనుకున్న వాడు నరేష్ చావుకబురును తీసుకెళ్లాల్సి వచ్చింది. అయితే రచయితకు ఉండే సామాజిక అవగాహన వల్ల చావంటే ఏమిటనే చర్చను కథలో విస్తారంగా చేశాడు. రాయి తగిలి చచ్చిపోయే వాళ్లు, ప్రమాదంలో ఆయువు మూడినవాళ్లు, పగలతో కొట్టుకొని చనిపోయిన వాళ్లు, ప్రతి ఒక్కరూ ఏదో తీరుగా, ఎప్పుడో ఒకప్పుడు చనిపోతారు. చావడం తప్పనప్పుడు ప్రజలకోసం, దేశం కోసం చావడంలోనే అమరత్వం ఉంటుందని సిద్దెంకి చెప్పాడు. కథలో ఇట్లాంటి సీరియస్ విషయాన్ని చొప్పించి పాఠకులను ఆలోచింపజేయడంలో రచయిత విజయం సాధించాడు. నరేష్‌కు పుట్టిన బిడ్డను చూడడానికి వచ్చిన సురేష్ లోకం తీరు తెలియక ఆడుకుంటున్న పసివాడు, వాడిని తొమ్మిది నెలలు మోసి పురిటి నొప్పులు అనుభవించి పురుడోసుకున్న బాలింతకు నరేష్ చావు కబురును చెప్పడం దగ్గర కథ భావోద్వేగ స్థాయికి చేరింది. మానవ సంబంధాల ఘర్షణను రచయిత ఇంత అద్భుతంగా ఆవిష్కరించాడు.

'మార్పు' కథ మరో భిన్నమైన జీవితాన్ని పట్టుకున్నది. మనందరికి పరిచయమైన దానిని కొత్తగా ఆవిష్కరించి మనల్ని ఆశ్చర్యానికి గురిచేసే శక్తిని రచయిత సంతరించుకోవడమంటే అది రచయిత ప్రతిభయే తప్ప మరొకటి కాదు. రోడ్డు ప్రక్కనో, సిగ్నల్ వద్దో, బస్టాప్‌లోనో, రైల్వే ప్లాట్‌ఫాం మీదనో అర్ధనగ్నంగా బాలకార్మికులు

మనందరికీ కన్పిస్తుంటారు. ఈ దేశ దారిద్ర్యానికి చిరిగిన జాతీయ జెండాంత నిదర్శనంగా నిలబడి ఉంటారు. అందరం దీనిని చాలా మామూలు విషయంగా భావిస్తుంటాం. కానీ, సిద్దెంకి సీరియస్‌గా తీసుకున్నాడు. కథా ఇతివృత్తంగా స్వీకరించి పాఠకుల్ని కదిలించాడు. రచయితగా తన సామాజిక బాధ్యతను నిర్వర్తించాడు.

సునీల్ అనే ఉపాధ్యాయుడు సికిందరాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగి స్పీడ్‌గా వెళ్తుంటే ఎనిమిదేండ్ల పోరడు చింపిరిజుట్టు, మాసిన బట్టలతో ఎదురొచ్చి కాళ్లమీద పడ్డాడు. పది రూపాయల కోసం వాడి ఆరాటం-పోరాటం. డజన్ అరటిపండ్లు తింటే ఆకలి తీరుతుంది. దానికోసం కన్పించినోళ్లందరి కాళ్లు పట్టుకున్నాడు. అట్లా సునీల్ కాళ్లు పట్టుకున్నాడు. అందరివలే పది రూపాయలు ఇచ్చి సునీల్ వెళ్లిపోతే కథేం లేదు. రచయిత సునీల్ పాత్ర ద్వారా కథను తారాస్థాయికి తీసుకెళ్లి తార్కికమైన ముగింపు ఇవ్వాలనుకున్నాడు. అందుకే కథ నడిచింది. బాల కార్మికున్ని "ఏ వూర్రా మీది"? అని సునీల్ అడిగాడు. వాడికి వూరు తెలియదు. కథ సాంద్రత స్థాయికి చేరుతుంది. "సదువుకో పోయినావురా?" సునీల్ ప్రశ్న. "సదువనియ్యరు" ఈ సంభాషణ మనస్సును పిండేస్తుంది. సునీల్, కథ చదువుతున్న మనలాగే ఆశ్చర్యానికి గురయ్యాడు. ఎవరు చదువనియ్యరనే ప్రశ్న వేసేలోపే ఆ పిల్లవాడే సమాధానం చెప్పాడు. "మేం అడక్కొచ్చి మా అయ్యవ్వలకు రోజూ పైసలు యియ్యకపోతే తిండి పెట్టరు". ఇది చాలా అమానవీయం. కన్న తల్లిదండ్రులు ఇలా కూడా చేస్తారా? పక్క బొక్కలు ఇరిగేటట్టు కొడ్తారా? సోయి తప్పేటట్టు కొట్టి పట్టించుకోకుండా పక్కనే తాగుతుంటారా? ఇదేదో పాత తెలుగు సినిమా కథోలే ఉందన్పిస్తుంది. సోయితప్పి పడి ఉన్న వాడికి తెలివి వచ్చాక, వాళ్లు మాట్లాడుకున్నది వింటే తనను చెత్తకుండీలో నుంచి తెచ్చుకొని పెంచుకున్నారని, వాళ్లు తల్లిదండ్రులు కాదని అర్థమైంది. ఆ పిల్లవాడి కంట్లో యాసిడ్ పోసి గుడ్డోన్ని చేసి బిచ్చమెత్తించాలనే వాళ్ల ఆలోచన విన్నాక ఆ పిల్లవాడు సంద్రమై పోయాడు. వాడికి ఈ భూమి మీద ఏ ఆధారం లేనంతగా దు:ఖించాడు.

మనిషి భావోద్వేగాలను చిత్రించడానికి కథలు రాస్తారని కథా సాహిత్యంలో లోతైన ప్రవేశం ఉన్నవాళ్లు చెబుతుంటారు. సుఖం, దు:ఖం, పోరాటం, ఓటమి, గెలుపు, ప్రేమ, దోపిడీ, అన్యాయం, అంటరానితనం, పితృస్వామ్యానికి సంబంధించిన ఇతివృత్తాలతో కథలు రాస్తుంటారు. సామాజిక విలువలు కథలో ఉండాలని పాశ్చాత్యులు అంటారు. అయితే, ఆ విలువల మధ్య వైరుధ్యాలను కూడా కథ చిత్రించాలి. కథకుడు

జీవితం నుంచి ప్రేరణ పొంది ఆ జీవితం మీద రియాక్షన్‌గా కథ వ్యక్తమవుతుంది. మార్పు కథలో సిద్దెంకి ఈ ప్రయత్నం చేశాడు. బాల కార్మికుడి భావోద్వేగాలను పట్టుకొని రాయటం వల్ల పఠిత హృదయం కూడా స్పందిస్తుంది. ఆ పిల్లవాడినే కాకుండా, వాని తమ్మున్ని, చెల్లెల్ని కూడా సునీల్ స్కూల్‌లో చేర్పించడంతో కథకు హేతుబద్ధమైన ముగింపు దొరికింది.

'ఎంతకంతే' కథ మరో జీవిత శకలం. ప్రపంచీకరణ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య సంబంధాల్లో వచ్చిన మార్పుల గురించి ఎన్నో కథలు వచ్చాయి. ఎయిడ్స్ ఇతివృత్తంగా కూడా కథలు వచ్చాయి. కానీ సిద్దెంకి రాసింది మాత్రం చాలా భిన్నమైనది. ఈ కథలో ముగింపు మాత్రం కథనాత్మకంగా ఉంది. మనం ఊహించలేము. ఇటీవల కొందరు కథలు చదువుతుంటే ఒక పేజీ చదవగానే ముగింపును మనమే ఊహించవచ్చు. గురజాడ 'దిద్దుబాటు'లో కమిలిని మంచంకింది నుంచి నవ్వుకుంటూ బయటకు వస్తుందని మనమెవ్వరం ఊహించలేం. సరిగ్గా సిద్దెంకి రాసిన ఈ కథలో కూడా అట్లాంటి ముగింపు ఉంది. కాకపోతే పోలీస్ కానిస్టేబుల్ ఎల్లవ్వను చూసి మనసులో అనుకున్న సందర్భంలో మాత్రం శృంగార వర్ణన అనవసరమన్పించింది.

ఈ నాలుగు కథలు కాకుండా సిద్దెంకి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ మీద, అంటరానితనం మీద, తెలంగాణ ఉద్యోగాలను ఆంధ్రోళ్లు ఆక్రమించడం పైన, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉండవలసిన అవినాభావ సంబంధాల గురించి, టీఆర్ఎస్ పార్టీ గెలుపు మీద అనేక రకాలుగా తన మనోనేత్రానికి అందిన వాటిమీద రాశాడు. నాయినమ్మ మీద రాసిన స్వీయాత్మక కథ కూడా బాగుంది. ఈ తరానికి నాయినమ్మల ప్రేమను పరిచయం చేయడానికి ఆ కథ ఉపయోగపడుతుంది.

ఎక్కడో సరిగ్గా గుర్తులేదు కానీ, జి.కల్యాణరావు కథాశిల్పం గురించి చెబుతూ... తండ్రీకొడుకులిద్దరు ఎర్రటి ఎండాకాలంలో మిద్దెమీద పనిచేస్తుంటారు. ఎండ తీవ్రతకు తట్టుకోలేక తండ్రి మిద్దె దిగి కిందకు వస్తాడు. తన కొడుకు ఎండలో పనిచేయడం చూసి బాధేసి తండ్రి మమకారాన్ని ఆపుకోలేక కిందకు దిగమని కొడుకును అడుగుతాడు. కొడుకు తండ్రి మాట పట్టించుకోడు. కొద్దిసేపయ్యాక తండ్రి ఇంట్లోకి వెళ్లి ఐదేళ్ల మనవడిని తీసుకొచ్చి ఎండలో నిలబెడతాడు. అది చూసిన కొడుకు నీకేమైనా బుద్ధి ఉందా? పసిపిల్లవాడిని ఎండలో నిలబెట్టావని తండ్రిని తిడతాడు. అప్పుడు తండ్రి నేను కూడా అదే అంటున్నానురా!? అని అంటాడు. కథ ముగుస్తుంది. తండ్రి ప్రేమ

ఏవిధంగా ఉంటుందో రెండువైపులా వ్యక్తమైంది. కథ షార్ప్‌గా ముగిస్తే మంచి శిల్పం. అంతేకాదు, ముగింపులో తార్కికత ఉండాలి. కార్యాకారణ సంబంధం ఉండాలి.

సిద్దెంకి కథలన్నీ క్లుప్తంగా ఉంటాయి. నేరుగా ఎత్తుగడ విషయంలోకి ప్రవేశిస్తుంది. ప్రతిదీ నిర్దిష్టంగా ఉంటుంది.

కథాశిల్పం విషయంలో సిద్దెంకి జాగురూకతతో,ఎరుకతో ఉన్నాడని ఆయన కథలు చదివాక అన్పిస్తుంది.

పాఠకులు ఒక కథను చదివాక వాళ్లలో భావ ప్రకంపనం కలిగించడం కూడా శిల్పంలో భాగమే. నేను పేర్కొన్న నాలుగు కథల్లో సిద్దెంకి ఆ పనిని విజయవంతంగా చేశాడు. కథాంశం ఎక్కడా సడలిపోకుండా చివరి వరకు నడిపించడంలో ఈ రచయితకు శ్రద్ధ ఉంది. సిద్దెంకికి సామాజిక స్పృహ ఉంది. మార్పును ఆహ్వానిస్తాడు. కనుక కథలోని పాత్రల మధ్య, ఇతివృత్తంలోని విషయాల మధ్య కూడా సంఘర్షణను చిత్రించాడు. నిజానికి కథాశిల్పంలో భాగమైన సంఘర్షణ రచయిత దృక్పథానికి సంబంధించినది. కథ ప్లాట్‌ను నిర్మాణం చేసుకోవడంలో కొన్ని కథల్లో జాగ్రత్తలు తీసుకున్న సిద్దెంకి మరికొన్ని కథల్లో అజాగ్రత్త వహించాడనిపిస్తుంది.

నడుస్తున్న కథాకాలంలో వైచిత్రి కలిగిన కథలను అందించిన సిద్దెంకి యాదగిరి కథల్లోకి మిమ్ములను ఆహ్వానిస్తూ...

- డా॥ సి.కాశీం

25 ఆగస్టు 2016, హైదరాబాద్-7.

చెమట చుక్కలని చిందిస్తేనే చరిత్రను రాయగలవనీ తెలుసుకో
నీ కోసం ఆరాటంగా వున్న మీ అమ్మ, నాన్న, సమాజపు కళ్ళలో
మరింత వెలుగులు నింపేలా నీ ఆరాటం ఉండాలనీ ఆశిస్తూ, దీవిస్తూ.....

- డా. కూర రామ్మోహన్ రెడ్డి (గోనెపల్లి),
టీఎస్‌పీఎస్సీ సభ్యులు, హైదరాబాద్.

కింది కులాల వాండ్లు కథా సాహిత్యాన్ని ప్రపంచీకరణ నుంచే విస్తృతంగా రాస్తున్నరు. ఆ రాసిన సాహిత్యమంతా చరిత్ర కెక్కాలంటే దాన్ని అన్ని వర్గాల వాళ్ళు పట్టించుకోవాల్సిన అవసరముంది. యాదగిరి రాసిన ఇవి చదవాల్సిన కథలు మాత్రమే కాదు. ఆచరించాల్సిన కథలు కూడా! భవిష్యత్ తెలంగాణ బంగారు తెలంగాణగా మారాలంటే సామాజిక తెలంగాణ ద్వారానే సాధ్యమని చెబుతున్నాడు. సిద్దెంకి తన కథల పరంపరను కొనసాగించాల్సిన అవసరముంది.

- సంగిశెట్టి శ్రీనివాస్

సిద్దెంకి కథలన్నీ క్లుప్తంగా ఉంటాయి. నేరుగా ఎత్తుగడ విషయంలోకి ప్రవేశిస్తుంది. ప్రతిదీ నిర్దిష్టంగా ఉంటుంది. కథాశిల్పం విషయంలో సిద్దెంకి జాగురూకతతో, ఎరుకతో ఉన్నాడని ఆయన కథలు చదివాక అన్పిస్తుంది. పాఠకులు ఒక కథను చదివాక వాళ్లలో భావ ప్రకంపనం కలిగించడం కూడా శిల్పంలో భాగమే. కథాంశం ఎక్కడా సడలిపోకుండా చివరి వరకు నడిపించడంలో ఈ రచయితకు శ్రద్ధ ఉంది. ఆ పనిని విజయవంతంగా చేశాడు.

- డా॥ సి. కాశీం

◆ సిద్దెంకి యాదగిరి